సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 146

శుక్రవారం 10-2-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'



**స్పిన్‌తో దుమ్ము రేపారు**

తొలి ఇన్నింగ్స్‌లో 177కు ఆస్ట్రేలియా ఆలౌట్.. జడేజాకు 5 వికెట్లు - 13లో



**ఇది కదా.. పాన్ ఇండియా కథ!**

హాలీవుడ్‌లోనూ రీమేక్ అవుతున్న 'దృశ్యం' చిత్రంపై కథనం - 12లో



**చలి.. ఆకలి**

తుర్కియే, సిరియాలో భూకంప మరణాల సంఖ్య 19 వేలు దాటింది. మంచు వల్ల సహాయ చర్యలకు ఆటంకం కలుగుతోంది.

వివరాలు 6లో ▸



**వీసా ప్రక్రియలో పురోగతి**

అమెరికా వీసాల కోసం నిరీక్షిస్తున్న భారతీయుల ఇబ్బందులను తొలగించేందుకు కేంద్ర హోం శాఖ కసరత్తు చేస్తోంది.


వివరాలు 6లో ▸



**ఉత్తర కొరియా సైనిక పరేడ్**

ఉత్తర కొరియా నియంత కిమ్ తన సైనిక బలాన్ని మరోసారి ప్రదర్శించారు. రాజధానిలో సైనిక పరేడ్ అట్టహాసంగా నిర్వహించారు.

వివరాలు 6లో ▸



**పుతిన్‌తో దోవల్ భేటీ**

భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు.

వివరాలు 6లో ▸

## న్యూస్‌రీల్

### గుండె మార్పిడితో బాలుడికి పునర్జన్మ



రాష్ట్రంలోనే తొలి గుండె మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతమైంది. తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం వైద్యులు నిరుపేద కుటుంబానికి చెందిన 15 ఏళ్ల బాలుడికి 48 ఏళ్ల మహిళ గుండె అమర్చి పునర్జన్మ ప్రసాదించారు.

వివరాలు 5 ▸

### లోకేశ్ పాదయాత్రలో కానిస్టేబుల్ మృతి



మొన్న చంద్రబాబు సభలు పలువురిని బలి తీసుకోగా.. నేడు ఆయన కుమారుడు లోకేశ్ సభ ఓ హెడ్ కానిస్టేబుల్ ప్రాణాలు తీసుకుంది. సంశిరెడ్డిపల్లెలో లోకేశ్ అనుమతుల్లేకుండా, జాగ్రత్తలు తీసుకోకుండా మాట్లాడటం ప్రారంభించగా.. పోలీసులు అడ్డు చెప్పారు. దీంతో టీడీపీ కార్యకర్తలు తోపులాటకు దిగడంతో హెడ్‌కానిస్టేబుల్ ఎ.రమేష్ గుండెపోటుకు గురై మరణించారు.

వివరాలు 14 ▸

### టి20 ఆటకు అమ్మాయిలు సిద్ధం



నేడు దక్షిణాఫ్రికాలో మహిళల టి20 ప్రపంచకప్ ప్రారంభం కానుంది. మొదటి మ్యాచ్ దక్షిణాఫ్రికా, శ్రీలంక మధ్య జరగనుంది. ఈనెల 12న భారత్, పాకిస్తాన్ జట్లు తలపడనున్నాయి.

వివరాలు 13 ▸



## ఇదండీ సంగతి



ఎవరేమోగానీ.. మీరయితే ఈ మధ్యన అలానే తీర్పులిస్తున్నారు సార్!!

# గాడినపడ్డ ఆదాయం

## గ్రాస్ జీఎస్టీ వసూళ్లలో దేశ సగటు కంటే రాష్ట్ర వృద్ధి రేటు అధికం

- డిసెంబర్‌కు జీఎస్టీ స్థూల వసూళ్లలో దేశ సగటు వృద్ధి 24.8 శాతం.. రాష్ట్రంలో 26.2 శాతం
- ధనిక రాష్ట్రాల కంటే మెరుగ్గా ఏపీ వృద్ధి రేటు.. ఇప్పటివరకు వాణిజ్య పన్నుల శాఖ ఆదాయార్జన రూ.43,206.03 కోట్లు
- ఫిబ్రవరి 6 వరకు రూ.3,649 కోట్లు ఆర్జించిన గనుల శాఖ.. జనవరి నాటికి రవాణా శాఖ ఆదాయం రూ.3,657.89 కోట్లు
- ఆదాయార్జన శాఖలపై సీఎం వైఎస్ జగన్ ఉన్నతస్థాయి సమీక్ష



**సాక్షి, అమరావతి:** కోవిడ్ ప్రతికూల పరిస్థితులను అధిగమించి రాష్ట్ర సొంత ఆదాయం గాడిన పడుతోందని, నిర్దేశించిన ఆదాయ లక్ష్యాలను చేరుకుంటున్నట్లు ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నివేదించారు. దేశ సగటుతో పాటు పలు ధనిక రాష్ట్రాల కంటే అధికంగా జీఎస్టీ స్థూల (గ్రాస్) వసూళ్ల వృద్ధి నమోదవుతున్నట్లు వివరించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఆదాయార్జన శాఖలపై సీఎం జగన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. జీఎస్టీ స్థూల వసూళ్లలో దేశ సగటు వృద్ధి రేటు 24.8 శాతం కాగా ఆంధ్రప్రదేశ్ 26.2 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ వృద్ధి రేటు పలు ధనిక రాష్ట్రాల కంటే అధికమని, తెలంగాణ (17.3%), తమిళనాడు (24.9%), గుజరాత్ (20.2%) కంటే మెరుగైన వసూళ్లు నమోదవుతున్నాయని తెలిపారు. ఇది రాష్ట్రంలో వాణిజ్య కార్యకలాపాలు అధికంగా జరుగుతున్నాయనేందుకు నిదర్శనమన్నారు.

**పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలు**

గతేడాది జనవరి నాటికి రాష్ట్ర జీఎస్టీ ఆదాయం రూ.26,360.28 కోట్లు కాగా ఈ ఏడాది జనవరి నాటికి రూ.28,181.86 కోట్లకు పెరిగిందని అధికారులు తెలిపారు. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ

మిగతా 2వ పేజీలో ▶

## అత్యున్నత ప్రమాణాలతో సర్కారు విద్య

- జగనన్న గోరుముద్దలో మార్చి 2 నుంచి అదనంగా రాగి జావ
- ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తూ సత్యసాయి ట్రస్టుతో ప్రభుత్వం ఎంవోయూ
- విద్యా రంగంలో విప్లవాత్మక కార్యక్రమాలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఒక్క గోరుముద్ద కార్యక్రమానికే రూ.1,700 కోట్లు ఖర్చు
- గతంలో మధ్యాహ్న భోజన పథకానికి కేవలం రూ.600 కోట్లే

2లో

ఘటన జరిగిన ఆయిల్ ట్యాంక్ వద్ద మృతదేహాలు.. రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు





# ఏడుగురిని బలిగొన్న విష వాయువులు

## పెద్దాపురం మండలం జి.రాగంపేట వద్ద ఆయిల్ మిల్లులో విషాదం

### ఆయిల్ ట్యాంక్ శుభ్రం చేసేందుకు 24 అడుగుల లోతుకు దిగిన కార్మికులు

- ట్యాంక్‌లో ఆక్సిజన్ అందక ఊపిరాడక అక్కడికక్కడే మృతి
- అతి కష్టంగా నిచ్చెన ఎక్కి వచ్చి ప్రాణాలు కాపాడుకున్న ఓ కార్మికుడు
- మృతుల్లో ఐదుగురిది పెదబయలు మండలం లక్ష్మీపురం, ఇద్దరిది పెద్దాపురం మండలం పులిమేరు
- సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి.. మృతుల కుటుంబాలకు భరోసా.. ప్రభుత్వం తరఫున రూ.25 లక్షల చొప్పున పరిహారం
- ప్యాకింగ్ సెక్షన్ కార్మికులతో ట్యాంక్ క్లీనింగ్ వల్లే ప్రమాదం.. ఆయిల్ ఫ్యాక్టరీ సీజ్.. యాజమాన్యంపై క్రిమినల్ కేసు

సాక్షి ప్రతినిధి, కాకినాడ/సాక్షి, పాడేరు/పెదబయలు: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి. రాగంపేటలోని అంబటి సుబ్బన్న ఆయిల్స్‌లో విష వాయువులు ఏడు నిండు ప్రాణాలను బలిగొన్నాయి. వంట నూనెల కర్మాగారానికి చెందిన ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు ట్యాంక్‌లోకి దిగిన కార్మికులు ఒకరి తర్వాత ఒకరుగా అరగంట వ్యవధిలో ఏడుగురు మృతి చెందారు. మృతులలో ఐదుగురు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్‌లోని పెదబయలు మండలానికి చెందిన వారు కాగా, ఇద్దరు కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం పులిమేరు వాసులు. మృతులంతా రోజువారి కూలీలే. అంతా 35 ఏళ్ల లోపు వారే..

మిగతా 14వ పేజీలో ▶

# మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నికలు

## రాష్ట్రంలో 14 స్థానాలకు షెడ్యూల్ విడుదల

- 9 స్థానిక సంస్థల స్థానాలు, 3 గ్రాడ్యుయేట్, 2 టీచర్ల నియోజకవర్గాలకు ఎన్నికలు
- ఈ నెల 16న నోటిఫికేషన్
- మార్చి 13న ఎన్నికలు, 16న కౌంటింగ్..తెలంగాణలో 2 స్థానాలకు ఎన్నికలు



**సాక్షి, న్యూఢిల్లీ / సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో 14 ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. 9 స్థానిక సంస్థల నియోజకవర్గాలు, 3 పట్టభద్రులు, 2 టీచర్ల నియోజకవర్గాలకు మార్చి 13న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఈ నెల 16న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మార్చి 16న కౌంటింగ్ చేపడతారు. కౌంటింగ్ పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటిస్తారు. నామినేషన్లకు చివరి తేదీ ఈ నెల 23 కాగా, ఉపసంహరణకు ఈ నెల 27 చివరి తేదీగా నిర్ణయించారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుంది. తెలంగాణలో 1 టీచర్ (హైదరాబాద్-రంగారెడ్డి- మహబూబ్‌నగర్) ఎమ్మెల్సీ, 1 స్థానిక

మిగతా 3వ పేజీలో ▶

# జనం లేరు.. షాక్‌లో సార్!

- లోకేశ్ పాదయాత్రలో జనం లేకుంటే సీరియస్ యాక్షన్ ఉంటుంది
- చిత్తూరులో చూసి నేను, సార్ చాలా బాధపడ్డాం
- టీడీపీ నేతలతో అచ్చెన్నాయుడు ఫోన్ కాల్ ఆడియో బహిర్గతం

**సాక్షి, తిరుపతి:** నారా లోకేశ్ పాదయాత్ర సందర్భంగా జన సమీకరణకు టీడీపీ నేతలు పడుతున్న తిప్పలు, సీనియర్ నాయకుల హెచ్చరికలు సాక్ష్యాధారాలతో బహిర్గతమయ్యాయి. కుప్పంలో మొదలైన లోకేశ్ పాదయాత్ర గురువారం గంగాధర నెల్లూరు నియోజక వర్గానికి చేరుకుంది. జన సమీకరణపై బుధవారం రాత్రి టీడీపీ నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడిన రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు హెచ్చరికలు చేశారు. ఈ ఆడియో లీక్ కావడంతో కలకలం రేగింది.

### సంభాషణ సాగిందిలా...

**చిట్టిబాబు నాయుడు (టీడీపీ గంగాధర నెల్లూరు ఇన్‌చార్జి):** అన్నా డీఎస్పీ ఆఫీస్‌లో పర్మిషన్ తీసుకుంటున్నా. మీరు చెప్పినట్లుగా ఉదయాన్నే వెయ్యి మంది వచ్చేందుకు వాహనాలు అరేంజ్ చేశా. రోజూ పాదయాత్ర స్టార్ట్ అయ్యేలోపు ఆరు మండలాల్లోనూ 50 వాహనాలు ఏర్పాటు చేశా. 300 వాహనాలకు డబ్బులు కూడా ఇచ్చేశా. నాలుగు రోజులకు బుక్ చేశా. రోజూ 3 వేల మంది

మిగతా 14వ పేజీలో ▶



లోకేశ్ పాదయాత్ర పరిస్థితి ఇదీ..

## ప్రభుత్వాలను కూల్చిన చరిత్ర కాంగ్రెస్‌దే

- 90 సార్లు ప్రభుత్వాలను పడగొట్టేందుకు ఆర్టికల్ 356 వినియోగం
- 50 సార్లు ఆర్టికల్ 356 వినియోగించిన నాటి ప్రధాని ఇందిరాగాంధీ
- ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నం చేసింది కాంగ్రెస్సే
- రాజ్‌భవన్‌లను కాంగ్రెస్ కార్యాలయాలుగా మార్చిన ఘనత కాంగ్రెస్‌దే
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో ప్రధాని మోదీ

- వివరాలు 6లో





జేఈఈలో ఎస్సీ గురుకుల

## విద్యార్థుల సత్తా

- 189లో 151 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక
- 93 మందికి నేరుగా ఎన్ఐటీల్లో సీట్లు లభించే అవకాశం
- ప్రతిభ చాటిన బీసీ, గిరిజన గురుకుల విద్యార్థులు

3లో

## అమరావతే రాజధాని అని కేంద్రం ఎక్కడ చెప్పింది?

- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మండిపాటు
- సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్‌ను వక్రీకరిస్తూ ఎల్లో మీడియా రాద్ధాంతం
- దాన్ని పట్టుకుని సీఎం జగన్‌పై అక్కసు వెళ్లగక్కిన చంద్రబాబు
- తను, తన కోటరీ కాజేసిన భూముల ధరలు పెంచుకునేందుకే ఈ విన్యాసాలు
- రియల్ ఎస్టేట్ వ్యాపారిలా వ్యవహరిస్తున్న బాబు
- తెలంగాణలో రూ.600 కోట్లతో రాజప్రాసాదంలా సచివాలయం
- గత ప్రభుత్వం ఇక్కడ రూ.5 వేల కోట్లు ఖర్చు చేసి అరకొర నిర్మాణాలతో దోపిడీ

14లో



## ఇదిగో సాగరతీరంలో నీరా కేఫ్

- ఈ నెలలోనే వినియోగదారులకు అందుబాటులోకి....
- రూ.10 కోట్లతో నెక్లెస్ రోడ్డులో నిర్మాణం
- నీరా పానీయంతో పాటు తెలంగాణ వంటకాలు కూడా..

**సాక్షి, హైదరాబాద్:** సాగరతీరం మరింతగా పర్యాటక హంగులను సంతరించుకుంటోంది. ప్రతిష్టాత్మకమైన ఫార్ములా-ఈ పోటీల నేపథ్యంలో నెక్లెస్ రోడ్డు, ట్యాంక్‌బండ్ పరిసరాలను అందంగా తీర్చిదిద్దారు. దేశ, విదేశాలకు చెందిన పర్యాటకులు, సందర్శకులను ఆకట్టుకొనేవిధంగా అనేక ఏర్పాట్లు చేపట్టారు. సాగర్ జలాలపై మ్యూజికల్ ఫౌంటెయిన్, లేజర్‌షోలతో పాటు ఈ నెలలోనే నీరా కేఫ్‌ను సైతం ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తాటి, ఈత చెట్ల నుంచి లభించే ప్రకృతిసిద్ధమైన నీరా పానీయాన్ని నగరవాసులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఎక్సైజ్ శాఖ సుమారు రూ.10 కోట్లతో నెక్లెస్ రోడ్డు, పీపుల్స్‌ప్లాజా సమీపంలో ఈ కేఫ్‌ను నిర్మించింది.

- ఈ కేఫ్‌లో తెలంగాణ వంటకాలన్నీ లభిస్తాయి.
- ఒకేసారి సుమారు 3 వేల మంది సందర్శించవచ్చు.
- పర్యాటక ప్రియులు, నగరవాసులు సాగరతీరంలో సేదతీరుతూ నీరాను ఆస్వాదించవచ్చు.
- తాటి, ఈత చెట్ల నుంచి సేకరించే నీరా నుంచి తయారయ్యే బెల్లం, సిరప్‌లు కూడా కేఫ్‌లో విక్రయిస్తారు.

**నీరాతో పాటు రెస్టారెంట్ సేవలు...**

తాటి, ఈత చెట్ల నుంచి తెల్లవారు జామునే సేకరించే నీరా పానీయంలోని సహజమైన పోషక విలువలు ఏ మాత్రం చెడకుండా శీతలీకరణ పద్ధతిలో నిల్వ చేసి విక్రయిస్తారు. ఇందుకోసం రెండంతస్తుల నీరా భవనంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సురక్షితంగా నిల్వ చేసేందుకు అవసరమైన అన్ని రకాల శీతలీకరణ యంత్రాలను సిద్ధం చేశారు. భువనగిరి సమీపంలోని నందనం, కడ్తాల్ సమీపంలోని ముద్విన్‌లో ఏర్పాటు చేసిన తాటివనం ప్రాజెక్టుల్లో నీరా కోసమే ప్రత్యేకంగా పెంచిన తాటి, ఈత చెట్ల నుంచి నీరాతో పాటు అనుబంధ ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. శరీరానికి అవసరమైన ప్రొటీన్, ఐరన్, పొటాషియం, కాల్షియం, విటమిన్‌లు, మినరల్స్ లభిస్తాయని వివరించారు. నీరాతో పాటే రెస్టారెంట్ సేవలు కూడా ఇక్కడ లభిస్తాయని చెప్పారు.

## క్లుప్తంగా...

### నేడు 'వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా'

- బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయనున్న సీఎం
- 4,536 మంది లబ్ధిదారులకు రూ.38.18 కోట్లు అందజేత

**సాక్షి, అమరావతి:** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లు పేదలైన తల్లిదండ్రులకు భారం కాకూడదన్న లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న 'వైఎస్సార్ కల్యాణమస్తు', 'వైఎస్సార్ షాదీ తోఫా' పథకాల ఆర్థిక సాయం నేడు లబ్ధిదారులకు అందనుంది. ఈ పథకాల కింద రాష్ట్రంలోని అర్హులైన 4,536 మంది లబ్ధిదారులకు రూ.38.18 కోట్ల ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, విభిన్న ప్రతిభావంతులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు వైఎస్సార్ కల్యాణమస్తు, ముస్లిం మైనార్టీ వర్గాల ఆడపిల్లలకు వైఎస్సార్ షాదీ తోఫా ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తోంది. 2022 అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య త్రైమాసికంలో వివాహం చేసుకున్న వారికి వీటి ద్వారా లబ్ధి చేకూర్చనుంది. పేదింటి ఆడబిడ్డలను చదువులో ప్రోత్సహించడం, బాల్య వివాహాలను అరికట్టడం, విద్యా సంస్థల్లో చేరికల శాతాన్ని పెంచడం, డ్రాపౌట్ రేట్ తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే వివాహం చేసుకునే వధూవరులకు 10వ తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి చేసింది. లంచాలు, వివక్షతకు తావులేకుండా గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తోంది. ఈ పథకం సాయాన్ని ప్రతి మూడు నెలలకు లబ్ధిదారులకు అందిస్తుంది. వివాహమైనవారు 30 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.

### 'జీ-20' పనుల కోసం నిధుల కేటాయింపు

**సాక్షి, అమరావతి:** విశాఖపట్నంలో భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'జీ-20' దేశాల సదస్సుకు సంబంధించి ముందస్తు ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 28, 29 తేదీల్లో దాదాపు 190 దేశాల ప్రతినిధులు విశాఖపట్నంలో సమావేశం కానున్నారు. ఇందుకు అవసరమైన పనులు చేపట్టేందుకు వీలుగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ రూ.50 కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో జీవీఎంసీ పరిధిలో రోడ్ల మరమ్మతులు, సుందరీకరణ, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించనున్నట్టు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వై.శ్రీలక్ష్మి పేర్కొన్నారు.

### బీసీ అట్రాసిటీ చట్టం చేయండి

**కేంద్రానికి ఎంపీ ఆర్ కృష్ణయ్య వినతి**

**సాక్షి, న్యూఢిల్లీ:** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలో దేశంలో బీసీలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి బీసీ అట్రాసిటీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా తీసుకురావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎ స్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి రూ.రెండు లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి ఆర్థిక విద్య, ఉద్యో గ, శిక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, భూపేష్ సాగర్, వేముల రామకృష్ణ, నందగోపాల్, ఎస్.మారేష్, బాషయ్య, రాకేశ్ కుమార్ గురువారం కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరీని కలిశారు. ఈ సందర్భంగా 15 అంశాలతో కూడిన బీసీల డిమాండ్లపై కేంద్రమంత్రితో చర్చించారు. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని కోరారు. జాతీయ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాలపై విధించిన షరతులను ఎత్తివేయాలని, బీసీ కార్పొరేషన్ బడ్జెట్‌లో ఏటా రూ.50 వేల కోట్లు కేటాయించాలని, ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు 80 శాతం రాయితీ రుణాలు మంజూరు చేయాలని ఎంపీ కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు.

### డాక్టర్లు, సిబ్బంది ఖాతాలకే ప్రోత్సాహకాలు

**సాక్షి, అమరావతి:** ప్రభుత్వాస్పత్రుల్లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవల్లో నాణ్యతను మరింతగా పెంపొందించడంపై వైద్య, ఆరోగ్య శాఖ దృష్టి సారించింది. ఆరోగ్యశ్రీ ప్రోత్సాహకాల (ఇన్సెంటివ్) సొమ్మును నేరుగా వైద్యులు, వైద్య సిబ్బంది బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. ఆస్పత్రుల్లో మానవ వనరుల కొరతకు తావులేకుండా పోస్టుల భర్తీ, మౌలిక వసతుల కల్పన, అన్ని ప్రభుత్వాస్పత్రులను నెట్‌వర్క్ ఆస్పత్రులుగా నోటిఫై చేయడం వంటి ప్రభుత్వ చర్యలతో ఆరోగ్యశ్రీ సేవలు అందరి ప్రశంసలు అందుకుంటున్నాయి. మొత్తం క్లెయిమ్‌లలో 30 శాతం ప్రభుత్వాస్పత్రుల నుంచి ఉంటున్నాయి. వీటిని ఇంకా పెంచడం ద్వారా ప్రభుత్వాస్పత్రులకు ఎక్కువ నిధులు రాబట్టి, ఆస్పత్రులను అభివృద్ధి చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగానే ప్రోత్సాహకాల జమలోనూ నిర్ణయం తీసుకుంది. ఆరోగ్యశ్రీ కింద ఒక ఆపరేషన్ చేస్తే.. దానికి వచ్చే క్లెయిమ్ మొత్తంలో 25 శాతం ప్రోత్సాహకం కింద హెల్త్ కేర్ స్టాఫ్‌కు వస్తుంది. ఈ మొత్తాన్ని నిబంధనలకు అనుగుణంగా వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందికి కేటాయిస్తారు. వైద్యులు, సిబ్బంది బ్యాంక్ ఖాతాలను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసే ప్రక్రియ తుది దశకు చేరుకుంది.

# అత్యున్నత ప్రమాణాలతో సర్కారు విద్య

- 6 వతరగతి, ఆపై తరగతి గదుల్లో ఇంటరాక్షన్ ఫ్లాట్ ప్యానళ్ల ఏర్పాటు
- అంతకంటే దిగువ తరగతుల్లో స్మార్ట్ టీవీలు
- జూన్ నాటికి 30,230 తరగతి గదుల్లో ఈ సౌకర్యాలు
- నాడు–నేడు తొలి దశలోని సుమారు 15 వేల స్కూళ్లలో ఈ ఏర్పాట్లు
- విదేశీ విద్యా దీవెన కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రూ.1.25 కోట్ల వరకు సాయం
- ఇతరులకు రూ.1 కోటి వరకు సహాయం



సీఎం జగన్ సమక్షంలో సత్యసాయి చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు, విద్యా శాఖ అధికారుల ఎంవోయూ

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో విద్యా రంగంలో అత్యున్నత ప్రమాణాలు నెలకొనేలా అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని, ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల పిల్లలకు మేలు చేసేలా ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని సీఎం వైఎస్ జగన్ తెలిపారు. ఈ రంగంలో ఎక్కడా అమలు కాని రీతిలో మనబడి నాడు–నేడు, జగనన్న అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక వంటి అనేక విప్లవాత్మక పథకాలు, కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. తాజాగా జగనన్న గోరుముద్ద కింద విద్యార్థులకు మరింత పౌష్టిక ఆహారాన్ని ఇవ్వడంలో భాగంగా ప్రస్తుత మెనూకు అదనంగా వచ్చే నెల 2 నుంచి రాగిజావను కూడా అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్న శ్రీ సత్యసాయి చారిటబుల్ ట్రస్టు, విద్యా శాఖ అధికారులు గురువారం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సత్యసాయి ట్రస్టు భాగస్వామ్యం కావడం ద్వారా.. భగవాన్ సత్యసాయి కూడా ఈ కార్యక్రమాన్ని ఆశీర్వదించి ముందుకు తీసుకుపోతున్నారని చెప్పవచ్చన్నారు. గోరుముద్ద కార్యక్రమంలో రాగి జావను అదనంగా చేర్చడం ద్వారా మరింత పౌష్టికాహారం పిల్లలకు అందుతుందన్నారు. కేవలం గోరుముద్ద కార్యక్రమానికే రూ.1,700 కోట్లు ఖర్చు పెడుతున్నామని చెప్పారు. మూడున్నరేళ్ల క్రితం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని, గతంలో కేవలం రూ.600 కోట్లు మాత్రమే మధ్యాహ్న భోజన పథకానికి ఖర్చు పెడితే మన ప్రభుత్వ హయాంలో ఆ ఖర్చు దాదాపు మూడు రెట్లు పెరిగిందని వివరించారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

### 37,63,698 విద్యార్థులకు పౌష్టికాహారం

జగనన్న గోరుముద్ద ద్వారా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 44,392 స్కూళ్లలో 37,63,698 మంది విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తోంది. పిల్లల్లో ఐరన్, కాల్షియం లోపాలు లేకుండా నివారించడానికి ఈ పథకం కింద తాజాగా రాగి జావను చేర్చింది. బడి ఈడు పిల్లల నమోదును పెంచడంతో పాటు వారిలో ధారణ సామర్థ్యం మెరుగుపర్చి, డ్రాపౌట్స్‌ను తగ్గించే కార్యక్రమాల్లో భాగంగా వారికి స్కూల్లోనే రుచికరమైన పౌష్టికాహారాన్ని మధ్యాహ్న భోజనంలో అందిస్తోంది. రోజుకో మెనూలో భాగంగా పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడానికి వారంలో 5 రోజులు గుడ్డు, మూడు రోజులు బెల్లం, పల్లీ చిక్కీ.. చిక్కీ ఇవ్వని రోజుల్లో చిరుధాన్యాలను మధ్యాహ్న భోజనంలో భాగం చేయించారు. తాజాగా వారంలో మూడు రోజులు రాగి జావ ఇవ్వనున్నారు.

**విద్యా రంగంలో కీలక సంస్కరణలు**

- విద్యా రంగంలో అనేక కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టాం. తల్లులు తమ పిల్లలను బడికి పంపించేందుకు అవసరమైన ప్రోత్సాహాన్నివ్వడానికి ఉద్దేశించిన అమ్మఒడి మొదలు.. నాడు–నేడు ద్వారా స్కూళ్ల వ్యవస్థను మార్పు చేసే వరకు ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నాం.
- 6వ తరగతి, ఆ పై తరగతుల్లో ప్రతి తరగతి గదిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ)ను ఏర్పాటు చేస్తున్నాం. 30,230 తరగతి గదుల్లో వీటిని పెడుతున్నాం. నాడు–నేడు తొలిదశ పూర్తి చేసుకున్న సుమారు 15 వేల స్కూళ్లలో జూన్ నాటికి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం.
- నాడు–నేడులో ఆఖరు కాంపొనెంట్ కింద 6వ తరగతి, ఆపై తరగతులను డిజిటలైజ్ చేసే కార్యక్రమం చేస్తున్నాం. అంతకంటే దిగువ తరగతుల వారికి స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేస్తున్నాం. వీటితో పాటు పిల్లలకు విద్యాకానుక, గోరుముద్ద, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్, బైలింగువల్ పాఠ్యపుస్తకాలు, 3వ తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్ల కాన్సెప్ట్, 8వ తరగతి పిల్లలకు ట్యాబ్‌ల పంపిణీ వంటి అనేక విప్లవాత్మక కార్యక్రమాలు చేపడుతున్నాం. పిల్లల కరిక్యులమ్‌ను బైజూస్ కంటెంట్‌తో అనుసంధానం చేస్తూ.. విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నాం.
- గతంలో ఎన్నడూ లేని విధంగా ఉన్నత విద్యలో చేరే పిల్లలందరికీ ప్రభుత్వం పూర్తి స్థాయి అండదండలు అందిస్తోంది. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పిల్లల కోసం విద్యా దీవెన కింద 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నాం. రూ.20 వేల వరకు వసతి దీవెన అమలు చేస్తున్నాం.
- విదేశీ విద్యా దీవెన కూడా అమలు చేస్తున్నాం. ఈ పథకం కింద ప్రపంచ వ్యాప్తంగా అత్యుత్తమమైన 50 కాలేజీలలో, 21 రకాల విభాగాలు, లేదా కోర్సులకు సంబంధించి సీట్లు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ.1.25 కోట్ల వరకు, మిగిలిన వారికి రూ.1 కోటి వరకు ప్రభుత్వం అందిస్తుంది.
- రేపు (నేడు) కళ్యాణమస్తు ప్రారంభిస్తున్నాం. ఈ పథకంలో అర్హత పొందాలంటే కనీసం పదోతరగతి పాస్ కావాలనే నిబంధన విధించాం.

ఈ కార్యక్రమంలో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్ సురేష్ కుమార్, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎండీ సీఎన్ దీవాన్‌రెడ్డి, మిడ్ డే మీల్స్ డైరెక్టర్ నిధి మీనా, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### ఒప్పందం మూడేళ్లు

సీఎం ఆలోచనలు, ఆదేశాలతో మార్చి 2 నుంచి రాగి జావను జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా అందించనున్నాం. దీనికి రూ.86 కోట్లు అదనంగా ఖర్చవుతుంది. ఇందులో సత్యసాయి ట్రస్టుకు భాగస్వామ్యం కల్పించాం. దీనికి అవసరమైన రాగి పిండి, బెల్లం పిండి ట్రస్టు సరఫరా చేస్తుంది. దీని ఖరీదు సుమారు రూ.42 కోట్లు ఉంటుంది. మూడేళ్ల పాటు వీరు సరఫరా చేస్తారు. దీనికి సంబంధించి ఇవాళ ఒప్పందం చేసుకుంటున్నాం. – **బొత్స సత్యనారాయణ,** విద్యా శాఖ మంత్రి

### సీఎం కృషితో విద్యా రంగానికి పునరుజ్జీవం

పిల్లలకు రాగి జావ ఇవ్వడం మంచి కార్యక్రమం అని మా ట్రస్టు సభ్యులందరూ చెప్పడంతో ముందుకొచ్చాం. సీఎం జగన్ నాయకత్వంలో విద్యా రంగానికి పునరుజ్జీవనం వచ్చింది. సీఎం చెబుతున్న ప్రతి మాట అమలు చేసి చూపిస్తున్నారు. విద్యా రంగంలో పథకాలన్నీ అద్భుతం. అమ్మచేతి గోరుముద్ద గుర్తుకు వచ్చేలా మధ్యాహ్న భోజనానికి మంచి పేరు పెట్టారు. ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మారుస్తున్నారు. కొత్త జిల్లాకు శ్రీ సత్యసాయి జిల్లాగా పేరు పెట్టినందుకు ధన్యవాదాలు. – **రత్నాకర్,** శ్రీ సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ



ఆదాయార్జన శాఖలపై ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం వైఎస్ జగన్, మంత్రులు, అధికారులు

# గాడినపడ్డ ఆదాయం

▶ మొదటి పేజీ తరువాయి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి నాటికి జీఎస్టీ, వ్యాట్, ప్రొఫెషనల్ ట్యాక్స్‌లతో కలిపి రూ.46,231 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకోగా 94 శాతం అంటే రూ.43,206.03 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించారు. గతంలో సూచించిన విధంగా పన్ను వసూలు యంత్రాంగంలో కీలక మార్పులు తెచ్చామని, పన్ను చెల్లింపుదారులకు సౌలభ్యమైన విధానాల ద్వారా ఆదాయాలు మెరుగుపడుతున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలియచేశారు. విధానాలను సరళీకరించడం, డేటా అనలిటిక్స్ వల్ల వసూళ్లు మెరుగుపడుతున్నట్లు వివరించారు. సిబ్బంది సమర్థత పెంపొందించేలా శిక్షణ కార్యక్రమాలను చేపట్టడంతోపాటు పన్ను చెల్లింపుదారులకు మరింత సులభంగా సేవలు అందించే విధంగా ట్యాక్స్ అసెస్‌మెంట్‌ను ఆటోమేటిక్ పద్ధతుల్లో అందించే వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డివిజన్ స్థాయిలో కేంద్రీకృత రిజిస్ట్రేషన్ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మనకన్నా మెరుగైన పనితీరు కనబరుస్తున్న రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి వాటి అమలు అవకాశాలను పరిశీలించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు.

**100 శాతం లక్ష్యం చేరుకున్న గనుల శాఖ**

గనులు, ఖనిజ శాఖ ఈ ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి 6 వరకు రూ.3,649 కోట్ల ఆదాయాన్ని ఆర్జించడం ద్వారా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని నూటికి నూరుశాతం చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి 6 నాటికి గనుల శాఖ ఆదాయం రూ.2,220 కోట్లుగా నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న రూ.5 వేల కోట్ల ఆదాయ లక్ష్యాన్ని దాదాపుగా చేరుకుంటామని చెప్పారు. నిర్వహణలో లేని గనుల్లో కార్యకలాపాలు పునఃప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రవాణా శాఖ ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి నాటికి రూ.3,852.93 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకోగా రూ.3,657.89 కోట్లను ఆర్జించినట్లు వెల్లడించారు. రవాణా రంగంలో కోవిడ్ సంక్షోభ పరిస్థితులు సమసిపోయి నెమ్మదిగా గాడిలో పడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న ఎర్రచందనం నిల్వలను మూడు దశల్లో విక్రయించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి (ఎక్సైజ్ శాఖ) కె.నారాయణస్వామి, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, అటవీ పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ స్పెషల్ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, ఎక్సైజ్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ స్పెషల్ సీఎస్ రజత్‌భార్గవ, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా, రవాణాశాఖ కమిషనర్ పీఎస్ఆర్ ఆంజనేయులు, వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ ఎం. గిరిజా శంకర్, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎస్.గుల్జార్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, అటవీ అభివృద్ధి సంస్థ సీజీఎం ఎం.రేవతి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ కమిషనర్ రామకృష్ణ, ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ డి.వాసుదేవరెడ్డి, గనులశాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు కథనాలను ఖండించిన ఐఏఎస్ అసోసియేషన్


**సాక్షి, అమరావతి:** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డిపై ఈనాడు, ఆంధ్రజ్యోతితో పాటు కొన్ని మీడియా సంస్థల్లో వచ్చిన కథనాలను రాష్ట్ర ఐఏఎస్ అసోసియేషన్ ఖండించింది. సీఎంఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, నవీన్, సీఎస్ జవహర్‌రెడ్డి కలిసి ఒకే కారులో వైఎస్సార్ జిల్లా నుంచి విజయవాడ వచ్చారన్న వార్తల్లో ఎటువంటి నిజం లేదని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం విజయవాడలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. వాస్తవాలు తెలుసుకోకుండా పరువు నష్టం కలిగిస్తూ కించపర్చేవిధంగా వార్తలు ప్రచురించడం, ప్రసారం చేయడం సరికాదన్నారు. ఎప్పుడో అక్టోబర్ నెలలో ఖరారైన షెడ్యూల్ ప్రకారం సీఎస్ వైఎస్సార్ జిల్లా ముద్దనూరు జిల్లా పరిషత్ స్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమానికి హాజరై రేణిగుంట విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు వెళ్లారని, ఆయన విమానం ఎక్కేంతవరకు వైఎస్సార్ జిల్లా కలెక్టర్ పక్కనే ఉన్నారని స్పష్టం చేశారు. ఇలాంటి తప్పుడు వార్తలను అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోందని, ప్రజలకు వాస్తవాలతో కూడిన సరైన సమాచారం అందించాలని మీడియా సంస్థలను కోరారు. పరస్పర గౌరవసూచకంగా, న్యాయ ప్రయోజనాల దృష్ట్యా పరువు నష్టం కలిగించే ఇటువంటి వార్తలపై తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు.

## ఏపీ ఇన్ పార్లమెంట్

### బీచ్‌శాండ్ మైనింగ్‌లో అక్రమాలకు అడ్డుకట్ట

**రాజ్యసభ**

**వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం**



**సాక్షి, న్యూఢిల్లీ:** అరుదైన ఖనిజాలు, మూలకాలు లభించే బీచ్‌శాండ్ మైనింగ్‌లో అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. బీచ్‌శాండ్ మైనింగ్‌లో ప్రైవేటు సంస్థలు పాల్గొనేలా అనుమతిస్తున్న కేంద్రం.. అందులో అక్రమాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటోందని గురువారం రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. దీనికి జితేంద్ర సింగ్ స్పందిస్తూ.. గత ఏడెనిమిదేళ్లలో జరిగిన పరిణామాలను పరిశీలిస్తే బీచ్‌శాండ్ మైనింగ్‌లో అక్రమాలు జరగకుండా తీసుకుంటున్న చర్యల్లో పురోగతి కనిపిస్తుందన్నారు. అరుదైన ఖనిజ నిక్షేపాల మైనింగ్‌లో స్మగ్లింగ్‌ను నిరోధించేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారాన్ని కోరుతున్నామని తెలిపారు.

**రిమోట్ ఓటింగ్‌పై పార్టీల నుంచి అభిప్రాయ సేకరణ**

రిమోట్ ఓటింగ్‌పై ఎన్నికల సంఘం (ఈసీ) వివిధ రాజకీయ పార్టీల అభిప్రాయాలను స్వీకరిస్తోందని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజుజు వెల్లడించారు. ఫిబ్రవరి 28లోపు తమ అభిప్రాయాలను పంపాలని ఆయా పార్టీలకు సూచించామన్నారు. ఓటింగ్ ప్రక్రియలో వలస కార్మికుల భాగస్వామ్యం పెంచేందుకు ఈసీ గతేడాది డిసెంబర్ 28న ఒక నోట్‌ను అన్ని రాజకీయ పార్టీలకు పంపిందన్నారు. ఈ మేరకు విజయసాయిరెడ్డి ప్రశ్నకు ఆయన లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. ''వలస ఓటరును ఏ విధంగా నిర్వచించాలి, వారిని ఏ ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించాలి, రిమోట్ ఓటింగ్ విధానం, వారి ఓట్ల లెక్కింపు, వారికి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఏ విధంగా వర్తింప చేయాలి? వంటి అంశాలపై అభిప్రాయాలు తెలియజేయాల్సిందిగా వివిధ రాజకీయ పార్టీలను కోరాం'' అని తెలిపారు.

**ఏపీ హైకోర్టులో 2,41,465 కేసులు పెండింగ్**

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 2,41,465 కేసులు, తెలంగాణ హైకోర్టులో 2,53,358 పెండింగ్‌లో ఉన్నట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. అంతేకాకుండా ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న క్రిమినల్ కేసులను విచారించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా మొత్తం 9 రాష్ట్రాల్లో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఉన్నాయని వెల్లడించారు. సుప్రీం కోర్టు గణాంకాల ప్రకారం ఫిబ్రవరి నాటికి సుప్రీం కోర్టులో 69,511 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అదే సమయంలో దేశంలో అన్ని హైకోర్టుల్లో మొత్తం 59,87,477 కేసులు పెండింగ్ ఉన్నాయని చెప్పారు. ఈ మేరకు టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బదులిచ్చారు.

### ప్రత్యేక హోదా ఇవ్వండి

**లోక్‌సభ**

**వైఎస్సార్‌సీపీ ఎంపీ వంగా గీత డిమాండ్**

**సాక్షి, న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ వంగా గీత డిమాండ్ చేశారు. గురువారం లోక్‌సభలో బడ్జెట్ పద్దులపై ఆమె మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌కు కేంద్రం సహకరించాలని కోరారు. అమృత్ బడ్జెట్ అంటున్నారని.. ఈ నేపథ్యంలో కొంచెం అమృతాన్ని ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఇస్తే అభివృద్ధి చెందుతుందన్నారు. ఆదాయ పన్ను మినహాయింపు రూ.7 లక్షలకు పెంచినా సెక్షన్ 80సీ, 80డీ సెక్షన్ 24 సీలకు మినహాయింపులు కొత్త పన్ను విధానంలో లేకపోవడం శోచనీయమన్నారు. ప్రావిడెంట్ ఫండ్, గృహనిర్మాణాలకు ప్రోత్సాహకాలు పెంచాలని కోరారు. కాకినాడకు కేటాయించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్‌కు వంద శాతం నిధులు కేంద్రమే భరించాలన్నారు.

**కరోనా వల్లే కార్యకలాపాలకు ఆటంకం**

కరోనా.. తద్వారా ఏర్పడిన పరిమితుల కారణంగా 2020–21, 2021–22ల్లో మంత్రిత్వశాఖ పథకాల కార్యకలాపాలకు ఆటంకం కలిగిందని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. మంత్రిత్వశాఖకు బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గాయని వైఎస్సార్‌సీపీ ఎంపీలు శ్రీకృష్ణదేవరాయలు, బాలశౌరి అడిగిన ప్రశ్నలకు ఈ మేరకు మంత్రి సమాధానమిచ్చారు.

## బర్త్‌డే కేక్‌లా రాష్ట్ర విభజన

- ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాల్సిందే
- లోక్‌సభలో గళమెత్తిన వైఎస్సార్‌సీపీ ఎంపీలు భరత్‌రామ్, శ్రీకృష్ణదేవరాయలు



**సాక్షి, న్యూఢిల్లీ:** రాజకీయ లబ్ధి కోసం బర్త్‌డే కేక్‌లా రాష్ట్రాన్ని విభజించారని లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు విమర్శించారు. అశాస్త్రీయంగా రాష్ట్రాన్ని విభజించడమే కాకుండా తొమ్మిదో బడ్జెట్‌లోనూ రాష్ట్రంపై సవతి ప్రేమే చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం లోక్‌సభలో బడ్జెట్ పద్దులపై వైఎస్సార్‌సీపీ తరపున చీఫ్ విప్ మార్గాని భరత్‌రామ్ మాట్లాడారు. సంఖ్యా పరంగా ఏపీ నుంచి 25 మంది ఎంపీలు మాత్రమే ఉన్నా ప్రత్యేకహోదా విషయంలో గట్టిగా గళం వినిపిస్తామని తేల్చిచెప్పారు. విభజన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని చెప్పారు. పార్లమెంటు వేదికగా నాటి ప్రధాని ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విభజన చట్టం ప్రకారం ఏపీలో తగిన సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. రాముడు అరణ్యవాసానికి వెళ్లినప్పుడు భరతుడు మాదిరిగా ప్రధాని మోదీ ఏపీని భుజాలకు ఎత్తుకోవాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సభాపతి స్థానంలో ఉన్న రాజేంద్ర అగర్వాల్ జోక్యం చేసుకొని మీరు భరతుడే కదా అని చమత్కరించారు. తొమ్మిదేళ్లు అయినా రైల్వే జోన్ కూడా ఏం పూర్తికాలేదని భరత్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు సవరించిన అంచనా రూ.55 వేల కోట్లను ఆమోదించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**విశాఖ, విజయవాడలకు మెట్రో ప్రాజెక్టులు ఇవ్వండి**

ముంబై, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి నగరాలతో పోటీ పడేలా ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం వంటివి తయారు కావాలని ఎంపీ భరత్ పేర్కొన్నారు. విశాఖపట్నం, విజయవాడలకు మెట్రో ప్రాజెక్టులు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌కు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

**హోదా ప్రకటించినా దాని ఊసే లేదు**

వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ విభజన అనంతరం ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించారని కానీ ప్రస్తుతం ఆ ఊసే లేదన్నారు. 1950ల్లో తగిన సాంకేతికత లేకున్నా నాగార్జునసాగర్ కట్టారని.. ఆ ప్రాజెక్టుకు పట్టిన సమయం కన్నా పోలవరం ప్రాజెక్టుకు ఎక్కువ సమయం పడుతోందన్నారు. రాష్ట్రాన్ని అశాస్త్రీయంగా విభజించారని మండిపడ్డారు. తెలంగాణ ఇవ్వాల్సిన రూ.6,800 కోట్లు విద్యుత్ బకాయిల సమస్యను పరిష్కరించాలన్నారు. ఏపీలో వైద్య కళాశాలలకు కేంద్రం సహకారం అందించాలని విన్నవించారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే యోచన విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సుకు రండి





ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సుకు రావాలని కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, మన్సుఖ్ మాండవీయా, నితిన్ గడ్కరీని ఆహ్వానిస్తున్న రాష్ట్ర మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుడివాడ అమర్‌నాథ్

- కేంద్ర మంత్రులకు గుడివాడ, బుగ్గన ఆహ్వానం
- విశాఖ సదస్సుకు దేశ, విదేశ పారిశ్రామికవేత్తలు

**సాక్షి, న్యూఢిల్లీ:** విశాఖపట్నంలో మార్చి 3, 4 తేదీల్లో నిర్వహించనున్న ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సుకు రావాలని పలువురు కేంద్ర మంత్రులను ఏపీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బుగ్గన రాజేంద్రనాథ్ ఆహ్వానించారు.గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్‌సింగ్, కిషన్‌రెడ్డి, మన్సుఖ్ మాండవీయా, సర్బానంద సోనోవాల్‌లను రాష్ట్ర మంత్రులిద్దరూ కలిశారు. అనంతరం గుడివాడ అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ ఇటీవల ప్రపంచ పెట్టుబడిదారుల సన్నాహక సదస్సులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో 49 దేశాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించామని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించిన 13 రంగాలకు ఈ సదస్సు ఉపకరిస్తుందన్నారు. రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక ప్రగతికి ఉపకరించడంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్రంలోని మూడు పారిశ్రామిక కారిడార్లలో 49 వేల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయన్నారు. ఇవన్నీ పారిశ్రామిక ప్రగతికి ఉపకరిస్తాయని వెల్లడించారు. విశాఖ సదస్సుకు పారిశ్రామికవేత్తలతో సహా అంతర్జాతీయ ప్రతినిధులు కూడా వస్తారని చెప్పారు. సుప్రీంకోర్టులో కేంద్రం రాజధానిపై వేసిన అఫిడవిట్‌ను చంద్రబాబు చదివినందుకు సంతోషంగా ఉందని తెలిపారు.

## డబ్బులెందుకు.. ఫోన్ ఉంటే చాలు..

**నగదు చెల్లింపుల్లో 'యూపీఐ' విప్లవం**

- ప్రతి కొనుగోలుకూ పేమెంట్ యాప్‌లతోనే చెల్లింపులు
- వీటి వినియోగంలోనూ జాగ్రత్తలు తప్పనిసరి
- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు.. ఆదమరిస్తే ఇక అంతే

**సాక్షి, అమరావతి:** బడ్డీ కొట్టులో రూపాయి చాక్లెట్ కొన్నా.. ఇంట్లోనే కూర్చొని టికెట్లు బుక్ చేయాలన్నా.. గ్యాస్, కరెంట్ తదితర బిల్లులు చెల్లించాలన్నా.. అన్నింటికీ ప్రజలు ఇప్పుడు 'యూపీఐ' యాప్‌లనే ఆశ్రయిస్తున్నారు. చివరకు భిక్షాటనలోనూ యూపీఐ క్యూఆర్ కోడ్‌లనే ఉపయోగించేస్తున్నారు. అన్నింటికీ పేమెంట్ యాప్‌లతోనే చెల్లింపులు జరుపుతున్నారు. ముఖ్యంగా గత రెండు, మూడేళ్ల నుంచి జనం చేతుల్లో క్యాష్ తక్కువైపోయి.. స్కానింగ్ ఎక్కువైపోయింది. యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ఫేస్(యూపీఐ) ఒక బ్యాంక్ అకౌంట్ నుంచి మరో అకౌంట్‌కు మొబైల్ ఫోన్ ద్వారా చెల్లింపులు జరిపేందుకు వాడే ఒక వాహకం. దీని ద్వారా ఆన్‌లైన్ పేమెంట్స్ చాలా సులవుగా, వేగంగా జరిగిపోతున్నాయి. ప్రస్తుతం పేమెంట్ యాప్‌ల ద్వారా రోజుకు రూ.లక్ష వరకు బదిలీ చేసే అవకాశముండటంతో.. దీనిని విరివిగా ఉపయోగిస్తున్నారు. వీటి వల్ల ప్రజలు బ్యాంకులకు వెళ్లి.. గంటల పాటు వేచి చూసే శ్రమ కూడా తప్పింది. సమయం కూడా ఆదా అవుతోంది.

**వేగంగా వృద్ధి..**

'డేటా డాట్ ఏఐ' అనే సంస్థ చేసిన అధ్యయనం ప్రకారం 2022లో ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది డౌన్‌లోడ్ చేసుకున్న యాప్స్‌లో ఫోన్ పే, పేటీఎం, గూగుల్‌పే మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. మొబైల్ బ్యాంకింగ్, డిజిటల్ వ్యాలెట్, పేమెంట్, పర్సనల్ లోన్స్ ఎంతో వేగంగా వృద్ధి చెందాయని ఈ నివేదిక వెల్లడించింది. ఇక టాప్–10 డౌన్‌లోడెడ్ యాప్స్‌లో నాలుగు, ఆ తర్వాతి స్థానాల్లో బజాజ్ ఫిన్ సర్వ్, యోనో ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా వరల్డ్, క్రెడిట్ బీ, ధని, నవీ, గ్రో యాప్స్ ఉన్నాయి.

**ఆదమరిస్తే అంతే..**

డిజిటల్ పేమెంట్స్ వల్ల ఎన్ని ప్రయోజనాలున్నాయో.. ముప్పు కూడా అదే స్థాయిలో ఉంది. కాస్త అజాగ్రత్తగా ఉన్నా.. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయే ప్రమాదముంది. యూపీఐ పేమెంట్స్‌పై అవగాహన లేకపోవడం, తమకు వచ్చే మోసపూరిత ఫోన్ కాల్స్, మెసేజ్‌లను నమ్మడం వల్ల చాలామంది మోసపోతున్నారు. లాటరీ తగిలిందని.. మీ ఖాతా వివరాలు అప్‌డేట్ చేయాలి ఓటీపీ చెప్పండని, ఈ లింక్ మీద క్లిక్ చేస్తే అదృష్టం వరిస్తుందని.. ఇప్పుడు కొత్తగా మా వీడియోలను చూస్తే చాలు, సోషల్ మీడియాలో లైక్ కొడితే చాలు డబ్బులిస్తామంటూ అనేక రకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేసి.. వన్‌టైమ్ పాస్‌వర్డ్(ఓటీపీ), యూపీఐ పిన్ నంబర్లు తెలుసుకొని డబ్బులు లాగేస్తున్నారు. ఇలా మోసపోకుండా ఉండాలంటే.. పాస్‌వర్డ్‌లను తరచుగా మారుస్తుండాలి. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింక్‌లను తెరవకూడదు. క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయకూడదు. ఎవరికీ ఎలాంటి సందర్భంలోనూ ఓటీపీ చెప్పకూడదు. ఇలా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు.. చెల్లింపుల విషయంలో జాగ్రత్తగా ఉంటే మోసాల నుంచి తప్పించుకోవచ్చు.


విజయనగరం జిల్లా గొర్లెసీతారాంపురంలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు


పల్నాడు జిల్లా అడిగొప్పల గ్రామంలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మన ప్రభుత్వం


వైఎస్సార్ జిల్లా మద్దిమడుగులో మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


నెల్లూరు జిల్లా వెంకన్నపాలెంలో స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

## క్లుప్తంగా...

### వెట్టిచాకిరీ వ్యవస్థ రూపు మాపడమే ప్రభుత్వ లక్ష్యం

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో వెట్టిచాకిరీ వ్యవస్థను రూపుమాపడమే ప్రభుత్వ లక్ష్యమని కార్మిక శాఖ కమిషనర్ ఎం.ఎం.నాయక్ అన్నారు. పేదరికం, నిరక్షరాస్యత కారణంగా ఏర్పడే వెట్టిచాకిరీ వ్యవస్థపై ప్రజల్లో మరింత అవగాహన పెంచడం కోసం రాష్ట్ర ప్రభుత్వం జీవో నం–1 ద్వారా ఫిబ్రవరి 9వ తేదీని వెట్టిచాకిరీ నిర్మూలనా దినంగా ప్రకటించిందని చెప్పారు. వెట్టిచాకిరీ నిర్మూలనా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇరిగేషన్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో నాయక్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు, వివిధ శాఖల సమన్వయంతో వెట్టిచాకిరీ వ్యవస్థను రూపుమాపడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ క్రమంలో కృషి చేసిన పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్, బచపన్ బచావో ఆందోళన్, చైల్డ్ లైన్, చైల్డ్ వెల్ఫేర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**ఆపరేషన్ స్వచ్ఛ్**

వెట్టి చాకిరీ నిర్మూలనకు రూపొందించిన 'ఆపరేషన్ స్వచ్ఛ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐడీ అదనపు డీజీ ఎన్.సంజయ్ కోరారు. 'ఆపరేషన్ స్వచ్ఛ్' కార్యక్రమం విధివిధానాలను నిర్దేశిస్తూ రూపొందించిన పుస్తకాన్ని ఆయన సీఐడీ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు.

### క్రీడా మౌలిక వసతులకు పెద్దపీట

**శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి**

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా రంగంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నట్టు శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 82వ శాప్ బోర్డు మీటింగ్‌లో 12 జిల్లాల్లో క్రీడాభివృద్ధికి పలు అంశాలను ప్రతిపాదించినట్టు చెప్పారు. వైఎస్సార్ జిల్లాలో డీఎస్ఏ స్టేడియం పునర్నిర్మాణం, రూ.33.54 లక్షలతో 50 కిలో వాట్ సోలార్ పవర్ సిస్టమ్, కర్నూలు జిల్లాలో నాలుగు సింథటిక్ టెన్నిస్ కోర్టులు, నంద్యాల జిల్లాలో నాలుగు సింథటిక్ కోర్టులతో పాటు ఆళ్లగడ్డ హైస్కూల్లో ఇండోర్ స్టేడియం, నందికొట్కూరులో వాలీబాల్ కోర్టు, అనంతపురం జిల్లాలో ఇండోర్ హాల్/స్కేటింగ్ రింక్, శ్రీసత్య సాయి జిల్లాలో చిగిచర్ల హైస్కూల్లో హాకీ గ్రౌండ్, తిరుపతి జిల్లా పుత్తూరులో స్కేటింగ్ రింక్, నెల్లూరు జిల్లాలో రెండు క్రీడా వికాస కేంద్రాల నిర్మాణం, తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో వాలీబాల్, బాస్కెట్ బాల్ కోర్టులు, అనపర్తి హైస్కూల్లో బాస్కెట్‌బాల్ కోర్టులో సింథటిక్ బోర్డు, కడియంలో మినీ స్టేడియానికి మరమ్మతులు, విజయనగరం జిల్లాలో స్కేటింగ్ రింక్, ఇతర మౌలిక సదుపాయాలు, కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం, వాటర్ స్పోర్ట్స్ పరికరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో తాడేపల్లి గూడెం మునిసిపల్ హైస్కూల్లో వాలీబాల్, పోల్‌వాల్ట్ కోర్టులు, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణాల కోసం ప్రతిపాదించిన తీర్మానాలను బోర్డు ఆమోదించినట్టు వివరించారు.

# సోషల్ మత్తు.. అదో జగత్తు!

## వ్యసనంగా మారుతున్న సామాజిక మాధ్యమం

- పాశ్చాత్య దేశాల్లో 98 శాతం యువత ఆన్‌లైన్‌లోనే..
- ప్రతి 30 నిమిషాలకు ఒకసారి నెట్‌లోకి వెళుతున్నట్టు గుర్తింపు
- సోషల్ మీడియాలో గడిపే భారతీయుల సగటు సమయం 2.36 గంటలు
- 5 గంటలకు పైగా ఆన్‌లైన్‌లోనే ఉండేవారు 4.7 శాతం మంది



**సాక్షి, అమరావతి:** ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్, యూట్యూబ్, ఇన్‌స్టాగామ్.. స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరికీ తెలిసిన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ఇవి. స్నేహితులు, కుటుంబ సభ్యులను కలిపేందుకు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు గంటల తరబడి వాటిలోనే గడిపేటంత వ్యసనంగా మారిపోయాయి. ముఖ్యంగా 16 నుంచి 24 ఏళ్ల యువత గంటల తరబడి సోషల్ మీడియాలోనే గడుపుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇంగ్లండ్‌కు చెందిన కమ్యూనికేషన్స్ రెగ్యులేటర్ 'ఆఫ్‌కమ్' లెక్కల ప్రకారం పాశ్చాత్య దేశాల్లో 98 శాతం యువత (16–24 సంవత్సరాలు) రోజులో ఎక్కువ సమయం ఆన్‌లైన్‌లో గడుపుతుంటే భారతదేశంలో 33.7 శాతం మంది అదే పనిలో ఉంటున్నట్టు పేర్కొంది. దేశంలో వినియోగంలో ఉన్న స్మార్ట్ ఫోన్లలో కనీసం మూడు యాప్‌ల్లో ఏదో ఒకటి రోజూ 30 నిమిషాలకు ఒకసారి తెరుస్తున్నట్టు గుర్తించారు. రోజులో గంట కంటే ఎక్కువ సేపు ఆన్‌లైన్‌లో గడిపితే అనర్థాలకు దారి తీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం భారతదేశంలోని ఇంటర్నెట్ వినియోగదారులు సగటున రోజుకు 2.36 గంటలు సోషల్ మీడియాలో గడుపుతున్నట్టు యూఎస్‌కు చెందిన టెక్ జ్యూరీ సంస్థ తెలిపింది.

### దేశంలో 4.7% మందికి వ్యసనం

వాస్తవానికి సోషల్ మీడియా వ్యసనాన్ని లెక్కించేందుకు నిర్దిష్టమైన కొలమానాలు ఏవీలేకున్నా.. గంటల తరబడి ఫోన్‌తోనే గడపడాన్ని వ్యసనంగానే భావిస్తున్నారు. ప్రతి 20 నిమిషాలకు ఒకసారి ఫోన్ చూసుకోవడం.. ఎలాంటి సందేశాలు రాకున్నా వచ్చినట్టు భావించడం.. కాస్త సమయం దొరికితే యూట్యూబ్, ఫేస్‌బుక్‌లోకి దూరిపోయి సమయాన్ని మరిచిపోవడం.. నిద్ర వస్తున్నా బలవంతంగా ఫోన్ చూస్తూ గడిపేయడం వంటి లక్షణాలు కనిపిస్తే అది సోషల్ మీడియా అడిక్షన్‌గా పేర్కొంటున్నారు. 5 గంటలకు పైగా ఆన్‌లైన్‌లోనే ఉండేవారిని వ్యసనపరులుగా భావిస్తున్నారు. యూకేలో 10 శాతం మందికి ఈ వ్యసనం ఉండగా, మన దేశంలో 4.7 శాతం మందికి సోషల్ మీడియా వ్యసనంగా మారినట్టు లెక్కించారు.

### అడిక్షన్ ఉందో లేదో ఇలా గుర్తించొచ్చు..

సోషల్ మీడియా వ్యసనానికి ఆనందించే అలవాటు మధ్య కొన్ని ముఖ్యమైన తేడాలు ఉన్నట్టు చికాగో యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడించింది.

- సోషల్ మీడియాను మితిమీరి ఉపయోగించడం వల్ల ఉద్యోగం, చదువు, పనులపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అంటే ఏదైనా నిర్దిష్ట సమయంలో చేయాల్సిన పనికి బదులు ఫోన్‌లో యాప్‌లను తెరిస్తే అది వ్యసనానికి సంకేతంగా చెబుతున్నారు.
- స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఉన్నప్పుడు, భోజనం చేసేటప్పుడు స్మార్ట్‌ఫోన్‌ను తీసుకోవడం, మెస్సేజ్‌లను చూడడం.
- ప్రతి చిన్న సమస్యకు పరిష్కారంగా ఆన్‌లైన్, సోషల్ మీడియాపై అధికంగా ఆధారపడటం
- ఫోన్‌లో బ్యాలెన్స్ ఉండి, ఇంటర్నెట్ రాకుంటే చిరాకు, కోపం రావడం, ఏదో కోల్పోయినట్టు ఆందోళన చెందడం.
- అవకాశం దొరికినప్పుడల్లా వ్యక్తులు ఆశ్రయించే మొదటి అంశం స్మార్ట్‌ఫోన్ కావడం.. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే సోషల్ మీడియా అడిక్షన్‌లోకి వెళ్లినట్లేనని మానసిక వైద్యులు చెబుతున్నారు.

### స్మార్ట్‌ఫోన్‌తో రోజువారీ బంధం ఇలా..

- సోషల్ మీడియాలో అత్యధికంగా (60 శాతం) ఉండేది 18-34 ఏళ్ల వారే
- ఫోన్ అస్సలు స్విచ్ఛాఫ్ చేయనివారు 50%
- రోజుకు ఫోన్ అన్‌లాక్ చేసేది 150 సార్లు
- రోజుకు సగటున ఫోన్‌చెక్ చేసుకునేది 63 సార్లు.. ఫోన్ పక్కలో పెట్టుకుని నిద్రపోయేవారు 71 శాతం
- బాత్‌రూముల్లోనూ ఫోన్లు వినియోగించేవారు 40%
- డ్రైవింగ్‌లో ఒక్కసారైనా మెస్సేజ్ చేసేవారు 75%
- పడుకునే ముందు లేదా నిద్ర లేచిన వెంటనే ఫోన్ చూసేవారు 87 శాతం



ప్రస్తుతం ఇంటర్నెట్ ఎక్కువ మందికి అందుబాటులోకి వస్తుండడంతో వచ్చే రెండేళ్లలో మనదేశంలో ఇది 12 శాతానికి పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ఇష్టమైన యాప్స్ లాగిన్ అయినప్పుడల్లా మెదడులో డోపమైన్ (ఆనందాన్ని కలిగించే ఎంజైమ్) విడుదల స్థాయి పెరుగుతుందని, ఫలితంగా మెదడులోని న్యూరో ట్రాన్స్‌మీటర్లు ఆనందంతో కదులుతాయని వైద్యులు చెబుతున్నారు.

# మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నికలు

▶ మొదటి పేజీ తరువాయి

సంస్థల (హైదరాబాద్) స్థానాల్లో కూడా ఇదే షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించనున్నారు.

**ఏపీలో ఎన్నికలు జరిగే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలు:** అనంతపురం, కడప, నెల్లూరు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలో 2 స్థానాలు, శ్రీకాకుళం, చిత్తూరు, కర్నూలు

**టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే స్థానాలు :**
ప్రకాశం – నెల్లూరు – చిత్తూరు
కడప – అనంతపురం – కర్నూలు

**పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానాలు :**
1. ప్రకాశం– నెల్లూరు –చిత్తూరు
2. కడప– అనంతపురం– కర్నూలు
3. శ్రీకాకుళం– విజయనగరం– విశాఖపట్నం

**షెడ్యూల్**

| | |
|---|---|
| నోటిఫికేషన్ | ఫిబ్రవరి 16 |
| నామినేషన్లకు చివరి తేది | ఫిబ్రవరి 23 |
| నామినేషన్ల పరిశీలన | ఫిబ్రవరి 24 |
| నామినేషన్ ఉపసంహరణ | ఫిబ్రవరి 27 |
| ఎన్నిక | మార్చి 13 |
| ఫలితాలు | మార్చి 16 |

# మహిళల రక్షణకు ఏపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత

**దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నా : ఆశా మాలవ్య**

**సాక్షి, అమరావతి/విజయవాడ స్పోర్ట్స్:** మహిళల రక్షణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం సంతోషంగా ఉందని దేశ వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేపట్టిన పర్వతారోహకురాలు ఆశా మాలవ్య అన్నారు. మహిళల ప్రాముఖ్యతను, రక్షణ వంటి అంశాలను విస్తృతంగా సమాజంలోకి తీసుకువెళ్లాలనే లక్ష్యంతో సైకిల్ యాత్ర చేపట్టిన ఆశా మాలవ్య గురువారం ఏపీ మహిళా కమిషన్ కార్యాలయం వద్ద చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆశా మాలవ్య 'దిశ' యాప్ బ్యాడ్జి, లోగోతో కూడిన టీ షర్ట్‌ను ధరించారు. ఏపీలో మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యతను దేశ ప్రధాని మోదీని కలిసి వివరిస్తానని ఆమె తెలిపారు. ఆశా మాలవ్యను వాసిరెడ్డి పద్మ సన్మానించి ఆమె సైకిల్ యాత్ర లక్ష్యం నెరవేరాలని అభినందించారు. మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియా బేగం పాల్గొన్నారు.


విజయవాడ నుంచి యాత్ర పునఃప్రారంభం

ఆశా మాలవ్య చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం విజయవాడ నుంచి పునఃప్రారంభమైంది. పోలీస్ కమిషనరేట్ వద్ద ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతి రాణా టాటా జెండా ఊపి ఆమె యాత్రను ప్రారంభించారు. ఆశా మాలవ్య తన లక్ష్యాన్ని సాధించాలని సీపీ ఆకాంక్షించారు. ఆశా మాలవ్య మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ యాప్ మహిళలు, బాలికలకు అండగా నిలుస్తుందని, తాను కూడా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నానని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి తన సైకిల్ యాత్ర తెలంగాణలోకి ప్రవేశిస్తుందని తెలిపారు.

# 'ఏదైనా పత్రిక కొనుగోలుకు ఆర్థిక సాయం' జీవోలను రద్దు చేయండి

- వలంటీర్లు 'సాక్షి'నే కొంటున్నారు..
- హైకోర్టులో 'ఈనాడు' యాజమాన్యం పిటిషన్
- జీవోలో ఎక్కడా సాక్షినే కొనాలని చెప్పలేదు..
- హైకోర్టుకు వివరించిన ఏజీ శ్రీరామ్

**సాక్షి, అమరావతి :** విస్తృత సర్కులేషన్ ఉన్న ఏదైనా ఓ దినపత్రికను కొనుగోలు చేసేందుకు గ్రామ, వార్డు వలంటీర్, సెక్రటేరియట్‌లకు నెలకు రూ.200 మేర ఆర్థిక సాయాన్ని అందజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలను సవాలు చేస్తూ ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఈనాడు) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ జీవోలను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించి, వాటిని రద్దు చేయాలని కోరింది. వలంటీర్లు, సెక్రటేరియట్ల 'సాక్షి' దినపత్రిక కొనుగోళ్లను పరిగణనలోకి తీసుకోకుండా ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్కులేషన్ (ఏబీసీ)ను ఆదేశించడంతో పాటు నిర్దిష్ట కాలాల్లో సాక్షి పత్రికకు ఇచ్చిన సర్కులేషన్ సర్టిఫికేషన్‌ను పునః సమీక్షించాలని కూడా ఏబీసీని ఆదేశించాలంటూ ఉషోదయ డైరెక్టర్ ఐ.వెంకట్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంలో పలు ప్రభుత్వ శాఖల ముఖ్య కార్యదర్శులను, ఏబీసీ సెక్రటరీ జనరల్‌తో పాటు వ్యక్తిగత హోదాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతిరెడ్డిలతో పాటు వారికి చెందిన కంపెనీలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై గురువారం ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం విచారించింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, మధ్యంతర ఉత్తర్వుల జారీపై తీర్పును రిజర్వ్ చేసింది. ఈ నెల 14న మధ్యంతర ఉత్తర్వులపై తమ నిర్ణయాన్ని వెలువరిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ లోపు ప్రధాన వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న పలు ప్రభుత్వ శాఖల ముఖ్య కార్యదర్శులకు, ఏబీసీ సెక్రటరీ జనరల్‌తో పాటు వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతిరెడ్డి తదితరులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపింది. తదుపరి విచారణను 14వ తేదీకి వాయిదా వేసింది. కాగా, ఈనాడు న్యాయవాదుల అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ తోసిపుచ్చారు. జీవోలో ఎక్కడా కూడా ప్రభుత్వం సాక్షి దినపత్రికను మాత్రమే కొనాలని చెప్పలేదన్నారు. విస్తృత సర్కులేషన్ ఉన్న ఏ పత్రికనైనా కొనుగోలు చేసే వెసులుబాటు వలంటీర్లకు ఇచ్చిందన్నారు.

# జేఈఈలో ఎస్సీ గురుకుల విద్యార్థుల సత్తా



**సాక్షి, అమరావతి/ సాక్షి, విశాఖపట్నం :** జేఈఈ తొలి విడత పరీక్షల్లో ఎస్సీ గురుకులాలకు చెందిన విద్యార్థులు కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా సత్తా చాటారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన గురువారం మీడియాకు వెల్లడించారు. ఎస్సీ గురుకులాలకు చెందిన 189 మంది విద్యార్థులు జేఈఈ పరీక్షలు రాశారని, వారిలో 151 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించినట్టు తెలిపారు. రాష్ట్రంలోని ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో చిన్నటేకూరు(కర్నూలు జిల్లా), అడవి తక్కెళ్లపాడు(గుంటూరు జిల్లా), ఈడ్పుగల్లు(కృష్ణా జిల్లా)లో జేఈఈ, నీట్ శిక్షణ కేంద్రాలను నిర్వహించినట్టు తెలిపారు. ప్రత్యేక శ్రద్ధతో ఇచ్చిన శిక్షణతో జేఈఈ తొలి విడత పరీక్షల్లో అనేక మంది ఎస్సీ విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో 99.05 పర్సంటైల్ వరకూ మార్కులు సాధించినట్టు చెప్పారు. అన్ని సబ్జెక్టుల్లోనూ ఓవరాల్‌గా చిన్నటేకూరు శిక్షణ కేంద్రానికి చెందిన వరదా పవన్‌కుమార్ 96.61, మల్లెపోగు అవన్‌కుమార్ 95.49, రవణ కిరణ్‌కుమార్ 95.39 పర్సంటైల్‌ను సాధించగా, ఈడ్పుగల్లుకు చెందిన జి.మనోజ్ఞ 95.60, అడవి తక్కెళ్లపాడుకు చెందిన అజయ్‌భార్గవ్ 93.63 పర్సంటైల్స్ సాధించి ఎస్సీ గురుకులాల్లో టాపర్స్‌గా నిలిచారని వివరించారు. ఎన్ఐటీలలో సీట్లు సాధించడానికి అంచనా వేస్తున్న కటాఫ్ మార్కుల ప్రకారంగా తమ గురుకులాల నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలకు అర్హత సాధించిన 151 మంది విద్యార్థుల్లో 93 మందికి ప్రస్తుతం సాధించిన మార్కులతోనే సీట్లు వస్తాయని అంచనా వేస్తున్నామని తెలిపారు. గురుకుల విద్యార్థులు ఎస్సీ రిజర్వేషన్ విభాగం నుంచి కాకుండా తమ ప్రతిభతో జనరల్ కేటగిరీలోనే సీట్లు పొందేందుకు అవసరమైన శిక్షణ ఇస్తామన్నారు.

**బీసీ గురుకుల విద్యార్థుల ప్రతిభ**

జేఈఈ తొలి విడత పరీక్షల్లో బీసీ సంక్షేమ గురుకుల విద్యార్థులు 168 మంది బీసీ గురుకుల విద్యార్థులు హాజరుకాగా 35 మంది జేఈఈ అడ్వాన్స్ పరీక్షలకు అర్హత సాధించారని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణమోహన్ తెలిపారు.

**సత్తా చాటిన గిరిజన విద్యార్థులు**

జేఈఈ మెయిన్‌లో గిరిజన విద్యార్థులు సత్తాచాటారు. విశాఖ మారికవలస ఏపీటీడబ్ల్యూఆర్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల్లో 18 మంది అడ్వాన్స్‌డ్ పరీక్షలకు అర్హత సాధించారు. రాహుల్ అత్యధికంగా 85.5 శాతం మార్కులు సాధించాడు.

### విద్యార్థులకు ఉపయుక్తం 'వన్ మినిట్ మేనేజర్' పుస్తకం

**సాక్షి, అమరావతి:** బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో ప్రావీణ్యం సాధించేందుకు 'వన్ మినిట్ మేనేజర్' అనే పుస్తకం ఉపయుక్తంగా ఉంటుందని ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఎంబీఏ విద్యార్థులకు సూచించారు. విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో ఎంబీఏ విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మనం చేరాలనుకున్న గమ్యం మనం వెళ్లే దారిపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రాథమిక అంశాల్లో కూడా నైపుణ్యం ఎంతో ఉపకరిస్తుందన్నారు. కేఎల్‌యూ వీసీ జి.పార్థసారథి వర్మ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ 'మండలి' డిప్యూటీ చైర్మన్‌గా బండా ప్రకాశ్!

**సాక్షి, హైదరాబాద్:** సుమారు ఏడాదిన్నరగా ఖాళీగా ఉన్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఈ ఎన్నికకు సంబంధించి శుక్రవారం నోటిఫికేషన్ వెలువడనుండగా, 11వ తేదీన నామినేషన్ల స్వీకరణ, పరిశీలన తదితరాలు పూర్తి చేస్తారు. 12న ఉదయం 10 గంటలకు శాసన మండలి ప్రారంభమైన అనంతరం డిప్యూటీ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేసి బాధ్యతలు అప్పగిస్తారు. కాగా శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ ముదిరాజ్ ఎన్నిక దాదాపు ఖాయమైంది. ఆయన పేరును బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఖరారు చేశారు. దీంతో ఈ నెల 11న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ఎన్నికకు సంబంధించి నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు బండా ప్రకాశ్ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా వ్యవహరించిన నేతి విద్యాసాగర్ 2021 జూన్ 3న ఎమ్మెల్సీగా తన పదవీ కాలం పూర్తి చేసుకున్నారు. అప్పటి నుంచి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ పదవికి ఎన్నిక జరగకపోవడంతో సుమారు ఏడాదిన్నరగా ఖాళీగా ఉంది.

### వీరశైవ లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చాలి

**సాక్షి, న్యూఢిల్లీ:** వీరశైవ లింగాయత్ కులాన్ని కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని బీఆర్ఎస్ ఎంపీ బీబీ పాటిల్ డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో గత 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించాలని జాతీయ బీసీ కమిషన్(ఎన్సీబీసీ) చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహిర్‌ను కోరారు. గురువారం ఢిల్లీలో బీబీ పాటిల్ నేతృత్వంలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్, తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్ సమాజం ప్రతినిధులు ఎన్సీబీసీ కార్యాలయంలో హన్స్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం బీబీ పాటిల్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో వీరశైవ లింగాయత్ ప్రజలు విద్యాపరంగా వెనుకబడి ఉన్నారని, అత్యధికులు రోజువారి కూలీపనులు చేసుకుంటూ బతుకు వెళ్లదీస్తున్నారని అన్నారు. త్వరలోనే ఓబీసీలో చేర్చడానికి కృషి చేస్తానని హన్స్‌రాజ్ అహిర్ పేర్కొన్నారని బీబీ పాటిల్ తెలిపారు.

## కవి, మాజీ ఐఏఎస్ జె.బాపురెడ్డి కన్నుమూత

**నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు**

**సిరిసిల్ల కల్చరల్:** రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి జె.బాపురెడ్డి(86) బుధవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బాపురెడ్డి భార్య పదేళ్ల క్రితం కాలం చేశారు. బాపురెడ్డి ఇల్లంతకుంట మండలం సిరికొండకు చెందిన జంకె కృష్ణారెడ్డి, రామలక్ష్మి దంపతులకు 1936, జూలై 21న జన్మించారు. సినారె స్ఫూర్తితో 8వ ఏట నుంచి రచనలు చేశారు. పద్యం, గేయం, వచనం, విమర్శ, అనువాదం వంటి సాహితీ విభాగాల్లో రాణించారు. 36 పుస్తకాలు రచించారు. చైతన్యరేఖలు, రాకెట్ రాయబారం వంటి గేయసంపుటాలు, 'మనసులో మాట'వ్యాససంపుటి, ప్రణవ ప్రణయం, రంగురంగుల చీకట్లు వంటి పుస్తకాలను వెలువరించారు. తెలుగు, ఆంగ్లంతోపాటు పలు భారతీయ భాషల్లోకి సైతం ఆయన పుస్తకాలు అనువాదమయ్యాయి. ప్రపంచ కళాసంస్కృతుల అకాడమీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 'మన చేతుల్లోనే ఉంది'గ్రంథానికి తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ వచన కవితా పురస్కారం అందుకున్నారు. 2016లో రాష్ట్ర ప్రభుత్వం దాశరథి పురస్కారంతో సత్కరించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఆర్థికశాస్త్రంలో స్నాతకోత్తర పట్టభద్రుడయ్యారు. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్‌లో చేరి మెదక్, వరంగల్ జిల్లాల కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం స్పెషల్ అసిస్టెంట్‌గా, భారత పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, పరిశ్రమల అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా, ఏపీపీఎస్సీ సభ్యుడిగా విధులు నిర్వహించారు. పరిశ్రమలశాఖలో ఎన్నో సంస్కరణలకు ఆద్యుడిగా పేరుగాంచారు. ప్రపంచ పర్యాటకుడిగా గుర్తింపు పొందిన ఆయన 37 దేశాల్లో పర్యటించారు.

### ముగిసిన పెద్దగట్టు జాతర

**సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలో కొలువైన శ్రీలింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర ముగిసింది. గురువారం రాత్రి మకర తోరణాన్ని సూర్యాపేటలోని గొల్ల బజారుకు చెందిన వల్లపు, కోడి వంశస్తులు తీసుకువెళ్లడంతో జాతర ముగిసినట్లు పూజారులు ప్రకటించారు. ఐదు రోజులపాటు జరిగిన ఈ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. చివరి రోజు కూడా భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు, ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు చేపట్టారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన 28 హుండీల ద్వారా రూ.25.71 లక్షల ఆదాయం వచ్చింది. అదే విధంగా 550 గ్రాముల వెండి, రెండు గ్రాముల బంగారం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

## అష్టావధాని అష్టకాల అస్తమయం

**సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, పలువురు సాహితీవేత్తల సంతాపం**

**చిన్నకోడూరు (సిద్దిపేట):** అవధాన సరస్వతి, విఖ్యాత సంస్కృతాంధ్ర పండితులు, అష్టావధాని, సరస్వతీ క్షేత్ర నిర్మాత, కవి, రచయిత అష్టకాల నరసింహరామశర్మ (80) బుధవారం రాత్రి గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. అష్టకాల ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, అష్టావధానిగా, వాస్తు, జ్యోతిష్య పండితుడిగా సిద్దిపేట ప్రాంతంలో ఆయన ప్రసిద్ధి చెందారు. అవధానాలు చేస్తూ వచ్చిన డబ్బు, దాతల సహకారంతో సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అనంతసాగర్ శివారులోని దట్టమైన అటవీ ప్రాంతంలో పదేళ్లపాటు శ్రమించి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఆయన రోజు మాదిరిగానే బుధవారం ద్విచక్రవాహనంపై సరస్వతీ క్షేత్రానికి వెళ్లి వచ్చారు. రాత్రి 11 గంటల సమయంలో గుండె నొప్పిరావడంతో కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో మరోసారి గుండెపోటు రావడంతో అక్కడే కన్నుమూశారు. అష్టకాలకు భార్య రత్నాభాయి, నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మరణవార్త తెలుసుకున్న సాహితీప్రియులు, కవులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మృతదేహానికి నివాళులర్పించారు. నేడు అనంతసాగర్ సరస్వతీ క్షేత్రం సమీపంలో అష్టకాల అంత్యక్రియలు జరుగుతాయి. ఆధ్యాత్మిక గురువును కోల్పోవడం బాధాకరమంటూ ఆయన అకాల మరణం పట్ల సీఎం కేసీఆర్ ట్విట్టర్‌లో సంతాపం ప్రకటించారు. అష్టకాల మృతిపట్ల మంత్రి హరీశ్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, పలువురు ప్రజా ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, సాహితీవేత్తలు సంతాపం తెలిపారు.

## చినబాబు ఫ్లాప్ షో..అందుకే చంద్రబాబు టాక్ షో..

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని


మంత్రి విడదల రజిని

**యడ్లపాడు:** రాజధాని గురించి చంద్రబాబు మాట్లాడటం హాస్యాస్పదమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఆమె గురువారం పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలెంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు సొంత మనుషులకు దోచిపెట్టేందుకే రాజధాని అంశాన్ని తెరపైకి తెచ్చారన్నారు. నిజంగా ఆయనకు రాజధాని నిర్మించాలనే ఉద్దేశమే ఉంటే తాత్కాలిక భవనాలతోనే ఎందుకు సరిపెట్టారని ప్రశ్నించారు. శాశ్వత నిర్మాణాల్లేకుండా, మౌలిక వసతులు కూడా కల్పించకుండా రాజధాని నిర్మించానంటూ కల్లబొల్లి కబుర్లు ఎన్నో అప్పట్లో చంద్రబాబు చెప్పారన్నారు. దీనివల్ల బాబు, ఆయన మనుషులు అక్కడ వ్యాపారం చేసుకుని లాభం పొందారని దుయ్యబట్టారు. పోలవరం ఆలస్యానికి చంద్రబాబే కారణమని ఆరోపించారు. నారా లోకేశ్ పాదయాత్రకు కనీస స్పందన కూడా లేదని, ఈ విషయాన్ని పక్కదారి పట్టించేందుకే చంద్రబాబు అర్థం పర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడి ఆడియో వింటేనే వారి ఆందోళన ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమాన అభివృద్ధితో ముందుకు వెళ్లాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని, మూడు రాజధానులు తమ విధానమని స్పష్టం చేశారు.

### మురుగునీటి శుద్ధిపై 'టిడ్కో' అధ్యయనం

**సాక్షి, అమరావతి:** టిడ్కో హౌసింగ్ టౌన్‌షిప్‌లలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం, నిర్వహణలో మెళకువలపై ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ఏపీ టిడ్కో బృందం గురువారం తెలంగాణలో పర్యటించింది. హైదరాబాద్ అంబర్‌పేటలోని 339 ఎంఎల్‌డీ సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనితీరును పరిశీలించిన బృందం అక్కడి కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో భూగర్భ డ్రెయినేజీల నుంచి వచ్చే మురుగునీటిని శుద్ధి చేసే ఎస్‌బీఆర్, ఎస్‌టీటీ పద్ధతులు, వాటర్ ప్యూరిఫికేషన్ తీరును అధ్యయనం చేసింది. ఇందుకు సంబంధించి తెలంగాణ అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించింది.

దేవుడి ప్రాణుల యందు దయ కలిగిన మనిషి
తనతో తాను దయగా ఉన్నట్టే.
– ఇస్లాం ధర్మం



సాక్షి
శుక్రవారం, ఫిబ్రవరి, 10

# అంతర్జాలంలో ‘కృత్రిమ’ యుద్ధం

సాంకేతిక యుద్ధం ఇది. కృత్రిమ మేధ(ఏఐ)తో అంతర్జాలంలో టెక్ దిగ్గజాల మధ్య వచ్చిపడ్డ పోటీ ఇది. సరికొత్త ఏఐ ఛాట్‌బోట్ విపణిలో సంచలనాత్మక సంగతులివి. మైక్రోసాఫ్ట్ భారీగా పెట్టుబడి పెట్టిన ‘ఓపెన్ ఏఐ’ సంస్థ సృష్టి ‘ఛాట్ జీపీటీ’దే నేటిదాకా హవా. ఇప్పుడు ఆ యాంత్రిక ఛాట్‌బోట్ సర్వీస్‌కు పోటీగా మరో దిగ్గజం గూగుల్ తనదైన ఛాట్‌బోట్ ‘బార్డ్’ను తెస్తున్నట్టు ప్రకటించింది. దీంతో కథ మలుపు తిరిగింది. మరోపక్క ఈ ఛాట్‌బోట్ టెక్నాలజీతోనే మరింత పదును తేలిన సెర్చ్ ఇంజన్‌గా మునుపటి తమ ‘బింగ్’ను ముందుకు తేనున్నట్టు మైక్రోసాఫ్ట్ తెలిపింది. వెంటనే గూగుల్ సైతం సెర్చ్ ఇంజన్‌గా తన ఆధిక్యాన్ని నిలబెట్టుకొనేందుకు ఏఐ ఫీచర్లతో సై అంటోంది. వెరసి, అంతర్జాలంలో కృత్రిమ మేధ ఆధారంగా కనివిని ఎరుగని పోటాపోటీ వాతావరణం నెలకొంది. కృత్రిమ మేధతో సాగే ఈ పనిముట్లతో మానవాళికి కలిగే మేలు, కీడులపై చర్చ ఊపందుకుంది.

సంక్లిష్ట అంశాల్ని అరటిపండు ఒలిచి నోట్లో పెట్టినట్టు చెప్పడానికి కృత్రిమమేధతో నడిచే ఈ ఛాట్‌బోట్స్ ఉపకరిస్తాయన్నది ప్రాథమిక ఆలోచన. గత ఏడాది నవంబర్‌లో వచ్చిన ‘ఛాట్ జీపీటీ’ అలా నూత్నపథగామి అయింది. 2 నెలల్లో 10 కోట్ల యూజర్లతో సంచలనమైంది. శాన్‌ఫ్రాన్సిస్కోలో 375 మంది ఉద్యోగుల చిన్న స్టార్టప్ ‘ఓపెన్ ఏఐ’ 30 బిలియన్ డాలర్ల విలువైనదైంది. దీంతో, పోటీగా ‘బార్డ్’ను తేవడంలో గూగుల్ తొందరపడక తప్పలేదు. నిజానికి, గూగుల్ బృందపు ఆరేళ్ళ శ్రమ ఫలితం ‘బార్డ్’. తద్వారా ప్రపంచ విజ్ఞానాన్ని సంభాషణల పద్ధతిలో జనానికి సులభంగా అందిస్తామన్నది గూగుల్ మాట. తీరా ప్రయోగదశలో ‘బార్డ్’కు బాలారిష్టాలు తప్పలేదు.

గూగుల్ స్వీయ ప్రచార ప్రకటనలోనే ‘బార్డ్’ కొన్ని జవాబులు తప్పు చెప్పినట్టు ‘రాయిటర్స్’ వార్తాసంస్థ పట్టుకొనేసరికి గగ్గోలు మొదలైంది. ప్యారిస్‌లో ఆ సర్వీస్‌ను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టే సంరంభానికి కొద్ది గంటల ముందే ఆ లోటుపాట్లు బయటపడ్డాయి. దీంతో ఒకపక్క మైక్రోసాఫ్ట్ షేర్ల ధరలు పెరిగితే, మరోపక్క గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ షేర్లు ఒక్క బుధవారమే 7.8 శాతం పడిపోయాయి. 100 బిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లింది. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ జేమ్స్ వెబ్‌స్పేస్ టెలిస్కోప్ గురించి ‘బార్డ్’ తప్పు చెప్పడం ఒకరకంగా గూగుల్‌కు తలవంపులే. కాకపోతే, ఈ ఛాట్‌బోట్ సేవల్ని ఇంకా ప్రజా వినియోగానికి పెట్టలేదు గనక ఫరవాలేదు. అందుబాటులోకి తెచ్చే ముందు ప్రత్యేక పరీక్షకులతో క్షుణ్ణంగా పరీక్షలు జరిపిస్తామంటోంది గూగుల్.

నిజానికి ప్రపంచవ్యాప్తంగా ఆన్‌లైన్ సెర్చ్‌లో గూగుల్‌దే ఆధిపత్యం. ఏ సమాచారం కావాలన్నా ‘గూగులమ్మను అడుగు’ అనేది ఆధునిక జనశ్రుతి. ఈ ప్రాచుర్యంతో గూగుల్‌కు నిరుడు వాణిజ్య ప్రకటనల ద్వారా 100 బిలియన్ (10 వేల కోట్ల) డాలర్ల ఆదాయం వచ్చిపడింది. అయితే, ‘ఏఐ’ను ఆసరాగా చేసుకొని విజృంభిస్తున్న ప్రత్యర్థి మైక్రోసాఫ్ట్‌తో గూగుల్ పీఠం కదులుతోంది. మైక్రోసాఫ్ట్ తమ సెర్చ్ ఇంజన్ ‘బింగ్’ను సైతం సరికొత్త ఫీచర్స్‌తో తీర్చిదిద్ది, గూగుల్‌కు గట్టి పోటీ ఇవ్వనున్నట్టు ఈ వారమే యుద్ధభేరి మోగించింది. వెంటనే ఫిబ్రవరి 8న గూగుల్ సైతం జనరేటివ్ ఏఐ అనుసంధానిత ఫీచర్లతో తమ సెర్చ్ ఇంజన్ ఫలితాల్ని మెరుగుపరుస్తామని చెప్పాల్సి వచ్చింది. ‘బార్డ్’ను తెచ్చిన రెండ్రోజులకే గూగుల్ ఈ రెండో ప్రకటన చేయాల్సిరావడం గమనార్హం. అంతర్జాలంలో పెరుగుతున్న పోటీకీ, టెక్ దిగ్గజాల పోరుకూ ఇది దర్పణం.

ఆధునిక ఏఐ సాంకేతికత ఆవిర్భావం, పోటాపోటీ ఒక రకంగా మంచిదైతే, మరోరకంగా చెడ్డది. అనేక ఇతర సాంకేతిక విప్లవాల లానే దీనివల్లా కొత్త ఉద్యోగాలొస్తాయి. కొన్ని పాతవి పోతాయి. ఏఐతో ప్రకృతి వైపరీత్యాలు, మహమ్మారులు సహా అనేక అంశాల్లో మానవ సామర్థ్యం పెరగవచ్చు. తరగతిలో వేర్వేరు అవగాహన స్థాయుల్లో పది మంది ఉంటే, ఒకే పాఠం ఎవరి స్థాయికి తగ్గట్టు వారికి అర్థమయ్యేలా అందించడం లాంటి మామూలు మేళ్ళు సరేసరి. అయితే, సంభాషణాత్మక ఛాట్‌బోట్ సర్వీస్‌లు సమస్యలకు సమాధానాలివ్వడంతో పాటు సొంతంగా కథలు, కవితలు అల్లగలగడం సృజనాత్మకతకూ సవాలే. ఇలా సమాజాన్నే మార్చేసే సవాలక్ష అంశాలతో తలెత్తే నైతిక, సామాజిక, తాత్త్విక ప్రశ్నలెన్నో. మానవజాతి మేలుకు వాడాల్సినదాన్ని దుర్వినియోగం చేస్తేనే ప్రమాదం. దీనిపై ప్రపంచ వ్యాప్త పర్యవేక్షణ ఎలా అన్నది చూడాలి. సాక్షాత్తూ ‘ఛాట్ జీపీటీ’ సృష్టికర్తలే ప్రభుత్వాల నియంత్రణ కోరుకుంటూ ఉండడం గమనార్హం.

వ్యాపార కార్యకలాపాలలో ఏఐ వ్యవస్థలను జొప్పించడానికీ, తద్వారా ఉద్యోగుల స్థానంలో అవే పనిచేయడానికీ చాలాకాలమే పట్టవచ్చు. ఈలోగా గ్రంథచౌర్యాలు, తప్పుడు పరిష్కారాలు తలెత్తే ప్రమాదమైతే ఉంది. అందుకే, అమెరికాలో కొన్ని స్కూళ్ళలో ఛాట్ జీపీటీని నిషేధించారు. అయితే, కాలప్రవాహంలో ఏ సాంకేతిక పురోగతినైనా స్వాగతించాల్సిందే. అడ్డుకోవాలని చూస్తే ఆగదు, అందువల్ల ప్రయోజనమూ లేదు. దశాబ్దాల క్రితం కంప్యూటర్ విషయంలో భయపడడం లాంటిదే ఇదీ. కానీ, జీవితంలో భాగమయ్యే కొత్త సాంకేతికత సక్రమంగా, బాధ్యతాయుతంగా వినియోగమయ్యేలా చూసుకోవాలి. విలువలకు తిలోదకాలివ్వకుండా అప్రమత్తం కావాలి. ఇప్పటికే సమాజంలో డిజిటల్ విభజనతో పెరిగిపోతున్న అసమానతలకు ఎలా అడ్డుకట్ట వేయాలో ఆలోచించాలి. యంత్రాన్ని సృష్టించిన మనిషికి, ఆ యాంత్రిక కృత్రిమ మేధే ప్రత్యామ్నాయం కావడం సమాజానికే సవాలన్నది నిజమే కానీ మనిషికి ఇవి మహత్తర క్షణాలు. టెక్నాలజీని మనిషి తీర్చిదిద్దితే, ఆ టెక్నాలజీయే మళ్ళీ మనిషిని తీర్చిదిద్దే కీలక ఘట్టం. వెల్కమ్ టు ది న్యూ ఏఐ వరల్డ్!

# బడ్జెట్లు మనుషుల కోసం కాదా?


మల్లెపల్లి లక్ష్మయ్య

**కేంద్ర బడ్జెట్‌లో పరిశ్రమలు, పనిముట్లు, యంత్రాలు, కార్లు, ఇతర ప్రాణంలేని వస్తువుల ప్రస్తావనే అత్యధికం. ఈ ‘అమృత్ కాల్’ బడ్జెట్‌లో అమృతం ఉంది. అది మనుషులను బతికించేందుకు కాదు. మనుషులను నిరుపయోగంగా మార్చేసే సాంకేతిక విప్లవానికీ, ఆధునికీకరణ యంత్రాలకూ. బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ఒకరోజు ముందు పార్లమెంటులో ఉంచే ఎకనామిక్ సర్వే ఉద్దేశ్యం మంచిదే. 2014–15 వరకు ‘సోషల్ సెక్టార్’ పేరుతో ఒక చాప్టర్ ఉండేది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలు, పిల్లలు, వారి సమస్యలు... పాత విధనాల సమీక్ష, కొత్త పథకాల రూపకల్పన ఆలోచనలు సంక్షిప్తంగానైనా ఉండేవి. 2015–16 నుంచి ప్రకటిస్తున్న ఎకనామిక్ సర్వేలలో ఈ ‘సోషల్ సెక్టార్’ అధ్యాయం గల్లంతయ్యింది.**

‘‘గత సంవత్సరం వందేళ్ళ భారత్’ పేరుతో ప్రవేశపెట్టిన బడ్జెట్ పునాదుల మీద ఆధారపడి ఈ ఏడాది బడ్జెట్ రూపొందింది. అభివృద్ధి ఫలాలను అన్ని ప్రాంతాలు, అందరు పౌరులకు ప్రత్యేకించి యువత, మహిళలు, రైతులు, వెనుకబడిన వర్గాలు, షెడ్యూల్డ్ కులాలు, తెగలకు అందిస్తూ సంపన్న సమ్మిళిత పురోగతిని సాధించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.’’ ఫిబ్రవరి ఒకటవ తేదీన పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ అన్న మాటలివి. ఇవి మాటలే.

బడ్జెట్ ప్రసంగం మొదటి పేరాలోని పలుకులివి. మిగతా ప్రసంగంలో ఎక్కడా ఆ మాటలకు సంబంధించిన ప్రస్తావనా లేదు; నిధుల కేటాయింపు అంతకన్నా లేదు. బడ్జెట్ ప్రసంగంలో ఎక్కువ భాగం పరిశ్రమలు, పనిముట్లు, యంత్రాలు, కార్లు, ఇతర ప్రాణంలేని వస్తువుల ప్రస్తావనే అత్యధికం. ‘అమృత్ కాల్’ బడ్జెట్ అని పేరుపెట్టుకున్న ఈ బడ్జెట్‌లో అమృతం చాలా ఉంది. అయితే అది మనుషులను బతికించేందుకు కాదు. మనుషులను నిరుపయోగంగా మార్చేసే సాంకేతిక విప్లవానికీ, ఆధునికీకరణ యంత్రాలకూ. అంటే ప్రాణంలేని వస్తువులకు నిరుపయోగ, నిష్ఫలామృతం.

ప్రభుత్వాలుగానీ, సంస్థలుగానీ, ఏదైనా బడ్జెట్ తయారు చేసుకునేటప్పుడు ఇప్పటి వరకూ ఉన్న పరిస్థితులను అంచనా వేసుకొని, భవిష్యత్ బాగుకోసం పథకాలు రాసుకుంటారు. మనవాళ్ళు కూడా గతంలో ఆ సాంప్రదాయాన్ని పాటించారు. దానికే ‘ఎకనామిక్ సర్వే’ అని పేరుపెట్టారు. బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ఒకరోజు ముందు దీనిని పార్లమెంటు ముందుంచుతారు. ఎకనామిక్ సర్వే ఉద్దేశ్యం మంచిదే. అయితే 2014 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న సర్వే ఫార్మాట్ వేరు. ఆ తర్వాత దాని దారే వేరు. 2014–15 వరకు ‘సోషల్ సెక్టార్’ పేరుతో ఒక చాప్టర్ ఉండేది. అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలు, పిల్లలు, వారి సమస్యలు... ప్రగతి, పాత విధనాల సమీక్ష, కొత్త పథకాల రూపకల్పన ఆలోచనలు సంక్షిప్తంగానైనా ఉండేవి. ఆశ్చర్యమేమిటంటే, 2015–16 నుంచి భారత ప్రభుత్వం ప్రకటిస్తున్న ఎకనామిక్ సర్వేలలో ఈ ‘సోషల్ సెక్టార్’ అధ్యాయం గల్లంతయ్యింది.

దీనిని చాలా మంది ఆర్థిక వేత్తలు, బడ్జెట్ విశ్లేషకులు, ప్రతిపక్షాల పెద్దలతో సహా ఎవ్వరూ పట్టించుకున్నట్టు లేదు. అందరూ ఏదో లోకంలో ఉన్నారు. ‘అమృత్ కాల్’లో తేలియాడుతున్నారు. ఇది కేవలం అధ్యాయం గల్లంతు కావడం కాదు, ఆలోచనా సరళిలో లోపం. అందుకే ఈ బడ్జెట్‌లో గానీ, 2022 ఎకనామిక్ సర్వేలో గానీ ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలు, మహిళలు, పిల్లలు కూడా దూరమయ్యారు.

ప్రస్తుతం అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వానికి రాజ్యాంగం, సమాజ స్థితిగతులు పట్టినట్టు కనిపించదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వ దృష్టి కోణం భిన్నమైనది. సైద్ధాంతికంగానే వీళ్ళు ఈ దేశంలో కులమనే ఒక వ్యవస్థ ఉన్నట్టుగానీ, దానివల్ల ఏర్పడిన, కొనసాగుతున్న అసమానతలు, వివక్ష, అణచివేత ఉన్నట్టుగానీ భావించరు. అందరూ హిందువులే అనే భావన వారికి. అందుకే ఎస్సీ, బీసీల ఉనికి, వారి గురించిన ప్రత్యేక సామాజిక స్థితిగతులు వాళ్ల ఎన్నికల ప్రణాళికల్లో, బడ్జెట్‌లో అంతగా ప్రస్తావనకు రావు. గత ఎనిమిదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఈ వర్గాల కోసం ఒక ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టిన దాఖలా లేదు. ప్రస్తుతం ఉన్న పథకాలను చాలా వాటిని నిర్వీర్యపరిచే పనికి కూడా పూనుకున్నారు.

## కొత్త కోణం



కేంద్రంలో ఎస్సీలు, బీసీలు, అనాథలు, దివ్యాంగుల కోసం కలిపి ఇప్పటికే ఒక మంత్రిత్వ శాఖ ఉన్నది. చాలామంది ప్రస్తుతం ఉన్న సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖను ఎస్సీల కోసమే ననుకుంటున్నారు. అది నిజం కాదు. అది ఎస్సీ, బీసీలకు కూడా. ఈ రెండు వర్గాలు కలిస్తే దాదాపు 65 శాతానికిపైగా ఉన్న సంగతిని కూడా ప్రభుత్వాలు మరచిపోయాయి. ఎస్సీ, బీసీలు కూడా మరిచిపోయారు. ఎస్సీ, బీసీలు కలిసి ఉన్న కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ కోసం ఇప్పటి వరకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులను చూస్తే ఆశ్చర్యం కలుగక మానదు. 2015–16లో మొత్తం బడ్జెట్ 16 లక్షల 63 వేల కోట్లు కాగా, అందులో ఈ మంత్రిత్వ శాఖకు కేటాయించింది కేవలం 5,380 కోట్లు. అంటే ఇది 0.32 శాతం మాత్రమే. అదేవిధంగా 2016–17లో 17 లక్షల 90 వేల కోట్ల మొత్తం బడ్జెట్‌లో కేటాయించింది 5,752 కోట్లు మాత్రమే. ఇది కూడా 0.32 శాతం దాటలేదు. అట్లా 2017–18లో 0.33 శాతం, 2018–19లో 0.31 శాతం. అదేవిధంగా 2020–21లో 35 లక్షల 90 వేల కోట్ల బడ్జెట్‌లో ఈ మంత్రిత్వ శాఖకు కేటాయించింది కేవలం 8,065 కోట్లు. ఇది 0.23 శాతం. ప్రతి సంవత్సరం పెరగాల్సింది. కానీ దారుణంగా పడిపోయింది. ప్రతి ఏడాది ఆ మంత్రిత్వ శాఖకు బడ్జెట్ కేటాయింపులు పెరుగుతున్నట్టు కనిపిస్తున్నది. కానీ దేశ బడ్జెట్ పెరుగుదలలో దానిశాతం పెరుగుతున్న దాఖలా లేదు.

రాజ్యాంగం అందించిన హక్కు ప్రకారం ప్రారంభించిన– ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేకంగా కేటాయించిన నిధుల వినియోగం కూడా దారుణంగా ఉంది. గతంలో దీనిని ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌గా పిలిచేవాళ్ళు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లానింగ్ కమిషన్‌ను తొలగించి, దాని స్థానంలో నీతి ఆయోగ్‌ను ఏర్పరిచారు. బడ్జెట్‌లో కూడా ప్లాన్, నాన్ ప్లాన్ పేర్లను తొలగించి రెవెన్యూ, క్యాపిటల్ అనే పదాలను మాత్రమే కొనసాగిస్తున్నారు. ప్లాన్, నాన్ ప్లాన్ లేనందువల్ల ఎస్సీ, ఎస్టీల కోసం ప్లాన్ నిధుల నుంచి కేటాయించాల్సిన వాటిని ఎస్సీ కాంపోనెంట్‌గా, ఎస్టీ కాంపోనెంట్‌గా పిలుస్తున్నారు. అయితే జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి నిధులను కేటాయించాలి. వాటి వివరాలను చూస్తే కూడా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న దళిత, ఆదివాసీ వ్యతిరేకత అర్థం కాగలదు.

గత ఎనిమిదేళ్ళలో ఎస్సీ కాంపోనెంట్ కింది కేటాయించిన నిధులు సగానికి పైగా దారి మళ్ళినట్టు వారి లెక్కల్లోనే కనిపిస్తున్నది. ఇప్పటికే సమాజంలో ఉన్న ఆర్థిక అసమానతలు, సామాజిక వివక్షలు ఎక్కువగా ఎస్సీ, ఎస్టీలను బాధిస్తున్నాయి. పేదరికం, ఆరోగ్యం, విద్య విషయంలో మిగతా సమాజానికీ ఎస్సీ, ఎస్టీలకూ మధ్య అగాథం కొనసాగుతూనే ఉంది. రోజు రోజుకీ కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, యాంత్రీకరణ, ఆధునికీకరణ విధానాలు ఈ వర్గాలను మొత్తంగానే సమాజ ప్రగతి నుంచి దూరం నెడుతున్నాయి. ఈ బడ్జెట్‌లో కొత్తదేమీ లేదుకానీ, కోట్లాది మంది యువతకు నైపుణ్యాల శిక్షణ ఇస్తామని ప్రకటించారు. ఈ నైపుణ్యాల శిక్షణ గురించిన గత అనుభవాలు అంత మంచి ఫలితాలను ఇచ్చినట్టు లేవు. సాంకేతిక, వృత్తిపరమైన నైపుణ్యాలతో కూడిన విద్యలు ప్రైవేట్ రంగంలో ఉంటాయి. ఇందులోకి ఎస్సీ, ఎస్టీ యువత వెళ్ళలేరు. ఎందుకంటే, అందులో రిజర్వేషన్లు లేవు.

అందుకే బడ్జెట్‌లో భారత దేశ సమాజం కనిపించాలి. దేశంలో ఉన్న అసమానతలను తొలగించడానికి పూనుకోవాలి. కానీ ఆ ప్రయత్నాలను ప్రభుత్వం చేస్తున్నట్టు కనిపించడం లేదు. నా ఉద్దేశ్యంలో కేంద్ర ప్రభుత్వం చాలా స్పష్టంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల కోసం ప్రత్యేకమైన పథకాలను ప్రవేశపెట్టడానికి సిద్ధంగా లేదు. మొదట్లో చెప్పినట్లు దీనిని వాళ్లు అసలు సమస్యగానే చూడడం లేదు. ఇప్పుడు తమను తాము తరచి చూసుకోవాల్సింది ఆయా వర్గాలే. ప్రభుత్వాలు తమను పట్టించుకోకపోతే, ప్రజలు ఎందుకు ప్రభుత్వాలను పట్టించుకోవాలి? ఇదే ఇప్పుడు అందరూ ప్రశ్నించుకోవాల్సిన కీలకమైన సందర్భం.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । మొబైల్: 81063 22077

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

### కొత్త లింగ చరిత్ర



ట్రాన్స్ దంపతులు జియా పావల్, జహద్ ఫాజిల్ ఇప్పుడు బయోలాజికల్ తల్లిదండ్రులయ్యారని వినడం హృద్యంగా ఉంది. శిశువు జననం– తన కేవల ఉనికితోనే సిస్‌జెండర్ (పుట్టినప్పటి లింగం) కఠినత్వపు, చెల్లినితనపు ద్వంద్వాలను బద్దలుకొడుతుంది. మరింత కలుపుకొనిపోయే నవ లింగ చైతన్యపు ప్రపంచానికి తలుపులు తెరుస్తుంది. (జియా పావల్ పుట్టినప్పుడు మగ. జహద్ ఫాజిల్ పుట్టుకతో స్త్రీ. ఇద్దరూ తమ లింగ మార్పిడి కోసం హార్మోన్ థెరపీ తీసుకున్నారు. మగ రూపంలోని జహద్ ఇప్పుడు గర్భం దాల్చారు. సీ–సెక్షన్ ద్వారా డెలివరీ అయింది.)

– ఆర్. బిందు, కేరళ విద్యామంత్రి

### పాశ్చాత్య అనుకరణ



కేరళలోని ట్రాన్స్ జెండర్ దంపతులు ఒక శిశువుకు జన్మనిచ్చారన్న వార్త సంచలనం అయ్యింది. దీన్ని చూశాక నాకు ఏం అనిపించిందంటే, పాశ్చాత్య ప్రపంచం ఒక సమాజంగా విఫలమైంది. ఆ పాశ్చాత్యులను అనుకరించేవాళ్లు ఎవరైనా కూడా విఫలం అవుతారు.

– షకీబ్ ఐ ఖాన్, కాస్మెటిక్ సర్జన్

### తిమ్మిని బమ్మి...



అది ఏ విషయమైనా సరే, మళ్లీ మళ్లీ తరచుగా, గట్టిగా చెబితే మెజారిటీని నమ్మించగలం అన్న ఆలోచన చుట్టూనే మొత్తం వ్యవస్థ అంతా తిరుగుతుంది. అది పనిచేస్తుంది కూడా.

– ఎడ్వర్డ్ స్నోడెన్, యాక్టివిస్ట్

### ఏం చేస్తున్నట్టు?



లోక్‌సభలో బడ్జెట్ మీద చర్చ కోరమ్ లేనందువల్ల నిలిచిపోయింది. అంటే దానర్థం కనీసం 55 మంది ఎంపీలు లేరని. మనం వాళ్లను ఎందుకు ఎన్నుకున్నట్టు? పార్లమెంటుకు హాజరు కాకుండా, అదీ సంధ్యా కాలంలో మన ఎంపీలు ఏం చేస్తున్నట్టు? 90 శాతం మంది ఎంపీలు పార్లమెంటుకు హాజరు కాకపోతే... దేవుడా మా ప్రజాస్వామ్యాన్ని రక్షించు.

– కె. నాగేశ్వర్, ప్రొఫెసర్, మాజీ ఎంఎల్‌సీ

# ప్రజాసాహిత్యోద్యమ దీపధారి

‘అరసం’ అనే సంక్షిప్త నామంతో తెలుగు సమాజంతో మమేకమైన అభ్యుదయ రచయితల సంఘం 80వ వార్షికోత్సవ సందర్భమిది. ఎనభై ఏళ్లుగా సమాజ ఉన్నతీకరణకు సాహిత్యం ఎంత దోహదపడుతుందో ఆచరణతో, రచనలతో రుజువు చేసిన మహత్తర చరిత్ర అరసానిది. 1943 ఫిబ్రవరి 13, 14 తేదీల్లో ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం ప్రథమ మహాసభలు జరిగిన తెనాలిలోనే 2023 ఫిబ్రవరి 11, 12 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం 19వ రాష్ట్ర మహాసభలు జరుగుతుండటం విశేష సన్నివేశం.

తెలుగునాట సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమానికి మూలపురుషులైన కందుకూరి, గిడుగు, గురజాడల... సామాజిక, సాహిత్య, భాషా సంస్కరణలను; భూస్వామ్య సంస్కృతిపై వారు జరిపిన పోరాటాల వారసత్వాన్ని అరసం స్వీకరించింది. సమతవైపు ప్రపంచ గతిని మార్చిన మహత్తరమైన మార్క్సిజం సిద్ధాంతాన్ని అరసం తన తాత్విక భూమికగా మలచుకుంది.

భారత జాతీయ రచయిత ప్రేమ్‌చంద్ అధ్యక్షతన 1936 ఏప్రిల్ 9న లక్నోలో ఆవిర్భవించిన అరసం దేశంలోని అన్ని ప్రాంతాలకూ, భాషలకూ ప్రాతినిధ్యం వహిస్తూ, ఏర్పడిన తొలి సంస్థ. ఆ మహాసభల్లో ప్రేమ్‌చంద్ ‘జీవితాన్ని విమర్శించేదే సాహిత్యం’గా స్పష్టం చేశారు.

ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం ప్రథమ మహాసభకు అధ్యక్షత వహించిన ఆంధ్ర విశారద తాపీ ధర్మారావు... దేవుడు, మతం, ప్రేమ, ప్రణయం, కర్మ అనే గాలి మాటలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపిచ్చారు. గుంటూరులో 1973లో జరిగిన ఆరవ రాష్ట్ర మహాసభల్లో ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం ‘ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం’గా రూపొందింది. ఇప్పటివరకు అరసం ప్రపంచ, దేశ, రాష్ట్ర కాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు నిత్య నూతన ప్రణాళికలతో పురోగమిస్తోంది. ‘తెలుగుతల్లి’ నుంచి ‘అభ్యుదయ’ దాకా పత్రికలను నడిపింది. వేలాది పుస్తకాలను ప్రచురించింది. సభలు, సమావేశాలు, సదస్సుల నిర్వహణ లెక్కకుమించి.


తెలంగాణ సాయుధ పోరాట కాలంలో అభ్యుదయ రచయితలు పెన్నూ, గన్నూ పట్టి ప్రజాపక్షం వహించారు. అరసం అనేక నిర్బంధాలనూ, నిషేధాలనూ చూసింది. సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాన్ని తెలుగునాట సోదర సంస్థ ప్రజానాట్య మండలితో కలిసి నిర్వహించటంలో అరసానిది నాయక పాత్ర. అరసం సుదీర్ఘ చరిత్రలో ఎందరో మహనీయులు తమ శక్తియుక్తులను ధారపోశారు. మార్గదర్శకులైనారు. ఆ దీపధారులకు జోహార్లు. అరసానిది విలువైన గతం, బలమైన వర్తమానం, ఆశావహమైన భవితవ్యం.

– పెనుగొండ లక్ష్మీనారాయణ, ‘అరసం’ జాతీయ కార్యదర్శి,
మొబైల్: 94402 48778

(తెనాలిలో ఫిబ్రవరి 11, 12 తేదీల్లో ‘అరసం’ రాష్ట్ర మహాసభలు)

# గురువింద గింజ

అట్లుంటది


తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. పొద్దు మీకంగనే మా దోస్తులు గా పాన్ డబ్బ కాడ జమైతరు. నాత్రి తొమ్మిది గొట్టె దాంక ముచ్చట బెట్టినంక ఇండ్లల్లకు బోతరు. నేను బోక ముందు గాల్లు ఏం ముచ్చట బెట్టింద్రో నాకైతె ఎర్క లేదు. గని నేను బోయినంక ఇట్ల మాట్లాడుకుంద్రు.

‘‘మన తెలంగానల తొవ్వలు అద్వాన్నంగున్నయి. బస్సుల తొవ్వ మీదికెల్లి బోతుంటె ఉయ్యాల ఊగినట్లుంటది. కడ్పుల ఏమన్నుంటె ఇవుతలకొస్తది’’ అని సత్నారి అన్నడు.

‘‘కాన్పు కష్టమైనోల్లను బస్సుల గిన కూసుండబెట్టి ఏ తొవ్వ మీదికెల్లి అయినా దీస్కబోతె కాన్పు అల్కగైతది’’ అని ఇస్తారి అన్నడు.

‘‘తొవ్వలు బాగ జేపియుంద్రని జెనం ఎంత మొత్తుకున్నా సర్కార్ సప్పుడు జెయ్యలేదు. తొవ్వలు గిన బాగ జేపిస్తె టక్కర్లు ఎక్వ అయితయని సర్కార్ అంటున్నది’’ అని సత్నారి జెప్పిండు.

‘‘తొవ్వలు బాగుంటె టక్కర్లు ఎక్వ అయితయా?’’ అని ఇస్తారి అడిగిండు.


‘‘తొవ్వలు బాగుంటె బస్సులు, మోటర్లు, లారీలను స్పీడ్గ నడ్పుతరు. దాంతోని టక్కర్లు అయితయి. గుంతల తోని తొవ్వలుంటె మెల్లగ నడ్పుతరు. దాంతోని ఎసువంటి టక్కర్లు గావు’’ అని యాద్గిరి అన్నడు.

‘‘కుటుంబ పాలన కుటుంబ పాలన అనుకుంట మొత్తుకుంటున్నరు. అవ్ మాది బరాబర్ కుటుంబ పాలనే. రాష్ట్రంల ఉన్న నాల్గు కోట్ల మంది మా కుటుంబ సభ్యులే. కేసీఆర్ మా కుటుంబ పెద్ద అని కేటీఆర్ అన్నడు.’’

‘‘రాష్ట్రంల ఉన్న జెనమంత కేసీఆర్ కుటుంబ సభ్యులే అయితె కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, కవితల లెక్క అందర్కి ఇండ్లు ఎందుకు లేవు. మోటర్లెందుకు లెవ్వు?’’

‘‘గీ నడ్మ నాందేడ్ల బీఆర్ఎస్ పబ్లిక్ మీటింగ్ బెట్టింది. గులాబి జెండలు ఎగిరేసింద్రు. గులాబి తోర్నాలు గట్టింద్రు. కేసీఆర్ కటౌట్లు బెట్టింద్రు. కేసీఆర్ స్పీచ్ గొట్టుకుంట సంటర్ల మా బీఆర్ఎస్ సర్కార్ గినొస్తె దేసమంత దలిత బంధు బెడ్తం. ఇర్వై నాల్గు గంటల రైతులకు ఫిరీగ కరెంటు ఇస్తం. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అని అన్నడు.’’

‘‘ఇనెటోడుంటె చెప్పెటోడు శెవుల పూలు బెడ్తనే ఉంటడు. పోయిన యాడాదిల రాష్ట్రంల దలిత బంధు



పద్కం కింద ఒక్కల్లకు గుడ్క పది లచ్చల రూపాయలియ్యలేదు. రైతులకు ఇర్వై నాలుగు గంటలటుంచి మూడు గంటలు గుడ్క త్రీఫేజ్ కరెంటు ఇస్తలేరు. కూట్లె రాయి దియ్యనోడు ఏట్లె రాయి దీస్తడా? రాష్ట్రంల దలిత బంధు అమలు జెయ్యనోడు దేసంల అమలు జేస్తడా?’’ అని యాద్గిరి అడిగిండు.

‘‘రాష్ట్ర బడ్జెట్ సంగతేంది?’’ అని సత్నారి అడిగితె–

‘‘కొత్త సీసల పాత సార లెక్క ఉన్నది. ఇంజన్ పాతదె గని మోటర్ కొత్తది. దలిత బంధు, రీజినల్ రింగ్ రోడ్డు, బాకీ మాఫి, మహిళా యూనివర్సిటి, ఆర్టీసి, కేసీఆర్ కిట్, ఈహెచ్ఎస్, హైద్రాబాద్ మెట్రో, హరిత హారం అసువంటి పద్కాలకు పోయిన యాడాది బడ్జెట్ల ఎన్ని ఫండ్స్ కేటాయించింద్రో గీపారి బడ్జెట్ల గుడ్క సరింగ గన్నే ఫండ్స్ కేటాయించింద్రు. గాదానికి గిన్ని కోట్లు గీదాన్కి గిన్ని కోట్లనుకుంట కేటాయించుడే తప్పిడ్సి సర్కార్ ఒక్క పైస గూడ కర్సు జెయ్యదు’’ అని ఇస్తారి అన్నడు.

‘‘గీ నడ్మ భారత్ జోడో బూట్లు, హాత్ సే హాత్ జోడో సైండిల్లు, ప్రజా సంగ్రామ యాత్ర చెప్పులు, యువగళం స్లిప్పర్లు వొచ్చినయి. బూట్లను, సైండిల్లను కాంగ్రెసోల్లు గొంటున్నరు. చెప్పులను బీజెపోల్లు గొంటె స్లిప్పర్లను తెలుగు దేసమోల్లు గొంటున్నరు’’ అని యాద్గిరి అన్నడు.

‘‘కన్యాకుమారికెల్లి కశ్మీర్ దాంక నేను పాద యాత్ర జేసిన. యాడికి బోయినా నాకు అదానీ పేరే ఇనబడ్డది. గాయినకూ, మోదీకి ఏం సంబంధమున్నది. గిది మోదీ మన్ కీ బాత్ లేకుంటె ధన్ కీ బాతా? అని రాహుల్ గాంది అడిగిండు’’ అని సత్నారి అన్నడు.

‘‘బీఆర్ఎస్ నాందేడ్ మీటింగ్ల కేసీఆర్ మాట్లాడుకుంట... పశ్చిమ బెంగాల్ల మోదీ రవీంద్రనాత్ టాగూర్ లెక్క గడ్డం బెంచుకోని దిర్గుతడు. పంజాబ్ల సిక్కు యేసంల గండ్లబడ్తడు. తమిల నాడుల లుంగి గడ్తడు. తెలంగానల దోతి గట్టుకోని దిర్గుతడు. కశ్మీర్ల షేర్వాని గడ్తడు. గిట్ల రాష్ట్ర, రాష్ట్రంకు యేసాలు బద్లాయిస్తడని అన్నడు. గని కుద్దు గాయిన్నే నాందేడ్ల సిక్కు యేసంల గండ్లబడ్డడు. గురువింద ఇత్తుకు గాయినకు ఎసువంటి ఫరక్ లేదని చెప్పకుంటనే చెప్పిండు. తెలంగానల రైతులకు ఇర్వై నాలుగు గంటలు కరెంటు ఇస్తున్నం. సంటర్ల బీఆర్ఎస్ సర్కారొస్తె దేసంల ఉన్న రైతులందర్కి ఇర్వై నాలుగు గంటలు ఫిరీగ కరెంటిస్తం. దేసమంత దలితబంధు, గిరిజన బంధు పద్కాలు బెడ్తమని కేసీఆర్ అన్నడు. మరీ గిన్ని అబద్దాలు జెప్తవా అని నాందేడ్ బీఆర్ఎస్ మీటింగ్‌కు యాబై కిలోమీటర్ల దూరంల బూమి కంపించింది’’ అని ఇస్తారి అన్నడు.

నాత్రి తొమ్మిది గొట్టె దాంక ముచ్చట బెట్టినంక ఎవలింటికి గాల్లు పోయింద్రు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

# జపమాలా రహస్యం

మరియ మాతను ముందుంచి, దేవుని ఎదుట మోకరిల్లి, ఆ దేవుని దివ్య గాథలను తలంచటం; ఆ దేవునికి మన విన్నపాలు అందించి... ‘మాకోసం వేడుకో అమ్మా’ అని మరియ మాతను వేడుకోవటం ‘జపమాల’లోని అంశాలు. ఇందులో 53 పూసలు ఉంటాయి. ప్రతి సంఘటనకూ పది పది పూసలతో జపించటం కనిపిస్తుంది. జప దండలో యాభై పూసలు దేవుని పరమైన సంఘటనలకు సంబంధించినవి. వీటిని రహస్యాలు అంటారు. ఇవి క్రైస్తవ విశ్వాసానికి సంబంధించినవి.

ప్రభువు జీవితంలో సంతోషదాయక సంఘటనలు... అంటే ప్రభువు పుట్టుకకు సంబంధించి గాబ్రియేలు అనే పేరు గల దూత వచ్చి, కన్య మరియను సమీపించి త్వరలో దైవ కృపవల్ల కుమారుడు జన్మిస్తాడని చెప్పటం, తల్లిదండ్రులు బాల యేసును గుడికి కానుకగా సమర్పించటం, తప్పిపోయిన చిన్నారి యేసును దేవాలయంలో శాస్త్రులతో తర్కించే సమయంలో కనుగొనటం వంటి సంఘటనలను ‘దేవ రహస్యాలు’ అని అంటారు. వీటిని యాభై పూసల్లో స్మరిస్తారు.

మరో రోజు చెప్పే యాభై పూసలు... ప్రభువు జీవితంలో బాధలకు సంబంధించిన గాథలు, సంఘటనలను స్మరించుకోవటానికి సంబంధించినవి. వీటిని ‘దుఃఖ రహస్యాలు’ అంటారు, అంటే – ధ్యాన సమయంలో యేసు ఏకంగా రక్తాన్నే చెమర్చటం, ఆయన శిరస్సుకు యూదులు ముండ్ల కిరీటం పెట్టి మేకులతో కొట్టటం, కలువరి గిరిపైకి బరువైన శిలువను మోసుకొని పోవటం వంటివి.

ఇంకో రోజు చెప్పే యాభై పూసలు ప్రభువు జీవితంలో మహిమాన్విత గాథలు, అద్భుతమైన సంఘటనలను స్మరించుకోవటానికి సంబంధించినవి. వీటిని ‘మహిమ రహస్యాలు’ అంటారు. యేసు మరణం నుండి పునరుత్థానుడు కావటం, యేసు మోక్షారోహణుడు కావటం, మరియ మాత ఆత్మ, శరీరాలతో మోక్షానికి కొనిపోబడటం వంటివి ఇందులో ఉంటాయి. ఇలా వారానికి రెండుసార్లు క్రైస్తవులు ఈ రహస్యాలను స్మరించుకుంటూ ఉంటారు. నమ్మకంతో కూడిన జపమలా రహస్యం ఇది. వీటి మధ్య మధ్యలో పది పది పూసలకు కొన్ని దేవునికి సంబంధించి... మరియకు విన్నప జపాలు ఉంటాయి, ఈ జపమాలలో ఎక్కువగా మెడిటేషనే ఉంటుంది తప్ప మేరీపూజలు, స్తుతి కనిపించవు.

– డా॥ దేవదాసు బెర్నార్డ్ రాజు,
విశ్రాంత కళాశాల ప్రిన్సిపాల్, విజయవాడ

(ఫిబ్రవరి 9 నుండి 11 వరకు గుణదల మేరీమాత ఉత్సవాలు)

## గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.పంచమి తె.5.48 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి షష్ఠి, **నక్షత్రం:** హస్త రా.9.44 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం** తె.5.59 నుండి 7.36 వరకు (తెల్లవారితే శనివారం).
**దుర్ముహూర్తం:** ఉ.8.50 నుండి 9.34 వరకు, తదుపరి ప.12.35 నుండి 1.22 వరకు, **అమృతఘడియలు:** ప.3.23 నుండి 5.04 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.35, **సూర్యాస్తమయం:** 5.54

## క్లుప్తంగా...

### శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 63,315 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.5.07 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 14 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్నవారికి 3 గంటల్లో దర్శనం అవుతోంది.

### పలు రైళ్లు రద్దు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు కొన్ని రైళ్లు పూర్తిగా, మరికొన్ని పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. గురువారం కొన్ని రైళ్లను రద్దు చేశామని, ఒక రైలును పాక్షికంగా రద్దు చేసినట్లు తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో విజయవాడ-బిట్రగుంట (07978), విజయవాడ-గూడూరు (07500), ఒంగోలు-విజయవాడ (07576) రైళ్లు, 10, 11 తేదీల్లో గూడూరు-విజయవాడ (07458), 10న కాకినాడ పోర్టు-విశాఖపట్నం (17267), విశాఖపట్నం-కాకినాడ పోర్టు (17268), విజయవాడ-ఒంగోలు (07461), విజయవాడ-గుంటూరు (07783), బిట్రగుంట-చెన్నై సెంట్రల్ (17237), చెన్నై సెంట్రల్-బిట్రగుంట (17238) రైళ్లను రద్దు చేసినట్లు వివరించారు. అదేవిధంగా కాకినాడ పోర్టు-విజయవాడ (17258) రైలును ఈ నెల 10న కాకినాడ పోర్టు-రాజమండ్రి మధ్య, విజయవాడ-కాకినాడ పోర్టు (17257) రైలును ఈ నెల 9, 10 తేదీల్లో రాజమండ్రి-కాకినాడ పోర్టు మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు వెల్లడించారు.

### ఘనంగా మేరీ మాత ఉత్సవాలు ప్రారంభం


దివ్యబలిపూజ నిర్వహిస్తున్న రెవరెండ్ ఫాదర్ జార్జ్ పుతెన్ పుర

గుణదల(విజయవాడ తూర్పు): సుప్రసిద్ధ గుణదల పుణ్యక్షేత్రంలో మేరీ మాత ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, గోల్డెన్ జుబిలేరియన్ ఫాదర్ జార్జ్ పుతేన్ పుర, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు తదితర గురువులు జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛన ప్రాయంగా ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫాదర్ పుతెన్ పుర భక్తులకు దైవ సందేశం అందించారు. ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి సన్మార్గంలో నడుచుకోవాలని కోరారు. మరియతల్లిని ఆశ్రయించిన వారి జీవితాల్లో శాంతి సమాధానాలు వెల్లివిరుస్తాయని సందేశించారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని అందజేశారు. తిరునాళ్ల మొదటి రోజైన గురువారం యాత్రికులు పెద్ద సంఖ్యలో పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు.

### ఎమ్మెల్యే మేకపాటికి శస్త్రచికిత్స

ఉదయగిరి: ఉదయగిరి శాసనసభ్యుడు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి గురువారం చెన్నై అపోలో హాస్పిటల్‌లో శస్త్రచికిత్స చేశారు. గుండెకు సంబంధించి రెండు నాళాలలో రక్త ప్రసరణలో సమస్య తలెత్తడంతో బుధవారం స్వల్ప అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. త్వరలోనే ఆయన పూర్తిస్థాయిలో కోలుకుని నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన సతీమణి శాంతకుమారి తెలిపారు. ఇదిలా ఉండగా ఉదయం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి ఫోన్ చేసి యోగక్షేమాలు తెలుసుకుని ధైర్యం చెప్పారు.

### రాష్ట్రంలో అల్లర్లకు బాబు అండ్ కో కుట్ర

- 865 రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: రాష్ట్రంలో అల్లర్లు సృష్టించి లబ్ధి పొందాలని బాబు అండ్ కో సామాజిక వర్గం శతవిధాలా ప్రయత్నిస్తున్నదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు విమర్శించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళాయపాలెం సీడ్ యాక్సెస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా రిలే నిరాహార దీక్ష 865 రోజు గురువారం కొనసాగింది. పలువురు మాట్లాడుతూ ఆధిపత్య ధోరణితో రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తున్న ఓ సామాజిక వర్గం బహుజనుల ఎదుగుదలను అడ్డుకుంటుందని చెప్పారు. 85 శాతం ఓటు బ్యాంకు ఉన్న బహుజనులను అణగదొక్కి స్వార్థ ప్రయోజనాలే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఇష్టానుసారంగా పాలన చేసి ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేశాడని మండిపడ్డారు. ఐదు సంవత్సరాలు బాబుకు అధికారం ఇస్తే నాలుగు భవనాలు నిర్మించి 29వేల మంది రైతులను నట్టేటముంచి 33వేల ఎకరాలను అడివిగా మార్చి.. ఇప్పుడు దొంగ యాత్రలకు శ్రీకారం చుట్టడం సిగ్గుచేటన్నారు. అమరావతితోపాటు, అన్ని ప్రాంతాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని చెప్పారు. సీఎం జగన్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు సంక్షేమం, అభివృద్ధితో అన్ని రకాలుగా సుభిక్షంగా ఉన్నారన్నారు. నాయకులు మాదిగాని గురునాథం , నూతక్కి జోషి, పి.వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, దాసు తదితరులు పాల్గొన్నారు.

# గుండె మార్పిడితో బాలుడికి పునర్జన్మ

**రాష్ట్రంలోనే తొలి గుండె మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం**

- శ్రీపద్మావతి చిన్నపిల్లల గుండె చికిత్సాలయం వైద్యుల ఘనత
- రూ.10 లక్షలు విడుదల చేసిన ప్రభుత్వం
- గోవిందనామం స్మరిస్తూ పులకించిన బాలుడు


శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో గుండె మార్పిడి చేయించుకున్న విశ్వేశ్వరకు వైద్య సదుపాయాలు అందిస్తున్న వైద్య సిబ్బంది

తిరుపతి తుడా: తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం వైద్యులు నిరుపేద కుటుంబానికి చెందిన 15 ఏళ్ల బాలుడికి గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేసి పునర్జన్మ ప్రసాదించారు. రాష్ట్రంలో ఓ చిన్నారికి గుండె మార్పిడి చికిత్సను తొలిసారిగా చేపట్టిన రికార్డును ఇక్కడి వైద్యులు సొంతం చేసుకున్నారు. 48 ఏళ్ల మహిళ గుండెను 15 సంవత్సరాల బాలుడికి అమర్చి శభాష్ అనిపించారు. టీటీడీ పరిధిలోని వైద్యుల కృషిని యావత్ ప్రజానీకం శభాష్ అంటూ కొనియాడుతోంది. గతంలో విశాఖపట్నం ప్రభుత్వ ఆస్పత్రి వేదికగా 40 ఏళ్లు పైబడిన ముగ్గురికి గుండె మార్పిడి చేశారు. ఆ తర్వాత తిరుపతిలో చేపట్టిన గుండె మార్పిడి శస్త్ర చికిత్స చరిత్ర సృష్టించింది.

**బ్రెయిన్ డెడ్ మహిళ నుంచి..**

అన్నమయ్య జిల్లాకు చెందిన ఎం.విశ్వేశ్వర (15)కు జనవరి 20న గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేపట్టారు. విశాఖకు చెందిన మహిళ(48) బ్రెయిన్ డెడ్ కావడంతో ఆమె కుటుంబీకులు అవయవ దానానికి ముందుకు వచ్చారు. దీంతో ఆమె గుండెను గ్రీన్ చానల్ ద్వారా తిరుపతి తీసుకువచ్చి శ్రీపద్మావతి చిన్న పిల్లల హృదయాలయంలో బాలుడికి అమర్చారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డితో కూడిన వైద్యుల బృందం విజయవంతంగా గుండె మార్పిడి శస్త్ర చికిత్సను చేపట్టింది. 21 రోజులపాటు ఆస్పత్రిలోని ప్రత్యేక వార్డులో ఆ బాలుడికి చికిత్సను అందించారు. ఆ బాలుడు కోలుకోవడంతో నాలుగైదు రోజుల్లో డిశ్చార్జి చేయనున్నారు.

**ఆదుకున్న ఆరోగ్యశ్రీ**

అన్నమయ్య జిల్లాకు చెందిన నరసయ్య, రాధ దంపతులు సాధారణ రైతు కూలీ కుటుంబానికి చెందిన వారు. వీరికి ముగ్గురు పిల్లలు. మొదటి సంతానమైన విశ్వేశ్వర గుండె పూర్తిగా క్షీణించి అనారోగ్యానికి గురి కావడంతో శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి తీసుకువచ్చారు. గుండెకు తీవ్ర ఇన్‌ఫెక్షన్ సోకినట్టు గుర్తించిన వైద్యులు గుండెమార్పిడి అనివార్యమని తేల్చారు. ఈ క్రమంలో విశాఖకు చెందిన 48 సంవత్సరాల సన్యాసమ్మ గుండెను బాలుడికి అమర్చి పునర్జన్మను ఇచ్చారు. రూ.40 లక్షల వరకు ఖర్చయ్యే వైద్యాన్ని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందించారు. వైద్యుల విజ్ఞప్తి మేరకు యుద్ధప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలను విడుదల చేసింది. గుండె మార్పిడి అనంతరం బాలుడిని పలకరించేందుకు వైద్యులు చేసిన ప్రయత్నం ఫలించింది. ఆ బాలుడు గోవింద నామస్మరణ చేస్తూ పులకించిపోయాడు. ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులు రాధ, నరసయ్య మాట్లాడుతూ.. తమ బిడ్డకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాణభిక్ష పెట్టారంటూ చేతులెత్తి కృతజ్ఞతలు తెలిపారు.

## యూకేజీ విద్యార్థిని ఫెయిల్

- బెంగళూరులో ఓ ప్రైవేటు స్కూలు ఘనకార్యం

బనశంకరి: పదో తరగతి, ఇంటర్, లేదా డిగ్రీ కోర్సుల్లో విద్యార్థులు ఫెయిల్ కావడం సహజం. కానీ యూకేజీలో కూడా ఫెయిల్ చేస్తారా? అంటే ఎవరైనా గానీ లేదు అనే చెబుతారు. కానీ భారత సిలికాన్ సిటీ బెంగళూరు శివార్లలోని ఆనేకల్‌లో ఓ స్కూల్ యూకేజీ బాలికను ఫెయిల్ చేసేసింది. బి.నందిని (5) అనే బాలిక సెయింట్‌జోసెఫ్ చామినేడ్ అకాడమి స్కూల్‌లో యూకేజీ చదువుతోంది. పరీక్షల్లో ఓ సబ్జెక్టులో 40 మార్కులకు గాను 5 మార్కులే వచ్చాయి కాబట్టి ఫెయిల్ అని రాసి మార్కుల లిస్టును ఇచ్చారు. విద్యార్థిని తల్లిదండ్రులు దీనిపై విస్తుపోయారు. బీజేపీ ఎమ్మెల్యే, మాజీ విద్యా శాఖ మంత్రి సురేశ్‌కుమార్ ట్వీట్ చేస్తూ ఆ చిన్నారిని ఏం చేయాలని అనుకుంటున్నారు అని పాఠశాల పాలకమండలిని ప్రశ్నించారు. ఫెయిల్ వ్యవహారంపై విద్యాశాఖ అధికారులు పాఠశాలకు నోటీస్ జారీ చేసి వివరణ కోరారు. కాగా స్కూల్ యాజమాన్యం మాత్రం ఆ ఫలితం యూనిట్ టెస్ట్‌దని, స్కూల్ సాఫ్ట్‌వేర్‌లో దొర్లిన పొరపాటు వల్ల ఫెయిల్ అని వచ్చిందని చెబుతోంది.



## శ్రీశైలం డ్యామ్‌ను పరిశీలించిన కేఆర్ఎంబీ సభ్యుడు


శ్రీశైలం డ్యామ్‌ను పరిశీలిస్తున్న అజయ్‌కుమార్ గుప్తా

శ్రీశైలం ప్రాజెక్ట్: కృష్ణానది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) సభ్యుడిగా నూతనంగా నియమితులైన అజయ్‌కుమార్ గుప్తా గురువారం శ్రీశైలం డ్యామ్‌ను పరిశీలించారు. ఆయన వెంట బోర్డు ఎస్ఈ అశోక్‌కుమార్, ఈఈ రఘునాథ్‌రావు ఉన్నారు. శ్రీశైలం జలాశయం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రాలను కూడా ఆయన పరిశీలించారు. శ్రీశైలం డ్యామ్ డిప్యూటీ ఎస్ఈ గంగాధర రెడ్డి, ఇంజనీర్లు మోహన్, మురళి, బాబుతో గుప్తా మాట్లాడి జలాశయ స్థితిగతులు, నీటి నిల్వ పరిమాణం, రేడియల్ క్రస్ట్ గేట్లు, గ్యాలరీ, ప్లంజ్‌పూల్‌ల నిర్వహణ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.

# ఎస్ఎస్ఎల్‌వీ–డీ2 ప్రయోగానికి సర్వం సిద్ధం

- షార్‌లో నేటి ఉదయం 9.18 గంటలకు ప్రయోగం
- మూడు ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపనున్న శాస్త్రవేత్తలు




సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సూళ్లూరుపేట సమీపంలో ఉన్న సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగవేదిక నుంచి స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ–డీ2)ను శుక్రవారం ఉదయం 9.18 గంటలకు ప్రయోగించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈ ప్రయోగం ద్వారా ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్, జానుస్–1, ఆజాదీ శాట్–2 అనే మూడు ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. ఈ ప్రయోగానికి గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత (తెల్లవారితే శుక్రవారం) 2.18 గంటలకు కౌంట్‌డౌన్‌ను ప్రారంభిస్తారు. ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ పర్యవేక్షణలో ఎంఆర్ఆర్ కమిటీ చైర్మన్ ఈఎస్ పద్మకుమార్ ఆధ్వర్యాన మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశం గురువారం ఉదయం నిర్వహించారు. అనంతరం లాంచ్ ఆథరైజేషన్ బోర్డ్ చైర్మన్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో మరో సమావేశాన్ని నిర్వహించి కౌంట్‌డౌన్, ప్రయోగ సమయాలను అధికారికంగా నిర్ణయించారు. ఎస్ఎస్ఎల్‌వీ–డీ1 పేరుతో గత ఏడాదిలో చేసిన మొదటి ప్రయోగం విఫలం కావడంతో ఈ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు.

**రాకెట్ వివరాలు... ప్రయోగం ఇలా...**

ఎస్ఎస్ఎల్‌వీ–డీ2 రాకెట్ 34 మీటర్లు పొడవు, రెండు మీటర్లు వెడల్పు, 119 టన్నుల బరువు కలిగి ఉంది. దీనిని నాలుగు దశల్లో ప్రయోగించనున్నారు. ఈ రాకెట్ మొదటి దశను 87 టన్నుల ఘన ఇంధనాన్ని ఉపయోగించి 124 సెకన్లలో పూర్తిచేస్తారు. రెండో దశను 7.7 టన్నుల ఘన ఇంధనంతో 384.2 సెకన్లలో, మూడో దశను 4.5 టన్నుల ఘన ఇంధనంతో 674.9 సెకన్లలో పూర్తి చేయనున్నారు. నాలుగో దశలో మాత్రమే 0.05 టన్నుల ద్రవ ఇంధనం సాయంతో 785.1 సెకన్లలో పూర్తి చేస్తారు. మొదటిగా 156.3 కేజీల బరువు కలిగిన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్(ఈవోఎస్–07)ను కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తర్వాత ఆంటారిస్–యూఎస్ఏకు చెందిన 10.2 కేజీల బరువు కలిగిన జానుస్–1 అనే ఉపగ్రహాన్ని 880.1 సెకన్లలో, అనంతరం 8.7 కేజీల బరువు కలిగిన ఆజాదీ శాట్–2 అనే ఉపగ్రహాన్ని 900.1 సెకన్లలో అంటే 15 నిమిషాలకు భూమికి 450 కిలోమీటర్లు ఎత్తులోని లియో ఆర్బిట్ (సూర్యునికి సమకాలిక కక్ష్య)లోకి ప్రవేశపెట్టడంతో ప్రయోగం పూర్తిచేసే విధంగా ఇస్రో శాస్త్రవేత్తలు డిజైన్ చేశారు. ఇది షార్ నుంచి 84వ ప్రయోగం కాగా, ఎస్ఎస్ఎల్‌వీ–డి1 సిరీస్‌లో రెండోది కావడం విశేషం.

### ఎస్ఎస్ఎల్‌వీ–డీ2కు ప్రత్యేక పూజలు

తిరుమల: ఎస్ఎస్ఎల్‌వీ–డి2కు తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం ఇస్రో శాస్త్రవేత్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇస్రో డైరెక్టర్ ఏకే పాత్ర, సభ్యులు తిరుమల శ్రీవారి పాదాల చెంత ఎస్ఎస్ఎల్‌వీ–డి2 నమూనాను ఉంచి పూజలు చేశారు. ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ గురువారం సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని రాకెట్ నమూనాకు పూజలు నిర్వహించారు.

## నడిరోడ్డుపై జేసీ ప్రభాకర్‌రెడ్డి హల్‌చల్

- వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం


రోడ్డుపై బైఠాయించిన జేసీ ప్రభాకర్‌రెడ్డి

పెద్దపప్పూరు: మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి రోడ్డుపై బైఠాయించి వాహనాదారులను ఇబ్బందులకు గురిచేశారు. పెద్దపప్పూరు మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని రోజుల కిందట ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేసింది. పారదర్శకంగా ఇసుక సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన రీచ్‌కు ఎలాంటి అనుమతులు లేవంటూ గురువారం జేసీ ప్రభాకర్‌రెడ్డి స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నడిరోడ్డుపై అనుచరులతో కలిసి బైఠాయించారు. వాహనదారులు ఇబ్బంది పడతారని తెలిసీ రెండు గంటలపాటు హంగామా చేశారు. సమస్య ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి కానీ, ఇలా రహదారిపై కూర్చోవడం సరికాదని ఎస్ఐ ఖాజాహుస్సేన్ చెప్పినా పట్టించుకోలేదు. అప్పటికే 2 గంటలు కావడం, వాహనాలు పెద్ద సంఖ్యలో రోడ్డుపైనే నిలవడంతో పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. వెంటనే అక్కడి నుంచి వెళ్లకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినా జేసీ వినిపించుకోలేదు. పైగా అప్పటికే అక్కడకు చేరుకున్న టీడీపీ శ్రేణులు నినాదాలు చేస్తూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. దీంతో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావించిన పోలీసులు ప్రభాకర్‌రెడ్డిని అక్కడ నుంచి ముందస్తు అరెస్ట్‌లో భాగంగా పోలీసు జీపులో తరలించి.. నోటీస్ అందజేసి ఇంటికి పంపించివేశారు.

## 8 బ్రేక్ దర్శన టికెట్లు రూ.50 వేలకు విక్రయం

- తిరుమలలో ఇద్దరు దర్శన దళారీలపై కేసు నమోదు

తిరుమల: శ్రీవారి దర్శన టికెట్లను అధిక ధరలకు విక్రయించిన ఇద్దరు దళారులపై తిరుమల పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు..తమిళనాడులోని కృష్ణగిరి జిల్లాకు చెందిన బీఆర్ విష్ణు శ్రీవారి బ్రేక్ దర్శన టికెట్లు కావాలంటూ దళారులైన చెన్నైకి చెందిన కృష్ణమూర్తి రఘురామన్, తిరుపతికి చెందిన కె.పళణి వెంకటేష్‌ను ఆశ్రయించాడు. దళారులు ఏపీకి చెందిన ప్రముఖ ప్రజాప్రతినిధి సిఫారసు లేఖను దుర్వినియోగం చేసి 5 బ్రేక్ దర్శనం టికెట్లను అతడికి రూ.35 వేలకు విక్రయించారు. అలాగే, హైదరాబాద్‌లోని న్యూ నల్లకుంట, ముషీరాబాద్‌కు చెందిన వి.దత్తాత్రేయ దళారి కృష్ణమూర్తి రఘురామన్‌ను బ్రేక్ దర్శన టికెట్ల కోసం సంప్రదించగా అతడి నుంచి రూ.15 వేలు తీసుకుని 3 బ్రేక్ దర్శన టికెట్లను దళారి అందించాడు. వీరందరూ తాము మోసపోయి దర్శన టికెట్లకు అధిక ధర చెల్లించామని తెలుసుకుని టీటీడీ విజిలెన్స్ అధికారులను ఆశ్రయించారు. విజిలెన్స్ అధికారులు తిరుమల టూటౌన్ పోలీసులకు భక్తులతో ఫిర్యాదు చేయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

## సమాజ వికాసంలో పుస్తకాల పాత్ర గొప్పది

- బెజవాడ పుస్తక పండుగను ప్రారంభించిన గవర్నర్ హరిచందన్



విజయవాడ పశ్చిమ (వన్‌టౌన్): సమాజ వికాసంలో పుస్తకాల పాత్ర విస్మరించలేనిదని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. వేదకాలం నాటి గతించిన చరిత్రను.. కాలగమనంలో చోటుచేసుకున్న అనేక ఘట్టాలను నేటి తరానికి అందించే గొప్ప సాధనాలు పుస్తకాలే అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 33వ విజయవాడ పుస్తక మహోత్సవాన్ని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ గురువారం ప్రారంభించారు. విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, తెలుగు– సంస్కృత అకాడమీ చైర్మన్ నందమూరి లక్ష్మీపార్వతి, రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు తదితరులు పుస్తక మహోత్సవం ప్రాధాన్యతను వివరించారు. సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మనోహరనాయుడు, లక్ష్మయ్య మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ వరకూ పుస్తక మహోత్సవం కొనసాగనుందన్నారు. ప్రచురణకర్త డి.విజయకుమార్, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మధురాంతకం నరేంద్ర, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, ఏపీ సీసీఎల్ఏ కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

# రూ. 10 కోట్ల విలువైన విదేశీ బంగారం పట్టివేత

- శ్రీలంక నుంచి తమిళనాడుకు సముద్ర మార్గంలో అక్రమ రవాణా
- ముగ్గురి అరెస్ట్..17.74 కేజీల బంగారం స్వాధీనం


పట్టుబడ్డ బంగారం


సముద్రంలో బంగారం కోసం గాలిస్తున్న దృశ్యం

సాక్షి, చెన్నై: విదేశాల నుంచి తమిళనాడులోకి సముద్రమార్గంలో అక్రమంగా తరలిస్తోన్న 17.74 కేజీల బంగారాన్ని చెన్నైలోని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విదేశాల నుంచి శ్రీలంక మీదుగా సముద్ర మార్గంలో పెద్ద ఎత్తున తమిళనాడులోకి బంగారం స్మగ్లింగ్ అవుతున్నట్లు డీఆర్ఐ చెన్నై జోన్ అధికారులకు సమాచారం అందింది. దీంతో డీఆర్ఐ అధికారులు శ్రీలంకకు కూతవేటు దూరంలో ఉన్న రామనాథపురం జిల్లా మండపం సముద్రతీరంలో బుధవారం నిఘా వేశారు. కోస్ట్‌గార్డ్ సహకారంతో చెన్నై డీఆర్ఐ అధికారులు సంయుక్తంగా ఆపరేషన్ మొదలుపెట్టారు. ఈ బృందాన్ని చూసిన ఓ పడవలో ఉన్న వ్యక్తులు కొన్ని ప్యాకెట్లను సముద్రంలో పడేశారు. ఇది చూసిన అధికారులు ఆ పడవను చుట్టుముట్టి అందులో ఉన్న తమిళనాడుకు చెందిన ముగ్గురు జాలర్లను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు సముద్రంలో బంగారం ఉన్న ప్యాకెట్లను పడేసినట్లు గుర్తించారు. దీంతో బంగారం కోసం సముద్రంలో డీఆర్ఐ అధికారులు గాలించారు. కోస్ట్‌గార్డు, గజ ఈతగాళ్ల సాయంతో సముద్రంలో బుధ, గురువారం కొన్ని గంటల పాటు గాలించారు. అనేక పడవల ద్వారా జరిపిన గాలింపులో 14 ప్యాకెట్లు బయటపడ్డాయి. వాటిలో 17.74 కేజీల విదేశీ బంగారాన్ని గుర్తించి సీజ్ చేశారు. వీటి విలువ రూ. 10.1 కోట్లుగా అంచనా వేశారు. పట్టుబడ్డ తమిళనాడుకు చెందిన ముగ్గురు జాలర్లను అరెస్ట్ చేశారు. ఈ వివరాలను గురువారం రాత్రి చెన్నైలో డీఆర్ఐ అధికారులు ప్రకటించారు. కాగా, 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు చెన్నై డీఆర్ఐ అధికారులు 209 కేజీల విదేశీ బంగారాన్ని సీజ్ చేశారు.

# నేటి నుంచి కురుక్షేత్రలో లక్ష చండీ మహాయజ్ఞం

- ఏర్పాట్లు పూర్తి
- పుణ్య జలాలతో ఘనంగా కలశ యాత్ర
- నేడు కురుక్షేత్రకి వెళ్లనున్న శారదాపీఠాధిపతి


కలశాల పూజలో పాల్గొన్న స్వాత్మానందేంద్ర సరస్వతి

సింహాచలం: విశాఖ శ్రీ శారదాపీఠం పర్యవేక్షణలో అఖండ భారతావనిలోనే తొలిసారిగా హరియాణ రాష్ట్రం కురుక్షేత్రలో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే లక్ష చండీ మహా యజ్ఞం ఏర్పాట్లు పూర్తయినట్టు శారదాపీఠం గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 26 వరకు జరిగే యజ్ఞానికి సంబంధించి కురుక్షేత్ర సమీపంలోని గుంతి ప్రాంతంలో 55 ఎకరాల సువిశాల ప్రాంగణంలో భారీ ఏర్పాట్లు చేశారు. శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి ప్రత్యక్ష పర్యవేక్షణలో పదహారు రోజుల పాటు యజ్ఞం కొనసాగనుంది. 22 రాష్ట్రాలకు చెందిన పండితులంతా ఇప్పటికే యజ్ఞభూమికి చేరుకున్నారు. నాలుగు వందల మంది బ్రాహ్మణోత్తముల సహకారంతో 1,760 మంది పండితులు యజ్ఞాన్ని నిర్వహించనున్నారు. శుక్రవారం సాయంత్రం మహా గణపతి పూజతో యజ్ఞానికి అంకురార్పణ చేస్తారు. కాగా యజ్ఞాన్ని పర్యవేక్షించేందుకు ఇప్పటికే పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి కురుక్షేత్రకి తరలి వెళ్లగా, శుక్రవారం ఉదయం స్వరూపానందేంద్ర సరస్వతి విశాఖ నుంచి కురుక్షేత్రకి బయలుదేరనున్నారు.

**వైభవంగా కలశ యాత్ర**

లక్ష చండీ మహా యజ్ఞాన్ని పురస్కరించుకుని గురువారం మధ్యాహ్నం యజ్ఞభూమి నుంచి ఘనంగా కలశ యాత్ర నిర్వహించారు. వందలాది మంది మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు. గుంతి శివారులో గంగ పూజ నిర్వహించారు. మానస సరోవరంతో పాటు సప్త నదుల నుంచి తీసుకొచ్చిన జలాలను కలశ యాత్రలో ఊరేగించి యజ్ఞభూమికి తీసుకొచ్చారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి, గుంతి మాత, జాగృతి జీతో పాటు దేశం నలుమూలల నుంచి వచ్చిన అనేక మంది మహిళా సాధువులు, రుషులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గంజాయి కేసులో టీడీపీ నేత అరెస్ట్

సాక్షి, నరసరావుపేట: గంజాయి అక్రమంగా తరలిస్తూ తెలుగుదేశంపార్టీ సోషల్ మీడియాలో కీలకంగా వ్యవహరిస్తున్న వ్యక్తి ఒకరు నరసరావుపేట పోలీసులకు చిక్కాడు. సాధారణ తనిఖీల్లో భాగంగా పల్నాడు జిల్లా నరసరావుపేట టూటౌన్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి పాత చెక్‌పోస్ట్ వద్ద సోదాలు నిర్వహిస్తున్నారు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం ఆరుగొలను గ్రామానికి చెందిన సిద్దులూరి అజయ్ అమృత్ కారులో వస్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశాడు. పోలీసు సిబ్బంది అతన్ని అదుపులోకి తీసుకుని కారులో తనిఖీ నిర్వహించగా, అందులో 5.1 కిలోల గంజాయి గుర్తించారు. దీంతో నిందితున్ని స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించగా అక్రమ గంజాయి రవాణా వ్యవహారం వెలుగుచూసింది. గత కొన్ని నెలలుగా హోల్‌సేల్ వ్యాపారుల వద్ద గంజాయిని కొనుగోలు చేసి పల్నాడు, గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని తెలుగుయువత, విద్యార్థులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు విచారణలో నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అజయ్ అమృత్‌పై ఇప్పటికే కృష్ణా జిల్లాలో క్రిమినల్ కేసు ఉన్నట్లు గుర్తించారు. కొన్ని రోజులుగా టీడీపీ సోషల్ మీడియాలో కీలకపాత్ర పోషిస్తూ, న్యాయమూర్తులను సైతం అజయ్ అమృత్ దూషించినట్లు పోలీసులు గుర్తించారు. పట్టుబడ్డ గంజాయితో సహా నిందితున్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

## క్లుప్తంగా...

### భారతీయుల అమెరికా వీసా ప్రక్రియలో పురోగతి

**వాషింగ్టన్:** అమెరికా వీసాల కోసం నెలల తరబడి నిరీక్షిస్తున్న భారతీయుల ఇబ్బందుల్ని తొలగించేందుకు అధ్యక్ష అడ్వైజరీ కమిషన్ చేసిన సిఫార్సులను ఆ దేశ హోం మంత్రిత్వ శాఖ ఆచరణలో పెడుతోంది. భారతీయుల వీసా దరఖాస్తులను విదేశాల్లోనూ త్వరగా తేల్చేలా అదనంగా దౌత్య కార్యాలయాలు, కౌంటర్లు తెరుస్తున్నారు. కోవిడ్ అనంతరం ప్రయాణ ఆంక్షలు తొలగించాక అమెరికా వీసాల కోసం భారత్ నుంచి దరఖాస్తులు వెల్లువలా వచ్చిపడటం తెల్సిందే. అమెరికాలో అభ్యసించనున్న విద్యార్థులు, పర్యటించే సందర్శకులు చాలాకాలంపాటు వేచి ఉండాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారని ప్రెసిడెన్షియల్ కమిషన్ సభ్యుడు అజయ్ జైన్ భుటోరియా వ్యాఖ్యానించారు. భారతీయ వీసా దరఖాస్తుదారులకు ప్రపంచంలో ఏ దేశంలో కుదిరితే ఆ దేశం నుంచే అక్కడి అమెరికా ఎంబసీ సిబ్బంది వర్చువల్‌గా ఇంటర్వ్యూలు చేసి వీసా జారీ/నిరాకరణ ప్రక్రియను పూర్తిచేయడంలో సాయపడతారు. విదేశాల్లోని అమెరికా ఎంబసీల్లో ఎక్కువ వీసా అపాయ్‌మెంట్ కౌంటర్లను తెరుస్తారు. సిబ్బంది సంఖ్యను పెంచుకుంటారు. ఎంబసీల్లో కొత్తగా సిబ్బందిని నియమించుకుంటారు. 400 రోజులకుపైబడిన వెయిటింగ్ సమయాన్ని 2–4 వారాలకు కుదించడమే వీరి లక్ష్యం.

### 'హెచ్‌–1బీ' గ్రేస్ పీరియడ్ 12 నెలలకు పెంచాలి

**వాషింగ్టన్:** అగ్రరాజ్యం అమెరికాలో సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో లే–ఆఫ్‌ల పర్వం కొనసాగుతోంది. మరోవైపు ఇతర రంగాల్లోనూ పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. ఫలితంగా అమెరికాలో ఉంటున్న భారతీయులు నిరుద్యోగులుగా మారుతున్నారు. హెచ్‌–1బీ(నాన్‌–ఇమ్మిగ్రెంట్) వీసాపై ఉంటున్నవారు ఉద్యోగం పోయాక 60 రోజుల్లోగా(2 నెలలు) మరో కొలువు వెతుక్కోవాలి. లేకపోతే స్వదేశానికి వెళ్లిపోవాలి. ఈ గ్రేస్ పిరియడ్‌ను 60 రోజుల నుంచి 12 నెలలకు(ఒక సంవత్సరం) పెంచాలని కోరుతూ ఫౌండేషన్ ఫర్ ఇండియా, ఇండియన్ డయాస్పోరా స్టడీస్ అండ్ గ్లోబల్ టెక్నాలజీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అనే రెండు భారత–అమెరికన్ సంస్థలు పోరాటం ప్రారంభించాయి. భారత టెకీలకు మేలు చేసేలా నిర్ణయం తీసుకోవాలంటూ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు ఆన్‌లైన్‌లో పిటిషన్లు సమర్పిస్తున్నాయి. అధ్యక్షుడితోపాటు డిపార్టుమెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి, యూఎస్ సిటిజెన్‌షిప్, ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ డైరెక్టర్‌కు ఆన్‌లైన్‌లో పిటిషన్లను పంపిస్తున్నాయి.

# 'చాట్'కు బార్డ్ పోటీ!

- ఏఐ ఆధారిత చాట్‌జీపీటీతో మైక్రోసాఫ్ట్ సంచలనం
- పోటీగా సొంతంగా 'బార్డ్'ను తీసుకొచ్చిన గూగుల్
- రెండింటి సేవలు దాదాపు ఒకేలా ఉన్నాయంటున్న నిపుణులు
- రానున్న రోజుల్లో మరికొన్ని ఏఐ చాట్‌బాట్‌లు!

**టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తీసుకొచ్చిన 'చాట్‌జీపీటీ' ఇంటర్నెట్ ప్రపంచంలో ఇప్పటికే సంచలనాలు నమోదు చేస్తోంది. కృత్రిమ మేధ(ఏఐ) ఆధారంగా పనిచేసే ఈ చాట్‌బాట్‌పై ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆసక్తి కనిపిస్తోంది. అమెరికాలో 'ఓపెన్‌ఏఐ' అనే స్టార్టప్ కంపెనీ అభివృద్ధి చేసిన చాట్‌జీపీటీని మైక్రోసాఫ్ట్ కంపెనీ 2022 నవంబర్ 30న ప్రారంభించగా, అతి తక్కువ కాలంలోనే నెటిజన్ల ఆదరణ పొందింది. చాట్‌జీపీటీకి పోటీగా ప్రఖ్యాత గూగుల్ సంస్థ 'బార్డ్' పేరిట సొంత ఏఐ ఆధారిత చాట్‌బాట్‌ను తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో మైక్రోసాఫ్ట్, గూగుల్ చాట్‌బాట్‌లు అందించే సేవల మధ్య వ్యత్యాసాలు ఏమైనా ఉన్నాయా? ఏది ఉత్తమం? అనేది తెలుసుకుందాం.**

**గూగుల్‌కు అదనపు బలం**

గూగుల్ చాట్‌బాట్ 'బార్డ్'కి గూగుల్ సెర్చ్ ఇంజిన్ అదనపు బలమనే చెప్పాలి. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది గూగుల్ సెర్చ్ ఇంజిన్‌ను విస్తృతంగా ఉపయోగించుకుంటున్నారు. కావాల్సిన సమాచారాన్ని పొందుతున్నారు. ఈ సెర్చ్ ఇంజిన్‌ను గూగుల్ సంస్థ తన 'బార్డ్'తో అనుసంధానించనుంది. దీనివల్ల బార్డ్ ద్వారా మరింత మెరుగైన సేవలను యూజర్లకు అందించేందుకు వీలవుతుంది. మైక్రోసాఫ్ట్ కూడా తన సెర్చ్ ఇంజిన్ 'బింగ్'తో చాట్‌జీపీటీని అనుసంధానించింది. బింగ్ యూజర్ల సంఖ్య తక్కువగా ఉండటం, గూగుల్ కన్నా మెరుగైన సెర్చ్ ఇంజిన్ సేవలు అందించలేకపోవడం వంటివి చాట్‌జీపీటీకి ప్రతికూలాంశాలుగా మారాయి.



**చాట్‌జీపీటీ**

- మైక్రోసాఫ్ట్ చాట్‌జీపీటీ 3.5 వెర్షన్ కూడా దాదాపు గూగుల్ 'లామ్డా' లాంటిదే. యూజర్‌కు సులువుగా అర్థమయ్యేలా సమాచారాన్ని అందిస్తుంది.
- గూగుల్, మైక్రోసాఫ్ట్ చాట్‌బాట్‌లు అందించే సేవలు దాదాపు ఒకేలా ఉన్నాయి.
- చాట్‌జీపీటీని అత్యాధునికంగా తీర్చిదిద్దారు. సమస్యలు ఏవైనా తలెత్తితే వెంటనే పరిష్కరిస్తున్నారు.
- చాట్‌జీపీటీ మెరుగైన సేవలు అందిస్తోందని యూజర్లు అభిప్రాయపడుతున్నారు.

**గూగుల్ బార్డ్**

- 'బార్డ్' అనేది లాంగ్వేజ్ మోడల్ ఫర్ డైలాగ్ అప్లికేషన్స్(లామ్డా), వెబ్ కంటెంట్‌ను వాడి యూజర్లకు సేవలందిస్తుంది.
- యూజర్ల భాషలోనే వారు కోరుకున్న సమాచారాన్ని అందిస్తుంది.
- వీలైనన్ని ఎక్కువ భాషల్లో సేవలు అందించడమే లక్ష్యంగా బార్డ్‌ను రూపొందిస్తున్నారు.
- ఏ ప్రశ్న వేసినా బార్డ్ సమాధానం ఇస్తుంది. సంబంధిత అంశంపై తాజా సమాచారాన్ని చేరవేస్తుంది. సులభంగా అర్థమయ్యేలా సమాధానం చెబుతుంది.

**ఏది బెటర్?**

మైక్రోసాఫ్ట్ చాట్‌జీపీటీలో 2021 సంవత్సరం వరకు మాత్రమే నాలెడ్జ్ లాక్ చేశారు. అంటే 2021 తర్వాత జరిగిన సంఘటనలకు సంబంధించిన సమాచారం వివరంగా అందించలేదు. గూగుల్ బార్డ్‌లో ఈ సమస్య లేదు. ఎప్పటికప్పుడు తాజా సమాచారం తెలుసుకోవచ్చు. బార్డ్ ఇంకా పూర్తిస్థాయిలో సిద్ధం కాలేదు. ప్రస్తుతం నమ్మకమైన కొందరు యూజర్లకు మాత్రమే ఈ సేవలు అందుతున్నాయి. త్వరలో అందరికీ అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది. గూగుల్ ఉపయోగిస్తున్న 'లామ్డా' సమర్థతపై అనుమానాలు ఉండగా, మైక్రోసాఫ్ట్ చాట్‌జీపీటీపై ఇప్పటిదాకా ఎలాంటి ఆరోపణలు రాలేదు. చాట్‌జీపీటీ, బార్డ్‌ల మధ్య ఏది బెటర్ అంటే ఇప్పుడే చెప్పలేమని టెక్నాలజీ నిపుణులు పేర్కొంటున్నారు. 'బార్డ్' కూడా అందరికీ అందుబాటులోకి వచ్చాకే రెండింటిలో ఏది ఉత్తమం అనేది నిర్ధారించగలమని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. కొన్ని స్టార్టప్ కంపెనీలు చాట్‌సోనిక్, జాస్పర్ ఏఐ, ఓపెన్ అసిస్టెంట్, వర్డ్‌ట్యూన్ పేరిట ఏఐ చాట్‌బాట్‌లను తీసుకొచ్చే పనిలో నిమగ్నమయ్యాయి. చైనా సెర్చ్ ఇంజిన్ 'బైదూ' కూడా ఎర్నీబాట్ పేరుతో సొంత ఏఐ అప్లికేషన్‌ను తీసుకురావాలని నిర్ణయించింది.

**చాట్‌బాట్ అంటే?**

మెషీన్ లెర్నింగ్ మోడల్‌లోని డేటాను ఉపయోగించుకొని కృత్రిమ మేధ సాయంతో యూజర్ల ప్రశ్నలకు సంభాషణల రూపంలో సమాధానం ఇవ్వడాన్ని చాట్‌బాట్ అంటారు. ప్రశ్న అడగ్గానే సమాధానాలు స్వయంచాలితంగా(ఆటోమేటిక్)గా జనరేట్ అవుతాయి. ఏఐ చాట్‌బాట్‌లు మనిషి స్పందించినట్లుగానే స్పందిస్తాయి. వ్యాపారం, విద్య, వైద్యంతోపాటు దాదాపు అన్ని రంగాలకు సంబంధించిన వివరాలు పొందవచ్చు. వ్యక్తిగత సమస్యలకు పరిష్కార మార్గాలు తెలుసుకోవచ్చు. కథలు, కవితలు, సినిమా స్క్రిప్టులు కూడా ఏఐ చాట్‌బాట్ రాసి ఇస్తుంది. పరీక్షల్లో రాయడానికి వ్యాసాలను సైతం విద్యార్థులు పొందవచ్చు. దీనిపై ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాసాలు సొంతంగా బుర్రకు పదునుపెట్టి రాయాలని, చాట్‌బాట్ నుంచి తీసుకుంటే విద్యార్థుల్లో ఆలోచనాశక్తి నశించిపోతుందని అంటున్నారు. చాట్‌బాట్‌లోనూ లోపాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కచ్చితత్వం లేని, తప్పుల తడకలుగా ఉన్న డేటా వనరుల నుంచి కూడా సమాచారం వస్తుందని, యూజర్లు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

### న్యాయవ్యవస్థలో రిజర్వేషన్లకు అవకాశం లేదు

**న్యూఢిల్లీ:** ప్రస్తుతమున్న విధానం, నిబంధనల ప్రకారం భారత న్యాయవ్యవస్థలో రిజర్వేషన్లకు అవకాశం లేదని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజు చెప్పారు. కానీ, జడ్జీల నియామక ప్రతిపాదనల సమయంలో సరైన ప్రాతినిధ్యం లేని మహిళలు, బీసీలు, ఇతర వర్గాలకు చెందిన వారి విషయం దృష్టిలో ఉంచుకోవాలని జడ్జీలు, ముఖ్యంగా కొలీజియం సభ్యులకు తెలిపినట్లు ఆయన వెల్లడించారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో డీఎంకే నేత తిరుచి శివ అడిగిన ఒక ప్రశ్నకు ఈ సమాధానమిచ్చారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నాటికి దేశంలోని 25 హైకోర్టుల్లో సుమారు 60 లక్షల కేసులు, సుప్రీంకోర్టులో 69 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు మరో ప్రశ్నకు సమాధానంగా మంత్రి వెల్లడించారు. ఇందులో, అలహాబాద్ హైకోర్టులో అత్యధికంగా 10.30 లక్షల కేసులు, సిక్కిం హైకోర్టులో అత్యల్పంగా 171 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

### గతంలో నాలుగుసార్లు చైనా బెలూన్లు కనిపించాయి

**అమెరికా రక్షణ శాఖ వెల్లడి**

**వాషింగ్టన్:** చైనా ప్రయోగించిన నిఘా బెలూన్లు గతంలో నాలుగు పర్యాయాలు తమ దేశ భూభాగాలపై ఎగిరాయని అమెరికా రక్షణ శాఖ కార్యాలయం పెంటగాన్ తెలిపింది. నిఘా ప్రయోజనాల కోసం చైనా గత కొద్ది సంవత్సరాలుగా బెలూన్లను వాడుతున్నట్లు భావిస్తున్నామని పేర్కొంది. వీటిల్లో కొన్నిటిని తాము గుర్తించలేదని వివరించింది. గత వారం జరిగిన ఘటనతో పోల్చి విశ్లేషించగా అవి చైనాకు చెందిన నిఘా బెలూన్లే అని రూఢీ అయినట్లు వెల్లడించింది. గత శనివారం అమెరికా ఫైటర్ జెట్ విమానం సౌత్ కరోలినా సమీపంలోని అట్లాంటిక్ సముద్ర జలాల్లో కూల్చివేసిన చైనా నిఘా బెలూన్ తాలూకు పరికరాల వెలికితీత కొనసాగుతోందని పేర్కొంది.

### 2 లక్షల మంది పౌరసత్వాన్ని వదులుకున్నారు

**న్యూఢిల్లీ:** 2011 నుంచి ఇప్పటి వరకు మొత్తం 16 లక్షల మందికి పైగా భారతీయులు భారతీయ పౌరసత్వాన్ని వదులుకున్నారని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. వీరిలో ఒక్క 2022 సంవత్సరంలోనే అత్యధికంగా 2.25 లక్షల మంది దేశ పౌరసత్వాన్ని వదిలిపెట్టారని వివరించింది. విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు సమాధానమిచ్చారు. అమెరికా కంపెనీలు ఇటీవలి కాలంలో ఉద్యోగ నిపుణులను తొలగిస్తున్న విషయాన్ని తాము పరిశీలిస్తున్నట్లు విదేశాంగ శాఖ సహాయ మంత్రి మురళీధరన్ చెప్పారు. వీరిలో హెచ్‌–1బీ, ఎల్1 వీసాలు కలిగిన భారతీయులు కూడా ఉన్నారని వివరించారు.



కార్యక్రమానికి కుమార్తెతో హాజరైన కిమ్

## అట్టహాసంగా ఉత్తర కొరియా సైనిక పరేడ్

**సియోల్:** ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ తన సైనిక బలాన్ని మరోసారి ప్రదర్శించారు. రాజధాని పాంగ్‌యాంగ్‌లో బుధవారం రాత్రి సైనిక పరేడ్ అట్టహాసంగా నిర్వహించారు. అమ్ముల పొదిలోని కీలక ఆయుధాలతోపాటు అత్యాధునిక, భారీ అణు క్షిపణులకు సైతం ఈ పరేడ్‌లో చోటుకల్పించారు. కిమ్ జోంగ్ ఉన్‌తోపాటు ఆయన కుమార్తె కిమ్ జు అయే ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పది సంవత్సరాల వయసున్న కిమ్ జు అయే భవిష్యత్తులో ఉత్తర కొరియా పాలనా పగ్గాలు చేపట్టడం ఖాయమన్న చర్చ పెద్ద ఎత్తున సాగుతోంది. కిమ్ జోంగ్ ఉన్ తన కుమార్తెను ఆ దిశగా సన్నద్ధం చేస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. కిమ్ జు అయే బహిరంగంగా ప్రజలకు కనిపించడం ఇది ఐదోసారి. ఆమె కిమ్‌కు రెండో సంతానమని తెలుస్తోంది. మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె తండ్రితోపాటు కనిపించారు.

**కిమ్ జోంగ్ ఉన్‌తోపాటు పాల్గొన్న కుమార్తె కిమ్ జు అయే**

మరిన్ని అణ్వాయుధాలను సొంతం చేసుకోవడానికి కిమ్ తీవ్రంగా శ్రమిస్తున్నారని పరిశీలకులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో నూతన ఘన–ఇంధన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని ఉత్తర కొరియా పరీక్షించబోతున్నట్లు అంచనా వేస్తున్నారు. తాజా సైనిక పరేడ్‌లో డజనుకుపైగా ఖండాంతర బాలిస్టిక్ మిస్సైళ్లను ప్రదర్శించారు. పొరుగు దేశమైన దక్షిణ కొరియాతోపాటు అగ్రరాజ్యం అమెరికాతో ఉత్తర కొరియా కయ్యానికి కాలు దువ్వుతోంది. పశ్చిమ దేశాల ఆంక్షల వల్ల వనరులు పరిమితంగా ఉన్నప్పటికీ అత్యాధునిక అణ్వాయుధాల తయారీపై కిమ్ దృష్టి పెట్టడం ఆసక్తికరంగా మారింది.

# ప్రభుత్వాలను కూల్చిన చరిత్ర కాంగ్రెస్‌దే

- 90 సార్లు ప్రభుత్వాలను పడగొట్టేందుకు ఆర్టికల్ 356 వినియోగం
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో కాంగ్రెస్‌పై మోదీ నిప్పులు

**సాక్షి, న్యూఢిల్లీ:** ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కూలిచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనంటూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రధాని ప్రతిపక్షంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ఆర్టికల్ 356ను అధికంగా దుర్వినియోగం చేసి ప్రభుత్వాలను పడగొట్టిందంటూ కాంగ్రెస్‌పై మాటల దాడి చేశారు. 'కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పెద్ద ఎత్తున ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేశారు. 90సార్లు ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కూలదోశారు. ప్రధానిగా ఇందిరాగాంధీ ఒక్కరే 50సార్లు ఆర్టికల్ 356ను వాడారు. కాంగ్రెస్ ఇప్పటిదాకా నెహ్రూ–గాంధీ కుటుంబం పేరును 600 కేంద్ర పథకాలకు పెట్టింది. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నిజంగా మహోన్నతమైన నేత అయితే ఆయన ఇంటిపేరైన నెహ్రూ ఎందుకు వారసత్వంగా రాలేదు?' అని ప్రధాని నిలదీశారు. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి ప్రధాని గురువారం సమాధానమిచ్చారు. గంటన్నర పాటు మాట్లాడిన ప్రధాని కాంగ్రెస్ గత పాలనను ఎండగట్టారు.

**ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నాలు**

రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టడంలో కాంగ్రెస్ చేసిన కుట్రలపై మాట్లాడిన ప్రధాని ఎన్టీఆర్ ప్రభుత్వ అంశాన్ని ప్రస్తావించారు. 'ప్రతి ప్రాంతీయ నేతను కాంగ్రెస్ ఇబ్బందులకు గురిచేసింది. ఎన్టీఆర్‌కు ఏం చేసిందో అందరికీ తెలుసు. (ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ సహా ఇతర విపక్ష ఎంపీలను చూపిస్తూ) కొందరు నేతలు ఇక్కడ వేషం మార్చి ఉండవచ్చు..పేర్లు మార్చుకొని ఉండొచ్చు.. జ్యోతిష్యులు చెప్పారని పేర్లు మార్చుకొని ఉండొచ్చు...కానీ అప్పుడు వారంతా ఎన్టీఆర్‌తో పాటే ఉన్నవారే. అనారోగ్యం కారణంగా అమెరికా వెళితే..ఆయన చికిత్స కోసం అమెరికా వెళితే ఆ ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నం చేశారు' అంటూ విమర్శించారు. కేరళలో వామపక్ష ప్రభుత్వాన్ని, తమిళనాడులో ఎంజీఆర్, కరుణానిధి ప్రభుత్వాలను ఆర్టికల్ 356 ఉపయోగించి కాంగ్రెస్ ప్రభుత్వం కూలిచ్చివేసిందని చెప్పారు. తమ ప్రభుత్వాలను కూల్చిన కాంగ్రెస్‌తోనే ఇప్పుడు వామపక్షాలు, డీఎంకే వంటి పార్టీలు కలిసి నిరసన తెలుపుతున్నాయని, వీరి ధోరణిని ఎంజీఆర్ ఆత్మ చూస్తుంటుందని చురకలంటించారు. ఇదేరీతిన 1980లో శరద్ పవార్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ కూలదోసిందని గుర్తు చేశారు.

**పార్టీ కార్యాలయాలుగా మార్చేసింది**

'కాంగ్రెస్ పాలకులు రాజ్‌భవన్‌లను పూర్తిగా పార్టీ ప్రధాన కార్యాలయాలుగా మార్చారు. 2005లో జార్ఖండ్‌లో ఎన్డీఏ ప్రభుత్వానికి అత్యధిక సీట్లున్నా, గవర్నర్ యూపీఏ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించారు. 1982లో హరియాణాలో ఎన్నికలకు ముందే బీజేపీ–దేవీలాల్‌ల మధ్య ఒప్పందం ఉన్నా, గవర్నర్ కాంగ్రెస్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు' అని అన్నారు.

**ఎంతగా బురదజల్లితే అంతగా కమల వికాసం**

విపక్షాల విమర్శలపై కవి మాణిక్ వర్మ కవితను ఉదహరించారు. ' బురద వాళ్ల దగ్గరుంది. నా దగ్గర రంగులున్నాయి. వాళ్లదగ్గర ఏముందో అదే వాళ్లు చల్లుతారు' అని అన్నారు. విమర్శలపై.. 'ఎంతగా బురదను చల్లుతారో అంత పెద్దగా కమలం వికసిస్తుంది' అని ఉద్ఘాటించారు. ' దేశం కోసం జీవిస్తున్నా, మాతృభూమి కోసం కొంతైనా చేస్తా' అంటూ గుండెలపై చేయి వేసి ప్రకటించారు. 'ఆరోపణలు(బురద) ఎంతగా వేస్తున్నారో దేశం చూస్తోంది. విపక్షాల అందరి ఆరోపణల(బురద) బరువు నా ఒక్కడిపైనా పడుతోంది' అని అన్నారు. విపక్షాల నినాదాలతో పలుమార్లు వాయిదాపడిన రాజ్యసభ సాయంత్రం ఐదుగంటలకు తిరిగి ప్రారంభమైంది. సభ సజావుగా సాగాలంటే సభ్యులు సంయమనం పాటించాలని, ఇందుకు అన్ని పార్టీల పక్ష నేతలు సమావేశంకావాలని చైర్మన్ ధన్‌ఖడ్ సూచించారు. దీంతో కాంగ్రెస్ సభ్యుడు శక్తిసిన్హా గోహిల్ మాట్లాడుతుండగా ప్రధానికి విపక్షాలు క్షమాపణలు చెప్పాలని బీజేపీ సభ్యులు మోదీమోదీ అంటూ నినాదాలు మొదలుపెట్టారు. దీంతో సభను వాయిదావేస్తున్నట్లు ధన్‌ఖడ్ ప్రకటించారు.



### మాకు మరిన్ని ఆయుధాలు కావాలి

**ఈయూ పార్లమెంట్‌లో ప్రసంగించిన జెలెన్‌స్కీ**



మేక్రాన్‌తో జెలెన్‌స్కీ

**బ్రస్సెల్స్:** రష్యాను ఎదుర్కొనేందుకు తమకు మరింత సైనిక సాయం కావాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ కోరారు. ఉక్రెయిన్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) కలిసి యూరప్ బద్ధవ్యతిరేకి అయిన రష్యాతో తలపడుతున్నాయని చెప్పారు. గురువారం ఆయన బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లోని ఈయూ పార్లమెంట్‌నుద్దేశించి ప్రసంగించారు. 'మనం కలిసి ఉన్నంత కాలం, మన యూరప్‌ను కాపాడుకున్నంత కాలం, మన యూరప్ జీవన విధానాన్ని పరిరక్షించుకున్నంత కాలం యూరప్ యూరప్‌గానే నిలిచి ఉంటుంది'అని జెలెన్‌స్కీ చెప్పారు. యూరప్ జీవన విధానాన్ని నాశనం చేయాలని రష్యా కోరుకుంటోంది. కానీ, మనం అలా జరగనివ్వరాదు'అని చెప్పారు. అంతకుముందు ఈయూ ప్రతినిధులు ఆయనకు పార్లమెంట్ భవనంలోకి ఘనంగా స్వాగతం పలికారు. ప్రసంగం పూర్తయిన అనంతరం, ప్రొటోకాల్ ప్రకారం ఉక్రెయిన్ జాతీయ గీతం, యూరోపియన్ గీతం వినిపించారు. ఆ సమయంలో జెలెన్‌స్కీ ఈయూ జెండాను చేబూనారు. అనంతరం యూరోపియన్ పార్లమెంట్ అధ్యక్షుడు రొబెర్టా మెట్సోలా మాట్లాడుతూ.. లాంగ్ రేంజ్ క్షిపణి వ్యవస్థలను, యుద్ధవిమానాలను సాధ్యమైనంత త్వరగా ఉక్రెయిన్‌కు అందించే విషయం పరిశీలించాలని సభ్య దేశాలను కోరారు. ఉక్రెయిన్‌కు రష్యాతో ఉన్న ముప్పునకు తగ్గట్టే చర్యలుండాలని సూచించారు. ఇది ఉక్రెయిన్ అస్తిత్వానికి సంబంధించిన విషయమన్నారు. ఈనెల 24వ తేదీతో ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించి ఏడాదవుతోంది. ఈ సందర్భంగా దాడులను మరో విడత తీవ్రతరం చేసేందుకు రష్యా ప్రయత్నిస్తోందని పరిశీలకులు అంటున్నారు. ఈ నేపథ్యంలోనే అదనపు సైనిక సాయం కోసం జెలెన్‌స్కీ మిత్ర దేశాల్లో పర్యటనలు చేస్తున్నారు. అంతకుముందు ఫ్రాన్సు పర్యటనలో ఆ దేశాధ్యక్షుడు మేక్రాన్ ఆయన్ను లీజియన్ ఆఫ్ హానర్‌తో సన్మానించారు. బ్రస్సెల్స్‌లో ఈయూకు చెందిన 27 దేశాల నేతలతో జెలెన్‌స్కీ సమావేశమయ్యారు.

### ఢిల్లీ మద్యం కేసులో ఈడీ మరో అరెస్ట్

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో మద్యం విధానంలో అక్రమాలు జరిగాయంటూ అరెస్టుల పర్వానికి తెరలేపిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గురువారం మరొకరిని అరెస్ట్‌చేసింది. 2022లో గోవా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రచార బాధ్యతలు నెరవేర్చిన ఒక అడ్వర్‌టైజ్‌మెంట్ సంస్థ డైరెక్టర్‌ను అరెస్ట్‌చేసింది. మద్యం కేసులో మనీ లాండరింగ్‌తో చారియట్ ప్రొడక్షన్స్ మీడియా డైరెక్టర్ రాజేశ్ జోషీకి ప్రమేయముందని ఈడీ ఆరోపిస్తోంది. జోషిని కోర్టు 13 వరకు ఈడీ కస్టడీకి అనుమతించింది. కేసులో ఐదుగురు నిందితుల బెయిల్ పిటిషన్లపై తీర్పును రౌజ్ అవెన్యూ కోర్టు రిజర్వు చేసింది. బెయిల్‌పై వాదనలు ముగిశాయని, 16న నిర్ణయం వెలువరుస్తామని జడ్జి పేర్కొన్నారు.

### పుతిన్‌తో దోవల్ భేటీ

**న్యూఢిల్లీ:** రష్యా పర్యటనలో ఉన్న భారత జాతీయ భద్రతా సలహాదారు ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. గురువారం మాస్కోలో ఈ భేటీ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఇకమీదటా ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు మాస్కోలోని భారత రాయబార కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అఫ్గానిస్తాన్ అంశంపై పలు దేశాల అత్యున్నత స్థాయి ప్రతినిధులతో పుతిన్ భేటీ అవుతున్నారు. అందులోభాగంగా గురువారం ఐదవ జాతీయ భద్రతా మండలి/సలహాదారుల సమావేశంలో దోవల్, పుతిన్ మాట్లాడుకున్నారని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ తెలిపింది. 'అఫ్గానిస్తాన్‌లో అనిశ్చితిని అవకాశంగా తీసుకుని కొన్ని ప్రాంతీయేతర శక్తులు అక్కడ మరింతగా విస్తరించేందుకు కుట్ర పన్నుతున్నాయి. అక్కడ పరిస్థితి ఏమంత బాగోలేదు. మానవతాసాయం మరింతగా తగ్గిపోతోంది' అని పుతిన్ అన్నారు. ' అఫ్గాన్ గడ్డ నుంచి ఉగ్రవాదాన్ని మరింతగా ఎగదోసే చర్యలను భారత్ ఏమాత్రం ఉపేక్షించదు. అఫ్గాన్ ప్రజలను కష్టాల్లో వదిలేయబోము' అని దోవల్ అన్నారు.



రెహన్లిలో చనిపోయిన కుమార్తెను ముద్దాడుతున్న తల్లి

# చలి.. ఆకలి

- శిథిలాల కింద బాధితుల వేదన
- 19 వేలు దాటేసిన మృతుల సంఖ్య
- గడ్డ కట్టించే చలితో సహాయ కార్యక్రమాలకు ఆటంకం



శిథిలాల్లో చిక్కుకుపోయిన అబ్దుల్

**అంటాక్యా/జందారిస్:** ఆశలు అడుగంటుతున్నాయి. శిథిలాల కింద సహాయం కోసం ఆర్తనాదాలు చేస్తున్న వారిని కాపాడగలమన్న నమ్మకం తగ్గిపోతోంది. ఉష్ణోగ్రతలు మైనస్ అయిదు డిగ్రీలకు చేరుకోవడంతో సహాయ చర్యలకి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటివరకు తుర్కియే, సిరియాల్లో 19 వేల మందికి పైగా మరణించారని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఇంకా శిథిలాల కింద లక్షలాది మంది ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. సహాయ చర్యల్లో లోపాలున్నాయని తుర్కియే అధ్యక్షుడు తయిపీ ఎర్డోగన్ స్వయంగా అంగీకరించారు. ఈ స్థాయిలో ప్రళయం సంభవిస్తే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అసాధ్యమని వ్యాఖ్యానించారు. భూకంపం వచ్చిన ప్రాంతం దేశంలో ఒక మారుమూల ఉండడంతో సహాయ బృందాలను పంపించడంలో ఆలస్యమైందని అన్నారు. మరోవైపు భూకంపానికి ఇళ్లు కోల్పోయిన వారు వీధుల్లోనే కాలం గడుపుతున్నారు. చలి తట్టుకోలేక వారంతా తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. చాలా మంది రాత్రి వేళల్లో రోడ్లపై పార్క్ చేసి ఉంచిన కార్లలో ఉంటున్నారు.

**ఆ 72 గంటలు ముగిశాయ్..!**

భూకంపం వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మొదటి మూడు రోజులే అత్యంత కీలకం. ఈ 72 గంటల్లో ఎంతమందిని కాపాడారన్నదే ముఖ్యం. ఆ తర్వాత శిథిలాలు తొలగించినా ప్రాణాలతో బయటపడేవారి సంఖ్య చాలా తక్కువ. గురువారం ఉదయానికి 72 గంటలు గడిచిపోవడంతో ఇంకెన్ని మరణాలు సంభవిస్తాయోనన్న ఆందోళన అందరిలోనూ నెలకొంది. భూకంపాల సమయంలో మొదటి మూడు రోజుల్లో సర్వ సాధారణంగా 90శాతం మందిని బాధితుల్ని రక్షిస్తారు. మూడు రోజులు దాటితే శిథిలాల కింద ఉన్న వారికి మంచినీళ్లు, ఆహారం అందించాలి. అవి అందక మిగిలిన వారు ప్రాణాలతో బయటపడడం కష్టంగా మారుతుంది.

**ఆరేళ్ల బాలికను కాపాడిన ఎన్‌డీఆర్ఎఫ్ బృందం**

తుర్కియేలో సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్న భారత నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్) శిథిలాల కింద నలిగిపోతున్న ఆరేళ్ల బాలికను కాపాడాయి. మన దేశం నుంచి వెళ్లిన మూడు బృందాలు అలుపెరుగకుండా సహాయ కార్యక్రమాలు అందిస్తున్నాయని కేంద్ర హోం శాఖ ట్వీట్ చేసింది. ''భారత్‌కు చెందిన సహాయ బృందం నర్దగి ప్రాంతంలో ఆరేళ్ల బాలికను కాపాడింది. ఎన్‌డీఆర్ఎఫ్ చేస్తున్న సహాయానికి గర్వపడుతున్నాం'' అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ట్వీట్ చేశారు. ఆ బాలికను కాపాడిన వీడియోను కూడా షేర్ చేశారు.

**హైపోథెర్మియా ముప్పు**

తుర్కియేలో భూకంపం తీవ్రత ఎక్కువగా ఉన్న అడియమాన్ ప్రావిన్స్‌లో బాధితులు దారుణమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. భూకంపం వచ్చి నాలుగు రోజులైనా సహాయ సిబ్బంది ఎవరూ రాలేదని రెసాట్ గొజ్లు అనే బాధితుడు తన గోడు వెళ్లబోసుకున్నాడు. శిథిలాల కింద ఉన్న వారిలో చాలా మంది హైపోథెర్మియా పరిస్థితులతో మరణించారని తెలిపారు. శరీరంలో ఉష్ణం పుట్టే వేగం కంటే, ఉష్ణం కోల్పోయే వేగం ఎక్కువగా ఉంటే దానిని హైపోథెర్మియా అని అంటారు. గట్టకట్టించే చలిలో బాధితుల శరీర ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గిపోయి మరణిస్తారు.

**దేశమే జరిగింది...!**

తుర్కియే (టర్కీ)లో సంభవించిన భూకంపం ధాటికి ఆ దేశం భౌగోళికంగా అయిదు నుంచి ఆరు మీటర్లు పక్కకి జరిగి ఉంటుందని భూగర్భ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూమి పొరల్లో ఉన్న టెక్టోనిక్ ప్లేట్స్ (ఫలకాలు) తీవ్రమైన రాపిడి కారణంగానే ఇది సంభవించినట్టు తెలిపారు. సిరియాతో పోల్చి చూస్తే తుర్కియేలో రెండు ఫలకాల మధ్య ఏర్పడిన ఒత్తిడి వల్ల రిక్టర్ స్కేలుపై 7.8 తీవ్రతతో భూకంపం కుదిపేసిందని, ఫలితంగా దేశమే కాస్త జరిగిందని ఇటలీకి చెందిన సెసిమాలజిస్ట్ ప్రొఫెసర్ కార్లో డొగ్లోని చెప్పారు. భూ పొరల్లో ఉన్న అనతోలియా ప్లేట్ వాయవ్య దిశగా ఉన్న అరేబికా ప్లేట్ వైపు జరగడంతో ఇలా దేశమే భౌగోళికంగా కదిలే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఒక టెక్టోనిక్ ప్లేట్ పశ్చిమ వైపు, మరో ప్లేట్ తూర్పు వైపు కదలడంతో భారీ భూకంపం సంభవించిందని ఆయన వివరించారు. వాలీబాల్ ఆట కోసం అడియామాన్‌కు వచ్చిన కాలేజీ అమ్మాయిలు, అబ్బాయిలు 39 మంది ప్రాణాలు కోల్పోయినట్టుగా భావిస్తున్నారు. ఫమగుస్తా కాలేజీకి చెందిన ఈ బృందం ఏడంతస్తులున్న ఒక హోటల్‌లో బస చేశారు.


**కాపాడడమూ కష్టమే..!**

భూకంపం శిథిలాల కింద ఉన్నవారిని గుర్తించి వారిని కాపాడడం అంత తేలికైన విషయం కాదు. సహాయ సిబ్బందితో పాటు బాధితులు కూడా సహకరించాలి. అందుకు ఈ ఫొటో నిదర్శనం. తుర్కియేలోని తీవ్ర విధ్వంసం జరిగిన హతేలో ఇంటి పైకప్పు మొత్తం మీద పడిపోవడంతో కాళ్లు కదల్చలేని స్థితిలో అబ్దుల్‌అలీమ్ అనే వ్యక్తి ఉన్నాడు. అంత పెద్ద శ్లాబుని తొలగించి అతనిని బయటకు తీసుకురావడం సహాయ సిబ్బందికి కష్టమైంది. అబ్దుల్‌ను కాపాడినా అతని భార్య, పిల్లలు ప్రాణాలు కోల్పోవడం విషాదం. శిథిలాల్లో చిక్కుకున్న వారిలో ఒక ప్రాణాన్ని కాపాడడానికి 10 లక్షల డాలర్లు ఖర్చు అవుతుందని తుర్కియే ప్రభుత్వం అంచనా వేస్తోంది.

### సిరియాలో సహాయానికి అంతర్యుద్ధమే అడ్డు

**అంతర్యుద్ధంతో** అతలాకుతలమవుతున్న సిరియాలో సంభవించిన భూకంపంలో సహాయ కార్యక్రమాలు సరిగా కనిపించడం లేదు. దేశంలోకి వెళ్లడానికి కేవలం రెబెల్స్ అధీనంలో ఒకే ఒక మార్గం తీసి ఉంది. సాయం అందించడం కోసం వచ్చిన అంతర్జాతీయ సంస్థలు సిరియాలో ఒక్కో ప్రాంతం ఒక్కొక్కరి అధీనంలో ఉండడంతో ముందుకు వెళ్లడానికి సవాలక్ష అనుమతులు తీసుకోవాల్సి వస్తోంది. కుర్దులు, సిరియన్ తిరుగుబాటుదారులు, జిహాదీ శక్తులు, తుర్కియే మిలటరీ మద్దతున్న రెబెల్స్, సిరియా ప్రభుత్వం ఇలా దేశం మొత్తం పలువురి అధీనంలో ఉండడం సహాయ కార్యక్రమాలకు ఆటంకంగా మారింది.

**భూకంపం సంభవించిన ప్రాంతాలు ఎవరి అధీనంలో?**



సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023

## మంత్రి ఉచిత చక్కెరకు మహిళ తిరస్కారం

**యశవంతపుర:** ఏదైనా ఉచితంగా ఇస్తామంటే ఎవరైనా ఎగబడతారు, పైగా తమకు ఇంకొంచెం ఎక్కువ ఇవ్వాలని బతిమాలతారు. కానీ బాగలకోట జిల్లా బీళగిలో మంత్రి మురుగేశ్ నిరాణి అనుచరులు ఉచితంగా పంచిన చక్కెరను ఒక మహిళ ఇంటి బయట పడేసింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మంత్రి మద్దతుదారులు బీళగిలో ఇంటింటికీ ఉచితంగా కొంత పంచదారను పంచారు. కార్యకర్తలు ప్యాకెట్లను ఆమె ఇంట్లోకి తీసుకెళ్లి ఇవ్వగా, వద్దని తిరస్కరించింది. లేదు, తీసుకోవాల్సిందేనని వాటిని ఇంట్లో పెట్టి వెళ్లిపోయారు. ఆమె ప్యాకెట్లను తీసి ఇంటి బయట పడేసింది. ఆమె నిజాయితీని చూసిన నెటిజన్లు అభినందించారు. ఈ వీడియోను యల్లప్ప హెగ్డే అనే సామాజిక కార్యకర్త సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## న్యూస్‌రీల్

### రేపు అమిత్ షా మంగళూరుకు రాక

**శివాజీనగర:** శాసనసభా ఎన్నికల్లో పట్టు కోసం బీజేపీ అగ్రనేతలు రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పదే పదే కన్నడనాడు యాత్రలు చేస్తున్నారు. తాజాగా అమిత్ షా రేపు శనివారం మంగళూరుకు వస్తున్నారు. పుత్తూరులో జరగనున్న క్యాంప్రో సంస్థ సువర్ణ మహోత్సవంలో పాల్గొంటారు. తరువాత తెంకిల వివేకానంద పాఠశాల మైదానంలో బీజేపీ సభలో పాల్గొంటారు. కాగా, ప్రధాని మోదీ 13న బెంగళూరు వచ్చి యలహంక వైమానిక స్థావరంలో జరిగే ఏరో ఇండియా–2023 ప్రదర్శనను ప్రారంభిస్తారు.

### కొడుకుతో కలిసి బావిలో దూకిన తల్లి!

**యశవంతపుర:** మహిళ బావిలో పడి అనుమానస్పద రీతిలో మృతి చెందిన ఘటన గదగ తాలూకా కళసాపుర గ్రామం సొప్పిహళ్లిలో బుధవారం జరిగింది. మృతురాలిని రుబీనా దావల్‌సాబ్ కణవి (27)గా గుర్తించారు. ఇంట్లోని వారందరూ పనికి వెళ్లిన సమయంలో ఆమె సమీపంలోని బావిలో శవమై కనిపించింది. మూడేళ్ల కొడుకు జావేద్ కూడా కనిపించలేదు, అతడి కోసం ఫైర్ సిబ్బంది బావిలో వెతుకుతున్నారు. రుబీనా కొడుకుతో కలిసి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. ఆమె శవాన్ని వెలికితీశారు. అత్తింటి వేధింపులే కారణమని ఆమె బంధువులు ఆరోపిస్తున్నారు. గదగ గ్రామాంతర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### 20 లక్షల విదేశీ కరెన్సీ స్వాధీనం




**దొడ్డబళ్లాపురం:** కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో విదేశానికి బయలుదేరిన ఇద్దరు ప్రయాణికుల నుంచి కస్టమ్స్ అధికారులు 20 లక్షల విలువైన విదేశీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నుంచి అబుదాబికి బయలుదేరిన వీరిని తనిఖీ చేయగా 20 లక్షల విలువైన విదేశీ కరెన్సీ బయటపడింది. కరెన్సీని సీజ్ చేసిన కస్టమ్స్ అధికారులు ప్రయాణికులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

**కేఐఏలో పట్టుబడ్డ బంగారు**

లోదుస్తుల్లో దాచి అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. బహ్రెయిన్ నుంచి గల్ఫ్ విమానం ద్వారా కెంపేగౌడ విమానాశ్రయానికి వచ్చిన తమిళనాడుకు చెందిన ప్రయాణికుడు తన ప్యాంట్, లోదుస్తుల్లో పేస్ట్ రూపంలో బంగారాన్ని దాచి తరలిస్తూ పట్టుబడ్డాడు. ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని బంగారాన్ని సీజ్ చేసారు.

### కేంద్రానికి పెంపు ప్రతిపాదనలు

**శివాజీనగర:** ఎస్సీ, ఎస్టీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రిజర్వేషన్ల శాతాన్ని పెంచడం తెలిసిందే. వాటి ఆమోదం కోసం కేంద్రానికి పంపాలని ప్రభుత్వం తీర్మానించింది. అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై సీఎం వివరణ ఇవ్వనున్నారు.



# పాపం.. మూగజీవులు





మనుషుల స్వార్థానికి బందీనయ్యా

**బనశంకరి:** ముద్దొచ్చే చిలుకలను, శునకాలను ఇళ్లలో పెంచుకోవాలని అందరూ అనుకుంటారు. ఇంటికి తీసుకువచ్చి ఎంతో మురిపెంగా పోషిస్తారు. కానీ వాటిని అమ్మే షాపుల్లో మాత్రం మూగజీవాలకు నరకం కనిపిస్తుంది. బెంగళూరు నగరంలో పెంపుడు జంతువులు, పక్షులు విక్రయం జోరుగా సాగుతోంది. అనధికారికంగా వందలాది దుకాణాలు నిర్వహిస్తున్నట్లు వెలుగుచూసింది. ఈ పెట్ షాపుల్లో పెంపుడు జంతువులు దుర్భరస్థితిలో కనిపిస్తాయి. వాటిని చూస్తే జాలి గుండె ఉన్న ఎవరైనా అయ్యో అని నిట్టూరుస్తారు. ఇరుకు పంజరాల్లో, గాలి, నీరు, తిండి లేక మగ్గిపోయి ఉంటాయి. ఈ కిరాతకంపై జంతు పక్షి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### దుర్భరస్థితిలో పెంపుడు పక్షులు, జంతువులు

- ఐటీ సిటీలో నరక కూపాలుగా పెట్ షాపులు

**తనిఖీల్లో చేదు నిజాల వెల్లడి**

కర్ణాటక ప్రాణి కళ్యాణ మండలి, నగర పోలీసులు, బీబీఎంపీ ప్రాణి కళ్యాణ మండలి కార్యకర్తలు సంయుక్తంగా పెట్ షాపుల్లో ఇటీవల తనిఖీలు నిర్వహించారు. పెంపుడు జంతువులు, పక్షులపై దౌర్జన్య నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘించి విక్రయాలు, వాటి సంతానోత్పత్తి చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. పెంపుడు శునకాల విక్రయం, సంతానోత్పత్తి కేంద్రాలు నిర్వహించే 50 మందికి నోటీసులు జారీచేశారు. 25 దుకాణాలను మూసివేశామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రమాదకర స్థితిలో ఉన్న 16 జాతుల పెంపుడు జంతువులు, పక్షులను రక్షించి రక్షణ గృహంలో ఉంచారు.

**వాటికీ జీవితం ఉంది**

వాటికి కూడా జీవితం ఉందని ఎవరూ పరిగణించడం లేదని అఖిల కర్ణాటక ప్రాణిదయా సంఘం కోరమంగల శాఖ కార్యదర్శి సునీల్ తెలిపారు. పెంపుడు జంతువులు, పక్షులను ఒక సరుకుగా విక్రయిస్తూ హింసిస్తున్నారని, నిబంధనల్ని పాటించని పెంపుడు జంతు విక్రయదారులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

### ఇరుకిరుకు స్థలాల్లో, తిండీ తిప్పలు లేకుండా

- డబ్బు సంపాదనే ధ్యేయంగా ఇరుకిరుకు స్థలంలో పెంపుడు జంతువులు, పక్షులను కుక్కి అమ్ముతుంటారు. వాటికి సుస్తీ చేసినా చికిత్స చేయించరు.
- పంజరాలను ప్రతిరోజు శుభ్రం చేయాలనే నిబంధన పాటించడం లేదు. పంజరాలు, గూళ్లు అపరిశుభ్రంగా ఉంటూ స్థానికులకు కూడా ఇబ్బంది కలిగిస్తుంటాయి.
- తల్లి శునకం నుంచి అప్పుడే పుట్టిన కూనలను వేరు చేసి షాపులో ఉంచడం, అమ్మేయడం మామూలు విషయమైంది.
- ఆఫ్రికన్ చిలుకలు, లవ్ బర్డ్స్, పిచ్చుకలు, టర్కీ కోళ్లు, కాక్‌టైల్ చిలుకలు, పావురాలు, బాతులు, కోళ్లు, కుందేళ్లు, ఇంకా దేశ విదేశీ జాతులకు చెందిన పెంపుడు శునకాలు, పిల్లులను పలు పెట్ దుకాణాల్లో విక్రయిస్తున్నారు.
- ప్రమాదకర స్థలాల్లో పెట్టి వాటి ప్రాణాలకు ముప్పు తెస్తున్నారు. పెంపుడు జంతువులను హింసించి సంతానోత్పత్తి చేపట్టి ఆదాయం గడిస్తున్నారు.



స్వేచ్ఛగా ఎగిరే విహంగాలు బోనుల్లో బందీలయ్యాయి

# రియల్టర్ ముఠా ఘాతుకం

- ఒంటరి మహిళ దారుణ హత్య
- చామరాజనగర జిల్లాలో ఘోరం
- అందరూ బెంగళూరు హుళిమావు వాసులు



**మైసూరు:** మహిళను దారుణంగా హత్య చేసిన కేసులో ఆరుమందిని కొళ్లెగాల గ్రామీణ పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు బెంగళూరులోని హుళిమావుకు చెందిన రియల్టర్ హరీష్ (37), అతని స్నేహితులు రాకేష్ (29), మణికంఠ (26), నితిన్ (31), వెంకటేష్ (27) మూర్తి (29). హుళిమావుకే చెందిన శ్వేత హతురాలు.

**పెళ్లి చేసుకోమన్నందుకు**

వివరాలు.. శ్వేత భర్తతో విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటోంది. అప్పటికే పెళ్లయి, ముగ్గురు పిల్లలు ఉన్న హరీష్ శ్వేతతో అక్రమ సంబంధం ఏర్పరచుకున్నాడు. తనను పెళ్లి చేసుకోమని కోరగా హరీష్ నిరాకరించాడు. దీంతో ఆమె అతని ఇంటికి వచ్చి గొడవ పడేది. దాంతో ఎలాగైనా శ్వేతను వదిలించుకోవాలి అనుకున్న హరీష్ ఫిబ్రవరి 4వ తేదీన చామరాజనగర జిల్లా కొళ్లెగాల తాలూకాలోని చిక్కళ్లూరు దేవాలయానికి వెళ్దామని అని శ్వేతను నమ్మించి కారులో తీసుకెళ్లాడు. వెనుకే అతని స్నేహితులు బైక్‌లపై బయల్దేరారు. కొళ్లేగాల వద్ద అందరూ ఆమెను గొంతు పిసికి చంపి ఒక పొలం వద్ద చెట్టుకు ఉరివేసి వెళ్లిపోయారు. శవాన్ని పొలం రైతు చూసి పోలీసులకు ఫిర్యాదు చేయగా కొళ్లెగాల పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. శ్వేత బ్యాగులో ఉన్న మొబైల్ కాల్ డేటాను పరిశీలించగా వివరాలు బయటకు వచ్చాయి. నిందితులను అరెస్టు చేశారు.

**భార్యా హంతకునికి జీవితఖైదు**

భార్య పైన అనుమానం పెంచుకున్న భర్త ఆమెను హత్య చేయగా, ఈ కేసులో 5వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అతకికి జీవిత ఖైదుని విధించింది. మైసూరు జిల్లాలోని హెచ్.డి.కోటె తాలూకాలోని మటిగెరివాసి సిద్దరాజు దోషి. వివరాలు.. 2012లో సహన అనే యువతిని పెళ్లి చేసుకున్న సిద్దరాజు ఆమెను అనుమానిస్తూ గొడవ పడేవాడు. 2018 ఆగస్టు 5వ తేదీన జరిగిన ఘర్షణలో సిద్దరాజు కొడవలితో సహనను నరికి చంపాడు. ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిద్దరాజు, అతని సోదరుడు సురేష్, వదిన దేవమ్మపైన కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కోర్టులో విచారణ సాగుతూ వచ్చింది. చివరకు నేరం రుజువు కావడంతో జడ్జి మల్లిఖార్జున... సిద్దరాజుకు జీవితఖైదు, రూ. 17 వేల జరిమానాను విధిస్తూ తీర్పు చెప్పారు. సాక్ష్యాలు లేనందున మిగతా ఇద్దరిని విముక్తుల్ని చేశారు.

# గుండెపోటుతో పీయూసీ విద్యార్థిని మృతి



విద్యార్థిని సంగీత (ఫైల్)

**బనశంకరి:** ఇటీవల కాలంలో తరచూ చిన్నారులు గుండెపోటుతో ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా కబడ్డీ ఆడుతున్న ఓ చిన్నారి గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఆనేకల్ తాలూకా అత్తిబెలె ప్రైవేటు కాలేజీలో చోటుచేసుకుంది. ఆనేకల్ తాలూకా బళగారనహళ్లి నివాసి సంగీతా (17) అత్తిబెలె సెయింట్ ఫిలోమినా కాలేజీలో పీయూసీ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. గురువారం కాలేజీ మైదానంలో కబడ్డీ ఆడుతుండగా సంగీతా ఆకస్మాత్తుగా కిందపడి పోవడంతో హుటాహుటిన నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించేలోపు కన్నుమూసింది.

# సీబీఐ వలలో పురాతత్వ అధికారులు

- బళ్లారిలో ముగ్గురు అరెస్టు



పట్టుబడిన పురాతత్వ శాఖ అధికారులు

**సాక్షి బళ్లారి:** సీబీఐ అధికారుల వలలో ముగ్గురు పురాతత్వ శాఖ అధికారులు పడ్డారు. నగరంలోని పురాతత్వ శాఖ కార్యాలయంలో పని చేస్తున్న ప్రశాంత్‌రెడ్డి, యోగీష్, మహమ్మద్ గౌస్ అనే ముగ్గురు పురాతత్వ శాఖ అధికారులను సీబీఐ అధికారులు పట్టుకున్నారు. వివరాలు.. నగరంలోని ఇన్‌ఫ్యాంట్రీ రోడ్డులో ఇంటి నిర్మాణం కోసం ఒక వ్యక్తి దరఖాస్తు చేశారు. ఈ ఇల్లు ప్రాచీన కట్టడాలకు దగ్గరగా ఉన్నందున ఆ శాఖ అనుమతి అవసరమైంది. రూ.1.50 లక్షల లంచం ఇవ్వాలని పై ముగ్గురూ డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని సామాజిక కార్యకర్త రాజశేఖర్ ములాలి సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి నగరంలోని ఓ హోటల్‌లో బాధితుని నుంచి లంచం తీసుకుంటున్న పురాతత్వ శాఖ అధికారులను సీబీఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నూతన అండర్‌పాస్ షురూ

- హెచ్‌ఏఎల్ మెయిన్ రోడ్డు జంక్షన్‌లో



**బనశంకరి:** బెంగళూరులో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు 11 ఫ్లై ఓవర్ల నిర్మాణానికి ఆమోదం తెలిపామని ముఖ్యమంత్రి బసవరాజబొమ్మై తెలిపారు. నగరంలోని హెచ్‌ఏఎల్ మెయిన్‌రోడ్డు సురంజన్ దాస్‌రోడ్డు జంక్షన్‌లో నిర్మించిన అండర్‌పాస్ ను గురువారం ప్రారంభించారు. శరవేగంగా విస్తరిస్తున్న బెంగళూరులో నిత్యం 5 వేల కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయన్నారు. కానీ రోడ్లు మాత్రం అవే ఉన్నాయని, అభివృద్ధి చేసేందుకు వైట్‌ఫీల్డ్ నుంచి ఎంజీ రోడ్డు వరకు వాహనాల సజావుగా ట్రాఫిక్ సాగేలా ఈ అండర్‌పాస్‌ను నిర్మించామని తెలిపారు.

మెట్రో రైలు మూడోస్టేజ్ పనులు జరుగుతున్నాయని, రాజకాలువలకు రూ 2 వేల కోట్లు నిధులు కేటాయించామని తెలిపారు. ప్రముఖ చెరువులకు క్రస్ట్ గేట్లను అమర్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు బైరతి బసవరాజు, మురుగేశ్‌నిరాణి, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్, పాలనాధికారి రాకేశ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**కొత్తగా ఐదు ట్రాఫిక్ పీఎస్‌లు**

**కృష్ణరాజపురం:** బెంగళూరు నగరంలో మరో ఐదు కొత్త ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయడంతో పాటు ఒక డీసీపీ, అదనపు సిబ్బందిని నియమిస్తామని సీఎం బొమ్మై తెలిపారు. అండర్ పాస్ కార్యక్రమంలో మాట్లాడుతూ ట్రాఫిక్ పర్యవేక్షణకు కొత్త ట్రాఫిక్ పీఎస్‌లు అవసరమని అన్నారు.

### మేకలను చంపి, దంపతులపై దాడి

- ఇంట్లోకి దూరిన చిరుత పట్టివేత



**మండ్య:** మండ్య జిల్లాలోని కేఆర్ పేటె తాలూకాలోని మూడనహళ్లి గ్రామం వద్ద ఒక తోటలోని ఇంట్లోకి చిరుతపులి చొరబడింది. నింగే గౌడ అనే వ్యక్తికి చెందిన తోటలో ఉన్న ఇంటి ఆవరణలోకి బుధవారం రాత్రి చిరుత దూరింది. ఈ సమయంలో నింగేగౌడ, భార్య ఇంట్లో ఉన్నారు. కొట్టంలో ఉన్న మేకల పైన దాడి చేసింది, ఆరు మేకలను చంపి కొన్నింటిని ఆరగించింది. దంపతులు చూసి కేకలు వేయడంతో చిరుత దాడి చేయడానికి ప్రయత్నం చేసింది, వెంటనే వారు ఎలాగో తప్పించుకుని బయటికి పరుగులు తీశారు. చిరుత ఇంట్లో ఉండగా బయటికి వచ్చిన దంపతులు తలుపులేసి తాళం వేశారు. చిరుత దాడిలో నింగెగౌడకు వీపు, నడుముకు గాయాలు అయ్యాయి. గ్రామస్తులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి ఇంట్లో నక్కిన చిరుత పులికి తుపాకీ ద్వారా మత్తు ఇంజెక్షన్ కొట్టి బంధించి తరలించారు.



### చిలుకల పట్టివేత

గురువారం బెంగళూరు రూరల్‌లో కుణిగల్ మార్గంలో అక్రమంగా తరలిస్తున్న 11 రామ చిలుకలను అటవీ సిబ్బంది గుర్తించారు. రాకీ, రఘు అనే ఇద్దరు బుల్లెట్ బైక్‌పై అట్టపెట్టెలో చిలుకలను తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. అడవుల్లో పట్టుకుని అమ్మేందుకు తీసుకెళ్తున్నట్లు నిందితులు తెలిపారు

# ప్రైవేటు భూమి అక్రమ రిజిస్ట్రేషన్

- ఇద్దరు అధికారులతో కలిపి 11 మందిపై ఎఫ్ఐఆర్

**దొడ్డబళ్లాపురం:** ప్రైవేటు భూమిని అక్రమంగా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసిన ఘటనపై ఇద్దరు ప్రభుత్వ అధికారులతో పాటు 11 మందిపై కేసు నమోదు చేసిన సంఘటన దొడ్డ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దొడ్డ తాలూకా వడ్డరహళ్లికి చెందిన ప్రస్తుతం బెంగళూరులో నివసిస్తున్న దేవరాజ్ అనే వ్యక్తికి వడ్డరహళ్లి గ్రామంలో 39 కుంటల భూమి ఉంది. సదరు భూమిని తమకు విక్రయించాలని చాలా రోజులుగా సిమెంట్ కంపెనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు ఒత్తిడి చేస్తున్నారు. వీరితోపాటు బ్రోకర్లు శరత్, భాస్కర్ అనే వ్యక్తులు కూడా డిమాండు చేశారు. అయితే దేవరాజు ఒప్పుకోలేదు. దీంతో ఎలాగయినా భూమిని సిమెంటు ఫ్యాక్టరీకి విక్రయించాలని నిందితులు బెంగళూరు శ్రీరాంపురలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో నకిలీ వ్యక్తిని భూమికి యజమానిగా డాక్యుమెంట్లు తయారు చేసి జీపీఏ చేయించారు. అనంతరం గత ఏడాది నవంబర్‌లో సిమెంట్ కంపెనీకి చెందిన ఇద్దరికి భూమి రిజిస్ట్రేషన్ చేయించారు. దొడ్డబళ్లాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ సమయంలో గౌరిశంకర్, మంజునాథ్, రవి అనే ముగ్గురు వ్యక్తులు సాక్షులుగా సంతకం చేసారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌కు విలేజ్ అకౌంటెంట్ కిరణ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీదేవమ్మ సహకరించారు. ఈ కేసులో మొత్తం 11 మందిపై దొడ్డ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది.

# పెళ్లికి వెళ్లి వస్తూ మృత్యుఒడికి

- కారు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



నుజ్జునుజ్జయిన కారు

**యశవంతపుర:** లారీ, ట్రాక్టర్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన దావణగెరె తాలూకా రామగొండనహళ్లి వద్ద బుధవారం రాత్రి జరిగింది. కారులో ప్రయాణిస్తున్న బిల్లహళ్లి మంజునాథ్(24), పాండోమట్టి అమృత్ (23)లు మృతులు. కారులో దావణగెరెలో పెళ్లికి వెళ్లి తిరిగి చెన్నగిరి తాలూకా పాండోమట్టికి వెళ్తున్నారు. ఎదురుగా వచ్చిన ట్రాక్టర్‌ను, తరువాత లారీని కారు ఢీకొంది. కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఇద్దరు చనిపోగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మాయకొండ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. త్వరలో పెళ్లి కావలసిన యువకులు మృతి చెందటంతో వారి కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

**క్యాంటర్ ప్రమాదం.. ఒకరి మృతి**

విజయపుర జిల్లా ఇండి పట్టణంలో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన క్యాంటర్ స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపుతప్పి సర్కిల్‌ను ఢీకొంది. డ్రైవర్‌కు బలమైన గాయాలయ్యాయి. డ్రైవర్ పక్కన కూర్చున్న మలకు మానె (36) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయింది.

# 30 ఐటీఐలకు రూ.927కోట్లు

- ఒక్కొక్కటి రూ.27 కోట్లతో అభివృద్ధి
- మంత్రిమండలి భేటీలో నిర్ణయాలు



**శివాజీనగర:** రాష్ట్రంలో ప్రభుత్వ ఐటీఐలను టాటా సంస్థ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. మొత్తం 155 ఐటీఐలు ఉండగా వాటిలో 30 ఐటీఐలను రూ.927 కోట్ల ఖర్చుతో అభివృద్ధిపరిచేందుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించింది. గురువారం విధానసౌధలో మంత్రి మండలి సమావేశం జరిగింది. మంత్రి జే.సీ.మాదుస్వామి ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. ప్రతి ఐటీఐకి రూ. 27 కోట్లు చొప్పున 30 ఐటీఐలను టాటా టెక్నాలజీ సంస్థ రూ.816 కోట్లు, ప్రభుత్వం రూ.111 కోట్లను వెచ్చించి ఉన్నతీకరిస్తాయని తెలిపారు.

**అభివృద్ధి పనులకు నిధులు**

అలాగే హావేరి జిల్లాలోని హిరెకెరూరు సర్వజ్ఞ ప్రాధికార ద్వారా హావేరి, హిరేకెరూరు, మాసూరు, అబలూరుతో పాటు వివిధ గ్రామాల్లో రూ. 25 కోట్లతో మౌలిక సదుపాయాలను కల్పిస్తారు. చామరాజనగర జిల్లాలో 166 గ్రామాలకు జలజీవన్ మిషన్ పథకం కింద తాగునీటి వసతిని అందజేస్తారు. హావేరి జిల్లా శిగ్గాంవ్ వద్ద కల్యాణ గ్రామంలో ప్రభుత్వ పరికరాలు, ట్రైనింగ్ కేంద్రానికి రూ.73 కోట్లు, హావేరి జిల్లా యల్లగోడు గ్రామంలో నైపుణ్య శిక్షణ కేంద్రం, బాలుర రెసిడెన్షియల్ స్కూల్‌కి రూ.35.35 కోట్లు కేటాయింపు చేశారు. కల్యాణ కర్ణాటక రవాణా కింద కల్బుర్గిలో బహుళ అంతస్తుల వాణిజ్య కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.26 కోట్లు మంజూరు చేశారు. పలు జిల్లాల్లో మంచినీరు, కట్టడాలకు నిధులను కేటాయించినట్లు తెలిపారు.

**నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు**

బెంగళూరు విధానసౌధలో నేడు శుక్రవారం నుంచి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ తప్పక హాజరు కావాలని విధాన సభాపతి విశ్వేశ్వర హెగ్డే కాగేరి గురువారం విన్నవించారు. ఈ ఐదేళ్లలో విధానసభా 15వ, ఆఖరి సమావేశం. ప్రస్తుత ఎమ్మెల్యేలు ఐదు సంవత్సరాల కాలావధిని విజయవంతంగా ముగించారు. ఆఖరి సమావేశాలని నిర్లక్ష్యం చేయకుండా, తప్పక పాల్గొనాలని కోరారు. ప్రజాస్వామ్యంలో అసెంబ్లీ దేవాలయమని, సభ్యులు బాధ్యతాయుతంగా నడుచుకొని సమావేశాల్లో పాల్గొనాలని తెలిపారు. ఈ సమావేశాలు ఫిబ్రవరి 24 వరకు జరుగుతాయి. ఫిబ్రవరి 17న సీఎం బసవరాజ బొమ్మై బడ్జెట్‌ను సమర్పిస్తారు. ఫిబ్రవరి 20 నుంచి 24 వరకు బడ్జెట్‌పై చర్చ జరుగుతుంది.

## క్లుప్తంగా

### అదనపు గదులు ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి

గంగావతి: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అదనపు గదులను గురువారం ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1.05 కోట్ల నిధులతో జూనియర్ కళాశాల విద్యార్థులకు అదనపు గదుల నిర్మాణం చేపట్టామన్నారు. నియోజకవర్గంలోని కళాశాలలు, పాఠశాలల్లో గదుల కొరత లేకుండా చేశామన్నారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు, అధ్యాపక వర్గం పాల్గొన్నారు.

### విద్యార్థుల పర్యటనకు శ్రీకారం

రాయచూరు రూరల్: జిల్లాలో పాఠశాల విద్యార్థుల పుణ్య క్షేత్రాలు, చారిత్రక స్థలాల పర్యటనకు డీడీపీఐ వృషబేంద్రయ్య శ్రీకారం చుట్టారు. గురువారం మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో ఆయన పర్యటనను పచ్చజెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు పర్యటనలో చారిత్రక స్థలాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భద్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. బీఈఓ చంద్రశేఖర్, పర్యాటక శాఖాధికారి మంజునాథ్ తదితరులున్నారు.

### మేధావులపై కేసు కొట్టివేత

మైసూరు: హిందూ ధర్మంపై, శ్రీరాముని గురించి కించపరిచేలా మాట్లాడిన మేధావులు ప్రొఫెసర్ కేఎస్ భగవాన్, ప్రొఫెసర్ అరవింద్ మాలగత్తి, మహేష్ చంద్రగురుపై నమోదైన కేసును మైసూరు నాలుగో అడిషనల్ సివిల్ కోర్టు జడ్జి కొట్టివేశారు. 2015 ఫిబ్రవరిలో మైసూరు మానస గంగోత్రిలో ఉన్న రాణి బహదూర్ సమావేశ హాల్లో జరిగిన ఒక కార్యక్రమంలో వీరందరూ హిందూ మతంపైన, శ్రీరాముని పైన కించపరిచేలా మాట్లాడారని హిందూ పరిషత్ నాయకుడు మనోజ్ కుమార్ జయలక్ష్మి పురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు వేశారు. విచారణలో సరైన సాక్ష్యాధారాలు సమర్పించలేకపోయారు. దీంతో న్యాయమూర్తి కేసును కొట్టివేస్తున్నట్లు తెలిపారు.

### బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

రాయచూరు రూరల్: దేవదాసి మహిళలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని దేవదాసి మహిళా విమోచన వేదిక డిమాండ్ చేసింది. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన సంచాలకురాలు పద్మ మాట్లాడారు. నెలకు రూ.5 వేల పారితోషికం, నిరుద్యోగ యువతకు నెలకు రూ.10 వేలు, కార్మిక వర్గాలకు రూ.3 వేలు అందించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

### ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

కంప్లి: ఈనెల 11, 12 తేదీల్లో జరిగే కంప్లి ఉత్సవాల్లో మున్సిపల్ యంత్రాంగం, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ ముఖ్యాధికారి డాక్టర్ శివలింగప్ప సూచించారు. ఆయన గురువారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఇళ్లు, దుకాణాలను తోరణాలతో సింగారించాలని, ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. సమావేశంలో అధ్యక్షురాలు శాంతలా, ఉపాధ్యక్షురాలు నిర్మల, అకౌంటెంట్ రమేష్ బళంకర్, కౌన్సిలర్లు ఎస్ఎం నాగరాజ్, వీఎల్ బాబు, వీరాంజనేయులు, ప్రముఖులు హేమయ్యస్వామి, కల్లుడి విశ్వనాథ్, షణ్ముఖప్ప చిత్రగార్, సత్యనారాయణ బాబు, కారేకల్ మనోహర్, బీకే.విరుపాక్షి పాల్గొన్నారు.

### అన్నదాత ఆత్మహత్య

మైసూరు: అప్పుల బాధను తట్టుకోలేక అన్నదాత ఉరి వేసుకొన్న సంఘటన మైసూరు జిల్లాలోని హుణసూరు తాలూకాలోని మారగౌడనహళ్ళి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు... రైతు ఎం.ఎస్.లింగరాజు (45)కు మూడున్నర ఎకరాల పొలం ఉంది. ఇందులో పంటల సాగు కోసం కావేరి గ్రామీణ బ్యాంకులో రూ. 3.25 లక్షలు, దొడ్డ కొప్పలు కేజీబీ బ్యాంకులో రూ. 2.50 లక్షలు, బరోడా బ్యాంకులో రూ. 1 లక్ష అప్పులు చేశాడు. పంటలు సరిగా పండక అప్పులు తీర్చే మార్గం లేక కుంగిపోయాడు. ఇంటి వద్ద ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

### ఈతకు వెళ్లి ఇద్దరు జలసమాధి





మృతి చెందిన వ్యక్తి, నబీరసూల్(ఫైల్)

రాయచూరు రూరల్: ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి నీటి పాలైన ఘటన లింగసూగూరు తాలూకాలో చోటు చేసుకుంది. బుధవారం మధ్యాహ్నం నారాయణపుర కుడి కాలువలో స్నానానికి వెళ్లిన హిరేజావూరుకు చెందిన ఖలీల్(40) అనే వ్యక్తి జలప్రవాహంలో కొట్టుకుపోయాడు. అతని మృతదేహం కోసం గాలించగా దేవదుర్గ తాలూకా సోమనమరడి గేట్ వద్ద లభించింది.

సిరుగుప్ప: తెక్కలకోటె పోలీస్ స్టేషన్ పరిధిలోని యరకల్ సమీపంలో తుంగభద్ర నది అరగోలు ఘాట్ వద్ద ఈతకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. బళ్లారి నగర శివార్లలోని ఆంధ్రాళ్‌కు చెందిన డీ.హీరేహాళ్ భాషా, మైమూన్ దంపతులకు జన్మించిన నబీర సూల్(18) అనే యువకుడు గడ్డె ఖాదర్‌బాషా ఉరుసు జాతరకు వచ్చి గురువారం సాయంత్రం నదిలో ఈతకు వెళ్లి మృతి చెందాడు. గ్రామస్తులు గమనించి ఆ యువకుడి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం కోసం సిరుగుప్ప ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈఘటనపై తెక్కలకోటె పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

# పై వంతెనల నిర్మాణానికి మోక్షమెన్నడో?

- రైల్వే గేట్ల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్
- విద్యార్థులు, రోగులకు తీవ్ర ఇబ్బందులు



రైల్వే గేట్ వేయడంతో సుధా క్రాస్ గేట్ వద్ద ఓ వైపున పెద్ద సంఖ్యలో నిలిచిపోయిన వాహనాలు

సాక్షి బళ్లారి: నగరంలోని సుధా క్రాస్, రేడియో పార్క్ సెకండ్ గేట్ వద్ద రైళ్లు వచ్చినప్పుడల్లా గేట్లు వేయడం వల్ల ఎక్కువ సేపు వాహనాలు ఎక్కడివి అక్కడే ఆగిపోతున్నాయి. పైవంతెన(ఫ్లై ఓవర్)ల నిర్మాణం ఏళ్ల తరబడి పూర్తి కాకపోవడంతో ట్రాఫిక్ సమస్యలతో నగర వాసులు నరకయాతనను అనుభవిస్తున్నారు. నగర వాసులకే కాకుండా జిల్లాకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే, పోయే వారు కూడా ఈ రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ జామ్‌తో సతమతం కావాల్సిన పరిస్థితి నెలకొంటోంది. సుధాక్రాస్ రైల్వే గేట్ నుంచి కుడితిని, బీటీపీఎస్, ఏసీసీ సిమెంట్, తోరణగల్లు జిందాల్ స్టీల్ ప్లాంట్లకు, సండూరు, కూడ్లిగి, కొట్టూరు, హరపనహళ్లి, హొసపేటె, కంప్లి, గంగావతిలకు వాహనాల్లో ఈ రోడ్డు మార్గాన్నే వెళ్తుంటారు. రైల్వే గేటు వేసినప్పుడు వాహనాలు ఎక్కడివక్కడ ఆగిపోవడం వల్ల ఎక్కడికీ కదలలేక చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

**సుధాక్రాస్ గేట్‌లో వాహన రద్దీ విపరీతం**

వీఎస్కేయూ, టీబీ ఆస్పత్రి, ట్రామాకేర్, అల్లీపురం మహాదేవతాత మఠం, బెస్ట్ స్కూల్, బీఐటీఎం కాలేజ్, తిలక్‌నగర్, కంటోన్మెంట్ తదితర ఎన్నో ప్రముఖ జనసంచారం కలిగిన ప్రాంతాలకు ఈ గేట్ గుండా విపరీతమైన వాహన రద్దీ ఉంటుంది. ముఖ్యంగా దాదాపు ఐదు వేల మందికి పైగా విద్యార్థులు నిత్యం ఈ రోడ్డు గుండా తమ కళాశాలలు, పాఠశాలలకు వెళ్తుంటారు. వీటికి తోడు భారీ వాహనాలు కూడా ఈరోడ్డు గుండా వెళ్తుంటాయి. సుధాక్రాస్ గేట్ వద్ద పైవంతెన నిర్మాణం ఇంతవరకు చేపట్టకపోగా, రేడియోపార్క్ గేట్ వద్ద చేపట్టిన పైవంతెన నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో ప్యాసింజర్, గూడ్స్ రైళ్లు వచ్చినప్పుడల్లా వాహనాలు ఎక్కడివక్కడ పెద్ద సంఖ్యలో ఆగిపోతుంటాయి. ఏళ్ల తరబడి పైవంతెనల నిర్మాణం చేపడుతామంటున్న రాజకీయ నాయకుల హామీలు నెరవేరడం లేదు. ఇకనైనా పెండింగ్‌లోని రైల్వే పైవంతెనల నిర్మాణాలను చేపట్టి పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## కుమార వ్యాఖ్యలపై నిరసన



బస్టాండ్ సర్కిల్‌లో ధర్నా చేస్తున్న సమాజ ప్రజలు

గంగావతి: బ్రాహ్మణ సమాజం వారిపై అవహేళనకర వ్యాఖ్యలు చేసిన మాజీ సీఎం కుమారస్వామి వైఖరిపై బస్టాండ్ సర్కిల్‌లో ఆ సమాజం వారు ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. సమాజ ప్రముఖులు విష్ణుతీర్థ మాట్లాడుతూ సీఎం పదవి విషయంలో బ్రాహ్మణులపై కుమారస్వామి విమర్శలు సరికాదన్నారు. ప్రజా ప్రభుత్వంలో రాజ్యాంగం ప్రకారం ఎవరైనా ఉన్నత పదవులకు అర్హులేనన్నారు. అలాంటిది కుమారస్వామి కేవలం బ్రాహ్మణ సమాజాన్నే విమర్శించడం ఆయన స్థాయికి తగదన్నారు. కౌన్సిలర్ వాసుదేవ నవలి, సమాజ ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## వసతిగృహ నిర్మాణానికి భూమిపూజ



పాల్గొన్న ఎమ్మెల్యే రఘుమూర్తి తదితరులు

చెళ్లకెరె రూరల్: నగరంలోని పావగడ రోడ్డులోని సాయిబాబా మందిరం ఆవరణలో రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించే వసతిగృహ నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే టి.రఘుమూర్తి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాయిబాబా అనుగ్రహంతో తాలూకా ప్రజలు ప్రశాంతంగా ఉన్నారన్నారు. ఇక్కడికి వచ్చే భక్తులకు బాబా ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయన్నారు. కార్యక్రమంలో నరహరేశ్వర దేవస్థానం వై.రాజారాం శాస్త్రి, వెంకటసాయి సేవా ట్రస్ట్ అధ్యక్షులు బీసీ.సంజీవమూర్తి, డీసీ వెంకటేష్ మూర్తి, మాకం శ్రీనివాసులు, హూవిన జగదీశ్, బాబా భక్తులు పాల్గొన్నారు.

## బోనులో చిక్కిన చిరుత

మైసూరు: జిల్లాలోని హుణసూరు తాలూకాలో అనేక గ్రామాల ప్రజలకు నిద్రలేకుండా చేస్తున్న చిరుతపులుల్లో ఒక్కొక్కటే బోనులో పడుతున్నాయి. తాలుకాలోని హరళహళ్లి గ్రామం వద్ద గురువారం బోనులో చిరుత చిక్కింది. ఈ చిరుత ఇప్పటికి మూడు మేక పిల్లలు, రెండు గొర్రెలను చంపింది. రైతు పుట్టస్వామి పొలంలో ఏర్పాటుచేసిన బోనులో చిరుత చిక్కింది. గ్రామస్తులు అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి చిరుతను తరలించారు.

## సునీల్‌కు కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న బలిజ సంఘం నేతలు

బళ్లారిటౌన్: బలిజ సమాజ నాయకుడు సునీల్ రావూర్‌కు కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని బలిజ సంఘం నేతలు డిమాండ్ చేశారు. గురువారం పత్రికా భవనంలో విలేకరులతో నేతలు, మాజీ ఎమ్మెల్సీ నిరంజన్ నాయుడు, తిప్పేస్వామి, ఉదయకుమార్, ప్రేమ్‌బాబు, కాంద్ర సతీష్, శ్రీనివాస్, రంగస్వామి తదితరులు మాట్లాడారు. సునీల్ కాంగ్రెస్ పార్టీలో చాలా కాలంగా ప్రామాణిక కార్యకర్తగా సేవలందిస్తున్నారన్నారు. నగరంలో 28 వేల మంది తమ సమాజం ఓటర్లు ఉండగా, రాష్ట్రంలో కూడా 45 లక్షల మంది ఓటర్లు ఉన్నారన్నారు. సునీల్‌కు టికెట్ కేటాయించేలా చాలా మంది పార్టీ నేతల ఆశీర్వాదం ఉందని, ఇప్పటికే ఢిల్లీకి చేరిన జాబితాలోని ముగ్గురిలో సునీల్ పేరు కూడా ఉన్నందున ఆయనకే టికెట్ ఖరారు చేయాలని ఒత్తిడి చేశారు.

## సంబరంగా ఒడి నింపే వేడుక



గాలి లక్ష్మీఅరుణకు ఒడి నింపుతున్న మహిళలు



పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు

బళ్లారి అర్బన్: బసవేశ్వరనగర్ సంగమేశ్వర దేవస్థానంలో గురువారం ఏర్పాటు చేసిన ఒడి నింపే కార్యక్రమాన్ని కేఆర్‌పీపీ సిటీ అభ్యర్థి గాలి లక్ష్మీఅరుణ ప్రారంభించారు. తాము అధికారంలోకి వస్తే ఇళ్లు లేని పేదలందరికీ ఇంటి పట్టాలను మంజూరు చేస్తామన్నారు. జనార్దన్‌రెడ్డి కలల సాకారానికి ప్రతి ఒక్కరు ఆశీర్వదించి వచ్చే ఎన్నికల్లో తమను గెలిపించాలని కోరారు. అనంతరం వేదికపై గాలి లక్ష్మీఅరుణకు ఒడి బియ్యం నింపిన తర్వాత వందలాదిగా పాల్గొన్న మహిళలు ఆశీర్వాదం పొందారు. మహిళలందరికీ ఒడి నింపేందుకు చీరలను పంపిణీ చేశారు. జిల్లా అధ్యక్షుడు గోనాళ్ రాజశేఖర్‌గౌడ, మహిళా అధ్యక్షురాలు హంపి రమణ, దమ్మూరు శేఖర్, కురిహట్టి రాజు, పాల్తూరు సురేష్, రోసిరెడ్డి, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల భవనానికి మరమ్మతులేవీ?

రాయచూరు రూరల్: నగరంలోని జహీరాబాద్ కళాశాల భవనానికి మరమ్మతులు చేపట్టాలని మూల నివాసి అంబేడ్కర్ సంఘం డిమాండ్ చేసింది. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి సంచాలకుడు భరత్ మాట్లాడారు. కళాశాలలో 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు చదువుతుండగా, గదుల అధ్వాన్నంగా మారి, పైకప్పు బీటలు వారి పెచ్చులూడే స్థితికి చేరుకుందన్నారు. సత్వరం మరమ్మతులు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

## ఇంటి తాళం పగలగొట్టి చోరీ

హుబ్లీ: తలుపులకు వేసిన తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు రూ.98 వేల విలువ చేసే ఆభరణాలను చోరీ చేసి ఉడాయించిన ఘటన బుధవారం పాతహుబ్లీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు...జివటివీధికి చెందిన పటీశ కుటుంబం శుభకార్యానికి హాజరయ్యేందుకు ఈశ్వర్ నగర్‌లోని తమ బంధువుల ఇంటికి వెళ్లినప్పుడు దుండగులు చోరీకి పాల్పడ్డారు. అల్మారాలోని రూ.78 వేల విలువ చేసే 19.5 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.16 వేల విలువ చేసే 400 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.4 వేల విలువ చేసే కాంస్య ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు పటీశ ఫిర్యాదులో పేర్కొన్నారు.

## కేఆర్‌పీపీలోకి చేరికలు



మహిళలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జనార్దన్‌రెడ్డి

గంగావతి: నగరంలోని పలు వార్డులకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన వారు గాలి జనార్దన్‌రెడ్డి సమక్షంలో కేఆర్‌పీపీలోకి చేరారు. నగరంలోని 31వ వార్డు జంతకల్ ఏరియా, ఇతర పలు వార్డుల నుంచి నేరుగా ఆయన నివాసం వద్దకు వచ్చిన యువకులు, మహిళలు పార్టీ తీర్థం స్వీకరించారు. అదే వార్డుకు చెందిన బీజేపీ వారిని కూడా ఆయన స్వయంగా పార్టీలో చేర్చుకున్నారు. పార్టీ జిల్లాధ్యక్షుడు మనోహర్‌గౌడ, నగర సమితి అధ్యక్షుడు వీరేష్, జిలాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బసనగౌడ

రాయచూరు రూరల్: గ్రామీణ రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తామని గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ పేర్కొన్నారు. ఆయన గురువారం తాలూకాలోని నెలెహాళలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. త్వరితగతిన, నాణ్యతతో పనులను చేపట్టాలని సూచించారు.

## సత్వర న్యాయం పొందండి



మాట్లాడుతున్న లోకాయుక్త ఎస్ఐ మహ్మద్ రఫీక్

కంప్లి: ప్రజలు తమ సమస్యలపై అర్జీ అందించి న్యాయం పొందాలని బళ్లారి లోకాయుక్త ఎస్ఐ మహ్మద్ రఫీక్ సూచించారు. తాలూకా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పనులను లంచం తీసుకోకుండా సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించి 2 అర్జీలను స్వీకరించి వాటిని అక్కడే పరిష్కరించారు. తహసీల్దార్ గౌసియాబేగం, టీపీ ఈఓ మల్లనగౌడ, అధికారులు డాక్టర్ రాధిక, శ్రీధర్, లతీఫాబేగం పాల్గొన్నారు.

## 16న భారీ జనాగ్రహ ర్యాలీ



కరపత్రాల విడుదలలో కరియప్ప తదితరులు

కంప్లి: తమ హక్కుల సాధనకు ఈనెల 16న బెంగళూరు ఫ్రీడం పార్క్‌లో బృహత్ జనాగ్రహ ర్యాలీ చేపడతామని భూ వసతి హక్కు వంచితుల పోరాట సమితి కార్యదర్శి కరియప్ప గుడిమని, రాష్ట్ర కార్యదర్శి కుమార్ సమితాళ్ తెలిపారు. గురువారం స్థానిక అతిథిగృహంలో విలేకరులతో వారు మాట్లాడారు. శుక్రవారం నుంచి గ్రామీణ స్థాయిలో సమితి కార్యకర్తల సమావేశం జరుగుతుందన్నారు. తమ హక్కులు పొందేంత వరకు ఎమ్మెల్యే, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లాధికారి, తహసీల్దార్ కార్యాలయాల ముందు నిరంతర ఉపవాస సత్యాగ్రహం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి నీలప్ప పెయింటర్, సభ్యులు నీలప్ప కరడి, విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి దుర్గేష్ బరగూరు, సభ్యులు రామసాగర భువన్, దీపిక, రైతు సంఘం జిల్లా ప్రముఖులు గంగాధర, దేవసముద్ర బసణ్ణ పాల్గొన్నారు.

## ఉగ్గాణి, వడ కోసం గొడవ

హుబ్లీ: ఉగ్గాణి, వడ కోసం మామ, అల్లుడు పరస్పరం దాడులు చేసుకున్న ఘటన కసబాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ నిష్కారణ దాడులపై ఇరువురు పరస్పరం ఫిర్యాదు చేశారు. ఇందిరానగర్‌లోని భార్య పుట్టింటికి వెళ్లిన రవికిరణ్ తన భార్యకు ఉగ్గాణి, వడ చేయాలని సూచించాడు. దీనికి ఆయన భార్య ఇంట్లో సంబంధిత ఆహార పదార్థాలు లేవని చెప్పడంతో భర్త రవికిరణ్ అసంతృప్తికి గురై కోపంతో మామను చెంప దెబ్బ కొట్టాడు. దీంతో బావమరిది అజయ్ కూడా తనపై ప్రతిదాడి చేసినట్లు రవికిరణ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## పార్టీ నాకు అన్ని విధాలుగా మద్దతిచ్చింది

- మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప

రాయచూరు రూరల్: కేంద్రంలోని బీజేపీ నాయకులు తనకు అన్ని విధాలుగా మద్దతిచ్చారని మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప పేర్కొన్నారు. ఆయన గురువారం సింధనూరు తాలూకా విరుపాపురలో వివాహ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా తనను కలిసిన పాత్రికేయులతో మాట్లాడారు. తాను రాష్ట్రంలో అన్ని పదవులు, హోదాలను అనుభవించానన్నారు. జాతీయ స్థాయిలో తనను పార్టీ సేవలకు ఆహ్వానించారన్నారు. తనను ఏనాడూ పార్టీ నేతలు దూరం చేయలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఆధ్వర్యంలో ఉత్తమ రీతిలో పని చేస్తున్న మంత్రివర్గ సహచరులకు తన పూర్తి సహకారం ఉందన్నారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందనే విశ్వాసం ఉందన్నారు. కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవి రేసులో డీకే శివకుమార్, సిద్దరామయ్యల మధ్య దోబూచులాట జరుగుతోందన్నారు. కాంగ్రెస్, బీజేపీల మధ్యే పోటీ అని, జేడీఎస్ తమకు సమ ఉజ్జీ కాదన్నారు.

## కోలారు వార్తలు...

## కాంగ్రెస్ చెప్పేదొకటి, చేసేదొకటి

- బీజేపీ నేత సీటీ రవి ఆరోపణ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ నేతలు

కోలారు : కాంగ్రెస్ చెప్పేదొకటి, చేసేదొకటని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవి ఎద్దేవా చేశారు. గురువారం రంగమందిరంలో నిర్వహించిన జిల్లా ఎస్సీ మోర్చా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే మహిళలకు ప్రతి నెలా రూ.2 వేలు ఇస్తామని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్‌లలో ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అక్కడ కాంగ్రెస్ పార్టీ ఉచిత విద్యుత్ ఇస్తోందా? అని నిలదీశారు. హిమాచల్ ప్రదేశ్‌లో అధికారంలోకి రాగానే డీజిల్ ధరలను పెంచేసిందన్నారు. బీజేపీలో నాయకత్వ లోపం ఉందని డీకే శివకుమార్ చేసిన ఆరోపణలు అవాస్తవం అన్నారు. సిద్దరామయ్యకు ఈ సారి కోలారు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇక జేడీఎస్ నాయకుడు కుమారస్వామి జాత్యాతీత జనతాదళకు నాయకుడు కాదు, జాతి దళానికి నాయకుడని హేళన చేశారు. కార్యక్రమంలో ఎంపీ మునిస్వామి, మాజీ ఎమ్మెల్యే వర్తూరు ప్రకాష్, బెగ్లి ప్రకాష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా రావణోత్సవం

కోలారు : వక్కలేరిలో రావణోత్సవాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. శివభక్తుడైన రావణుడికి కూడా పూజలు నిర్వహించే ఆచారం అనాదిగా వక్కలేరిలో కొనసాగుతోంది. బుధవారం రాత్రి 10 గంటలకు పది తలల రావణుడి తలపై మార్కండేయ స్వామి విగ్రహాన్ని ఉంచి రావణోత్సవాన్ని ఆచరించారు. మార్కండేశ్వర స్వామి రథోత్సవం పూర్తయిన తరువాత రావణోత్సవాన్ని నిర్వహించడం గ్రామంలో ఆనవాయితీగా వస్తోంది. అదేవిధంగా తాలూకాలోని సుగటూరులో కూడా రావణోత్సవాన్ని నిర్వహించారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన పల్లకిలో రావణుడి విగ్రహాన్ని ఉంచి గ్రామంలో ఊరేగించారు.

## బోగస్ కార్డుల రద్దుపై జాగృతి జాతా



జాతాను ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలో కార్మికుల బోగస్ కార్డుల రద్దుపై నగరంలో జాగృతి జాతా నిర్వహించారు. గురువారం కలెక్టరేట్ వద్ద న్యాయ సేవా ప్రాధికార సభ్యుడు దయానంద్ మాట్లాడారు. నిజమైన కార్మికులు పేర్లు నమోదు చేసుకోకుండా నకిలీ పేర్లతో నమోదు చేసుకున్న కార్డులను కార్మిక శాఖకు వాపస్ ఇవ్వాలని, లేని పక్షంలో వాటిని రద్దు చేయాలని ఆదేశించారు. జాతాలో జిల్లా కార్మిక శాఖాధికారిణి ఆరతి, సభ్యులు, పదాధికారులున్నారు.

## నిధుల స్వాహాపై విచారణకు డిమాండ్



మాట్లాడుతున్న శివప్ప

రాయచూరు రూరల్: సిరవార తాలూకా నవలకల్ జీపీలో నిధుల గోల్‌మాల్ జరిగిందని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంచాలకుడు శివప్ప ఆరోపించారు. ఆయన గురువారం పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. పంచాయతీలో 2020 నుంచి 2023 వరకు 14, 15వ ఆర్థిక ప్రణాళికా సంఘం ద్వారా విడుదలైన నిధులను పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏకమై స్వప్రయోజనాల కోసం వినియోగించారన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## జిల్లాలోనే కొనసాగించండి

కోలారు : జిల్లాలో వివిధ పాఠశాలల్లో గుర్తింపు పొందిన అదనపు ఇంగ్లిష్ ఉపాధ్యాయులను ఆయా తాలూకాల్లోనే కొనసాగించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.సురేష్‌బాబు ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. తమను జిల్లాలోనే కొనసాగించాలన్న ఉపాధ్యాయుల వినతిపై ఆయన స్పందిస్తూ తమను ఇతర జిల్లాలకు పంపుతారేమోననే భయం వద్దన్నారు. అదనంగా 1-5 వరకు బోధిస్తున్న ఉపాధ్యాయులందరికీ కౌన్సిలింగ్‌లో అవకాశం కల్పించాలని కోరారు. కెఎస్ సౌమ్య, ఎల్ ఆనంద్, సంగీత, సరిత తదితరులున్నారు.

## వెట్టి పద్ధతిని నిర్మూలిద్దాం

కోలారు : జిల్లాలో వెట్టి పద్ధతిని నిర్మూలిద్దామని జెడ్పీ సీఈఓ యుకేష్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వెట్టి పద్ధతి నివారణ దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వెట్టి పద్ధతిలో పని చేస్తున్న వారిని గుర్తించి వారిని ప్రధాన జనజీవన స్రవంతిలోకి తేవాలన్నారు. జిల్లా న్యాయ సేవల ప్రాధికార సభ్యుడు, న్యాయమూర్తి సునీల్ హొసమని మాట్లాడుతూ రాష్ట్రంలో వెట్టి పద్ధతిలో ఉన్న వారిని విముక్తులను చేస్తామన్నారు. ప్రొబేషనరి కలెక్టర్ వినాయక్, ఉప విభాగాధికారి వెంకటలక్ష్మి, కార్మిక శాఖ అధికారి శర్మినా తాజ్ పాల్గొన్నారు.

## ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అగణ్యకు చోటు



తాను సాధించిన ప్రశంసాపత్రంతో అగణ్య

కోలారు : తాలూకాలోని కామధేనుహళ్లికి చెందిన చిన్నారి అగణ్య ఎస్.మూర్తి అతి చిన్న వయస్సులోనే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్-2022లో చోటు సంపాదించింది. 2 సంవత్సరాల 4 నెలల వయస్సులో అగణ్య 7 దేశాల జాతీయ చిహ్నాలు, 8 రకాల రంగులు, పక్షులు, 11 రకాల జల చరాలు, 16 రకాల శరీర భాగాలు, 17 మంది ప్రముఖ వ్యక్తులు, 20 రకాల వాహనాలు, 24 రకాల పండ్లు, కూరగాయలు, పెంపుడు జంతువులు, అటవీ ప్రాణులను గుర్తించడం ద్వారా అద్భుత ప్రతిభతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించింది.

## మంత్రి కార్యక్రమంలో గందరగోళం



అడ్డుపడుతున్న ప్రతిపక్ష నేతలు

తుమకూరు: జిల్లాలోని చిక్కనాయకనహళ్లి పరిధిలో హుళియారులో గురువారం పలు వార్డుల్లో సిమెంటు రోడ్డు అభివృద్ధి పనులకు మంత్రి జేసీ మాధుస్వామి భూమిపూజ చేశారు. ఈ సమయంలో కాంగ్రెస్, జేడీఎస్ నాయకులు నల్లజెండాలతో నిరసన తెలపడంతో గందరగోళం ఏర్పడింది. నగరోత్థాన పథకంలో సుమారు రూ.5 కోట్లతో రోడ్ల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ పనులను నిలిపివేయాలని ప్రతిపక్ష సభ్యులు నల్ల జెండాలతో నిరసన తెలిపారు. పోలీసులు జెండాలను లాక్కుని వారిని అడ్డుకున్నారు. వైఎస్ పాళ్య, లింగప్పన పాళ్య, చుట్టుపక్కల ప్రాంతాల్లో మంత్రి పర్యటించి పలు పనులను ప్రారంభించారు.

## అక్రమ మద్యం రవాణాను అరికడదాం

- సమావేశంలో అధికారుల తీర్మానం



సమావేశమైన అంతర్రాష్ట్ర అధికారులు

కోలారు : కర్ణాటక శాసనసభ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో గురువారం నగర సమీపంలోని ప్రైవేటు హోటల్‌లో ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన అబ్కారీ(ఎక్సైజ్) శాఖ ఉన్నతాధికారులు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం రవాణా కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై చర్చలు జరిపారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా, సత్యసాయి జిల్లా, చిత్తూరు జిల్లా, తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా, కర్ణాటకలోని కోలారు జిల్లాకు చెందిన అబ్కారీ శాఖ అధికారులు పాల్గొన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం అరికట్టడానికి తగిన జాగ్రత్తలు చేపట్టాలని, సంయుక్తంగా దాడులు నిర్వహించాలని, పరస్పరం సహకార మనోభావంతో వ్యవహరించాలని నిర్ణయం తీసుకున్నారు. అన్ని సరిహద్దు ప్రాంతాల వద్ద చెక్‌పోస్టులను ప్రారంభించాలని, సిబ్బందితో గస్తీని ప్రారంభించాలన్నారు. అక్రమ మద్యం రవాణాపై ఫిర్యాదులు రాగానే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలన్నారు. ఎన్నికల కోడ్ వెలువడగానే అధికారులందరూ అప్రమత్తం కావాలన్నారు. సమావేశంలో బెంగుళూరు ఉత్తర వలయం అబ్కారీ శాఖాధికారి ఎఫ్‌హెచ్ ఛలవాది, ఏఎల్ నాగేష్, కోలారు అబ్కారీ డిప్యూటీ కమిషనర్ హెచ్. రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ సమస్యలను పరిష్కరించరూ

శ్రీనివాసపురం : ఉపాధ్యాయుల బదిలీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్సీ ప్రభుత్వ ఉద్యోగుల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం తహసీల్దార్ ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. తాలూకా సమన్వయ సమితి అధ్యక్షుడు ఎస్.మునివెంకటప్ప మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్నందున ఉపాధ్యాయులను బదిలీ చేయడం సరికాదన్నారు. బదిలీల్లో స్పౌస్ కేసులు, సంఘాల ప్రతినిధులకు ప్రాధాన్యత నివ్వలేదన్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు హనుమప్ప, ప్రధాన కార్యదర్శి హెచ్ అంజప్ప, ఉపాధ్యక్షుడు టి రమేష్ ఉన్నారు.

## క్లుప్తంగా

### ఫ్యాక్టరీలో చోరీ

**దొడ్డబళ్లాపురం:** ఫ్యాక్టరీలో జొరబడ్డ దొంగలు లక్షల విలువ చేసే తామ్రాన్ని అపహరించిన సంఘటన దొడ్డబళ్లాపురం తాలూకా బాశెట్టి హళ్లి పారిశ్రామికవాడలో చోటుచేసుకుంది. ఈనెల 8న బాశెట్టిహళ్లి పారిశ్రామికవాడలోని ఆదిత్య ఆటో ప్రాడక్ట్ అండ్ ఇంజినీరింగ్ ప్రై.లి.ఫ్యాక్టరీలోకి జొరబడ్డ దొంగలు రూ.4 లక్షల విలువైన నాలుగు తామ్రం బాక్సులను అపహరించారు. ఘటనకు సంబంధించి కంపెనీ మేనేజర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### క్యాంటర్ ఢీకొని వ్యక్తి మృతి



**తుమకూరు:** క్యాంటర్ వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తుమకూరు జిల్లా శిర తాలూకా కళ్లంబెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని చిక్కనహళ్లి వద్ద చోటు చేసుకుంది. చిక్కనహళ్లి సమీపంలో ఉన్న జాతీయ రహదారిలో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన క్యాంటర్ వాహనం ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతుడి వివరాలు ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### నాగుల చెరువులో గుర్తు తెలియని శవం



**దొడ్డబళ్లాపురం:** దొడ్డ పట్టణ పరిధిలోని నాగుల చెరువులో గుర్తు తెలియని వ్యక్తి శవం బయటపడింది. గురువారం ఉదయం నాగుల చెరువు కట్టమీద వాకింగ్ చేసే వారికి నీటిలో తేలుతున్న శవం కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పట్టణ పోలీసులు శవాన్ని వెలికితీయించి పోర్టుమార్టానికి తరలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు.

### దోపిడీ దొంగ అరెస్ట్

**కృష్ణరాజపురం:** ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న దోపిడీ దొంగను జయనగర పోలీసులు అరెస్ట్ చేసి రూ. 18 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రమేశ్‌గా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### బైకిస్టు దుర్మరణం

**మైసూరు:** అంబులెన్స్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కత్తెలకాడు వద్ద చోటు చేసుకుంది. మృతుడిని జెట్టిహళ్లి కాఫీబోర్డు ఉద్యోగి లోకేష్ (43)గా గుర్తించారు. లోకేశ్ బైక్‌పై విధులకు వెళ్తుండగా మడికేరి వైపు నుంచి వచ్చిన అంబులెన్స్ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలతో లోకేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### వెట్టి వ్యవస్థను నిర్మూలించాలి

**చిక్కబళ్లాపురం:** వెట్టి చాకిరి వ్యవస్థను నిర్మూలించడం మన కర్తవ్యమని కలెక్టర్ నాగరాజు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వెట్టి వ్యవస్థ నిర్మూలన దినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ... బలవంతంగా పనులు చేపట్టడం నేరమని, వెట్టి చాకిరికి గురైన వారిని గుర్తించి వారికి అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. జిల్లా కోర్టు న్యాయమూర్తి లక్ష్మీకాంత్ మాట్లాడుతూ... వెట్టి చట్టరీత్యా నేరమని, శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో లాయర్ ప్రకాశ్, జెడ్పీ నిర్దేశకులు గిరిజా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బెంగళూరులో భారీగా డ్రగ్స్ పట్టివేత



స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ పరిశీలిస్తున్న సీపీ ప్రతాప్‌రెడ్డి, జాయింట్ సీపీ శరణప్ప, పట్టుపడిన విదేశీయలు, మాదక ద్రవ్యాలు, వివిధ ప్రాంతాల్లో పట్టుబడిన పెడ్లర్లు

- టాంజానియా, కెన్యా పౌరులతో పాటు 11 మంది పెడ్లర్ల అరెస్ట్

**బనశంకరి, కృష్ణరాజపురం:** బెంగళూరులో టాంజానియా, కెన్యా దేశానికి చెందిన ఇద్దరు పౌరులతో పాటు 11 మంది డ్రగ్స్ పెడ్లర్లను అరెస్ట్ చేసి రూ. 1.34 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నట్లు నగర సీపీ సీహెచ్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన సీసీబీ పోలీసులు స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను పరిశీలించి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

**కస్టమర్లకు వాట్సాప్ సమాచారం..**

డ్రగ్స్ పెడ్లర్లు విస్తృతమైన నెట్‌వర్కు ఏర్పాటు చేసుకున్నారు. డెలివరీ బాయ్స్‌ను సమేతంగా నియమించుకుని సరఫరా చేస్తున్నట్లు సీసీబీ పోలీసులు గుర్తించారు. వారిపై నిఘా పెట్టారు. నెల రోజులుగా సమాచారం సేకరించి మడివాళ, బాణసవాడి, సుద్దగుంటెపాళ్య, కేఆర్.పుర, బండేపాళ్య పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న డ్రగ్స్‌పెడ్లర్లను అరెస్ట్ చేశామన్నారు.

**బాణసవాడిలో...**

బాణసవాడిలో సీసీబీ పోలీసులు దాడి చేసి కెన్యా, టాంజానియా దేశానికి చెందిన ఇద్దరు పర్యాటకులను అరెస్ట్ చేసి రూ.20 లక్షల విలువచేసే 200 గ్రాములు ఎండీఎంఏక్రిస్టల్, మొబైల్, 20 కవర్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై బాణసవాడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

**సుద్దగుంటెపాళ్య పరిధిలో..**

కేరళకు చెందిన ముగ్గురు డ్రగ్స్‌పెడ్లర్లను సీసీబీ పోలీసులు అరెస్ట్ చేసి రూ.23 లక్షల విలువైన 102 గ్రాములు ఎండీఎంఏ క్రిస్టల్, 43 గ్రాముల బరువు గల 117 ఎండీఎంఏ ఎక్స్‌టెసీపిల్స్, 83 గ్రాముల హ్యాశీశ్ ఆయిల్, మూడుసెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై సుద్దగుంటెపాళ్య పీఎస్‌లో కేసు నమోదైంది.

**కేఆర్ పురం పరిధిలో..**

కృష్ణరాజపురం పరిధిలో కేరళకు చెందిన ఇద్దరు, మేఘాలయకు చెందిన ఒకరిని సీసీబీ పోలీసులు అరెస్ట్ చేసి రూ.30 లక్షల విలువైన 100 గ్రాములు ఎండీఎంఏ క్రిస్టల్, 219 ఎల్ఎల్‌టీస్ట్రిప్స్, 7.52 గ్రాములు ఎండీఎంఏ క్రిస్టల్ ఎక్స్‌టెసీ పిల్స్ స్వాధీనం చేసుకున్నారు. బండేపాళ్య పోలీసులు డ్రగ్స్‌పెడ్లింగ్‌లో నిమగ్నమైన కేరళకు చెందిన వ్యక్తిని సీసీబీ పోలీసులు అరెస్ట్ చేసి రూ.1.60 లక్షల విలువైన 21 గ్రాములు ఎండీఎంఏక్రిస్టల్, మొబైల్ స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన డ్రగ్స్‌పెడ్లర్లపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశామని ప్రతాప్‌రెడ్డి తెలిపారు. విలేకరుల సమావేశంలో సీసీబీ జాయింట్ పోలీస్ కమిషనర్ శరణప్ప. డీసీపీ బద్రీనాథ్ పాల్గొన్నారు.

## వీధి శునకాలకు పార్వో వైరస్

**మైసూరు:** మైసూరు జిల్లా సాలిగ్రామ పట్టణంతో పాటు తాలూకాలోని పలు ప్రాంతాల్లోని వీధి కుక్కలు ప్రాణాంతక పార్వో వైరస్ బారిన పడి మృతి చెందుతున్నాయి. ఇది అంటువ్యాధి కావడంతో కుక్కలు ఎక్కువగా మృతి చెందుతున్నాయని పశు వైద్యులు తెలిపారు. పెంపుడు శునకాలు కూడా ఈ వైరస్ సోకుతుంటంతో వాటి యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువుల వైద్యుడు డాక్టర్. రాము మాట్లాడుతూ... ఈ వైరస్ సోకిన కుక్కలు వాంతులు, విరేచనాలు, రక్తం కారడం తదితర కారణాలతో చనిపోతాయని తెలిపారు. చికిత్స చేసినా ఫలితం కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



వైరస్ సోకిన కుక్కకు చికిత్స చేస్తున్న దృశ్యం

## బీబీఎంపీ ఉద్యోగుల ధర్నా విరమణ

**బనశంకరి:** బృహత్ బెంగళూరు మహానగర పాలికె ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. పాలికె అధికారులు, ఉద్యోగుల సంఘం పదాధికారులను కమిషనర్ తుషార్ కలిసి డిమాండ్ల పరిష్కారానికి సమ్మతించడంతో ధర్నా విరమించామని సంఘం అధ్యక్షుడు అమృతరాజ్ తెలిపారు. కమిషనర్ తుషార్ మాట్లాడుతూ... ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని, వాటి పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తామన్నారు.



ధర్నాకు దిగిన బీబీఎంపీ ఉద్యోగులు

## నాటి ఘటనకు వారే కారణం

**శివాజీనగర:** కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి వ్యతిరేకంగా మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి మళ్లీ పరోక్షంగా ధ్వజమెత్తారు. యడ్యూరప్ప ప్రభుత్వాన్ని తొలగించేందుకు పేశ్వ వంశస్థులే కారణమని ఆరోపించారు. గురువారం కారవారలో విలేకరులతో మాట్లాడిన కుమారస్వామి, పేశ్వ వంశంవారు యడ్యూరప్పకు పరిపాలించేందుకు అవకాశం కల్పించలేదు. పేశ్వ వంశంవారే యడ్యూరప్ప ప్రభుత్వాన్ని తొలగించారు. రెండోసారి యడ్యూరప్ప కష్టపడి సీఎం అయ్యారు. అయితే ఆయనను ఎలాగు తొలగించారనేది అందరికీ తెలిసిందేనని అన్నారు. అయితే కుటుంబ రాజకీయాలు అంటూ తమ పార్టీని ఆరోపిస్తున్నారు. వంశపారంపర్యం బీజేపీలో కాంగ్రెస్‌లో లేదా? అనవసరంగా తన కుటుంబాన్ని టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు.

## ఎన్నికలు రాక ముందే గిఫ్ట్‌లు



చీరల కోసం బారులు తీరిన మహిళలు

**చిక్కబళ్లాపురం:** శాసనసభ ఎన్నికలకు సమయం సమీపిస్తుండటంతో గిఫ్ట్ పాలిటిక్స్ జోరందుకున్నాయి. మంత్రి సుధాకర్ మద్దతుదారుడు గంటిగానహళ్లి శివకుమార్ గ్రామంలో మహిళలకు చీరల పంపిణీ చేసారు. వందలాది మంది మహిళలు గంటల తరబడి వేచి ఉండి చీరలు తీసుకున్నారు. ఓటర్లను ఆకట్టునేందుకు కానుకలను ఇప్పటి నుంచే ఇవ్వడం షురూ చేశారు.

## దివ్యాంగులకు అవకాశాలు కల్పించాలి

**గౌరిబిదనూరు:** దివ్యాంగులపై జాలి చూపకుండా వారి శక్తికి తగినట్లు అవకాశాలు కల్పించాలని అరుణోదయ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల అధ్యక్షురాలు విజయలక్ష్మి తెలిపారు. గురువారం నగరంలోని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వారు పాఠశాలలో దివ్యాంగ సేవ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వారు బహుమతులు వితరణ చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీ సంచాలకులు బికె పద్మక్క మాట్లాడుతూ... సమాజంలో దివ్యాంగులు ప్రజా వాహినిలోనికి రావడానికి, వారికి కావలసిన శిక్షణ అందించాలన్నారు. దివ్యాంగులు తయారు చేసిన వివిధ అలంకారిక వస్తువులను పరిశీలించారు. బికె చంద్రిక, బికె ప్రమీళ, బికె సుశీల, శాంత, కీర్తి, నందిని, నవ్య పాల్గొన్నారు.



దివ్యాంగులతో బ్రహ్మకుమారీలు

## బీబీఎంపీ బడ్జెట్‌పై సమావేశం

**బనశంకరి:** బెంగళూరు మహానగర పాలికె బడ్జెట్ 2023–24 ఆదాయ వ్యయంపై సలహాలు సూచనలు అందించాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను బీబీఎంపీ పాలనాధికారి రాకేశ్‌సింగ్ కోరారు. గురువారం వికాససౌధలో నగర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ...నగర ప్రజలకు అవసరమైన మూలభూత సౌకర్యాలు కల్పించడం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ రూపొందిస్తామని తెలిపారు. పాలికె ఆర్థిక విభాగ ప్రత్యేక కమిషనర్ జయరామ్‌రాయపుర మాట్లాడుతూ...243 వార్డుల్లో ప్రజలు అభిప్రాయాలు సేకరించిందని తెలిపారు.



బడ్జెట్ సమావేశంలో మంత్రులు, అధికారులు

### మారికాంబ దేవి జాతర వేడుకలు ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**శివమొగ్గ:** భారతీయ వారసత్వానికి ప్రపంచ గుర్తింపు ఉందని సీనియర్ నటుడు, రంగభూమి కళాకారుడు, రచయిత టి.ఎస్.నాగాభరణం అన్నారు. శివమొగ్గ జిల్లాలోని సాగర పట్టణంలో నగరసభలో సాగర ప్రసిద్ధి చెందిన శ్రీ మారికాంబ దేవి జాతర వేడుకల్లో జ్యోతి వెలిగించి ప్రారంభించారు. వారసత్వాలను భావితరాలు కాపాడుకోవాలని అన్నారు.

### అలెమారి సముదాయం ధర్నా



**తుమకూరు:** వెనుకబడిన అలెమారి సముదాయం అభివృద్ధి కోసం కేటాయించిన రిజర్వ్ నిధులు వెనక్కి మళ్లడంపై తుమకూరు నగరంలోని జిల్లా అధికారి కార్యాలయం ముందు అలెమారి సముదాయం గురువారం ధర్నా నిర్వహించారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌కు వచ్చిన వారు తమ సమస్యలు పరిష్కరించాలని, నిధులను మళ్లీ కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అధికారిని వినతిపత్రం అందజేశారు. దళిత సంఘాలు కూడా అలెమారి ధర్నాకు మద్దతు తెలిపారు.

### విద్యార్థిని కిడ్నాప్‌పై ఫిర్యాదు

**హోసూరు:** ట్యూషన్‌కు వెళ్లిన తన కూతురిని ఓ యువకుడు కిడ్నాప్ చేశాడని విద్యార్థిని తండ్రి ఊత్తంగేరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు... క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి ప్రాంతానికి చెందిన 14 ఏళ్ల బాలిక అదే ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. బుధవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికొచ్చిన బాలిక ట్యూషన్‌కు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించినా జాడ తెలియలేదు. స్థానికుల సమాచారం మేరకు సంగంబట్టి గ్రామానికి చెందిన సతీష్ (23) కిడ్నాప్ చేసినట్లు తెలిసింది. ఈ ఘటనపై విద్యార్థిని తండ్రి ఊత్తంగేరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## హోసూరు వార్తలు..

### అభివృద్ధి పనులకు భూమిపూజ

**కెలమంగలం:** కెలమంగలం సమితి జే. కారుపల్లి పంచాయతీలో అభివృద్ధి పనులకు తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్ గురువారం పనులు ప్రారంభించారు. పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానిక ప్రజలు గత కొద్ది రోజులుగా కోరుతూ వచ్చారు. పంచాయతీ అధ్యక్షులు అశ్వినీ సంబంధిత శాఖాధికారులతో చర్చించి మురికి నీటి కాల్వలు, సీసీ రోడ్ల ఏర్పాటు, శ్మశానవాటికకు ప్రహరీ తదితర అభివృద్ధి పనులకు రూ. 39 లక్షలు మంజూరు చేయించారు. శుక్రవారం ఎమ్మెల్యే టి. రామచంద్రన్ పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ కౌన్సిలర్ రమేష్, జే. కారుపల్లి పంచాయతీ మాజీ అధ్యక్షుడు బుల్లెట్ క్రిష్ణప్ప, అశ్వత్థప్ప గ్రామస్థులు పాల్గొన్నారు.

### ఈ సిరా తుడిచినా పోదు !

**మైసూరు:** శాసనసభ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. ఈసారి వేలిపై వేసే సిరా గుర్తు అంత త్వరగా పోకుండా చర్యలు తీసుకుంటున్నారు. మైలాక్ సంస్థ నుంచి 1.30 లక్షల బాటిళ్లను కొనుగోలు చేయనున్నారు. సిరా గుర్తు పోకుండా ఉండే విధంగా ఇంక్ తయారు చేసి ఇవ్వాలని సంస్థను ఈసీ కోరింది. అదే విధంగా 3.90 లక్షల లక్క స్టిక్కులకు కూడా ఆర్డర్ ఇచ్చారు.

### విలువలతో కూడిన విద్యను నేర్పాలి

**బాగేపల్లి:** విద్యా సంస్థలు విలువలతో కూడిన విద్యను నేర్పాలని బీఈఓ సిద్దప్ప అన్నారు. గురువారం బాగేపల్లి పట్టణంలో ఉన్న బ్రైట్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఏర్పాటు చేసిన ఓ వేడుకను ప్రారంభించి మాట్లాడుతూ... ప్రస్తుతం విద్య వ్యాపారంగా మారిపోయిందని, నాణ్యమైన విద్య అందించనప్పుడు విద్యా సంస్థలకు మంచి పేరు వస్తుందన్నారు.

### స్వయం సహాయ సంఘాలకు చెక్కుల పంపిణీ



**బాగేపల్లి:** గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళలకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా సహకార సంఘాల ద్వారా సున్నా వడ్డీతో రుణాలు అందజేస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సుబ్బారెడ్డి అన్నారు. గురువారం బాగేపల్లి తాలూకా చేలూరు సమీపంలోని పాళ్యకెరె గ్రామ పంచాయతీ ఆవరణంలో స్వయం సహాయ సంఘాలకు రూ. 52 లక్షల విలువైన చెక్కును అందజేసి మాట్లాడారు.

### నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి

**యశవంతపుర:** అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యానికి ఓ చిన్నారి బలైంది. బీదర్ జిల్లా ఔరాద్ పట్టణంలో టీచర్స్ కాలనీలోని అంగనవాడీ కేంద్రంలో గురువారం మధ్యాహ్నం భోజనం చేసిన ఓ చిన్నారి అక్కడ సమీపంలో ఉన్న నీటి తొట్టిలో పడి మృతి చెందింది. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తమ కుమార్తె ప్రాణాలు కోల్పోయిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

## రైతులకు జాగృతి శిబిరం

**హోసూరు:** హోసూరు యూనియన్‌లోని వివిధ గ్రామ పంచాయతీల్లో వ్యవసాయ శాఖ ద్వారా గురువారం రైతులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. హోసూరు వ్యవసాయశాఖ ఉప డైరెక్టర్ భువనేశ్వరి అధ్యక్షతన యూనియన్‌లోని కొళదాసపురం, ముత్తాళి, వన్నెలవాడి, నాగొండపల్లి, మాచినాయకనపల్లి, గోపనపల్లి గ్రామపంచాయతీల్లో శిబిరాలను నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా రైతులకు అందజేస్తున్న రాయితీలు, ఆధునిక వ్యవసాయ ఉపకరణాల గురించి వివరించారు. పంటసాగులో బిందుసేద్యం ప్రాముఖ్యత, ఎరువుల వినియోగం, రుణాలు తదితరాలను తెలియజెప్పారు. ఈ సందర్భంగా రైతులకు ఉచితంగా కొబ్బరి మొక్కలను అందజేశారు.



రైతులకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

## పార్కు స్థలం ఆక్రమణపై తనిఖీ

**హోసూరు:** హోసూరు తాలూకా పూనపల్లి పంచాయతీ పరిధిలో పార్కు ఏర్పాటు కోసం కేటాయించిన స్థలాన్ని ప్రైవేట్ లేఔట్ గృహవతి వాసులు ఆక్రమించుకొన్నారని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు పరిశీలించారు. పూనపల్లి సమీపంలోని ప్రైవేట్ లేఔట్‌లో 200కు పైగా కుటుంబాలున్నాయి. ఈ ప్రాంతంలో పార్కు ఏర్పాటుకు కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని గృహవసతి కాలనీ వాసులు ఆక్రమించుకొన్నారని ఫిర్యాదులు అందాయి. ఈ విషయంపై స్పందించిన బీడీవో భూపతి, అధికారులు వెళ్లి తనిఖీ చేశారు. పార్కు ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించుకొన్నట్లు ఇందులో రుజువైంది. స్థానికులు పెద్దఎత్తున గుమిగూడడంతో ఆ ప్రాంతంలో కొద్ది సేపు ఉద్రిక్తతకు దారి తీసింది. విషయం తెలుసుకొన్న మత్తిగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆక్రమణలు తొలగించాలని, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించరాదని స్థానికుల ప్రజలకు హెచ్చరించారు.

### ఇద్దరు గంజాయి విక్రేతలు అరెస్టు

**దొడ్డబళ్లాపురం:** గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని నెలమంగల తాలూకా దాబస్‌పేట పోలీసులు అరెస్టు చేసారు. నెలమంగల తాలూకా నిడవంద నెరువు కట్ట వద్ద గంజాయి విక్రయిస్తుండగా మెరుపు దాడి చేసిన సీఐ నవీన్ బీహార్‌కు చెందిన రామ్ మనోహర్ యాదవ్, అస్సాంకు చెందిన ఆకాశ్ మనకిలను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రెండు కేజీలకు పైగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

### ట్రాక్టర్ల నిషేధాన్ని వ్యతిరేకిస్తూ ధర్నా

**శివాజీనగర:** బెంగళూరు నగరంలో ట్రాక్టర్ల సంచారం నిషేధించడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు మొదలయ్యాయి. గురువారం నగరంలోని ఫ్రీడం పార్క్‌లో నమ్మ కర్ణాటక సేనా నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. సేనా రాష్ట్రాధ్యక్షుడు ఎం.బసవరాజ్ పడకోటి మాట్లాడుతూ...పోలీసుల కొత్త నిబంధనలతో ఉత్తర కర్ణాటక, కల్యాణ కర్ణాటక నుంచి వలస వచ్చిన లక్షలాది మంది పేదలు, కార్మికులు, ట్రాక్టర్ డ్రైవర్లు, సహాయకులు ఒక పూట భోజనానికి కష్టపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెంగళూరు నగర ట్రాక్టర్ల యజమానుల విభాగం (నమ్మ కర్ణాటక సేనా అనుబంధం) అధ్యక్షుడు లింగప్ప హుల్లూరు మాట్లాడుతూ... ప్రతి ట్రాక్టర్‌కు డ్రైవర్, ఒక సహాయకుడు, ఇద్దరు కూలీలతో పాటు కనీసం నలుగురికి ఉపాధి పొందుతున్నారని, 40 వేల ట్రాక్టర్లు స్తంభించిపోతే లక్షకు పైగా కార్మికులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**హోసూరు:** హోసూరు కార్పొరేషన్ పరిధిలో గురువారం కలెక్టర్ దీపక్ జేకబ్ ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. మొదటగా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి రోగులకు అందజేసే వైద్య చికిత్సలు, ఔషధాల నిల్వ, పిల్లల విభాగం, శస్త్ర చికిత్స విభాగం, ఎక్స్‌రే, సిద్ధా విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రిలో తాగునీటి వసతి తదితర మౌలిక వసతులపై అధికారుల వద్ద ఆరాతీశారు. అక్కడ నిరుపయోగంగా ఉన్న భవనాలను పరిశీలించారు. అనంతరం రైతు బజారు సమీపంలో రూ. 3.36 కోట్ల ఖర్చుతో నిర్మించిన వ్యవసాయ వాణిజ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కేంద్రాన్ని వెంటనే వాడుకలోకి తీసుకురావాలని సంబంధిత శాఖాధికారులు కలెక్టర్‌కు విన్నవించారు. బీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకొన్నారు. అంచెట్టి తాలూకాలో పర్యటించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శరణ్య, తహసీల్దార్ గవాస్కర్, బీడీవోలు బాలాజీ, భూపతి, పరమశివం తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

### బైక్ ప్రమాదంలో వృద్ధుడు మృతి

**క్రిష్ణగిరి:** ద్విచక్ర వాహనం నుంచి కిందపడిన వృద్ధుడు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రం క్రిష్ణగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు క్రిష్ణగిరి సమీపంలోని పెద్దనపల్లి కామరాజ్‌కాలనీకి చెందిన వాసుదేవన్ (65) బుధవారం సాయంత్రం క్రిష్ణగిరి ఆటల మైదానం వద్ద ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలేర్పడిన వాసుదేవన్ ఘటనా స్థలంలో మృతి చెందాడు. క్రిష్ణగిరి పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# చిత్రలేఖనంలో అందెవేసిన చేయి



ఆకట్టుకుంటున్న చిత్రలేఖనాలు



బంగారు పూతతో దేవతల చిత్రాలు

- గృహిణిగా ఉంటూ కళాభిరుచి
- గౌరిబిదనూరు వాసి కళాతృష్ణ

**గౌరిబిదనూరు:** మంచి చిత్రకారిణిగా శాంతి పేరుపొందారు. ఆమె కుంచె నుంచి జాలువారిన మైసూరు సంప్రదాయిక చిత్రలేఖనాలు చూపరులను అబ్బురపరుస్తాయి. చేయి తిరిగిన ప్రముఖ చిత్రకారులు చిత్రించారా, లేదా యంత్రం ద్వారా ముద్రించారా? అనిపించేంత బాగా ఉంటాయి.

**మల్నాడు సౌందర్యంతో సాధన..**

శాంతి సూరజ్ పుట్టిల్లు శివమొగ్గ జిల్లా తీర్థహళ్ళి తాలూకా ఉడుగెరె. అక్కడ పాఠశాల, కాలేజీ చదువుల నుంచే ప్రకృతి శోభకు పేరైన మలెనాడులోని కొండ గుట్టలు, నదులు, జలపాతాల ను చూసి పెన్సిల్‌తో చిత్రిస్తూ వచ్చారు. అలా చిత్రకళ పట్ల అభిరుచి పెంచుకొన్నట్లు తెలిపారు. దీనిని గమనించిన ఉపాధ్యాయులు, తల్లితండ్రులు ఈమెను ప్రోత్సహిస్తూ వచ్చారు. మైసూరులోని స్కూల్ ఆఫ్ ఆర్ట్ లో చిత్రకళను అభ్యసించారు. మైసూరులో లయన్స్ క్లబ్ సభ్యుడు జీఎస్ సూరజ్‌తో పెళ్లయ్యాక గౌరిబిదనూరులోనే ఉంటున్నారు.



చిత్రకారిణి శాంతి

**ఎక్కువగా దేవతల చిత్రాలు..**

దేవీ దేవతల చిత్రాలను ఎక్కువగా చిత్రిస్తూ ఉంటారు. ఖర్చుతో కూడుకొన్న ఈ చిత్రకళకు రంగులనే కాక బంగారు పూత పేపర్లను సైతం ఉపయోగిస్తూ వుంటారు. రోజులో ఇంటి పనుల మధ్య 2 నుంచి 3 గంటల పాటు చిత్రకళకు వెచ్చిస్తూ ఉంటానని చెప్పారు. దేవతల చిత్రాలు కళకళలాడాలంటే ఎక్కువగా బంగారు రంగును ఉపయోగించాలి. ఇందుకోసం బంగారం అవసరమని, ఒక్కో చిత్రలేఖనానికి సుమారుగా రూ. 5 వేల నుంచి 6 వేల వరకు ఖర్చు వస్తుందని తెలిపారు. చిత్రం గీయడానికి నెలరోజులు పడుతుందన్నారు. ఇటీవల దేవీ దేవతల చిత్ర లేఖనాల్ని చూసిన కొంతమంది వారి పూజా గదిలో పెట్టుకోవడానికని కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో బొమ్మను రూ. 20 వేల నుంచి 25 వేల వరకు విక్రయిస్తానని చెప్పారు. ఆమె చిత్ర కౌశల్యాన్ని మెచ్చి పలు అవార్డులు కూడా వచ్చాయి. గృహిణిగా ఉంటూనే కళాతృష్ణను తీర్చుకోవడంతో పాటు ఆదాయం పొందడం విశేషం.

## 'ప్రకృతి' శిక్షణలో విదేశీ స్కాలర్!

- నెదర్లాండ్ దేశం నుంచి అత్తోట రాక
- సంప్రదాయ రైతులా వేషధారణ
- జీవామృతాల తయారీలో సాధన

**తెనాలి:** తెనాలి దగ్గర్లోని అత్తోటలోగల ప్రకృతి వ్యవసాయ కేంద్రం 'భూమి భారతి'లో కొన్ని రోజులుగా విదేశీయుడు దర్శనమిస్తున్నాడు. రైతులు ధరించే ఖద్దరు షర్టు, లుంగీ, తలపాగతో పంట పొలాల్లో బిజీగా ఉంటున్నాడు. ద్రవ జీవామృతం కలుపుతున్నాడు. తోటి రైతులకు సాగు పనుల్లో చేదోడుగా ఉంటున్నాడు. అతడి పేరు యోగస్. నెదర్లాండ్స్ రాజధాని అమ్‌స్టర్‌డామ్‌కు చెందిన 24 ఏళ్ల రీసెర్చ్ స్కాలర్. నాచురల్ ఫార్మింగ్‌పై పరిశోధన చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రపంచ దేశాలను ఆకర్షిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి సాగు గురించి తెలిసింది. నియోజకవర్గంలోని అత్తోట గ్రామంలోని ప్రకృతి సాగు యజ్ఞం మరింత ప్రత్యేకం. ఇక్కడ ప్రైవేటు రంగంలో ప్రప్రథమంగా 'భూమి భారతి' పేరుతో ప్రకృతి వ్యవసాయ కేంద్రం ఆరంభమైంది. గత ఏడేళ్లుగా చేస్తున్న సాగుతో ఉత్పత్తి చేసిన 365 రకాలతో దేశీ వరి విత్తన నిధి ఏర్పాటైంది. నెదర్లాండ్స్‌కు చెందిన రీసెర్చ్ స్కాలర్ యోగస్‌ను ఈ విశేషాలు ఆకర్షించాయి. ప్రకృతి సాగు అధ్యయనం కోసమని మూడు నెలల పర్యటనకు ఇండియాకు వచ్చాడు. ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ సూచనపై ముందుగా అత్తోట గ్రామానికి వచ్చారు. భూమి భారతి కేంద్రంలో ఉంటూ, గత ఏడేళ్ల నుంచి అక్కడ ప్రకృతి సాగులో కొనసాగుతున్న యర్రు బాపారావు నేతృత్వంలో ప్రకృతి సాగులో శిక్షణ పొందుతున్నాడు.



ద్రవ జీవామృతాన్ని కలుపుతూ యోగస్

**వైవిధ్య పంటల సాగుపై ఆశ్చర్యం..**

యోగస్ తండ్రి ప్రభుత్వోద్యోగి కాగా, తల్లి ప్రభుత్వ టీచరు. క్యాన్సర్ బారిన పడిన తండ్రి రెండేళ్ల క్రితం మరణించారు. నాచురల్ ఫార్మింగ్‌లో రీసెర్చ్ స్కాలరయిన అతడు, ప్రకృతి సాగులో ఉత్తమం ఏది? ఎక్కడ? అనేది శోధించాడు. ఫలితంగానే అత్తోట పంట పొలాల్లో ప్రత్యక్షమయ్యాడు. గత పది రోజులుగా ప్రకృతి సాగుతో కలిగే ప్రయోజనాలను స్వయంగా చూశారు. గోధుమలు, క్యారెట్, బంగాళదుంపలు, బీట్‌రూట్ వంటి కొన్ని రకాలే పండే తన దేశానికి భిన్నంగా ఇక్కడ వైవిధ్యమైన పంటల సాగుకు ఆశ్చర్యపోతున్నట్టు చెప్పాడు. కీలకమైన ద్రవ జీవామృతం, ఘన జీవామృతాల తయారీని నేర్చుకున్నాడు.

మన జ్ఞాపకాలు, మన విశేషాలు, విజయాలు పదికాలాల పాటు పదిలంగా దాచుకునే అవకాశం ఫొటోలు, వీడియోలు, రచనలు, పుస్తకాల ద్వారానే లభిస్తుంది. అయితే అవి మన వద్దా.. మనకు, మన గురించి తెలిసిన వారి వరకే అవి అందుబాటులో ఉంటాయి. అదే మన ప్రాంత వైశిష్ట్యం, పోరాట చరిత్ర, సంప్రదాయాలు నిరంతరం మనతోపాటు, మన సమాజం కళ్లెదుట ఉండాలంటే ఎలా? మన విజయాలు, ఇప్పుడు మన మధ్య లేని ప్రముఖుల గొప్పతనాన్ని విశ్వవ్యాప్తం చేయడం, భావితరాలకు అందించడం ఎలా? దానికి ఒకే ఒక మార్గం ఉంది. ఆ అద్భుత అవకాశాన్ని పోస్టల్ శాఖ కల్పిస్తోంది. ప్రత్యేకంగా పౌరులే తమ ద్వారా తాము కోరుకున్న వ్యక్తులు, ప్రాంతాలు, విశిష్టతలతో పోస్టల్ స్టాంపులు, కవర్లు వేయించుకునే అవకాశం కల్పిస్తోంది. తద్వారా మనం కోరుకున్న అంశాలు చిరస్థాయిగా నిలిచిపోయేలా సహకరిస్తోంది.

– శ్రీకాకుళం డెస్క్








**ఆధ్యాత్మిక 'ముద్ర'..**

జిల్లాను దేశ పటంలో ప్రత్యేకంగా నిలిపిన శతాబ్దాల చరిత్ర గలిగిన శ్రీకూర్మం. అరసవల్లి దేవాలయాల చిత్రాలను 2013లో స్టాంప్ రూపంలో తీసుకొచ్చింది. వాటి విశిష్టతలను ప్రపంచానికి మరోసారి తెలియజెప్పింది.

# తపాలా గుండెలపై సిక్కోలు ముద్రలు

- ప్రముఖుల పేరిట తపాలా కవర్ల ముద్రణ
- చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలపై స్టాంప్‌లు

శ్రీకాకుళం అంటే ఓ చరిత్ర. ఓ ఉద్యమం. కష్టజీవుల ఇలాకాగా.. ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే ప్రాంతంగా.. చారిత్రాక ఘటనలకు వేదికగా నిలిచిన ప్రాంతం. ఎన్నో విశిష్టతల సమాహారం. వీటినే.. ఈ సంగతుల్నే.. ఈ చారిత్రక గురుతుల్నే.. ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తనవంతు ప్రయత్నం చేస్తోంది పోస్టల్ శాఖ. తపాలా సేవల్లో చారిత్రక, పేరెన్నిక గన్న విశిష్టతల్ని స్టాంప్‌లు, కవర్లపైన ముద్రించి నేటి తరానికి నాటి సంగతుల్ని పరిచయం చేస్తోంది.

**ఎందుకీ ప్రయత్నం..**

భారత ప్రభుత్వం జీఐ ఉత్పత్తులతో పోస్టల్ ప్రత్యేక కవర్లు తయారు చేసుకోవాలని సూచించిందని దీంతో చారిత్రక ఆధారాలున్న, రాష్ట్రంలో ప్రత్యేకంగా తయారవుతున్న వస్తువులు, గొప్ప వ్యక్తులు, చూడదగిన ప్రదేశాలతో ప్రత్యేక పోస్టల్ కవర్లు ఆవిష్కరిస్తున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

**రూ.25 వేల వరకు ఖర్చు..**

ఏదైనా విశిష్టతలకు సంబంధించిన ప్రత్యేక కవర్ విడుదల చేసేందుకు పోస్టల్ శాఖకు రూ.25 వేల వరకు చెల్లించాలి. ముందుగా విశిష్టతలను వివరిస్తూ పోస్టల్ శాఖకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని.. ఉన్నతాధికారులు పర్యవేక్షణ అనంతరం అర్హతలను బట్టి అనుమతి లభిస్తుందని శ్రీకాకుళం హెడ్ పోస్టాఫీస్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్యామ్ సుందర్ వివరించారు. ఆవిష్కరణ సభ పోస్టాఫీస్ పరిసరాల్లో నిర్వహిస్తే రూ.12,500 చెల్లిస్తే సరిపోతుందన్నారు. మనకు నచ్చిన ప్రాంతాల్లో నిర్వహించాలంటే మాత్రం రూ.25 వేలు చెల్లించాలని వివరించారు.






**విదేశీ అతిథికి ఖ్యాతి..**

- ఏటా జిల్లాలోని తేలినీలాపురం ప్రాంతానికి తరలివచ్చే సైబీరియన్ పక్షులపై పోస్టల్ శాఖ 2021 సెప్టెంబర్ 6న ప్రత్యేక కవర్‌ను విడుదల చేసింది. దీనికి 'తేలినీలాపురం బర్డ్ శాంచ్యురీ' పేరుతో నామకరణం చేసింది.
- టెక్కలికి చెందిన రియల్స్ సంస్థ నిర్వాహకుడు టీపీ బెనర్జీదాస్ దీనికి సంబంధించిన రుసుమును పోస్టల్ శాఖకు చెల్లించారు.




**మీ ఫొటోతో స్టాంప్ కావాలా..**

పోస్టల్ శాఖ విశిష్ట వ్యక్తులు, ఇతర అంశాలపై ప్రత్యేక కవర్లు, స్టాంపులతో పాటు వినియోగదారులకు కూడా ప్రత్యేక స్టాంప్‌లు ముద్రిస్తోంది.

మై స్టాంప్ పేరుతో మీకు నచ్చిన వ్యక్తి ఫొటోతో 12 స్టాంప్‌లను ముద్రించి అందిస్తోంది. కావాలంటే మీరు జిల్లాలోని ప్రధాన తపాలా కార్యాలయాలైన ఆమదాలవలస, టెక్కలి, శ్రీకాకుళం కేంద్రాల్లో సంప్రదించాలి. ఇందుకోసం రూ.300 చెల్లించాలి.

- పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను ఇవ్వాలి. ఆధార్ కార్డు సమర్పించి అప్లికేషన్ పూర్తి చేసి ఇస్తే మీకు స్టాంపుల్ని పోస్టల్ శాఖ అందిస్తుంది.

**కవర్‌పై కంచు మోగింది..**

జిల్లాలోని సారవకోట మండలం బుడితిలోని కంచు, ఇత్తడి వస్తువుల తయారీ పరిశ్రమలపై పోస్టల్ శాఖ దృష్టి సారించింది. 2022 ఏప్రిల్ 12న బుడితి వస్తువుల ప్రత్యేకతలపై కవర్‌ను విడుదల చేసింది. దీనికి 'బుడితి బెల్ అండ్ బ్రాస్‌మెటల్ క్రాఫ్ట్' అని నామకరణం చేసింది. కంచుగంట, ఇత్తడి, ఇతర లోహాలకు చెందిన దేవతా విగ్రహాలు, కొన్ని చిహ్నాలు, పాత్రల ఫొటోలను కవర్‌పై ముద్రించింది.

- బుడితికి చెందిన ఇత్తడి వస్తువుల తయారీదారుడు కింతాడ ఈశ్వరరావు దీనికి సంబంధించిన రుసుమును పోస్టల్ శాఖకు చెల్లించారు.



**సర్దార్ సేవలకు సలామ్..**



- స్వాతంత్ర్య సమరయోధుడు ఉద్దానం ప్రాంతానికి చెందిన సర్దార్ గౌతు లచ్చన్నపై పోస్టల్ శాఖ ప్రత్యేక కవర్‌ను 2021 అక్టోబర్ 13న విడుదల చేసింది. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోని ముఖ్య ఘటనల్లో కీలక పాత్ర పోషించిన వ్యక్తిగా గౌతు లచ్చన్న పేరుగాంచారు. ఈ ప్రత్యేక కవర్‌ను 'అన్‌సంగ్ హీరోస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అని పోస్టల్ శాఖ నామకరణం చేసింది.
- దీనికి స్పాన్సర్‌గా ఎస్.రామునాయుడు(ఉత్తర అమెరికా తెలుగు సంఘం) వ్యవహరించారు.

**త్వరలో మరో రెండు..**



ప్రభుత్వం సూచన మేరకు చారిత్రక ఆధారాలున్న ప్రదేశాలు, రాష్ట్రంలో ప్రత్యేకంగా తయారవుతున్న వస్తువులు, విశిష్ట వ్యక్తులు, ప్రముఖ పర్యాటక ప్రదేశాలపై పోస్టల్ కవర్‌లు ఆవిష్కరిస్తున్నాం. జిల్లాకు చెందిన విశిష్ట వ్యక్తి ప్రముఖ కవి గరిమెళ్ల సత్యనారాయణ, ఉద్దానం జీడిపప్పుపై ప్రత్యేక కవరు విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం.

– వి.సత్యనారాయణ, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్, శ్రీకాకుళం పోస్టల్ డివిజన్



**నేతన్నల సృజనను కవర్ చేస్తూ..**

గాంధీజీ నుంచి నవతరం వరకు అందరూ ఆ'ధరిం'చి'న.. విశ్వఖ్యాతి గాంచిన పొందూరు ఖాదీపై 2019 డిసెంబర్ 5న ప్రత్యేక కవర్ విడుదల చేసింది. దానిపై రాట్నంతో పాటు గాంధీ మహాత్ముని ఫొటోను ప్రచురించారు. నిపుణులైన నేతగాళ్లు సృజించిన అద్భుతాల ఆనవాళ్లకు దక్కిన గొప్పగౌరవం ఈ కవర్. 'ప్రైడ్ ఆఫ్ పొందూరు.. గాంధీజీస్ చెరఖా' అని పోస్టల్ శాఖ నామకరణం చేసింది.

- పొందూరుకు చెందిన వ్యాపారవేత్త కాకర్ల పైడిలింగం కవర్ ముద్రణకు సహకరించారు.

# శరవేగంగా కోటప్పకొండ అభివృద్ధి

కోటివేల్పుల అండ కోటప్పకొండ. కొండమీద కొలువైన ఉన్న కోటయ్య స్వామికి ఏటా జరిపే మహాశివరాత్రి ఉత్సవానికి సర్వం సిద్ధం అవుతోంది. లక్షల సంఖ్యలో తరలివచ్చే భక్తులకు కావల్సిన సౌకర్యాలు, వసతులు, రవాణా, దర్శనం వంటి వాటిపై కొద్దిరోజులుగా యంత్రాంగం చేస్తున్న కసరత్తు ఒక కొలిక్కి వచ్చింది. త్రికూటాద్రిపై ఎక్కడ చూసినా పండుగ శోభ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.



- రూ.23 కోట్లతో రహదారి విస్తరణ పనులు
- రూ.3.7 కోట్లతో ఆలయంలో వసతి, సౌకర్యాలు
- ఆలయానికి నూతన రంగులు, అన్నదాన మండప నిర్మాణం
- మహాశివరాత్రి నాటికి భక్తులకు అందుబాటులోకి...



**నరసరావుపేట రూరల్:** ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మహాశివరాత్రి పర్వదినాన కోటప్పకొండలో నిర్వహించే తిరునాళ్లకు తరలివచ్చే లక్షలాది మంది యాత్రికులకు అందుబాటులోకి వచ్చేలా పనులు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా కొండకు వచ్చే రహదారుల విస్తరణపై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ప్రాంగణంలో పనులు చేపట్టారు.

**రహదారుల విస్తరణ**

కోటప్పకొండ తిరునాళ్లకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది యాత్రికులు తరలివస్తారు. గత ఏడాది 20 లక్షల మంది వచ్చారని అధికారుల అంచనా. తిరునాళ్ల రోజు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ అధికారులకు సవాలుగా మారుతోంది. ఎన్ని చర్యలు తీసుకున్నా ప్రతి ఏడాది ట్రాఫిక్ జామ్‌తో ప్రజాప్రతినిధులు, భక్తులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని కొండకు వచ్చే ప్రధాన రహదారుల విస్తరణను చేపట్టారు. కోటప్పకొండ నుంచి నరసరావుపేట వరకు రూ.17 కోట్లతో రోడ్లను విస్తరిస్తున్నారు. యల్లమంద వద్ద బ్రిడ్జి పనులు మినహా మిగిలిన పనులు పూర్తయ్యాయి. అలాగే ట్రాఫిక్ దారి మళ్లింపునకు ఉపయోగపడేలా కోటప్పకొండ నుంచి పమిడిమర్రు–జెఎన్‌టీయు కళాశాల మీదగా వినుకొండను రూ.7 కోట్లతో విస్తరించే పనులు చేపట్టారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి అయా పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

**ఆలయ ఆవరణలో వసతులు**

దర్శనానికి వచ్చే భక్తులకు ఆలయ ప్రాంగణంలో వసతులు, సౌకర్యాలు కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకం కోసం అన్నదాన మండపాన్ని నిర్మిస్తున్నారు. చిలకలూరిపేటకు చెందిన స్వామి వారి భక్తుడు సుధీర్ ఇచ్చిన రూ.1.6 కోట్ల విరాళంతో ఈ మండప నిర్మాణం చేపట్టారు. భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు విశ్రాంత మందిరాన్ని రూ.47 లక్షలతో పూర్తిచేశారు. దర్శనానికి వచ్చే భక్తులకు వేసవిలో కూడా అసౌకర్యం కలగకుండా ప్రధాన ఆలయం చుట్టూ షెడ్ నిర్మాణం రూ.40 లక్షలతో జరుగుతోంది. టీటీడీ సహకారంతో నిర్మించిన వసతి గృహాన్ని పూర్తిగా ఆధునీకరిస్తున్నారు. రూ.75 లక్షలతో చేపట్టిన పనులతో పాటు మిగిలిన అభివృద్ధి పనులు పూర్తికావడంతో ఈనెల 16వ తేదీన ఏకాదశి రోజున ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి నూతన శోభను తీసుకువచ్చేలా రంగులు వేస్తున్నారు. గాలిగోపురం, స్వాగత ద్వారాలతో పాటు వినాయక విగ్రహం, ఘాట్‌రోడ్డులోని బ్రహ్మ, విష్ణు విగ్రహాలకు రంగులు వేసే పనులు పూర్తికావడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**కొండపై ప్రత్యేక దృష్టి**

దాదాపు రూ.30 కోట్లతో కోటప్పకొండలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నాం. రహదారుల విస్తరణను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని ప్రధాన రహదారుల విస్తరణ పనులు చేపట్టాం. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఆలయంలో అభివృద్ధి పనులు తుదిదశకు చేరుకున్నాయి.

–డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే

**15 నాటికి పనులు పూర్తి**

కోటప్పకొండలో రూ.3.7 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతి, దర్శనం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈనెల 16వ తేదీ ఏకాదశి రోజున అభివృద్ధి పనులు ఆరంభిస్తాం.

–వేమూరి గోపి, ఈవో కోటప్పకొండ

# త్వరలో మెడి'కల సాకారం'

- రాజమహేంద్రవరంలో ప్రభుత్వ వైద్య కళాశాలకు మార్గం సుగమం

**సాక్షి, రాజమహేంద్రవరం:** వైద్య విద్యను పేదలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 16 వైద్య కళాశాలలు నిర్మించాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాజమహేంద్రవరంలో ప్రభుత్వ వైద్య కళాశాల, బోధనాసుపత్రి ఆరంభం దిశగా అడుగులు చకచకా పడుతున్నాయి. 2023–24 విద్యా సంవత్సరం నుంచి కొత్త వైద్య కళాశాలలో అకడమిక్ కార్యకలాపాల నిర్వహణకు వైఎస్సార్ వైద్య విశ్వవిద్యాలయం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో నంద్యాల, మచిలీపట్నం, విజయనగరం, ఏలూరు, రాజమహేంద్రవరం నగరాల్లో వైద్య కళాశాల విద్యా సంబంధ కార్యకలాపాలు ప్రారంభించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. దీంతో ఇక్కడ 150 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశం కల్పించనున్నారు. ఈ మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లలో అధికారులు తలమునకలవుతున్నారు. ఈ వైద్య కళాశాలకు అనుబంధంగా రాజమహేంద్రవరంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి(జీజీహెచ్)ని బోధనాసుపత్రిగా తీర్చిదిద్దుతున్నారు.

**యుద్ధప్రాతిపదికన..**

నగరంలోని సెంట్రల్ జైలు ప్రాంగణంలో వైద్య కళాశాల, బోధనాసుపత్రి నిర్మాణ పనులను రూ.475 కోట్లతో యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. అకడమిక్ కార్యకలాపాలకు ఉద్దేశించిన ప్రీ ఇంజినీర్డ్ బిల్డింగ్ (పీఈబీ) నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. తొలి ఫ్లోర్ నిర్మాణం పూర్తయింది. రెండో ఫ్లోర్ నిర్మాణం చకచకా జరుగుతోంది. ఆలిండియా మెడికల్ కౌన్సిల్ మార్గదర్శకాల మేరకు మేక్‌షిఫ్ట్ (అవసరాలకు అనుగుణంగా మార్పు చేసేలా) పద్ధతిలో కళాశాల పనులు చేపడుతున్నారు. టీచింగ్ స్టాఫ్ క్వార్టర్లు, మెడికోలు, నర్సింగ్ హాస్టళ్లు తదితర భవనాలు అందుబాటులోకి తీసుకురానున్నారు. మే నెలాఖరుకు వీటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. కళాశాలకు అవసరమైన వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియ కూడా ఇప్పటికే పూర్తయింది. ఆసుపత్రిలో ఇదివరకు పని చేస్తున్న వైద్యులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేసి, కొత్తవారిని నియమించారు. అలాగే కళాశాలకు ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ నియామకాలు కూడా పూర్తయ్యాయి. 54 మంది వైద్యులు, 484 మంది నర్సులు, ఇతర ఉద్యోగాలు భర్తీ చేశారు.

**జీజీహెచ్‌కు మహర్దశ**

వైద్య కళాశాల అందుబాటులోకి వస్తే రాజమహేంద్రవరంలోని ప్రస్తుత జీజీహెచ్‌కి మహర్దశ పడుతుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ జీజీహెచ్ తరువాత అత్యంత ప్రాధాన్యం ఉన్నది రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి. తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి ప్రజలు ఇక్కడికి వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. ప్రతి రోజూ 800 నుంచి 1,000 మందికి పైగా ఔట్ పేషెంట్లు (ఓపీ) వస్తుంటారు. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్న ఈ ఆసుపత్రి ప్రాధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. 1864లో 12 పడకలతో ఏర్పాటైన ఈ ఆసుపత్రిని 1942లో 63, 1947లో 90, 1969లో 115, 1976లో 150, 1977లో 200 పడకలకు విస్తరించారు. అలా దినదినాభివృద్ధి చెందిన ఈ ఆసుపత్రిలో ప్రస్తుతం 350 పడకలు ఉన్నాయి. 13 విభాగాల్లో వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక్కడ వైద్య కళాశాల ఏర్పాటు ద్వారా జీజీహెచ్‌ను 500 పడకల బోధనాసుపత్రిగా ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది.

**అకడమిక్ కార్యకలాపాలకు సిద్ధం**

2023–24 విద్యా సంవత్సరం నుంచి అకడమిక్ కార్యకలాపాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సిద్ధంగా ఉన్నాం. కళాశాలకు అవసరమైన భవన నిర్మాణ పనులు ఇప్పటికే వేగంగా జరుగుతున్నాయి. మే నెలాఖరుకు పనులు పూర్తి చేసి, భవనాలు అప్పగిస్తామని కాంట్రాక్టు కంపెనీ స్పష్టం చేసింది. సిబ్బంది నియామకం కూడా పూర్తయింది. కళాశాల నిర్మాణం పూర్తయి, అడ్మిషన్లు ప్రారంభమైతే 150 మెడికల్ సీట్లు అందుబాటులోకి వస్తాయి. వైద్య విద్యార్థులకు ఇది ఎంతో మేలు చేస్తుంది.

– డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల, రాజమహేంద్రవరం

# ఉప్పునీటికి అడ్డుకట్ట



- కొల్లేరు ప్రాంతంలో రెగ్యులేటర్ల నిర్మాణం
- రూ.470 కోట్లతో సవరించిన అంచనాలు
- త్వరలో టెండర్లు పిలవనున్న అధికారులు

**ఆకివీడు:** సముద్రం నుంచి ఉప్పు నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన మూడు రెగ్యులేటర్ల నిర్మాణానికి కసరత్తులు జరుగుతున్నాయి. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో జరిగిన కార్యక్రమంలో రెగ్యులేటర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి భూమి పూజ చేసిన సంగతి తెలిసిందే. కృష్ణా కొల్లేరు సెలినిటీ వాటర్ మిటిగేషన్ ప్రాజెక్టుతో కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణానికి తొలుత రూ.410.14 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. ఆకివీడు వద్ద రెగ్యులేటర్ నిర్మాణానికి రూ.86 కోట్లు, పడతడికి వద్ద రూ.136.06 కోట్లు, మోళ్లపర్రు వద్ద రూ.188.08 కోట్లతో పాత ఎస్టిమేట్లు ఉన్నాయి. ఇటీవల మెటీరియల్ ధరలు పెరిగిపోవడంతో టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో ఎస్టిమేట్లను పునరుద్ధరించాలని ప్రభుత్వం సూచించింది. ఆ ప్రకారంగా రీ ఎస్టిమేట్లు వేసి ప్రభుత్వ ఆమోదం కోసం డ్రైనేజీ శాఖ నివేదికలు పంపింది. ప్రాజెక్టు క్రింద మూడు రెగ్యులేటర్ల నిర్మాణానికి రూ.470.12 కోట్లు అంచనాలు వేశారు. ప్రభుత్వ ఆమోద ముద్ర వేసిన తరువాత మళ్లీ టెండర్లు పిలవనున్నారు.

**రెగ్యులేటర్లతో ఉప్పునీటికి సంకెళ్లు**

ఉప్పునీటి ప్రవాహంతో వేలాది ఎకరాల పంట భూములు చౌడు బారుతున్నాయని, సాగుకు పనికిరాకుండా పోతున్నాయని రైతులు వాపోతున్నారు. మరోపక్క కొల్లేరు సరస్సులోకి ఉప్పునీరు ప్రవేశిస్తుందని, ఇది పర్యావరణానికి, జీవ సమతుల్యానికి హానికరమని పలువురు పేర్కొంటున్నారు. ఉప్పునీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేయకపోతే ప్రతీ ఏటా వేలాది కోట్ల నష్టం వాటిల్లుతుందని, లక్షల కోట్ల విలువైన భూములు నిసత్తువగా మారిపోతాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రెగ్యులేటర్ల ఆవశ్యకతను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జలవనరుల నిపుణులు, ఉన్నతాధికారులతో చర్చించిన తరువాత రెగ్యులేటర్ల నిర్మాణంపై ఒక నిర్ణయానికి వచ్చారు.

**5వ కాంటూరు వరకూ నీటి నిల్వ**

కొల్లేరు సరస్సులోని ఐదో కాంటూర్ వరకూ నీటిని నిల్వ చేసి సరస్సుకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు రెగ్యులేటర్ నిర్మాణం దోహదపడుతుందని పలువురు చెబుతున్నారు. కాంటూర్ ఐదు లోపల ఉన్న ప్రభుత్వ భూమి సుమారు 70 వేల ఎకరాల్లో నీటి నిల్వ సమృద్ధిగా ఉంటుంది. సరస్సు పరీవాహక ప్రాంతంలో జీవ వైవిధ్యం, జీవ సమతుల్యం కాపాడే అవకాశం ఉంది. సరస్సులో లక్షలాది జీవరాసులతో పాటు కొల్లేటి కొంగలు, విదేశీ, స్వదేశీ పక్షి సంతతి వృద్ధిచెంది, పక్షి జాతి అంతరించి పోకుండా మార్గం సుగమమవుతోంది.

**త్వరలో రీ టెండర్లు**

రెగ్యులేటర్ల నిర్మాణంపై రీ ఎస్టిమేట్ వేసి ప్రభుత్వానికి పంపాం. త్వరలోనే ఆమోదం వస్తుంది. వెంటనే రీ టెండర్లు పిలుస్తాం. గతంలో వేసిన ఎస్టిమేట్లలో ధరల వ్యత్యాసం ఉంది. పెరిగిన ధరలకు అనుగుణంగా ఎస్టిమేట్లు వేశాం.

–పీ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, డీఈ, డ్రైనేజీ శాఖ, భీమవరం

**వంతెనల మధ్య రెగ్యులేటర్**

కొల్లేరు సరస్సును ఐదో కాంటూరు వరకూ పరిరక్షించేందుకు ఆకివీడు ఉప్పుటేరు వంతెన వద్ద రెగ్యులేటర్ నిర్మించనున్నారు. రీ ఎస్టిమేట్‌తో రెగ్యులేటర్ నిర్మాణ వ్యయం రూ.105 కోట్లకు చేరుకుంది. త్వరలోనే టెండర్లు పిలవనున్నారు. రెగ్యులేటర్‌తో సరస్సులో నీటిమట్టం స్థిరంగా ఉంటుంది.

–టీ.అప్పారావు, డ్రైనేజీ డీఈ, ఉప్పుటేరు డివిజన్

**కొల్లేరు పరిరక్షణే ధ్యేయం**

కొల్లేరు సరస్సు పరిరక్షణే ధ్యేయంగా సీఎం జగన్ ప్రభుత్వం పనిచేస్తుంది. కొల్లేరు రక్షణలో భాగంగా ఉప్పునీరు కొల్లేరులోకి ప్రవేశించకుండా రెగ్యులేటర్ల నిర్మాణం శుభ సూచకం.

–ముంగర నర్సింహరావు, కొల్లేరు ప్రాంత నాయకుడు

## ఫ్యాషన్



ఏ కాలాన్నైనా బ్రైట్‌గా మార్చేసే గుణం పువ్వుల సొంతం.
ఆ సౌందర్యాన్ని ధరించే దుస్తుల మీదకు తీసుకురావడం తరుణుల అభిమతం అందుకే జాతీయ అంతర్జాతీయ వేదికల మీద కూడా పువ్వుల ప్రింట్లు, డిజైన్లు అమితంగా ఆకట్టుకుంటుంటాయి.
పెళ్లి, పుట్టిన రోజు వంటి వేడుకల్లోనే కాదు క్యాజువల్‌వేర్‌గానూ కట్టిపడేసే పూల డ్రెస్సులు ధరించడమంటే మేనిపైన పూల సంతకం చేసినట్టే.

# పూల సంతకం



### పువ్వుల ప్రింట్లు

ఏ హంగులూ చేయలేం అనుకున్న వారు పువ్వుల ప్రింట్లు ఉన్న సిల్క్ లేదా బ్రొకేడ్, కాటన్ ఫ్యాబ్రిక్‌లో ఏదైనా ఎంచుకో వచ్చు. కాలానుగుణంగా ఫ్యాబ్రిక్ ఎంపికలో మార్పులు ఉండవచ్చు గానీ, పువ్వుల సొగసులో మార్పులు ఉండవని నిరూపిస్తుంటారు అతి వలు. అందుకే కాబోలు పువ్వుల ప్రింట్లు ఉన్న ఫ్యాబ్రిక్ ఎన్నో రకాల స్టైల్స్‌లో డ్రెస్ డిజైనర్ల చేతిలో మారిపో తుంటుంది.

### ఎంబ్రాయిడరీ పూలు

చేతితో చేసిన ఎంబ్రాయిడరీ వర్క్‌లోనూ పువ్వులు. లతల అందం మన మదిని దోచేస్తూనే ఉంటుంది. ఎన్ని హంగులు దిద్దినా వాటినుంచి కొత్త స్ఫూర్తిని పొందుతూనే ఉంటాం. అందుకే కొత్త డిజైన్లను సృష్టిస్తూనే ఉంటారు డిజైనర్లు.

### అప్లిక్ పూలు

కావల్సిన పరిమాణంలో పువ్వులను ముందుగానే డిజైన్ చేసుకొని, ఎంపిక చేసుకున్న ఫ్యాబ్రిక్ మీద ప్యాచ్ వర్క్ చేస్తారు. ఈ పూల గుత్తులు డ్రెస్ అందాన్ని వెయ్యింతలుగా పెంచుతుంది.





## హెయిర్ కేర్

# చుండ్రు నివారణకు

తలలో చుండ్రు సమస్య ఈ కాలం అధికంగా విసిగిస్తుంటుంది. దీనికి కారణం మాడు పై భాగం పొడిబారడం వల్ల తెల్లటి పొట్టులాంటి మృతకణాలు బయటకు కనిపిస్తుంటాయి. దీనివల్ల దురద కూడా ఉంటుంది. ఈ సమస్య నివారణకు..

● ఆపిల్ సైడర్ వెనిగర్‌లో అరటిపండు గుజ్జును బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడుకు పట్టించి పది నిమిషాల తర్వాత వెచ్చని నీళ్లతో శుభ్రపరుచుకోవాలి. ● కలబంద గుజ్జును మాడుకు పట్టించి 15 నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. కలబంద చుండ్రును నివారించడమే కాకుండా మాడుపైన దురద వంటి చర్మ సమస్యలనూ నివారిస్తుంది. వెంట్రుకలకు మృదుత్వాన్ని ఇస్తుంది. ● చిన్న అల్లం ముక్కను సన్నగా తరగాలి. ఈ ముక్కలను నువ్వుల నూనెలో వేసి మరిగించాలి. చల్లారిన తర్వాత కుదుళ్లకు నూనె పట్టేలా మర్దనా చేయాలి. గంట సేపు అలాగే ఉంచి, ఆ తర్వాత తలస్నానం చేయాలి. వారంలో రెండు సార్లు ఈ విధంగా చేస్తే చుండ్రు తగ్గుతుంది. ● కప్పు నీళ్లలో 2–3 టేబుల్ స్పూన్ల ఉప్పు కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించాలి. 10 నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ● వేప నూనె, ఆలివ్ ఆయిల్ సమపాళ్లలో కలిపి వేడి చేయాలి. గోరువెచ్చని ఈ నూనెను తలకు పట్టించి వేళ్లతో మృదువుగా మర్దనా చేయాలి. 15 నిమిషాల తర్వాత రసాయనాల గాఢత తక్కువ ఉండే షాంపూతో తలస్నానం చేయాలి. ● బేబీ ఆయిల్‌ను తలకు పట్టించి, మర్దనా చేసి వెచ్చని నీళ్లలో ముంచి తీసిన టర్కీ టవల్‌ని చుట్టుకోవాలి. 15 నిమిషాల తర్వాత చుండ్రు నివారణకు ఉపయోగించే షాంపూతో తలస్నానం చేయాలి.



## స్త్రీ శక్తి

# సత్తా చాటారు ఐపీఎస్ అయ్యారు

లక్ష్య సిద్ధి ఉంటే విజయం ఖాయమని నిరూపించారు...లక్షల్లో జీతాలు ఇవ్వని తృప్తిని వెతుక్కుంటూ ప్రజాసేవలో అడుగుపెట్టబోతున్నారు. వెన్నుతట్టి ప్రోత్సహిస్తే ఏ రంగంలో నైనా విజేతలమేననడానికి మరోమారు ఉదాహరణగా నిలిచారు యువ ఐపీఎస్ ప్రొబే షనరీ అధికారిణులు. కూతుళ్లను ఉన్నతంగా చూడాలన్న ఆ తండ్రుల ఆశయా లను..మహోన్నతంగా తమ విజయంతో చాటారు ఈ యువ ఐపీఎస్ అధికారి ణులు. తగిన ప్రోత్సాహం అందిస్తే.. తామేంటో చూపిస్తామని నిరూపిం చారు.సమాజంలో అత్యున్నతమైన ఇండియన్ పోలీస్ సర్వీస్‌కు ఎంపిక కావ డమే కాదు..ట్రైనింగ్‌లోనూ తాము సివంగులమని పురుషులతో కలబడి నిలబడ్డారు. బెస్ట్ ఔట్‌డోర్ ట్రోఫీని దక్కించుకున్నారు. రేపు శనివారం దీక్షాంత్ పరేడ్‌తో ప్రజాసేవలోకి తొలి అడుగు పెట్టబోతున్న మహిళా ఐపీఎస్ అధికారులు 'ఫ్యామిలీ'తో తమ శిక్షణ అనుభవాలు..భవి ష్యత్ లక్ష్యాలను ఇలా పంచుకున్నారు...

– నాగోజు సత్యనారాయణ, సాక్షి, హైదరాబాద్

### నాన్నే నాకు స్ఫూర్తి



నాపేరు దీక్ష.. రాజస్థాన్‌లోని జుంజున్ జిల్లా ఖేత్రీ పట్టణం. నాన్న అక్కడే హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్‌లో ఏజీఎంగా పనిచేస్తారు. మా అమ్మ గవర్నమెంట్ టీచర్. ఐఐటీ ఢిల్లీ నుంచి నేను బీటెక్ పూర్తి చేశాను. ఆ తర్వాత యూపీఎస్సీ ప్రిపరేషన్ ప్రారంభించాను. మా నాన్నకు నన్ను ఐపీఎస్‌గా చూడడం ఎంతో ఇష్టం. ఆయన ప్రోత్సాహంతోనే నేను సివిల్స్‌వైపు దృష్టి పెట్టాను. ఆయన ప్రతి విషయంలో నాకు ఎంతో సపోర్ట్‌గా ఉంటారు. అలాగే మా సీనియర్స్ కూడా సివిల్స్ గురించి గొప్పగా చెప్పడం కూడా ఒక కారణం. సివిల్స్ రెండో ప్రయత్నంలో ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్‌కు ఎంపికయ్యాను. ఆ తర్వాత మళ్లీ మా నాన్న ప్రోత్సాహంతో మూడోసారి సివిల్స్ రాశాను. అలా నాకు మూడో ప్రయత్నంలో ఐపీఎస్ వచ్చింది. ఈ శిక్షణకు వచ్చినప్పుడు చాలా ఆందోళనగా అనిపించింది. కానీ క్రమంగా అన్నీ నేర్చుకున్నాను..గుర్రపు స్వారీ, గన్ షూటింగ్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఇలా ప్రతి పని నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. మహిళలు ఏదైనా సాధించగలరు..మన శక్తి ఏంటో మనం గుర్తించాలి. అప్పుడు మనం చేసే పనిలో ఆత్మవిశ్వాసంతో చేయగల్గుతాం. అందుకు నేను ఉదాహరణ. నాకు బెస్ట్ ఔట్‌డోర్ ప్రొబేషనర్ అవార్డు వచ్చింది. ఆ విషయం తెలియగానే మొట్టమొదట మా నాన్నకే ఫోన్ చేసి చెప్పా..ఆయన ఆనందం అంతా ఇంతా కాదు. నాన్న డ్రీమ్ పూర్తి చేశానన్న తృప్తి నాకు ఎంతో అనిపించింది. సివిల్స్ లేదా ఇంకా ఏ పోటీ పరీక్షకు ప్రిపేర్ అయ్యే వారికి నేను చెప్పేది ఒక్కటే... మన లక్ష్యం ఏంటి...? ఎలా సాధించాలన్నదానిపై స్పష్టత ఉండాలి. అందుకు తగ్గట్టుగా ప్రణాళిక పెట్టుకుని చదవాలి. శ్రద్ధగా, నిష్ఠగా ఉండాలి..అలా అని మిగిలిన విషయాలు వదిలేయద్దు. మనకు నచ్చినట్టు రిలాక్స్ అవ్వాలి. ఎంత ఏకాగ్రతతో చదువుతామన్న దాన్ని బట్టి రోజుకు ఎన్ని గంటలు చదవాలన్నది ఉంటుంది. నేను రోజుకు ఆరు నుంచి ఏడు గంటలు మాత్రమే చదివాను. పరీక్ష దగ్గరపడే కొద్ది కొద్దిగా పెంచుతూ వెళ్లా..రోజుకు 10 గంటలకు పెంచాను. నాకు విజయం వచ్చింది.

**– దీక్ష, బెస్ట్ ఔట్‌డోర్ ప్రొబేషనరీ ఐపీఎస్, బీహార్ కేడర్**

### నేనే ఫస్ట్ పోలీస్



మా కుటుంబంలో చాలా మంది బిజినెస్‌లోనే ఉన్నారు. కానీ, నాకు మాత్రం ప్రజలకు దగ్గరగా ఉండే వృత్తిలో ఉండాలని కోరిక .. అందుకే నేను డిగ్రీ చేస్తున్నప్పటి నుంచి సివిల్స్ వైపు వెళ్లాలని నిర్ణయించుకున్నా. అలా నాల్గో ప్రయత్నంలో ఐపీఎస్ వచ్చింది. మా కుటుంబం నుంచి నేను మొదటి పోలీస్ అధికారి కావడంతో మా కుటుంబ సభ్యులు ఎంతో సంతోషంగా ఉన్నారు. మా సొంత ప్రాంతం మహారాష్ట్ర. కానీ, మా కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. నాన్న బిజినెస్‌లో ఉన్నారు. నేను పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే. సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీ నుంచి బీఎస్సీ బయో కెమిస్ట్రీ పూర్తి చేశాను. ఆ తర్వాత సివిల్స్ ప్రిపరేషన్ ప్రారంభించాను. లక్ష్యంపై స్థిరంగా ఉన్నాను..అందుకే మూడుసార్లు విజయం రాకపోయినా ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. నాల్గో ప్రయత్నంలో సివిల్స్ సాధించాను. నేను ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు ఎంపికయ్యాను. అక్కడి ప్రభుత్వం మహిళా భద్రతకు తీసుకుంటున్న చర్యల గురించి విన్నాను. ప్రాక్టికల్ ట్రైనింగ్‌లో జిల్లాల్లో మరిన్ని విషయాలు తెలుసుకునే అవకాశం వస్తుందని భావిస్తున్నా. ఒక ఐపీఎస్ అధికారిగా నా లక్ష్యం ఒక్కటే ...నేను ఎక్కడ పనిచేసినా అక్కడ ప్రజలు భద్రంగా ఉన్నామన్న భావన కల్పించడం.. ప్రత్యేకించి మహిళలు, చిన్నారులకు పోలీస్‌పై నమ్మకం పెంచేలా పనిచేయడం.

**– అంకిత సురాన, ఆంధ్రప్రదేశ్ కేడర్ ఐపీఎస్**

### ప్రణాళిక ఉంటే విజయం తప్పక వస్తుంది



నా పేరు శేషాద్రిని రెడ్డి... మా నాన్న సుధాకర్‌రెడ్డి సివిల్ కాంట్రాక్టర్. చిన్నప్పటి నుంచి మా నాన్న ఎంతో ప్రోత్సహించేవారు. సివిల్ సర్వీసెస్ ఆఫీసర్‌గా ప్రజలకు ఎంత సేవ చేసే అవకాశం ఉంటుంది..వాళ్లకు సమాజంలో ఎంత గౌరవం ఉంటుందన్నది బాగా చెప్పేవారు. అది నాలో ఎంతో ప్రేరణ నింపింది. అలా చిన్ననాటి నుంచే నేను ఐపీఎస్ కావాలని నిశ్చయించుకున్నా. ముందు నుంచి నేను ప్రణాళిక ప్రకారం చదువుకుంటూ వచ్చాను. ఇంజినీరింగ్ పూర్తి చేసిన తర్వాత ప్రిపరేషన్‌పై మరింత ఫోకస్ పెట్టాను. అమ్మా నాన్నల సహకారం నా కష్టంతో చివరకు విజయం సాధించడం సంతోషంగా ఉంది. హైదరాబాద్‌లో పుట్టిపెరిగిన నాకు మళ్లీ తెలంగాణ కేడర్‌లో సొంత రాష్ట్రంలోనే సేవ చేసే అవకాశం రావడం ఇంకా సంతోషంగా ఉంది. తెలంగాణలో పోలీస్ టెక్నాలజీ పరంగా, ఇతర అంశాల్లోనూ ఎంతో బాగున్నాయి. ఇప్పటికే మా సీనియర్ అధికారులు అమలు చేస్తున్న విధానాలను తెలుసుకుంటూనే ప్రజలకు పోలీసింగ్ మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తాను. భవిష్యత్తులో మరింతగా పెరగనున్న సైబర్ నేరాలను ఎలా కట్టడి చేయాలన్న దానిపైన మాకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. అది మరింత ఉపయోగపడుతుందని నేను భావిస్తున్నాను.

**– శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్, తెలంగాణ కేడర్**

### ఆరేళ్ల బాబును వదిలి ట్రైనింగ్‌కు వచ్చా



ఐపీఎస్ కావాలన్న లక్ష్యం కోసం ఆరేళ్ల బాబును వదిలి ట్రైనింగ్‌కు వచ్చాను..చివరకు మా బ్యాచ్‌లో లేడీ ప్రొబేషనరీ ఔట్‌డోర్ టాపర్‌గా నేను నిలవడం సంతోషంగా ఉంది. నాది తమిళనాడు రాష్ట్రంలోని సేలం జిల్లా. మా నాన్నగారు రైతు, మా అమ్మ టీచర్. నాకు ఒక చెల్లి. వీఐటీ యూనివర్సిటీ వెల్లూరులో నేను బీటెక్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చదివాను. తర్వాత వివాహం అయ్యింది. సాఫ్ట్‌వేర్‌లో మంచి ఉద్యోగం అయినా ఏదో వెలితి ఉండేది. దాన్ని వదిలేశాను. ఆడిట్ అండ్ అకౌంట్ సర్వీస్‌లో పని చేశాను.అదీ మంచి ఉద్యోగమే అయినా తృప్తి లేదు. ప్రజలతో మమేకమై వారికి ఉపయోగపడే వృత్తిలో ఉండాలని నిర్ణయించుకున్నాను. అప్పటికే నాకు కొడుకు పుట్టాడు. ఈ టైంలో మంచి ఉద్యోగం వదిలి సివిల్స్ ఎందుకు అని మా కుటుంబం, ముఖ్యంగా నా భర్త నిరుత్సాహపర్చలేదు.. నీ లక్ష్యం కోసం వెళ్లు.. కుటుంబాన్ని నేను చూసుకుంటా అన్నాడు. దాంతో బాబు పుట్టిన తర్వాత నేను యూపీఎస్సీకి ప్రిపరేషన్ ప్రారంభించాను. అలా ఐపీఎస్‌కి సెలెక్ట్ అయ్యాను. నేను ఔట్‌డోర్ ట్రైనింగ్‌లో ట్రోఫీ పొందానంటే ఈ ట్రైనింగ్ నాలో పెంచిన ఆత్మవిశ్వాసమే కారణం. ఐపీఎస్ శిక్షణ అనేది అంత చిన్న విషయమేమీ కాదు. ఫిజికల్‌గా, మెంటల్‌గా కూడా ఎంతో శ్రమించాలి. శిక్షణ ప్రారంభంలో చాలా కష్టంగా అనిపించినా..క్రమంగా మనలోని శక్తిని మనం గుర్తిస్తాం. మా కుటుంబం నుంచి నేను మొదటి పోలీస్‌ను. ఎంతోమంది మహిళా పోలీసు అధికారులు నేను చూసిన వాళ్లు.. వాళ్లంతా నాకు ప్రేరణే. ఒక మహిళా పోలీస్ అధికారిగా నా వృత్తి జీవితంలో మహిళలు, చిన్నారుల సంరక్షణకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని నేను భావిస్తున్నాను. నా శిక్షణలో నా కుటుంబం సపోర్ట్ ఎంతో ఉంది.

**– నిత్యా రాధాకృష్ణన్, ప్రొబేషనరీ ఐపీఎస్, ఏజీఎంటీయూటీ కేడర్**

ఫొటోలు: పోచంపల్లి మోహనాచారి

## వంటిల్లు

# రుచికి తోడుగా ఆరోగ్యం

ఇంటికి బంధువులు వస్తున్నారు.
డైనింగ్ టేబుల్ కళకళలాడుతోంది.
తోటకూర ఉంది... పక్కనే వేటకూరా ఉంది.
కూరగాయల ఆధరువులూ కొలువుదీరాయి.
బంధువులు వచ్చారు... భోజనాలు పూర్తయ్యాయి.
వేటకూర పాత్రలో గరిటె మాత్రమే మిగిలింది.
తోటకూర పాత్ర అదే కళతో నిండుగా ఉంది.
కూరగాయల వంటలు దిగులుగా చూస్తున్నాయి.
అతిథులు రుచిగా భోజనం చేశారు... సంతోషం.
మరి... రుచికి ఆరోగ్యం
జతగా చేరి ఉంటే మరీ సంతోషం.
అందుకే... ఈ వారానికి
ఇలా వండి టేస్ట్ చేద్దాం.

### పాలక్ చికెన్



**కావలసినవి:** పాలకూర– 100 గ్రాములు (శుభ్రం చేసినది) ; బోన్‌లెస్ చికెన్ - పావు కేజీ.

**మారినేట్ చేయడానికి:** పెరుగు - 2 టేబుల్ స్పూన్‌లు ; మిరప్పొడి - అర టీ స్పూన్ ; ధనియాల పొడి– టీ స్పూన్ ; కసూరి మేథీ (మెంతి ఆకుల పొడి) – టీ స్పూన్ (పొడి లేకపోతే గుప్పెడు తాజా ఆకులు వాడవచ్చు) ; గరం మసాలా పొడి– అర టీ స్పూన్ ; ఉప్పు - టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నిమ్మరసం– టేబుల్ స్పూన్ ; నెయ్యి– టేబుల్ స్పూన్ .

**గ్రేవీ కోసం:** నూనె – 2 టేబుల్ స్పూన్‌లు ; యాలకులు - 3 ; బిర్యానీ ఆకులు – 2 ; జీలకర్ర – అర టీ స్పూన్ ; ఉల్లిపాయలు – 3 (గ్రైండ్ చేయాలి) ; వెల్లుల్లి పేస్ట్ – టేబుల్ స్పూన్ ; అల్లం పేస్ట్ – టేబుల్ స్పూన్ ; పచ్చిమిర్చి– 2 (నిలువుగా చీరాలి) ; టొమాటోలు – 3 (తొక్క, గింజలు తీసి గ్రైండ్ చేయాలి) ; మిరప్పొడి– అర టీ స్పూన్ ; గరం మసాలా పొడి– టీ స్పూన్ ; ధనియాల పొడి– టీ స్పూన్ ; కసూరి మేథీ– టేబుల్ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; మీగడ– టేబుల్ స్పూన్.

**గార్నిష్ చేయడానికి:** వెన్న – టేబుల్ స్పూన్

**తయారీ:** ● చికెన్‌ను శుభ్రం చేసి పెద్ద పాత్రలో వేయాలి. మరొక పాత్రలో మారినేట్ చేయడానికి తీసుకున్న దినుసులను వేసి బాగా కలిపి ఈ మిశ్రమాన్ని చికెన్ ముక్కల్లో వేసి అన్నింటికీ సమంగా పట్టించి మూతపెట్టి ఆ పాత్రను మూడు గంటల సేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. ● ఈ లోపు ఒక పాత్రలో నీటిని మరిగించి పాలకూర ఆకులను వేసి రెండు నిమిషాలపాటు మరిగిన తర్వాత ఆకులను చిల్లుల గరిటెతో బయటకు తీసి చన్నీటిలో వేయాలి. వేడి తగ్గిన తర్వాత వడపోసి పక్కన ఉంచాలి. చల్లారిన తరవాత మెత్తగా గ్రైండ్ చేయాలి. ● మందపాటి పాత్రలో నెయ్యి వేడి చేసి మారినేట్ చేసిన చికెన్ వేసి (మీడియం మంట మీద ) ముక్కలను గరిటెతో కలుపుతూ మగ్గనివ్వాలి. ముక్కలు మెత్తబడిన తరవాత దించేసి పక్కన పెట్టాలి. ● వెడల్పుగా ఉన్న పాన్‌లో నూనె వేడి చేసి జీలకర్ర వేసి చిటపటలాడనివ్వాలి. యాలకులు, బిర్యానీ ఆకులు, పచ్చిమిర్చి, ఉల్లిపాయ, వెల్లుల్లి, అల్లం పేస్టు వేసి మూడు నిమిషాల పాటు వేయించాలి. నూనె వేరు పడిన తర్వాత టొమాటో పేస్ట్ వేసి కలిపి అందులో ధనియాల పొడి, మిరప్పొడి, కసూరీ మేథీ, గరం మసాలా పొడి, ఉప్పు వేసి వేగనివ్వాలి. ఇవన్నీ వేగిన తరవాత పాలకూర పేస్ట్, ఉడికించిన చికెన్ వేసి కలిపి నాలుగు నిమిషాల సేపు ఉడికించాలి. చివరగా మీగడ వేసి కలిపి దించేయాలి. వడ్డించేముందు కర్రీ మీద వెన్న వేయాలి.

### గోంగూర మటన్



**కావలసినవి:** మటన్ – అర కేజీ ; గోంగూర – పావు కేజీ (ఆకులు); పసుపు – టీ స్పూన్ ; అల్లంవెల్లుల్లి పేస్ట్ – టేబుల్ స్పూన్ ; ఉల్లిపాయ ముక్కలు – కప్పు ; మిరప్పొడి– టీ స్పూన్ ; ధనియాల పొడి– టీ స్పూన్ ; జీలకర్ర పొడి– అర టీ స్పూన్ ; పచ్చి మిర్చి – 5 (నిలువుగా చీరాలి) ; కొత్తిమీర – చిన్న కట్ట ; గరం మసాలా పొడి– టీ స్పూన్ ; షాజీర– టీ స్పూన్ ; యాలకులు – 2 ; దాల్చిన చెక్క – అంగుళం ముక్క ; లవంగాలు – 2 ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు.

**తయారీ:** ● ప్రెషర్ కుక్కర్‌లో మటన్, జీలకర్ర పొడి, ధనియాలపొడి, మిరప్పొడి, అరకప్పు నీరు, ఉప్పు వేసి కలిపి మూత పెట్టి ఉడికించాలి. ● పెనంలో నూనె వేడి చేసి గరం మసాలా దినుసులన్నీ వేసి వేగిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు వేయాలి. ఉల్లిపాయ ముక్కలు రంగు మారిన తరవాత అల్లంవెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చివాసన పోయేవరకు వేగనివ్వాలి. ఇప్పుడు పసుపు, పచ్చిమిర్చి, గోంగూర ఆకులు వేసి బాగా కలిపి సన్న మంట మీద ఉడికించాలి. గోంగూర మెత్తబడిన తర్వాత మటన్ (ఉడికించిన నీటితోపాటు) వేసి కలిపి ఐదు నిమిషాల సేపు ఉడికించాలి. ● చివరగా అవసరాన్ని బట్టి మరికొంత నీటిని వేసి కలిపి గరం మసాలా పొడి, కొత్తిమీర ఆకులు వేసి కలిపి దించేయాలి.

### చికెన్ వెజిటబుల్ స్ట్యూ



**కావలసినవి:** చికెన్ – అర కేజీ ; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు ; జీలకర్ర – అర టీ స్పూన్ ; మెంతులు – అర టీ స్పూన్ ; అల్లం వెల్లుల్లి పేస్ట్ – టీ స్పూన్ ; కరివేపాకు – 2 రెమ్మలు ; ఉల్లిపాయ – 1 (తరగాలి) ; పచ్చిమిర్చి– 1 (తరగాలి) ; టొమాటో – 1 (తరగాలి) ; బంగాళదుంప ముక్కలు – కప్పు ; క్యారట్ ముక్కలు – కప్పు ; బీన్స్ ముక్కలు – అర కప్పు ; పసుపు – టీ స్పూన్ ; కశ్మీర్ మిరప్పొడి – టీ స్పూన్ ; ధనియాల పొడి– టీ స్పూన్ ; గరం మసాలా పొడి– అర టీ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నిమ్మరసం – టీ స్పూన్ ; మిరియాల పొడి – పావు టీ స్పూన్ నీరు – 3 కప్పులు.

**తయారీ:** ● చికెన్ ముక్కలను శుభ్రం చేసి పక్కన పెట్టుకోవాలి. ● పెద్ద పెనంలో నూనె వేడి చేసి జీలకర్ర, మెంతులు వేయించాలి. అందులో కరివేపాకు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి అవి వేగిన తరవాత ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. ఇప్పుడు మసాలా పొడి, పసుపు, కశ్మీర్ మిరప్పొడి, ధనియాల పొడి వేసి అర నిమిషం పాటు సన్న మంట మీద అన్నింటినీ కలుపుతూ వేయించి, టొమాటో ముక్కలు వేసి మగ్గనివ్వాలి. ● ఇందులో చికెన్ ముక్కలు వేసి మసాలా మిశ్రమం బాగా పట్టేటట్లు కలిపి మూత పెట్టి సన్న మంట మీద ఐదు నిమిషాల పాటు ఉడికించాలి. ● ఇప్పుడు బంగాళదుంప ముక్కలు, నీరు పోసి కలిపి మూత పెట్టి పది నిమిషాల సేపు ఉడికించాలి. ఆ తర్వాత క్యారట్, బీన్స్ వేసి కలిపి మళ్లీ మూత పెట్టి మరో ఐదారు నిమిషాల పాటు ఉడకనివ్వాలి. ఇప్పుడు నిమ్మరసం, మిరియాల పొడి వేసి కలిపి దించేయాలి. వేడి వేడి చికెన్ వెజిటబుల్ స్ట్యూ రెడీ.

### బీరకాయ రొయ్యలు



**కావలసినవి:** రొయ్యలు – అరకేజీ (పొట్టు వలిచినవి) ; బీరకాయ – అరకేజీ ; పసుపు – అర టీ స్పూన్ ; పచ్చిమిర్చి– 2 ; ఉల్లిపాయలు – 4 ; అల్లంవెల్లుల్లి పేస్ట్ – టీ స్పూన్ ; ఆవాలు – టీ స్పూన్ ; జీలకర్ర – టీ స్పూన్ ; కరివేపాకు – 4 రెమ్మలు ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నూనె – 4 టేబుల్ స్పూన్‌లు.

**తయారీ:** ● రొయ్యలను ఉప్పు, పసుపు వేసి శుభ్రంగా కడిగి మందంగా ఉన్న పాత్రలో వేయాలి. అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉప్పు, మిరప్పొడి, కొద్దిగా నూనె వేసి కలిపి పదినిమిషాల సేపు పక్కన ఉంచాలి. ● బీరకాయ చెక్కు తీసి ముక్కలుగా తరగాలి. ● పెనంలో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేగిన తర్వాత కరివేపాకు వేయాలి. ఇప్పుడు బీరకాయ ముక్కలు వేసి కలిపి మూత పెట్టి సన్నమంట మీద ఉడకనివ్వాలి. ● రొయ్యలు, మసాలా మిశ్రమం ఉన్న పాత్రను మరొక స్టవ్ మీద పెట్టి సన్న మంట మీద ఉడికించాలి (ఇందులో నీరు పోయనక్కరలేదు). రొయ్యలు ఉడికిన తర్వాత ఈ మిశ్రమాన్ని బీరకాయ ఉడుకుతున్న పాత్రలో వేయాలి. ఇందులో ఉప్పు, మిరప్పొడి కూడా వేసి బాగా కలిపి రుచి కలిసే వరకు రెండు నిమిషాల సేపు ఉడికించాలి.

● ఆర్ట్ అండ్ కల్చర్


ఆష్టి మిల్లర్

# అపురూప కల్పన

## ఆర్కిటెక్చర్ + ఆర్ట్

**ముంబైకి చెందిన ఆష్టి మిల్లర్‌ను 'ఆర్కిటెక్ట్' అంటే మాత్రమే సరిపోదు. అలా అని 'ఆర్ట్'కు మాత్రమే పరిమితం చేయలేము. ఇలస్ట్రేషన్, గ్రాఫిక్ డిజైన్‌లతో తన ప్రొఫెషనల్ కెరీర్‌కు కొత్త మెరుపు తీసుకువచ్చింది. అదే తన ప్రత్యేకశైలిగా మారింది...**

**ముం**బైలోని ఆష్టి మిల్లర్ ఇల్లు క్రియేటివిటీకి సంబంధించిన విషయాలకు కేంద్రంగా ఉండేది. తల్లి ఫైన్ ఆర్టిస్ట్. తండ్రి ఆర్కిటెక్ట్. ఇంటినిండా ఆర్ట్‌కు సంబంధించిన ముచ్చట్లే! చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులతో పాటు రకరకాల మ్యూజియమ్‌లు, ఆర్ట్‌గ్యాలరీలకు వెళుతుండేది మిల్లర్.

అవి ఊరకే ఉండనిస్తాయా! తనలో సృజనాత్మకమైన ఆలోచనలను పెంపొందించాయి.

సక్సెస్‌ఫుల్ ఆర్కిటెక్ట్‌గా తండ్రికి మంచి పేరు ఉంది. అయితే అది రాత్రికి రాత్రి వచ్చేందేమీ కాదు. ఎంతో కష్టపడ్డాడు. తండ్రి కష్టం తనకు ఆదర్శం అయింది. తండ్రి బాటలోనే ఆర్కిటెక్చర్ కోర్సు చదువుకుంది. 'మిల్లర్ ఇంక్ స్టూడియో' మొదలు పెట్టింది. ఈ స్టూడియో ద్వారా ప్రొఫెషనల్ కెరీర్ 'ఆర్కిటెక్ట్'ను తన క్రియేటివిటీకి సంబంధించిన ఇలస్ట్రేషన్ అండ్ గ్రాఫిక్ డిజైన్‌లతో మిళితం చేసి యూనిక్ స్టైల్‌తో తిరుగులేని విజయం సాధించింది మిల్లర్.

జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధ బ్రాండ్‌లతో కలిసి పనిచేస్తోంది. మారథాన్‌లకు సంబంధించిన మెడల్స్‌ను యూనిక్ స్టైల్‌లో డిజైన్ చేయడంలో తనదైన ప్రత్యేకత సాధించుకుంది.

ఒక ఫిన్‌టెక్ కంపెనీ బ్రాండ్‌కు సంబంధించి మనీఆర్ట్ సిరీస్ కోసం మిల్లర్ సృష్టించిన 14 లేయర్‌లతో కూడిన ఆర్ట్ వర్క్‌కు మంచి పేరు వచ్చింది. ప్రతి లేయర్‌లో వివిధ దేశాలకు చెంది కరెన్సీ, వివిధ భౌగోళిక ప్రాంతాలకు సంబంధించిన ఎలిమెంట్స్ ప్రతిఫలిస్తాయి.

> నేను చేసే వర్క్స్‌లో వీలైనన్ని వివరాలు ఉండేలా జాగ్రత్త పడతాను. దీంతో వీక్షకులు అందులో కొత్తదనాన్ని చూస్తారు. నా ఆలోచన విధానం ఏమిటో తెలిసిపోతుంది. నా మది ఎప్పుడూ రకరకాల ఐడియాలతో నిండిపోయి ఉంటుంది. వాటిలో నుంచి కొన్ని ఐడియాలను తీసుకొని పనిచేస్తాను.
> – మిల్లర్

మిల్లర్ ఆర్ట్‌వర్క్స్ దేశవిదేశాల్లోని ప్రసిద్ధ గ్యాలరీలలో ప్రదర్శించబడ్డాయి.

'మిల్లర్ ఆర్ట్‌వర్క్‌లో తాజాదనం కనిపిస్తుంది. సూటిగా మనసును తాకే ఆకర్షణీయత ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో నగరాలలో ఎన్నో కట్టడాలు ఉన్నాయి. వాటి వైవిధ్యాన్ని తన కళలోకి తీసుకురావడానికి ఎంతో అవకాశం ఉంది' అంటుంది క్యూరేటర్ అమ్‌బ్రోగి.

'మిల్లర్‌లోని ప్రత్యేకత ఏమిటంటే ఒకే సమయంలో భిన్నమైన విషయాల గురించి ఆలోచించడం. వాటిని సృజనాత్మకంగా సమన్వయం చేసుకోవడం. ఆమె ఆర్ట్‌వర్క్స్‌లో ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, శిల్పం, చిత్రం మిళితమై కనిపిస్తాయి' అంటున్నాడు ఆర్కిటెక్చరల్ సంస్థ పికార్ట్‌కు చెందిన ఆంథోనీ మార్కెస్.

ఆంథోనితో కలిసి అర్బన్ మాస్టర్ ప్లాన్స్ నుంచి పర్సనల్ స్పేసెస్ వరకు ఎన్నో ప్రాజెక్ట్‌లలో పనిచేసింది ఆష్టి మిల్లర్.

'మోర్ ఈజ్ బెటర్' అనే ఫిలాసఫీని నమ్ముతున్న ఆష్టి మిల్లర్ తాజాగా ఫోర్బ్స్ ఇండియా '30 అండర్ 30'లో చోటు సంపాదించింది.

● టెక్.. టాక్

## పోకో ఎక్స్5 ప్రో

డిస్‌ప్లే: 6.67 అంగుళాలు ; రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
మెమోరీ: 128జీబి 6జీబి ర్యామ్ 6 జీబి 8జీబి ర్యామ్
రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్ ; కలర్స్: బ్లాక్, బ్లూ, ఎల్లో




## మైక్రోసాఫ్ట్ 'ఎడ్జ్'లో కొత్త ఫీచర్స్

మైక్రోసాఫ్ట్ తమ వెబ్‌బ్రౌజర్ 'ఎడ్జ్' ను కొత్త ఏఐ ఆధారిత ఫీచర్స్‌తో అప్‌డేట్ చేసింది. బ్రాండ్–న్యూ లుక్‌తో కనిపించనున్న 'ఎడ్జ్' బ్రౌజర్‌లోని రెండు ఏఐ ఆధారిత ఫీచర్లు చాట్, కంపోజ్. 'చాట్'తో వెబ్‌పేజ్ కంటెంట్, డాక్యుమెంట్‌కు సంబంధించి సమ్మరీని పొందడానికి, ప్రశ్నలు అడగడానికి వీలవుతుంది. 'కంపోజ్' ఫీచర్ అనేది రైటింగ్ అసిస్టెంట్. ఇది ప్రాంప్ట్స్ ఆధారంగా టెక్స్ట్, ఇ–మెయిల్స్‌ను జనరేట్ చేస్తుంది.



## ఇన్‌స్టాగ్రామ్‌లో ఇలా...

ఇన్‌స్టాగ్రామ్‌లో (ఐఫోన్) ఒరిజినల్ ఫొటోలు 'ఫొటో లైబ్రరీ'లో సేవ్ కావడానికి...

1. ఇన్‌స్టా ఒపెన్ చేసి 'ప్రొఫైల్'లోకి వెళ్లాలి.
2. అప్పర్‌రైట్ కార్నర్‌లో మూడు లైన్స్ టాప్ చేయాలి.
3. సెట్టింగ్స్–సెలెక్ట్
4. ఎకౌంట్‌లోకి వెళ్లాలి.
5. ఒరిజినల్ ఫొటోస్–టాప్
6. 'సేవ్ ఒరిజినల్ ఫొటోస్' బటన్ నొక్కాలి.



● సక్సెస్ స్టోరీ

# కర్మయోగి స్ఫూర్తితో...

**యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ) నిర్వహించే ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (ఐఇఎస్-2022)లో హైదరాబాద్‌కు చెందిన పవన్ స్వరూప్ రెడ్డి 5వ ర్యాంక్ సాధించాడు.**



సూరత్ 'నిట్'లో సివిల్ ఇంజనీరింగ్ చేసిన పవన్ స్వరూప్‌రెడ్డి ఐఐటీ, కాన్పూర్‌లో స్ట్రక్చరల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేశాడు. 'మెట్రో మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచిన డా.శ్రీధరన్ ఆటోబయోగ్రఫీ 'కర్మ యోగి' చదివాడు పవన్ స్వరూప్. ఈ పుస్తకం తనలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. బలమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవడానికి కారణం అయింది. శ్రీధరన్ చేసిన ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్‌లతో స్ఫూర్తి పొందిన పవన్ స్వరూప్ ఇంజనీరింగ్ సర్వీస్‌లలోకి రావాలనుకున్నాడు. తనను ఐ.ఇ.ఎస్ ఆఫీసర్‌గా చూడాలనేది తల్లి కల. తండ్రి ఆంజనేయులురెడ్డి ఇదే పరీక్షల్లో ఒకప్పుడు 13వ ర్యాంక్ సాధించాడు. ప్రస్తుతం ఆయన సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్‌లో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు.

బెంగళూరులోని అమెరికాకు చెందిన ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీలో స్ట్రక్చరల్ ఇంజనీర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు రోజుకు 5–6 గంటలు, సెలవు రోజు 8–10 గంటల పాటు 'ఐఇఎస్' పరీక్షల కోసం ప్రిపేరయ్యేవాడు. 'ఒకవైపు ఉద్యోగబాధ్యతలకు వందశాతం న్యాయం చేయాలి. మరోవైపు ఆఫీస్ నుంచి వచ్చిన తరువాత పరీక్షలకు గట్టిగా ప్రిపేర్ కావాలి' అనుకొని రంగంలోకి దిగాడు. స్మార్ట్‌ఫోన్‌ను పక్కన పెట్టాడు. స్టడీ మెటీరియల్ మాత్రమే తన కళ్ల ముందు కనిపించేది. స్వరూప్ కష్టం వృథా పోలేదు. ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్‌లో 5వ ర్యాంకుతో విజయకేతనం ఎగరేశాడు.

'ఒక్కసారి మీ ప్రయత్నంలో విఫలం అయితే ఎంతమాత్రం నిరాశ పడనక్కర్లేదు. మనం చేసిన తప్పుల నుంచి కూడా ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. ఏంచేయకూడదో తెలుసుకోవచ్చు. మనం నిర్దేశించుకున్న లక్ష్యంపై గట్టి సంకల్పబలం ఉంటే విజయం దక్కడం కష్టమేమీ కాదు' అంటున్న పవన్ స్వరూప్‌రెడ్డి తన వృత్తిజీవితంలో విజయాలు సాధించాలని ఆశిద్దాం.

● గేమింగ్

## మోస్ట్ వాంటెడ్ గేమ్

**ఓ**పెన్–వరల్డ్, యాక్షన్ రోల్–ప్లేయింగ్ గేమ్ 'హాగ్‌వార్ట్స్ లెగసీ' నేడు విడుదల అవుతుంది. హ్యారీపోటర్ నవలల ఆధారంగా అల్లుకున్న కథ ఇది. ఈ గేమ్‌లో ప్లేయర్స్ హాగ్‌వార్ట్స్ స్కూల్ ఆఫ్ విచ్‌క్రాఫ్ట్ క్లాస్‌లకు హాజరు కావాల్సి ఉంటుంది. ప్లేయర్ క్యారెక్టర్ యుద్ధతంత్రాలలో నైపుణ్యం సాధించాల్సి ఉంటుంది. లియర్‌జర్‌ఫిగ్‌లాంటి కొత్త క్యారెక్టర్లను ఈ ఆటలో ప్రవేశ పెట్టారు. మూడు మంత్రదండాలలో ప్రతిదానికి తనదైన ప్రత్యేక శక్తి ఉంటుంది. హ్యారీపాటర్ అభిమానులకు 'మోస్ట్ వాంటెడ్ గేమ్' గా గుర్తింపు పొందింది.

**జానర్స్:** ఒపెన్ వరల్డ్ ఎంటర్‌టైన్‌మెంట్ నెరేటివ్
**మోడ్:** సింగిల్–ప్లేయర్ వీడియో గేమ్
**ప్లాట్‌ఫామ్స్:** పీసి, పీఎస్5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్



# సినిమా

మలయాళం 'దృశ్యం' పోస్టర్లు







**ఒక 'దృశ్యం'... మలయాళంలో బంపర్ హిట్. అదే 'దృశ్యం'... తెలుగు, తమిళ్, కన్నడ, హిందీలోనూ సూపర్ హిట్. అందుకే ఈ 'దృశ్యం' దేశం దాటింది. అటు చైనా.. ఇండోనేషియాలోనూ 'దృశ్యం' బాక్సాఫీస్ రికార్డులు సాధించింది. ఇలా మలయాళంలో వచ్చిన 'దృశ్యం' ఏ భాషలో రీమేక్ అయితే ఆ భాషలో హిట్. ఇప్పుడు ఇంగ్లీష్ 'దృశ్యం' రానుంది. ఇంకా పలు విదేశీ భాషల్లో రీమేక్ కానుంది. ప్రపంచ వ్యాప్తంగా చూసే సినిమాలను 'పాన్ ఇండియా' అంటున్నాం. 'పాన్ ఇండియా మూవీ' అంటే కథ కూడా 'పాన్ ఇండియా'ది అయ్యుండాలి. 'దృశ్యం' అలాంటి కథే. ఇది కదా... పాన్ ఇండియా కథ! ఇక ఈ 'దృశ్యం' గురించి తెలుసుకుందాం.**

# ఇది కదా... పాన్ ఇండియా కథ!

**కథ ఏంటంటే...**

సినిమాల పట్ల విపరీతమైన ఆసక్తి ఉన్న ఓ మధ్యతరగతి కుటుంబానికి చెందిన తండ్రి తన కుటుంబాన్ని, ముఖ్యంగా తన పెద్ద కుమార్తెను ఊహించని ఆపాయం నుంచి ఎలా రక్షించుకోగలిగాడు? ఈ ప్రయత్నంలో ఓ పోలీసాఫీసర్ కుమారుడి హత్య కేసును ఛేదించాలనుకునే పోలీస్ డిపార్ట్‌మెంట్ వ్యూహాలకు ఎటువంటి ప్రతివ్యూహాలు రచించి, ఆ తండ్రి సక్సెస్ అయ్యాడు అన్నదే ఈ చిత్ర కథ.

**తొ**మ్మిదేళ్ల క్రితం హీరో మోహన్‌లాల్, దర్శకుడు జీతూ జోసెఫ్ కాంబినేషన్‌లో మలయాళంలో 'దృశ్యం' చిత్రం రూపొందింది. ఈ చిత్రంలో మీనా, అన్సిబా హాసన్, ఎస్తర్ అనిల్, ఆశా శరత్, సిద్ధిక్ కీలక పాత్రలు పోషించారు. ఐదు కోట్ల రూపాయల బడ్జెట్‌తో ఈ సినిమాను ఆంటోనీ పెరుంబవూర్ నిర్మించారు. 2013 డిసెంబరు 19న విడుదలై, ఈ చిత్రం సంచలన విజయం సాధించింది. ఫ్యామిలీ ఎమోషన్స్‌కు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ జోడించి జీతూ జోసెఫ్ తీసిన ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చింది. ఎంతగా నచ్చిందంటే.. కేరళ బాక్సాఫీస్ చరిత్రలో యాభై కోట్ల రూపాయల వసూళ్లను సాధించిన తొలి చిత్రంగా 'దృశ్యం' చరిత్ర సృష్టించింది. మొత్తంగా 75 కోట్ల రూపాయల వసూళ్లను రాబట్టింది. ఈ సినిమా షూటింగ్‌ని కేవలం 44 రోజుల్లోనే పూర్తి చేశారు. ఇక 'దృశ్యం' సూపర్ డూపర్ హిట్ సాధించడంతో 2020 సెప్టెంబర్‌లో 'దృశ్యం 2' షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు మోహన్‌లాల్, జీతూ జోసెఫ్ అండ్ ఆంటోనీ పెరుంబవూర్. తొలి భాగంలానే పర్ఫెక్ట్ ప్లానింగ్‌తో 46 రోజుల్లో షూటింగ్‌ను పూర్తి చేసి 2021 ఫిబ్రవరి 19న ప్రేక్షకుల ముందుకు తెచ్చారు. 'దృశ్యం 2' కూడా సూపర్ డూపర్ హిట్. అయితే ఓ వెలితి. అదేంటంటే.. 'దృశ్యం 2' థియేటర్స్‌లో కాకుండా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో విడుదలైంది. దీనికి కారణం కరోనా. ఒకవేళ థియేటర్స్‌లో విడుదలై ఉంటే కొత్త బాక్సాఫీస్ రికార్డ్స్ నమోదై ఉండేవేమో! 2016లో విడుదలై దాదాపు రూ. 150 కోట్ల వసూళ్లను సాధించిన 'పులిమురుగన్'(ఇందులో మోహన్‌లాల్ హీరో) రికార్డును 'దృశ్యం 2' బ్రేక్ చేసి ఉండేదని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

**మోహన్ లాల్, జీతూ జోసెఫ్, ఆంటోనీల కాంబినేషన్‌లో 'దృశ్యం 3' కూడా రానుంది. గత ఏడాది ఆగస్టులో జరిగిన ఓ అవార్డు ఫంక్షన్‌లో 'దృశ్యం 3' ఉంటుందన్నారు ఆంటోనీ.**

**తొలి ఇండియన్ మూవీ!**

'దృశ్యం' సినిమా సూపర్ డూపర్ హిట్ కావడంతో పాటు పలు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమై వీక్షకుల, విమర్శకుల ప్రసంశలను పొందింది. దీంతో ఈ సినిమా రీమేక్ రైట్స్ హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. మలయాళ 'దృశ్యం' సినిమాను 2014లో తెలుగులో 'దృశ్యం'గా (ఇందులో వెంకటేశ్ హీరోగా నటించారు), కన్నడంలో 'దృశ్య' (ఇందులో రవిచంద్రన్)గా రీమేక్ చేశారు. ఆ తర్వాత 2015లో తమిళంలో 'పాపనాశం'గా (కమల్‌హాసన్ హీరో), హిందీలో 'దృశ్యం' (అజయ్ దేవగన్)గా రీమేక్ చేశారు. అంతేకాదు.. ఆ తర్వాత శ్రీలంక భాషలో 'ధర్మయుద్ధాయ' (2017)గా, చైనాలో 'షీప్ వితవుట్ షెపర్డ్' (2019)గా ఆ తర్వాత ఇండోనేషియాలో 'దృశ్యం'గా రీమేక్ అయ్యింది. ఇలా చైనా, ఇండోనేషియా భాషల్లో రీమేక్ అయిన తొలి ఇండియన్ మూవీ కూడా 'దృశ్యం'నే కావడం విశేషం. రీమేక్ కావడమే కాదు.. అక్కడ బాక్సాఫీస్ పరంగా హిట్ సాధించింది. కాగా, 'దృశ్యం' సినిమాకు సీక్వెల్‌గా 2021లో విడుదలైన మలయాళ 'దృశ్యం 2'కి కూడా డిజిటల్ వీక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. దీంతో 'దృశ్యం 2'ను తెలుగు, హిందీ భాషల్లో రీమేక్ చేశారు. 'దృశ్యం' రీమేక్‌లో నటించిన వెంకటేశ్‌నే 'దృశ్యం 2'లోనూ నటించారు. కోవిడ్ వల్ల ఈ చిత్రం 2021 నవంబరు 25న ఓటీటీలో స్ట్రీమింగ్ అయ్యింది. కాగా 'దృశ్యం 2' హిందీ రీమేక్ గత ఏడాది నవంబరు 18న థియేటర్స్‌లో విడుదలై రూ. 300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, 2022లో అత్యధిక వసూళ్లను సాధించిన టాప్ టెన్ హిందీ మూవీస్‌లో ఒకటిగా నిలిచింది. హిందీ 'దృశ్యం'లో నటించిన అజయ్ దేవగన్‌నే 'దృశ్యం 2'లోనూ నటించారు. అలాగే హిందీ చిత్రం 'దేవదాస్' (1955) తర్వాత ఇతర భాషల్లో ఎక్కువగా రీమేక్ అవుతున్న చిత్రం 'దృశ్యం' అని టాక్.

**మాలీవుడ్ నుంచి హాలీవుడ్‌కి...**

'దృశ్యం', 'దృశ్యం 2' చిత్రాలకు సంబంధించిన ఇంగ్లిష్, నాన్ ఇండియన్ లాంగ్వేజెస్ రీమేక్ హక్కులను పనోరమ స్టూడియోస్ ఇంటర్‌నేషనల్ సంస్థ దక్కించుకుంది (ఫిలిప్పినో, ఇండోనేషియా, సింహళ భాషల హక్కులు మాత్రం కాదు.. ఎందుకంటే ఈ భాషల్లో ఆల్రెడీ 'దృశ్యం' రీమేక్ అయ్యింది). "'దృశ్యం', 'దృశ్యం 2'ల ఫారిన్ లాంగ్వేజెస్ హక్కులను దక్కించుకున్నాం. జపాన్, కొరియా, హాలీవుడ్‌లో 'దృశ్యం'ను రీమేక్ చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాం. 'దృశ్యం 2'కు చెందిన చైనీస్ రీమేక్ హక్కులు కూడా మా వద్దే ఉన్నాయి" అని పనోరమ స్టూడియోస్ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

## స్పెయిన్‌లో సెలబ్రేషన్


● మహేశ్‌బాబు

**ఫా**రిన్ టూర్‌కు వెళ్లారు మహేశ్‌బాబు. 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా తాజా షెడ్యూల్ ముగిసింది. ముఖ్యంగా హాస్పిటల్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సన్నివేశాలను చిత్రీకరించారు. తర్వాతి షెడ్యూల్ త్వరలో ఆరంభం కానుంది. ఈ గ్యాప్‌లో ఫ్యామిలీతో కలిసి మహేశ్ స్పెయిన్ వెళ్లారని సమాచారం. ఫిబ్రవరి 10 (శుక్రవారం) మహేశ్, నమ్రతల పెళ్లి రోజు. మ్యారేజ్ డే సెలబ్రేషన్స్ కోసమే స్పెయిన్‌కు వెళ్లి ఉంటారని ఊహించవచ్చు.

## ఇదీ దాసరి చరిత్రకు శ్రీకారం - నట్టి కుమార్



"సినీ పరిశ్రమ నిలబడటానికి దాసరి నారాయణరావు లాంటి పెద్దలు ఎంతో కృషి చేశారు. అందుకే ఆయన సినీ ప్రయాణంతో 'ఇదీ దాసరి చరిత్ర' పేరుతో సినిమా తీస్తా. మే 4న దాసరిగారి జయంతిన ఈ చిత్రాన్ని ప్రారంభిస్తాం" అన్నారు నిర్మాత నట్టి కుమార్. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ– "దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డిగారు ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకుకొచ్చి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. దాసరిగారు కూడా నిర్మాతల మండలిలోని సభ్యులకు మెడిక్లెయిమ్ పాలసీని వర్తింపజేశారు. అయితే కొందరు సినీ పెద్దలు వాటికి తిలోదకాలు ఇచ్చే స్థితికి వచ్చారు. రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా, సినీ రంగానికి దాసరిగారు చేసిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ప్రాంగణంలో ఆయన విగ్రహం పెట్టాలి.. అలాగే ఫిలింనగర్‌లో, ఆయన పుట్టిన పాలకొల్లులో దాసరిగారి పేరుతో పార్కులు నిర్మించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కృషిచేయాలి. ఏపీలో కూడా షూటింగ్‌లు జరగాల్సిన అవసరం ఉంది. ఏపీ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని కృష్ణమురళి, ఎలక్ట్రానిక్ మీడియా అడ్వైజర్ అలీ ఇండస్ట్రీలోని అందర్నీ కలుపుకుని ముందుకువెళ్లాలి. గిల్డ్‌లోని కొందరు పెద్ద నిర్మాతలు చిన్న నిర్మాతల గురించి ఆలోచించరు. అందుకే త్వరలో జరిగే తెలుగు ఫిలిం ఛాంబర్, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి ఎన్నికల్లో వారిని ఎన్నుకోకుండా జాగ్రత్తపడాలి" అన్నారు.

## నిర్మాతగా మారడానికి ఇదే సరైన కథ! - అవికా గోర్



**"నిర్మాతని కావాలని నా 21వ ఏటనే అనుకున్నాను.. నిర్మాతగా మారడానికి 'పాప్ కార్న్' సరైన కథ. అందుకే ఈ చిత్రంతో తొలి అడుగు వేశాను" అని అవికా గోర్ అన్నారు. సాయి రోనక్ హీరోగా మురళి గంధం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పాప్‌కార్న్'. ఈ చిత్రంలో అవికా గోర్ హీరోయిన్‌గా నటించడంతో పాటు నిర్మాతగా (సహ నిర్మాత) మారారు. ఎంఎస్ చలపతి రాజు సమర్పణలో భోగేంద్ర గుప్తా నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా అవికా గోర్ చెప్పిన విశేషాలు.**

● డైరెక్టర్ మురళి చెప్పిన 'పాప్‌కార్న్' కథ ఆసక్తిగా అనిపించింది. 90 శాతం లిఫ్ట్‌లో జరిగే కథ ఇది. ఇప్పుడు ఆడియన్స్‌కి మంచి కంటెంట్ లేదా మాస్ మసాలా కావాలి. ఆ రెంటినీ బ్యాలెన్స్ చేస్తూ 'పాప్‌కార్న్' తీశారు మురళి. ● చిత్రపరిశ్రమలో నాకు గాడ్‌ఫాదర్స్ లేరు. అందుకే నేను నిర్మాతగా చేస్తానని చెప్పగానే ముందు సందేహం వ్యక్తం చేశారు మా పేరెంట్స్. కానీ, ఇది నా కల అని చెప్పగానే వాళ్లు ఒప్పుకున్నారు. నిర్మాతగా సినిమా ఎలా వస్తోంది? ఎలా ప్రమోట్ చేయాలి? అని ఆలోచించడం కొత్తగా అనిపించింది. నా ప్రొడక్షన్ హౌస్‌లో మరో సినిమా షూటింగ్ చేశాం. అలాగే ఇంకో మూవీ ప్రీ ప్రొడక్షన్ జరుగుతోంది. ● ప్రస్తుతం తెలుగులో కొన్ని సినిమాలు చేస్తున్నాను. '1920' అనే చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నాను.

## టీజర్ ఆకట్టుకుంది - మంత్రి కేటీఆర్


● కేటీఆర్‌తో చిత్ర యూనిట్

"భీమదేవరపల్లి బ్రాంచి' సినిమా టీజర్ ఆకట్టుకుంది. మంచి కథాంశంతో పాటు చక్కని సందేశం ఉన్న చిత్రం అని అర్థమవుతోంది. ఈ సినిమాను తప్పకుండా చూస్తాను" అని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, అద్దంకి దయాకర్, అంజి వల్లుమాన్, రాజవ్వ, సుధాకర్ రెడ్డి, కీర్తిలత గౌడ్ నటించిన చిత్రం 'భీమదేవరపల్లి బ్రాంచి'. రమేష్ చెప్పాల దర్శకత్వంలో డా.బత్తిని కీర్తిలతా గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి నిర్మించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం టీజర్‌ను కేటీఆర్ విడుదల చేశారు. "ఓ మంచి విషయాన్ని రమేష్ చెప్పాల వినోదాత్మకంగా చెప్పారు" అన్నారు కీర్తిలతా గౌడ్.

## ఊ అంటావా మావా!


● ప్రసన్న కుమార్, రేలంగి నరసింహారావు, యశ్వంత్

**య**శ్వంత్, రాకింగ్ రాకేష్, అనన్య, హిందోలా చక్రవర్తి, పూజ, సిమ్రాన్ కీలక పాత్రల్లో రేలంగి నరసింహారావు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఊ అంటావా మావా ఊఊ అంటావా మావ'. తుమ్మల ప్రసన్న కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా రేలంగి నరసింహారావు మాట్లాడుతూ– "తెలుగులో ఇప్పటి వరకూ రాని కామెడీ, హారర్ థ్రిల్లర్ చిత్రమిది. మంచి సినిమా అవుతుందనే నమ్మకం ఉంది" అన్నారు. "రేలంగి నరసింహారావుగారి 76వ చిత్రం ఇది. అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. పాటలు చక్కగా కుదిరాయి" అన్నారు ప్రసన్నకుమార్.

## మార్చిలో దళారి


● 'షకలక' శంకర్

'షకలక' శంకర్ హీరోగా, అక్సఖాన్, రూపిక హీరోయిన్లుగా రాజీవ్ కనకాల ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'దళారి'. కాచిడి గోపాల్ రెడ్డి దర్శకత్వంలో ఎడవెల్లి వెంకట రెడ్డి నిర్మించిన ఈ సినిమా మార్చిలో రిలీజ్ కానుంది. కాగా తెలంగాణలోని వేములవాడలో 'ఇండస్ట్రీ ఆఫ్ తెలంగాణ ఫోక్ సింగర్స్'(ఐటీఎఫ్) నిర్వహించిన గూగులమ్మతల్లి బోనాలు కార్యక్రమంలో 'దళారి' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. "ఈ కరీంనగర్ జిల్లా బిడ్డగా అందర్నీ మెప్పించే కథతో 'దళారి' సినిమా తీశాను" అన్నారు కాచిడి గోపాల్ రెడ్డి. "ఈ సినిమా కథ, పాటలు, డ్యాన్సులు, ఎమోషన్స్ ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా ఉంటాయి" అన్నారు వెంకట్ రెడ్డి.

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 142 | 60,806 |
| నిఫ్టీ ▲ | 22 | 17,893 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు (తొలి సెంటు రాత్రి 11.30 గంటలకు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 11,873 | ▽ | 37 |
| డోజోన్స్ | 33,865 | ▽ | 84 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,911 | ▲ | 26 |
| డాక్స్ | 15,523 | ▲ | 111 |
| షాంఘై | 3,270 | ▲ | 38 |
| నికాయ్ | 27,584 | ▽ | 22 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**బులియన్** రూ.లలో

| ముంబై | | |
|---|---|---|
| బంగారం (24 క్యారెట్) | | |
| 57,597 | ▲ | 59 |
| బంగారం (22 క్యారెట్) | | |
| 57,366 | ▲ | 58 |
| వెండి (కిలో) | | |
| 67,516 | ▽ | 33 |

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | | 81.83 | 83.50 |
| £ | బ్రిటన్ పౌండ్ | | 87.18 | 92.29 |
| € | యూరో | | 98.18 | 101.56 |
| ¥ | జపాన్ ఎన్ (100) | | 61.92 | 63.95 |
| AUS$ | ఆస్ట్రేలియా డాలర్ | | 56.37 | 58.80 |
| S$ | సింగపూర్ డాలర్ | | 61.33 | 63.37 |
| SAR | సౌదీ రియాల్ | | 21.01 | 22.68 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | | 21.57 | 23.36 |
| ¥ | చైనా యువాన్ | | 11.05 | 13.13 |

## బిజినెస్ రీల్

### హైదరాబాద్‌లో టీసీఎస్ మరో సెంటర్: రాజన్న



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) హైదరాబాద్‌లో మరో సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌లో తమకు ఏడు ఉండగా ఇది ఎనిమిదోది కానున్నట్లు సంస్థ సీనియర్ వైస్–ప్రెసిడెంట్ వి. రాజన్న తెలిపారు. సుమారు ఏడు వందల మంది సిబ్బంది సామర్థ్యంతో ఉండే ఈ చిన్న స్థాయి కేంద్రం వచ్చే ఆరేడు నెలల్లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని వివరించారు. ప్రస్తుతం దాదాపు 90,000 మంది ఉద్యోగులు ఇక్కడ ఉండగా వీరిలో 37.4 శాతం మంది మహిళలు ఉన్నట్లు తెలిపారు.

### భారత్‌లో ట్విటర్ బ్లూటిక్ @ రూ. 900



న్యూఢిల్లీ: మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విటర్ భారత్‌లోని యూజర్ల కోసం బ్లూటిక్ చార్జీలను ప్రకటించింది. దీని ప్రకారం మొబైల్ యాప్‌కు సంబంధించి నెలకు రూ. 900, వెబ్ కోసం రూ. 650 చెల్లించాల్సి ఉంటుందని సంస్థ తెలిపింది. అలాగే, వెబ్ యూజర్ల కోసం రూ. 6,800 వార్షిక ప్లాన్‌ను కూడా ట్విటర్ ఆవిష్కరించింది. ట్విటర్‌ను టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ కొనుగోలు చేసిన తర్వాత పలు కొత్త మార్పులు చేస్తున్న సంగతి తెలిసిందే.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 10-2-2023 | |
|---|---|
| విశాఖ | 460-00 |
| చిత్తూరు | 448-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 415-00 |
| విజయవాడ | 415-00 |
| రిటైల్ ధర (డజను) | 66.00 |
| **9-2-2023 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 390-00 |
| వరంగల్ | 392-00 |
| రిటైల్ ధర | 4.85 |

# అరబిందో మధ్యంతర డివిడెండ్ రూ.3

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ సంస్థ అరబిందో ఫార్మా డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.604 కోట్ల నుంచి రూ.491 కోట్లకు వచ్చి చేరింది. ఎబిటా రూ.954 కోట్లు, ఎబిటా మార్జిన్ 14.9 శాతంగా ఉంది. ఈపీఎస్ ఒక్కో షేరుకు రూ.8.38 నమోదైంది. టర్నోవర్ 6.7 శాతం అధికమై రూ.6,407 కోట్లకు ఎగసింది. యూఎస్ ఫార్ములేషన్స్ ఆదాయం 9.3 శాతం దూసుకెళ్లి రూ.3,001 కోట్లు, యూరప్ ఫార్ములేషన్స్ స్వల్పంగా పెరిగి రూ.1,701 కోట్లుగా ఉంది. వృద్ధి మార్కెట్ల నుంచి ఆదాయం 25.7 శాతం అధికమై రూ.499 కోట్లకు చేరింది. పరిశోధన, అభివృద్ధికి చేసిన వ్యయం 4.8 శాతం నుంచి 6.5 శాతానికి ఎగసి రూ.415 కోట్లకు చేరింది. డిసెంబర్ త్రైమాసికంలో యూఎస్‌ఎఫ్‌డీఏ నుంచి నాలుగు ఇంజెక్టేబుల్స్‌తోసహా 15 ఏఎన్‌డీఏలకు తుది ఆమోదం లభించింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.3 మధ్యంతర డివిడెండ్ చెల్లించాలన్న ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది.



క్రితం ముగింపుతో పోలిస్తే అరబిందో ఫార్మా షేరు ధర బీఎస్‌ఈలో గురువారం 0.99 శాతం క్షీణించి రూ.440.70 వద్ద స్థిరపడింది.

# హిందాల్కో లాభం డౌన్

క్యూ3లో రూ. 1,362 కోట్లు

న్యూఢిల్లీ: అల్యూమినియం తయారీ దిగ్గజం హిందాల్కో ఇండస్ట్రీస్ మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 63 శాతం క్షీణించి రూ. 1,362 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 3,675 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 50,272 కోట్ల నుంచి రూ. 53,151 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో షేరు ఎన్‌ఎస్‌ఈలో 2.2% లాభపడి రూ. 446 వద్ద ముగిసింది.

# ఎల్‌ఐసీ లాభం హైజంప్

న్యూఢిల్లీ: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. నికర లాభం అత్యంత భారీగా దూసుకెళ్లి రూ. 8,334 కోట్లను అధిగమించింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 235 కోట్లు ఆర్జించింది. నికర ప్రీమియం ఆదాయం రూ. 97,620 కోట్ల నుంచి రూ. 1,11,788 కోట్లకు జంప్ చేసింది. అయితే గత కాలంలో కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టుకానందున ఫలితాలు పోల్చి చూడటం తగదని ఎల్‌ఐసీ పేర్కొంది. కాగా.. పెట్టుబడుల ఆదాయం రూ. 76,574 కోట్ల నుంచి రూ. 84,889 కోట్లకు ఎగసింది.

**అదానీ గ్రూప్‌పై..**




క్యూ3లో వాటాదారుల నిధికి రూ. 2,000 కోట్లను ప్రొవిజన్ల కింద బదిలీ చేయడంతో నికర లాభం రూ. 6,334 కోట్లుగా నమోదైనట్లు ఎల్‌ఐసీ చైర్మన్ ఎంఆర్ కుమార్ వెల్లడించారు. అదానీ గ్రూప్ యాజమాన్యంతో సమావేశం కానున్నట్లు వెల్లడించారు. కొద్ది రోజులుగా అదానీ గ్రూప్ కంపెనీలలో తలెత్తిన సంక్షోభంపై ఇన్వెస్టర్ బృందం ద్వారా వివరణను కోరనున్నట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌ఐసీ షేరు ఎన్‌ఎస్‌ఈలో 0.5% పుంజుకుని రూ. 614 వద్ద ముగిసింది.

# ఈక్విటీల్లోకి మళ్లీ పెట్టుబడుల వరద

జనవరిలో రూ.12,546 కోట్లు రాక • డిసెంబర్‌తో పోలిస్తే 72% అధికం

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పథకాలకు జనవరిలో తిరిగి డిమాండ్ ఏర్పడింది. రూ.12,546 కోట్లు నికరంగా ఈక్విటీ పథకాల్లోకి వచ్చాయి. గత నాలుగు నెలల్లో ఈక్విటీ ఫండ్స్‌లోకి ఒకనెలలో వచ్చిన గరిష్ట పెట్టుబడులు ఇవి. 2022 డిసెంబర్‌లో ఈక్విటీల్లోకి రూ.7,303 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అదే ఏడాది నవంబర్‌లో రూ.2,258 కోట్లు, అక్టోబర్‌లో రూ.9,390 కోట్ల చొప్పున వచ్చాయి. ఇక 2022 సెప్టెంబర్‌లో వచ్చిన రూ.14,100 కోట్లు నెలవారీ గరిష్ట స్థాయిగా ఉంది. ఈక్విటీ పథకాల్లోకి వరుసగా 23వ నెలలోనూ నికరంగా పెట్టుబడులు రావడాన్ని గమనించొచ్చు. 2023 జనవరి గణాంకాలను ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) విడుదల చేసింది.




### విభాగాల వారీగా..

అత్యధికంగా స్మాల్‌క్యాప్ పథకాల్లోకి రూ.2,256 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఆ తర్వాత లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ పథకాల్లోకి రూ.1,902 కోట్లు, మల్టీక్యాప్ పథకాల్లోకి రూ.1,773 కోట్లు, మిడ్‌క్యాప్ పథకాల్లోకి రూ.1,628 కోట్లు, ఈఎల్ఎస్ఎస్ పథకాల్లోకి రూ.14,14 కోట్లు, ఫ్లెక్సీక్యాప్ పథకాల్లోకి రూ.1,006 కోట్లు, సెక్టోరల్, థీమ్యాటిక్ పథకాల్లోకి రూ.903 కోట్లు, కాంట్రా ఫండ్స్‌లోకి రూ.763 కోట్లు, లార్జ్‌క్యాప్ పథకాల్లోకి రూ.716 కోట్లు, ఫోకస్డ్ ఫండ్స్‌లోకి రూ.183 కోట్ల చొప్పున నికరంగా పెట్టుబడులు వచ్చాయి.

### ఫిక్స్‌డ్ ఇన్‌కమ్

స్థిరాదాయ పథకాల (డెట్) నుంచి జనవరిలో నికరంగా రూ.10,316 కోట్లు బయటకు వెళ్లాయి. అత్యధికంగా లిక్విడ్ ఫండ్స్‌లో రూ.5,042 కోట్లు, షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లో రూ.3,859 కోట్లు, ఓవర్ నైట్ ఫండ్స్‌లో రూ.3,688 కోట్ల చొప్పున ఇన్వెస్టర్లు విక్రయించారు. మనీ మార్కెట్ పథకాలు రూ.6,460 కోట్లు ఆకర్షించాయి. ఇక హైబ్రిడ్ పథకాలు సైతం రూ.4,492 కోట్లు ఆకర్షించగా, మల్టీ అస్సెట్ పథకాల్లోకి రూ.2,182 కోట్లు, ఆర్బిట్రేజ్ ఫండ్స్‌లోకి రూ.2,055 వచ్చాయి. ఇండెక్స్ ఫండ్స్‌లోకి రూ.5,813 కోట్లు వచ్చాయి.

### ఇన్వెస్టర్లలో నమ్మకం

''స్టాక్ మార్కెట్లలో అస్థిరతలు నెలకొన్నప్పటికీ ఇన్వెస్టర్లు ఈక్విటీ పథకాలపై నమ్మకాన్ని ఉంచారు. దీనికి నిదర్శనమే రూ.12,546 కోట్లు రావడం. నెలవారీగా చూస్తే ఇది 72 శాతం అధికం'' అని ఫయర్స్ రీసెర్చ్ హెడ్ గోపాల్ కావలిరెడ్డి తెలిపారు. మార్కెట్లలో ఆటుపోట్లు ఉన్నా ఇన్వెస్టర్లు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో పెట్టుబడులకు ఆసక్తి చూపించినట్టు మోతీలాల్ ఓస్వాల్ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అఖిల్ చతుర్వేది పేర్కొన్నారు.


### సిప్ బలం

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో రూ.13,856 కోట్లు వచ్చాయి. డిసెంబర్‌లో వచ్చిన రూ.13,573 కోట్లతో పోలిస్తే స్వల్పంగా పెరిగాయి. సిప్ పెట్టుబడులు రూ.13వేల కోట్లకు పైగా రావడం వరుసగా నాలుగో నెలలోనూ నమోదైంది. సిప్ ఖాతాల సంఖ్య 6.21 కోట్లుగా ఉంది. నికరంగా 9.20 లక్షల కొత్త సిప్ ఖాతాలు రిజిస్టర్ అయ్యాయి. ఒకవైపు ఎఫ్‌పీఐలు విక్రయాలు చేస్తున్నప్పటికీ మార్కెట్లు స్థిరంగా ఉండడానికి సిప్ పెట్టుబడులు మద్దతుగా నిలిచినట్టు యాంఫి సీఈవో ఎన్ఎస్ వెంకటేశ్ పేర్కొన్నారు.

## ఐటీ, ఫైనాన్స్ షేర్లలో కొనుగోళ్లు

- పరిమిత శ్రేణిలో ఒడిదుడుకుల ట్రేడింగ్
- సూచీలకు రెండోరోజూ లాభాలే

ముంబై: ఐటీ, ఫైనాన్స్, మౌలిక రంగాల షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు రెండోరోజూ లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందాయి. ఉదయం ఫ్లాటుగా ప్రారంభమైన సూచీలు రోజంతా తీవ్ర ఊగిసలాటకు లోనయ్యాయి. ట్రేడింగ్‌లో 391 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 142 పాయింట్లు పెరిగి 60,806 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 22 పాయింట్లు బలపడి 17,893 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 17,780 వద్ద కనిష్టాన్ని, 17,917 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. మెటల్, ఆటో, ఇంధనం, టెలికం, రియల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.205 కోట్ల షేర్లను, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.205 కోట్లను విక్రయించారు. డాలర్ మారకంలో రూపాయి విలువ మూడు పైసలు బలపడి 82.51 స్థాయి వద్ద స్థిరపడింది. బుధవారం లాభాల తర్వాత మళ్లీ అదానీ గ్రూప్‌లో గురువారం అమ్మకాలు జరిగాయి.



## తనిష్క్ 'గిఫ్ట్ ఆఫ్ చాయిస్' సేల్

హైదరాబాద్: ప్రేమికుల దినోత్సవం సందర్భంగా తనిష్క్ ''గిఫ్ట్ ఆఫ్ చాయిస్'' పేరిట ప్రత్యేక విక్రయాల కార్యక్రమాన్ని చేపట్టింది. హృదయాకారపు డైమండ్ డిజైన్స్, ఎంగేజ్‌మెంట్ రింగులు, బ్రాస్‌లెట్స్, పెండెంట్‌లు, చెవిరింగుల కొనుగోళ్లపై 20% వరకూ ఆఫర్‌ను అందిస్తుంది. ''ప్రేమ, ఏకత్వంకు 'గిఫ్ట్ ఆఫ్ చాయిస్' ప్రతీకగా నిలుస్తుంది. పరిమితకాలం పాటు ఉండే ఈ ఆఫర్‌ను కస్టమర్లంతా సద్వినియోగం చేసుకోవాలి'' అని కంపెనీ కోరింది.

## ఓలా కొత్త స్కూటర్లు

రూ.84,999 నుంచి ప్రారంభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఓలా ఎలక్ట్రిక్ కొత్త స్కూటర్లను ఆవిష్కరించింది. ఎస్1 శ్రేణిలో రూ. 99,999 ధరలో నూతన వేరియంట్‌ను అందుబాటులోకి తెచ్చింది. 2 కిలోవాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచారు. ఒకసారి చార్జింగ్‌తో 91 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. గరిష్ట వేగం గంటకు 90 కిలోమీటర్లు. డెలివరీలు ప్రారంభం అయ్యాయి. ఎస్1 ఎయిర్ పేరుతో మూడు వేరియంట్లను సైతం ఓలా పరిచయం చేసింది. రూ.84,999 ధర గల 2 కిలోవాట్ అవర్ బ్యాటరీ వేరియంట్ ఒకసారి చార్జింగ్‌తో 85 కిలోమీటర్లు పరుగెడుతుంది. టాప్ స్పీడ్ గంటకు 85 కిలోమీటర్లు. 3 కిలోవాట్ అవర్ వేరియంట్ 125 కిలోమీటర్లు, 4 కిలోవాట్ అవర్ రకం 165 కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. ధరలు వరుసగా రూ.99,999, రూ.1,09,999 ఉన్నాయి. ఎస్1 ఎయిర్ వేరియంట్ల బుకింగ్స్ ప్రారంభం అయ్యాయి.






# ధనాధన్ ఆటకు అమ్మాయిలు సిద్ధం

- నేటినుంచి మహిళల టి20 ప్రపంచకప్
- దక్షిణాఫ్రికా, లంక మధ్య తొలిపోరు
- 12న భారత్, పాక్ ఢీ

కేప్‌టౌన్: నేటి నుంచి ఐసీసీ టి20 ప్రపంచకప్ రూపంలో మరో 'షో'కు రంగం సిద్ధమైంది. ఇప్పటి వరకు జరిగిన ఏడు మెగా ఈవెంట్లలో ఐదు సార్లు విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా అమ్మాయిల జట్టు హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. 2020లో ఈ జగజ్జేత చేతిలో మెల్‌బోర్న్ వేదికపై జరిగిన ఫైనల్లో ఓడిన భారత్ కూడా పొట్టి ప్రపంచకప్‌పై గట్టి ఆశలే పెట్టుకుంది. ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొనే పది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూపులో ఐదు జట్లు రౌండ్ రాబిన్ పద్ధతిలో తలపడతాయి. అనంతరం తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నాకౌట్ (సెమీస్)కు అర్హత సాధిస్తాయి. తొలి సెమీస్ 23న, రెండో సెమీస్ 24న జరుగుతాయి. 26న జరిగే తుదిపోరుతో టోర్నీ ముగుస్తుంది. ముందుగా శుక్రవారం టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికాతో శ్రీలంక తలపడుతుంది. భారత్ 12న జరిగే తొలి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను ఎదుర్కొంటుంది. భారత్ ఆడే నాలుగు లీగ్ మ్యాచ్‌లు కూడా 6.30కే మొదలవుతాయి. 'స్టార్‌స్పోర్ట్స్'లో మ్యాచ్‌లు ప్రసారమవుతాయి.

గ్రూప్ 'ఎ': ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్.

గ్రూప్ 'బి': భారత్, ఇంగ్లండ్, ఐర్లాండ్, పాకిస్తాన్, వెస్టిండీస్.


**మన మహిళల షెడ్యూల్ ఇదే**

| | |
|---|---|
| ఫిబ్రవరి 12 | భారత్ X పాకిస్తాన్ |
| ఫిబ్రవరి 15 | భారత్ X వెస్టిండీస్ |
| ఫిబ్రవరి 18 | భారత్ X ఇంగ్లండ్ |
| ఫిబ్రవరి 20 | భారత్ X ఐర్లాండ్ |

# నేడు ఫ్రీ ప్రాక్టీస్


ఫార్ములా–ఇ హైదరాబాద్

సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక ఫార్ములా–ఇ రేసింగ్‌కు భాగ్యనగరం సిద్ధమైంది. రెండు రోజుల ఈ ఈవెంట్‌లో భాగంగా నేడు సాయంత్రం తొలి ఫ్రీ ప్రాక్టీస్ జరుగుతుంది. పోటీల్లో పాల్గొంటున్న 11 జట్ల రేసర్లు ట్రాక్‌తో పాటు తమ కార్లను, వాటి పనితీరును పరీక్షించుకొని పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యేందుకు ఈ ప్రాక్టీస్‌ను వాడుకుంటారు. శనివారం కూడా రెండో ఫ్రీ ప్రాక్టీస్‌తో పాటు ఉ.10.40నుంచి క్వాలిఫయింగ్ పోరు జరుగుతుంది. అనంతరం మ.గం. 3 గంటలకు అసలైన రేస్ ప్రారంభమవుతుంది. దాదాపు గంటన్నర పాటు సాగే ఈ రేస్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హుస్సేన్ సాగర్ తీరంలో నెక్లెస్‌రోడ్‌పై ఏర్పాటు చేసిన హైదరాబాద్ స్ట్రీట్ సర్క్యూట్ 2.83 కిలోమీటర్లు పొడవు ఉంది. ఇందులో మొత్తం 18 మలుపులు ఉన్నాయి. భారత్‌కు చెందిన రేసర్లు ఎవరూ లేకపోయినా మహీంద్ర టీమ్‌తో పాటు టాటా స్పాన్సర్‌గా ఉన్న జాగ్వార్ టీమ్‌పై రేసింగ్ అభిమానుల్లో ఆసక్తి నెలకొని ఉంది. మహీంద్రా టీమ్‌లో రిజర్వ్ డ్రైవర్‌గా జెహాన్ దారువాలా ఉన్నాడు. గరిష్టంగా 322 కిలోమీటర్ల వేగంతో పరుగెత్తే ఎలక్ట్రిక్ కార్ల మధ్య పోటీని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ఫ్యాన్స్ ఆసక్తి చూపిస్తున్నారు. 'బుక్ మై షో'లో ఈ రేసు కోసం టికెట్లు అందుబాటులో ఉన్నాయి.




ఫార్ములా–ఇ కారుతో మహీంద్ర డ్రైవర్లు గ్రాసీ, దారువాలా, రోలండ్

# స్పిన్‌తో దుమ్ము రేపారు..!




లబుషేన్‌ను స్టంపౌంట్ చేసిన ఆనందంలో కేఎస్ భరత్



జడేజా

**ఆశ్చర్యమేమీ లేదు... భారత గడ్డపై టెస్టు మ్యాచ్‌లో విదేశీ బ్యాటర్ల పరిస్థితి ఏమిటో కొత్తగా చెప్పాల్సింది లేదు... అందుకు ఆస్ట్రేలియా కూడా మినహాయింపు కాదని మరోసారి రుజువైంది... అంచనాలకు అనుగుణంగానే భారత బౌలర్లు చెలరేగిపోగా, పిచ్‌ను సందేహిస్తూనే బరిలోకి దిగిన కంగారూ బ్యాటింగ్ లైనప్ కుప్పకూలింది. దాదాపు ఏడు నెలల తర్వాత టెస్టు ఆడిన జడేజా తన స్పిన్‌తో ప్రత్యర్థి పతనాన్ని శాసించగా, అశ్విన్ సహకరించాడు. అయితే తొలి 13 బంతుల్లోనే పేసర్లకు 2 వికెట్లు చేజార్చుకొని స్పిన్ రాక ముందే ఆసీస్ దాసోహమంది. అనంతరం దూకుడైన బ్యాటింగ్‌తో రోహిత్ ఆధిపత్యం ప్రదర్శించడంతో బోర్డర్-గావస్కర్ ట్రోఫీ తొలి రోజును టీమిండియా తమదిగా మార్చుకుంది. రెండో రోజు పిచ్ ఆసీస్ స్పిన్నర్లకు ఎలా సహకరిస్తుందో, భారత బ్యాటర్లు ఎంత భారీ స్కోరు చేస్తారనేది ఆసక్తికరం.**

- తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 177 ఆలౌట్
- రవీంద్ర జడేజాకు 5 వికెట్లు
- భారత్ 77/1

నాగ్‌పూర్: ఆస్ట్రేలియాతో ప్రారంభమైన తొలి టెస్టులో మొదటి రోజు భారత్ పక్షాన నిలిచింది. ముందు బౌలింగ్‌లో, ఆపై నిలకడైన బ్యాటింగ్‌తో టీమిండియా ఆటను ముగించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 63.5 ఓవర్లలో 177 పరుగులకే ఆలౌటైంది. మార్నస్ లబుషేన్ (123 బంతుల్లో 49; 8 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా (5/47) ఐదు వికెట్లతో చెలరేగగా, అశ్విన్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం భారత్ ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోయి 77 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (69 బంతుల్లో 56 బ్యాటింగ్; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించాడు. ప్రస్తుతం భారత్ మరో 100 పరుగులు మాత్రమే వెనుకబడి ఉంది.

**కీలక భాగస్వామ్యం...**

టాస్ గెలిచిన ప్రయోజనాన్ని ఆస్ట్రేలియా పొందలేకపోయింది. సిరాజ్ తన తొలి బంతికే ఖాజా (1)ను ఎల్బీగా అవుట్ చేశాడు. అంపైర్ నాటౌట్‌గా ప్రకటించినా...రివ్యూలో భారత్ ఫలితం సాధించింది. ఆ తర్వాత షమీ వేసిన చక్కటి బంతి వార్నర్ (1) స్టంప్స్‌ను ఎగరగొట్టింది. ఇన్నింగ్స్ ఏడో ఓవర్లోనే జడేజాను భారత్ బౌలింగ్‌కు దించింది. ఇలాంటి స్థితిలో లబుషేన్, స్టీవ్ స్మిత్ (107 బంతుల్లో 37; 7 ఫోర్లు) కలిసి జట్టును ఆదుకున్నారు. భారత బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ కొన్ని చక్కటి షాట్లతో వీరిద్దరు స్కోరు బోర్డును నడిపించారు. లంచ్ సమయానికి 76/2 స్కోరుతో ఆసీస్ కోలుకున్నట్లుగా అనిపించింది.

**టపటపా...**

విరామం తర్వాత జడేజా వరుస బంతుల్లో రెండు వికెట్లు తీసి కంగారూల పని పట్టాడు. భరత్ చక్కటి స్టంపింగ్‌కు లబుషేన్ వెనుదిరగ్గా, రెన్‌షా (0) తొలి బంతికే వికెట్ల ముందు దొరికిపోయాడు. లబుషేన్, స్మిత్ మూడో వికెట్‌కు 82 పరుగులు జోడించారు. అక్షర్ ఓవర్లో 3 ఫోర్లు కొట్టి జోరు పెంచే ప్రయత్నం చేసిన స్మిత్‌ను కూడా జడేజా బౌల్డ్ చేయడంతో ఆసీస్ పరిస్థితి మరింత దిగజారింది. దాంతో అలెక్స్ క్యారీ (33 బంతుల్లో 36; 7 ఫోర్లు), పీటర్ హ్యాండ్స్‌కోంబ్ (84 బంతుల్లో 31; 4 ఫోర్లు) కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఎదురుదాడికి దిగిన క్యారీ వరుసగా స్వీప్, రివర్స్ స్వీప్‌షాట్లతో బౌండరీలు రాబట్టాడు. అయితే అశ్విన్ బౌలింగ్‌లో అదే రివర్స్‌స్వీప్‌కు ప్రయత్నించి బౌల్డ్ కావడంతో ఆరో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. హ్యాండ్స్‌కోంబ్, క్యారీ 11.2 ఓవర్లలో 53 పరుగులు జోడించడం విశేషం. 'టీ' తర్వాత హ్యాండ్స్‌కోంబ్‌ను జడేజా అవుట్ చేయడంతో 200 పరుగుల స్కోరుకు ఆసీస్ చాలా దూరంలో ఆగిపోయింది. ఆ జట్టు 15 పరుగుల వ్యవధిలోనే చివరి 5 వికెట్లు చేజార్చుకుంది.

**రోహిత్ జోరు...**

తొలి రోజు సాధ్యమైనన్ని ఎక్కువ పరుగులు సాధించాలనే ఉద్దేశంతో బరిలోకి దిగిన రోహిత్ దానిని తన బ్యాటింగ్‌లో ప్రదర్శించాడు. కమిన్స్ వేసిన మొదటి ఓవర్లోనే 3 ఫోర్లు కొట్టిన అతను, ఆ తర్వాత కమిన్స్ ఓవర్లోనే మరో 2 ఫోర్లు బాదాడు. ఆట ముగిసే వరకు భారత కెప్టెన్ అదే ధాటిని కొనసాగించగా, మరో ఎండ్‌లో కేఎల్ రాహుల్ (71 బంతుల్లో 20; 1 ఫోర్) చాలా జాగ్రత్తగా ఆడాడు. తన 55వ బంతికి గానీ రాహుల్ ఫోర్ కొట్టలేకపోయాడు. లయన్ బౌలింగ్‌లో బౌండరీతో 66 బంతుల్లోనే రోహిత్ అర్ధ సెంచరీ పూర్తయింది. అయితే చివర్లో రాహుల్‌ను వెనక్కి పంపి మర్ఫీ కెరీర్‌లో తొలి వికెట్ తీయగా, ఆసీస్‌కు కాస్త ఊరట లభించింది.

**స్కోరు వివరాలు**


**ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** వార్నర్ (బి) షమీ 1; ఖాజా (ఎల్బీ) (బి) సిరాజ్ 1; లబుషేన్ (స్టంప్డ్) భరత్ (బి) జడేజా 49; స్మిత్ (బి) జడేజా 37; రెన్‌షా (ఎల్బీ) (బి) జడేజా 0; హ్యాండ్స్‌కోంబ్ (ఎల్బీ) (బి) జడేజా 31; క్యారీ (బి) అశ్విన్ 36; కమిన్స్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 6; మర్ఫీ (ఎల్బీ) (బి) జడేజా 0; లయన్ (నాటౌట్) 0; బోలండ్ (బి) అశ్విన్ 1; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (63.5 ఓవర్లలో ఆలౌట్) 177. వికెట్ల పతనం:** 1-2, 2-2, 3-84, 4-84, 5-109, 6-162, 7-172, 8-173, 9-176, 10-177. **బౌలింగ్:** షమీ 9-4-18-1, సిరాజ్ 7-3-30-1, జడేజా 22-8-47-5, అక్షర్ 10-3-28-0, అశ్విన్ 15.5-2-42-3.

**భారత్ తొలి ఇన్నింగ్స్:** రోహిత్ (బ్యాటింగ్) 56; రాహుల్ (సి) అండ్ (బి) మర్ఫీ 20; అశ్విన్ (బ్యాటింగ్) 0; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (24 ఓవర్లలో వికెట్ నష్టానికి) 77. వికెట్ల పతనం:** 1-76. **బౌలింగ్:** కమిన్స్ 4-1-27-0, బోలండ్ 3-1-4-0, లయన్ 10-3-33-0, మర్ఫీ 7-0-13-1.

## టెస్టులకు 'శ్రీకారం'

దాదాపు 15 నెలల క్రితం... కాన్పూర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టులో కోన శ్రీకర్ భరత్ సబ్‌స్టిట్యూట్ వికెట్ కీపర్‌గా వ్యవహరించాడు. రెండు క్యాచ్‌లు, ఒక స్టంపింగ్‌తో పాటు బంతి అనూహ్యంగా మలుపులు తిరుగుతున్న పిచ్‌పై అతని అద్భుత కీపింగ్ అందరినీ ఆకట్టుకుంది. దురదృష్టవశాత్తూ క్రికెట్ గణాంకాల్లో సబ్‌స్టిట్యూట్ ప్రదర్శనకు చోటుండదు. ఎట్టకేలకు గురువారం భరత్ టెస్టు క్రికెట్ ఆడిన 305వ భారత క్రికెటర్‌గా మైదానంలోకి అడుగుపెట్టాడు. సరిగ్గా పదేళ్ల క్రితం తొలి ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడిన అతను ఇప్పుడు టీమిండియా సభ్యుడయ్యాడు. రంజీ ట్రోఫీలో, భారత 'ఎ' జట్టు రెగ్యులర్‌గా అనేక సిరీస్‌లు ఆడిన తర్వాత టెస్టు బరిలోకి దిగిన భరత్ తొలి రోజు ఆటలోనే తనదైన ముద్ర వేశాడు. చురుకైన కదలికలతో అతను లబుషేన్‌ను మెరుపు వేగంతో స్టంపౌట్ చేసిన క్షణమే ఆటను మలుపు తిప్పింది. ఆంధ్ర క్రికెట్‌లో వివిధ వయో విభాగాల్లో ప్రదర్శన ద్వారా పైకి ఎదిగిన భరత్‌కు దేశవాళీ క్రికెట్‌లో గుర్తింపు తెచ్చుకునేందుకు కొంత సమయం పట్టింది. 86 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో ట్రిపుల్ సెంచరీ సహా 4707 పరుగులు చేసిన భరత్ 2021 ఐపీఎల్‌లో ఒక ఇన్నింగ్స్‌తో అందరి దృష్టిలో పడ్డాడు. ఢిల్లీపై మ్యాచ్‌లో చివరి బంతికి సిక్స్ కొట్టి ఆర్‌సీబీని గెలిపించడం అతని దూకుడైన ఆటను పరిచయం చేసింది. అప్పటినుంచి టీమిండియాలో రెగ్యులర్‌గా మారే అవకాశం ఉన్న కీపర్‌గా అతని పేరుపై పలు మార్లు సెలక్షన్ సమావేశాల్లో చర్చ జరిగింది. సాహా రిటైరైతే అతనికి ప్రత్యామ్నాయంగా భరత్ ఖాయమని అర్థమైంది. గతంలోనూ సీనియర్ టీమ్‌కు ఎంపికైనా, భరత్‌కు మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. వికెట్ కీపర్ ఎమ్మెస్కే ప్రసాద్ (6 టెస్టులు) తర్వాత భారత టెస్టు జట్టుకు ఎంపికైన ఆంధ్ర ఆటగాడిగా భరత్ నిలిచాడు. 2018లో భారత జట్టులోకి ఎంపికయ్యే సమయానికి హనుమ విహారి ఆంధ్ర తరఫున ఆడుతున్నా...అంతకు ముందే 6 సీజన్లు అతను హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. వన్డే, టి20 జట్లలో ఇప్పటికే సభ్యుడైన సూర్యకుమార్ యాదవ్ కూడా నాగ్‌పూర్‌లో టెస్టులో అరంగేట్రం చేశాడు. మున్ముందు కోన భరత్ మరింత మెరుగైన ప్రదర్శనతో సత్తా చాటి జట్టులో స్థానం సుస్థిరం చేసుకోవాలని ఆశిద్దాం.

'ఆస్ట్రేలియాతో టెస్టులో అరంగేట్రం చేస్తున్న మన కోన భరత్‌కు నా హార్దికాభినందనలు. తెలుగు జెండా మరింత ఎత్తున రెపరెపలాడుతోంది' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ సందర్భంగా ట్వీట్ చేశారు.



ఆల్ ది బెస్ట్ కన్నా... తల్లితో భరత్

## క్లుప్తంగా...

### 17న కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ

**సాక్షి, అమరావతి:** కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్నారు. రబీలో సాగు, వేసవిలో తాగునీటి అవసరాలపై చర్చించి కేటాయింపులు చేయడమే అజెండాగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఏపీ, తెలంగాణ ఈఎన్సీలకు కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే గురువారం లేఖలు రాశారు. ప్రస్తుత నీటి సంవత్సరంలో ఇప్పటి వరకు రెండు రాష్ట్రాలు వినియోగించుకున్న వాటాను మినహాయించి ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్ లలో లభ్యత ఆధారంగా మిగతా వాటా నీటిని కేటాయించడంపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.

### అధికార భాషా సంఘానికి కొత్త సభ్యుల నియామకం

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులుగా కత్తి వెంకటేశ్వర్లు, తవ్వ వెంకటయ్య, డి.మస్తానమ్మను నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌భార్గవ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వీరు రెండేళ్లపాటు ఆ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### మూడు వర్సిటీలకు వీసీల నియామకం

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలోని 3 యూనివర్సిటీలకు వైస్ చాన్స్‌లర్‌లను నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒంగోలులో ఏర్పాటు చేసిన ఆంధ్ర కేసరి వర్సిటీకి హైదరాబాద్ జేఎన్‌టీయూ ఎన్విరాన్మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీలోని ప్రొఫెసర్ అంజిరెడ్డి మారెడ్డిని నియమించారు. విజయనగరంలోని జేఎన్‌టీయూ గురజాడ వర్సిటీకి ఏయూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్. కె.వెంకట సుబ్బయ్యను నియమించారు. కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ వర్సిటీకి హైదరాబాద్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ మెకానికల్ విభాగంలోని ప్రొఫెసర్ బానోత్ ఆంజనేయ ప్రసాద్‌ను నియమించారు. వీరి పదవీకాలం మూడేళ్లు ఉంటుంది.

### గ్రేడ్-3 ఈవో పోస్టుల పరీక్షకు హాల్‌టికెట్లు

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో ఎండోమెంటు విభాగంలోని గ్రేడ్-3 ఈవో పోస్టులకు సంబంధించి నిర్వహించనున్న మెయిన్ పరీక్షకు హాల్‌ టిక్కెట్లను విడుదల చేసినట్లు ఏపీపీఎస్సీ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. శుక్రవారం నుంచి వీటిని అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వివరించింది. ఈ మెయిన్ పరీక్ష ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్నారు.

### అమరావతి ఎంపిక రహస్యంగా జరగలేదు

- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు

**సాక్షి, అమరావతి:** రాజధాని అమరావతి ఎంపిక రహస్యంగా జరగలేదని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. రాజధానిగా అమరావతిని మెజారిటీ ప్రజలు ఆమోదించారని గురువారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో చెప్పారు. ఎంతో భక్తితో పూజలు చేసి ప్రధాని మోదీ యమునా జలం, పార్లమెంట్ మట్టి తెచ్చారన్నారు. ఏపీ ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ఎంపిక చేసినట్లు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసినట్లు చెప్పారు. చట్ట ప్రకారం అమరావతిలో అన్నీ పూర్తి చేయాలన్నారు. అమరావతిని మార్చబోమని జగన్ మాట ఇచ్చారని, టీడీపీ కంటే బాగా అభివృద్ధి చేస్తామని చెప్పారని తెలిపారు. అప్పుడు ఓట్ల కోసం అలా చెప్పి ఎన్నికల్లో గెలిచాక చట్టానికి తూట్లు పొడిచారని విమర్శించారు. 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా 34 వేల ఎకరాలను రాజధానికి ఇచ్చారని తెలిపారు. మొత్తం రాష్ట్రాన్నే నాశనం చేసే పరిస్థితికి వచ్చారని, అమరావతిని పూర్తి చేసి ఉంటే అన్ని అవసరాలు పూర్తయ్యాక 8 వేల ఎకరాలు మిగిలేదన్నారు. ఇప్పుడు దాని విలువ రూ.లక్షల కోట్లలో ఉండేదన్నారు. పైరవీల కోసం రాజ్యసభ సీట్లు ఇచ్చారని ఆరోపించారు. అమరావతిలో రోడ్లను కూడా తవ్వేస్తుంటే బాధగా ఉందన్నారు. విభజన చట్టం కంటే జగన్ విధ్వంసక చర్యల వల్లే ఎక్కువ నష్టం జరిగిందని విమర్శించారు. జగన్‌కు ప్రజలపై గౌరవం, కమిట్‌మెంట్ లేదన్నారు. ప్రజాకోర్టులో జగన్ మోహన్‌రెడ్డిని దోషిగా నిలబెట్టేదాకా తెలుగుదేశం పార్టీ పోరాడుతుందని అన్నారు.

### వివేకా హత్య కేసులో నిందితుల తరలింపు!

**కడప అర్బన్:** మాజీమంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణ నిమిత్తం కడప కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న యాదాటి సునీల్‌యాదవ్, గజ్జల ఉమాశంకర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిలను పోలీసులు హైదరాబాద్ సీబీఐ కోర్టులో శుక్రవారం ఉదయం 10:30 గంటలలోపు హాజరుపర్చనున్నారు. ఈ మేరకు పోలీసులు బందోబస్తు విధులను ఏర్పాటు చేసుకున్నారు. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ఆ ముగ్గురినీ కడప కేంద్ర కారాగారం నుంచి తీసుకెళ్లనున్నట్లు తెలిసింది. కాగా, రిమాండ్‌లో ఉన్న దేవిరెడ్డి శివశంకర్ రెడ్డిని గురువారం మధ్యాహ్నం ఆయన సతీమణి తులశమ్మ, కుమారుడు చైతన్యరెడ్డి, కుటుంబ సభ్యులు కలిశారు.

# లోకేశ్ పాదయాత్రలో హెడ్ కానిస్టేబుల్ మృతి

- తోపులాటలో గుండెపోటుకు గురైన హెడ్ కానిస్టేబుల్
- ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో కన్నుమూత
- చిత్తూరు జిల్లాలో విషాదం
- పోలీసు అధికారుల సంతాపం



రమేష్ (ఫైల్ ఫొటో)

**సాక్షి, చిత్తూరు/గంగాధర నెల్లూరు/ పాలసముద్రం:** మొన్న చంద్రబాబు సభలు పలువురు ప్రజలను బలి తీసుకోగా, నేడు ఆయన కుమారుడు లోకేశ్ సభ ఓ హెడ్ కానిస్టేబుల్ ప్రాణాలు తీసుకుంది. రహదారులు, ఇరుకు రోడ్లు, మార్జిన్లు తదితర ప్రాంతాల్లో సభలు, ర్యాలీల వల్ల జరిగే విపరిణామాలకు ఇటీవలి చంద్రబాబు సభలే ఉదాహరణలు. ఇటువంటి ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించడానికి ప్రభుత్వం విశాలమైన మైదానాల్లో సభలు పెట్టుకోవాలని జీవో తెచ్చింది. అయినా, చంద్రబాబు కుమారుడు నారా లోకేశ్ చేపట్టిన పాదయాత్రలో భద్రతాపరమైన అంశాలను ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఆయన పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన లేదు. కార్యకర్తలు కూడా నామమాత్రంగా వస్తున్నారు. జనం రాకపోవడంతో లోకేశ్ అనుమతుల్లేకుండానే ఎక్కడపడితే అక్కడ పాదయాత్ర ఆపి మాట్లాడుతున్నారు. జనం ఎక్కువగా ఉన్నట్లు కనిపించేందుకు ఇరుకు రోడ్లు, మార్కెట్ ప్రాంతాల్లో లోకేశ్ సభలు నిర్వహిస్తున్నారు. ప్రజల భద్రతకు భంగం కలిగించేలా నిర్వహిస్తున్న ఈ సభలను పోలీసులు అడ్డుకుంటున్నారు. ఇదే సమయంలో టీడీపీ నేతలూ కార్యకర్తలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారు. ఫ్రస్ట్రేషన్ పెరిగిన టీడీపీ కార్యకర్తలు పోలీసులకు ఎదురుతిరుగుతున్నారు. ఈ సందర్భంగా తోపులాటలు జరుగుతున్నాయి. ఇలాంటి సభే హెడ్ కానిస్టేబుల్ మరణానికి కారణమైంది. గురువారం గంగాధర నెల్లూరు మండలం సంశిరెడ్డిపల్లెలో నిర్వహించిన పాదయాత్రలో ఈ విషాద ఘటన జరిగింది. సంశిరెడ్డిపల్లెలో లోకేశ్ అనుమతుల్లేకుండానే, జాగ్రత్తలు తీసుకోకుండానే మాట్లాడటం ప్రారంభించారు. దీంతో పోలీసులు అడ్డు చెప్పారు. ఈ సందర్భంగా పోలీసులు, టీడీపీ కార్యకర్తల మధ్య తీవ్ర స్థాయిలో తోపులాట జరిగింది. టీడీపీ కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ తీవ్ర అలజడి సృష్టించారు. ఈ సమయంలో అక్కడే బందోబస్తు విధుల్లో ఉన్న చిత్తూరు జిల్లా ఐరాల పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎ.రమేష్ (54) తీవ్ర అస్వస్థతతో గుండెపోటుకు గురయ్యారు. పోలీసులు వెంటనే ఆయన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే హెడ్ కానిస్టేబుల్ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. దీంతో పోలీసు కుటుంబాలు, ఆయన స్వస్థలమైన యాదమరి మండలంలోని కుచుంపల్లెలో విషాదం నెలకొంది. హెడ్‌కానిస్టేబుల్ మృతికి పోలీసు ఉన్నతాధికారులు సంతాపం తెలిపారు. టీడీపీ సభల్లో ఇది మరో దుర్ఘటన అని, నిబంధనలు పాటించకుండా టీడీపీ నేతలు మూర్ఖంగా ప్రవర్తించడంవల్లే హెడ్ కానిస్టేబుల్ మరణం సంభవించిందని పలువురు వ్యాఖ్యానించారు.

**శూలం గుచ్చుకొని కార్యకర్తకు గాయాలు**

ఎండీ మంగళం సమీపంలోని ఆలయం వద్ద లోకేశ్ మరో సభ నిర్వహించారు. ఇదీ నిబంధనలకు విరుద్ధంగానే జరిగింది. ఇక్కడ ఆలయం వద్ద ఉన్న శూలం గుచ్చుకుని మండలంలోని టీడీపీ కార్యకర్తకు గాయాలయ్యాయి. వెంటనే ఆయన్ని చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

**ఈసారైనా గెలిపించండి: లోకేశ్ వేడుకోలు**

గంగాధర నెల్లూరులో 2009 నుంచి టీడీపీని గెలిపించలేదని, ఈసారైనా గెలిపించండి అంటూ నారా లోకేశ్ ప్రజలను అభ్యర్థించారు. ఆయన గురువారం గంగాధర నెల్లూరు మండలం దేవళంమిట్ట నుంచి పాలసముద్రం వరకు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కడపగుంటలో మాట్లాడుతూ చంద్రబాబు పాలిచ్చే ఆవులాంటివాడని అన్నారు. మూడున్నరేళ్లుగా జగన్ రెడ్డి హయాంలో ఎస్సీలకు న్యాయం జరగలేదని ఆరోపించారు. ఇక్కడి ఎమ్మెల్యే నారాయణస్వామి ఏం పీకారని ప్రశ్నించారు. సమిసిరెడ్డిపల్లి వద్ద రోడ్డుపై పర్మిషన్ లేకుండా మాట్లాడొద్దన్న పోలీసుల్ని యూజ్‌లెస్‌ఫెలోస్ అంటూ దుర్భాషలాడాడు. తనకు చట్టం తెలుసంటూ రాజ్యాంగం పుస్తకాన్ని చూపించారు.

**రంగాపురంలో మద్యం సీన్**

పాలసముద్రం మండలం రంగాపురంలో గురువారం సాయంత్రం లోకేశ్ సభకు జనాలను తరలించేందుకు చుట్టుపక్కల పల్లెలతోపాటు తమిళనాడుకు కూడా వాహనాలు ఏర్పాటుచేశారు. అయినా జనం రాలేదు. వచ్చిన వారు కూడా చాలా మంది టీడీపీ నేతలిచ్చిన మద్యం తాగి, బిర్యానీ తిని అక్కడే పడిపోయారు. రెండు గంటలు ఆలస్యంగా సభకు వచ్చిన లోకేశ్ జనం లేకపోవడంతో చిర్రుబుర్రులాడారు.

# జనం లేరు.. షాక్‌లో సార్!

▶ మొదటి పేజీ తరువాయి

పాదయాత్రకు రావాలని చెప్పాం అన్నా.

- **అచ్చెన్నాయుడు:** మొన్న చూశారు కదా..! చిత్తూరులో చూసి నేను, సార్ (చంద్రబాబు) చాలా బాధపడ్డాం.
- **చిట్టిబాబు నాయుడు:** అన్నన్నా.. అలా జరగదన్నా. మా నియోజకవర్గంలో అలా జరగదన్నా. నేను చేస్తా. చిత్తూరులో ఏమైందో నాకు తెలియదు.
- **అచ్చెన్నాయుడు:** ఏంటంటే.. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాదయాత్రలో జనం ఉండడం లేదు. పలుచగా ఉంటున్నారు. సాయంత్రం ఓ మోస్తరుగా వస్తున్నారు. జనం పలుచగా ఉండకూడదు. ఒక గ్రామం నుంచి వచ్చిన వారు మరో గ్రామం వరకు వచ్చేలా జాగ్రత్తగా ప్లాన్ చేసుకో.
- **చిట్టిబాబు నాయుడు:** అలాగే అన్నా. ప్రతి కిలోమీటర్‌కు వెల్‌కమ్ పాయింట్లు ఏర్పాటు చేశా. అలా 10 ఏర్పాటు చేశానన్నా. వెల్‌కమ్ పాయింట్ల వద్ద వెయ్యి మంది ఉండేలా చూస్తున్నాం. డ్రమ్స్, మైక్‌లు ఉంటాయి. వచ్చిన వారికి మజ్జిగ ఇస్తున్నాం. పూలు చల్లడం, టపాకాయలు కాల్చడం, అక్కడే మహిళలు వచ్చి హారతులు ఇవ్వడం, గుమ్మడికాయలు కొట్టడం.. ఇవన్నీ ప్రతి జంక్షన్‌లో చేస్తున్నాం అన్నా. తమిళనాడు నుంచి జెండాలు కట్టేందుకు 5 వేల పైపులు తీసుకొచ్చాం. 14 కి.మీ జెండాలు కడతాం అన్నా.
- **అచ్చెన్నాయుడు:** ఓకే ఓకే.. థ్యాంక్యూ థ్యాంక్యూ. ఏదైనా ఉంటే నాకు చెప్పు. మండల, యూనిట్ ఇన్‌చార్జీలు బాధ్యత తీసుకోవాలి. జనం మొబిలైజేషన్ లేకపోతే మాకు తెలుస్తుంది. వెంటనే సీరియస్ యాక్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకు జరిగిన నాలుగు నియోజకవర్గాల్లో మాదిరిగా కాకుండా విజయవంతం చేయాలి. అందరూ పార్టిసిపేట్ చేయాలి. మీ అందరికీ నమస్కారం.

# అమరావతే రాజధాని అని కేంద్రం ఎక్కడ చెప్పింది?


- సజ్జల రామకృష్ణారెడ్డి మండిపాటు



**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని నిబంధనల మేరకే 2015లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ప్రకటించిందని సుప్రీం కోర్టులో కేంద్ర హోంశాఖ దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఎక్కడ ఉందో చూపాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఎల్లో మీడియాను ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు), వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి నిలదీశారు. కేంద్రం అఫిడవిట్‌లో ఎక్కడా చెప్పకపోయినా.. అమరావతే ఏకైక రాజధానిగా తేల్చిచెప్పినట్లు ఈనాడు, ఈటీవీ, టీవీ-5, ఇతరత్రా ఎల్లో మీడియా వక్రీకరించి రాద్ధాంతం చేస్తే.. దాన్ని పట్టుకుని చంద్రబాబు సీఎం వైఎస్ జగన్‌పై స్థాయిని మరచి నోరు పారేసుకున్నారని మండిపడ్డారు. గురువారం ఆయన వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాజధాని నిర్ణయం రాష్ట్రానిదే అని కేంద్రం ఎప్పుడో చెప్పిందన్నారు. ఇక్కడ హైకోర్టులో కూడా కేంద్రం ఇదే కేసులో అదే విషయం చెబుతూ అఫిడవిట్ వేసిందని తెలిపారు. అప్పటి ప్రభుత్వం సీఆర్‌డీఏ చట్టం చేసినప్పుడు తమను సంప్రదించలేదని.. సీఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేసి, దాని స్థానంలో మూడు రాజధానుల చట్టాన్ని ప్రస్తుత ప్రభుత్వం చేసినప్పుడు, దాన్ని రద్దు చేసినప్పుడు తమను సంప్రదించలేదని అఫిడవిట్‌లో కేంద్రం పేర్కొందన్నారు. అంటే రాజధాని నిర్మాణంతో తమకు సంబంధం లేదనే స్పష్టత కేంద్రానికి ఉందని చెప్పారు. చంద్రబాబు గ్రాఫిక్స్‌తో రూపొందించిన అమరావతి ఒట్టి భ్రమేనని, మూడు ప్రాంతాల ప్రజల ఆకాంక్షల మేరకు.. రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా మూడు రాజధానుల ఏర్పాటు చేయాలన్నదే సీఎం వైఎస్ జగన్ విధానమని తేల్చి చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా మూడు రాజధానులను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సజ్జల ఇంకా ఏమన్నారంటే..

**కేంద్రాన్ని సంప్రదించే రాజధాని ప్రకటించారా?**

- విభజన చట్టంలో సెక్షన్ 5, 6కు అనుగుణంగా రాజధాని ప్రత్యామ్నాయాల అధ్యయనానికి కేంద్రం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ 2014 ఆగస్టు 27న నివేదిక ఇచ్చింది. దీని కంటే ముందే 2014 జూలై 20న నాటి మంత్రి నారాయణ నేతృత్వంలో రాజధాని ఎంపిక కోసం అప్పటి టీడీపీ సర్కార్ కమిటీ వేసింది. గుంటూరు–విజయవాడ మధ్య రాజధానిని ఏర్పాటు చేస్తున్నట్లు నారాయణ కమిటీ ప్రకటించింది. ఆ తర్వాత 2014 సెప్టెంబర్ 3న శాసనసభలో రాజధానిపై తీర్మానం చేశారు. కేంద్రాన్ని సంప్రదించకుండానే.. శివరామకృష్ణన్ నివేదికను తుంగలో తొక్కి రాజధానిగా అమరావతిని ప్రకటించారు.
- అమరావతి ప్రాంతంలోని నేల స్వభావం వల్ల భవన నిర్మాణ వ్యయం అధికమవుతుందని శివరామకృష్ణన్ కమిటీ తేల్చి చెప్పింది. కానీ.. తాను, తన కోటరీ భూములు కాజేసిన ప్రాంతాన్నే చంద్రబాబు రాజధానిగా ప్రకటించారు. తాను, తన కోటరీ ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా కాజేసిన భూములు.. పేదలను బెదిరించి దక్కించుకున్న అసైన్డు, లంక భూముల ధరలను పెంచుకోవడం కోసం అప్పట్లో చంద్రబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారిలా, బ్రోకర్‌లా వ్యవహరించారు.
- అమరావతిలోని 53 వేల ఎకరాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికే రూ.1.09 లక్షల కోట్లు అవసరమని అప్పట్లో 'ఈనాడు' కథనం అచ్చేసింది. మౌలిక సదుపాయాలు కల్పించడానికే 20 ఏళ్లు పడుతుంది. ధరలు పెరగడం వల్ల మౌలిక సదుపాయాల కల్పనకే రూ.ఐదారు లక్షల కోట్లు ఖర్చు అవుతుంది. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక చంద్రబాబు రియల్ ఎస్టేట్ దోపిడీ ఆశలపై నీళ్లు చల్లారు.
- తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో రూ.600 కోట్లతో అద్భుతమైన రీతిలో రాజప్రాసాదం వంటి సచివాలయాన్ని నిర్మిస్తే.. టీడీపీ సర్కార్ రూ.ఐదు వేల కోట్లు ఖర్చు పెట్టి.. తాత్కాలిక నిర్మాణాలు, అరకొర పనులు చేసి దోచుకుంది.
- రాజధానికి కనీసం రోడ్డును కూడా చంద్రబాబు నిర్మించలేదు. నీ బతుక్కు విజయవాడలో కనకదుర్గమ్మ ఫ్లై ఓవర్, బెంజ్ సర్కిల్‌లో ఫ్లై ఓవర్‌ను కూడా పూర్తి చేయలేదు. సీఎం వైఎస్ జగన్ కోవిడ్ వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆ రెండు ఫ్లై ఓవర్‌లతో పాటు బెంజ్ సర్కిల్‌లో మరో ఫ్లై ఓవర్ కూడా పూర్తి చేశారు. కరకట్ట రోడ్డు విస్తరించి, అమరావతికి రహదారి సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం, రింగ్ రోడ్డు నిర్మాణం, కాజా నుంచి పెద అవుట్‌పల్లి వరకూ బైపాస్ రహదారి నిర్మిస్తూ అమరావతితోపాటు గుంటూరు, విజయవాడను అభివృద్ధి చేస్తున్నారు.
- ప్రతిపక్ష నేత హోదాలో జగన్ అప్పట్లో మాట్లాడిన వీడియోను చంద్రబాబు కట్ చేసి, వక్రీకరిస్తూ ఉన్మాదిలా వ్యవహరిస్తున్నారు. 14 ఏళ్లు సీఎంగా పని చేశానని చెప్పుకునే చంద్రబాబుకు పోలీస్ యాక్ట్ 30 అంటే తెలియక పోవడం సిగ్గుచేటు. ఆయన ఇరుకు సందుల్లో సభలు పెట్టి.. ఎనిమిది మందిని పొట్టన పెట్టుకోపోయి ఉంటే జీవో 1ను జారీ చేయాల్సిన అవసరం ఉండేదా? ప్రత్యేక హోదా కోసం మేం పోరాడుతూనే ఉన్నాం. పోలవరం పాపం అంతా చంద్రబాబుదే.



IN THE HON'BLE SUPREME COURT OF INDIA
CIVIL APPELLATE JURISDICTION
SPECIAL LEAVE PETITION (CIVIL) No. 21922/2022

IN THE MATTER OF:

M/s. Amaravati Parirakshana Samiti ... Petitioner

Versus

Union of India & Ors. ... Respondents

COUNTER AFFIDAVIT ON BEHALF OF THE RESPONDENT NO.1, UNION OF INDIA

5. Accordingly, in terms of Section 6 of the Andhra Pradesh Reorganisation Act, 2014, the Central Government constituted an Expert Committee on 28.03.2014 under the chairmanship of Shri K. C. Sivaramakrishnan, IAS Retd. to study alternatives for a new capital for the State of Andhra Pradesh. The said Committee submitted its report on 30.08.2014, laying down broad guidelines which would require to be considered while selecting a new capital. The said report was sent to Government of Andhra Pradesh for necessary action. A True Copy of the relevant extracts of the Shri K C Sivaramakrishnan is annexed hereto and marked as **Annexure R-2** at page 8 to 11.

6. Subsequently, Government of Andhra Pradesh vide Government Order dated 23.04.2015 notified that the Capital city be named as "Amaravati". A True Copy of the Andhra Pradesh Government Order dated 23.04.2015 is annexed hereto and marked as **Annexure R-3** at page 12 to 13.

7. That the Under Section 94 of the Act of 2014, the Central Government shall provide special financial support for the creation of essential facilities in the new capital of the successor state of Andhra Pradesh including the Raj Bhawan, High Court, Government Secretariat, Legislative Assembly, Legislative Council and such other essential infrastructure.

## అఫిడవిట్లో కేంద్రం ఏం చెప్పిందంటే...

వాస్తవానికి అఫిడవిట్లో కేంద్రం ఎక్కడా 'ఈనాడు' రాసినట్లుగా విభజన చట్టం నిబంధనల మేరకే అమరావతిని రాజధానిగా నిర్ణయించినట్లు పేర్కొనలేదు. 'ఈనాడు' రాతలు పచ్చి అబద్ధాలని తేల్చే కేంద్రం అఫిడవిట్ కాపీ ఇది. దీన్లో 5, 6 ,7 పాయింట్ల కింద ఏం చెప్పారంటే...

**5** ఆంధ్రప్రదేశ్ పునర్ విభజన చట్టంలో సెక్షన్ 6 ప్రకారం కొత్త రాజధాని కోసం ప్రత్యామ్నాయాలను అధ్యయనం చేయటానికి మేం శివరామకృష్ణన్ నేతృత్వంలో 2014, మార్చి 28న నిపుణుల కమిటీని నియమించాం. ఆ కమిటీ 2014, ఆగస్టు 30న నివేదికను ఇచ్చింది. ఆ నివేదికను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి పంపించాం.

**6** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2015, ఏప్రిల్ 23న అమరావతి పేరుతో కొత్త రాజధానిని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**7** విభజన చట్టంలో సెక్షన్ 94 ప్రకారం కొత్త రాజధానిలో రాజ్ భవన్, శాసనసభ, శాసన మండలి, సచివాలయం, హైకోర్టు భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం ఆర్థిక సహకారం అందించాలి. ఆ మేరకు రూ.2,500 కోట్లను రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేశాం.

.... అఫిడవిట్లో ఉన్నది ఇదే. దీనికి వక్రభాష్యం చెబుతూ 'ఈనాడు' పునర్విభజన చట్ట నిబంధనల మేరకే అమరావతిని నిర్ణయించినట్లుగా రాసిపారేసింది. వాస్తవానికి అమరావతి భూములన్నీ కృష్ణా డెల్టా పరిధిలోకి వస్తాయి. సమృద్ధిగా పంటలు పండే డెల్టా భూముల్ని, దేశానికి అన్నంపెట్టే భూముల్ని తీసుకుని రాజధానిని నిర్మించటం ఎంతమాత్రం శ్రేయస్కరం కాదని శివరామకృష్ణన్ కమిటీ స్పష్టంగా నివేదికలో పేర్కొంది. మరి చంద్రబాబు చేసింది ఆ నివేదికను ఉల్లంఘించటమే కదా? దాన్ని ఆమోదించినట్లు ఎలా అవుతుంది రామోజీరావు గారూ?!

# ఏడుగురిని బలిగొన్న విష వాయువులు



మృతులు : దుర్గాప్రసాద్, జగదీష్, వెచ్చంగి సాగర్, వెచ్చంగి నరసింగరావు, వెచ్చంగి కృష్ణారావు (ఫైల్)



కుర్తాడి బొంజుబాబు, కొర్రా రామారావు (ఫైల్)

▶ మొదటి పేజీ తరువాయి

గురువారం ఉదయం 7 – 7.30 గంటల మధ్య ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పెద్దాపురం పరిసర గ్రామాల నుంచి స్థానికులు బాధిత కుటుంబాలకు మద్దతుగా ఫ్యాక్టరీ వద్దకు తరలిరావడంతో ఉద్రిక్తత నెలకొంది. ప్రమాద విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాలా తోడ్పాటు అందివ్వాలని కాకినాడ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. కుటుంబానికి రూ.25 లక్షలు వంతున పరిహారం ప్రకటించారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

**ఉక్కిరి బిక్కిరి..**

జి.రాగంపేటలోని అంబటి సుబ్బన్న ఆయిల్స్ ఫ్యాక్టరీ ఆవరణలోని ఏడు ఆయిల్ ట్యాంకులలో ఐదో నంబర్ ట్యాంకును గురువారం శుభ్రం చేయాలనుకున్నారు. 24 అడుగుల లోతున్న ఈ ట్యాంకులో అడుగున ఉండే వంట నూనె మడ్డిని తొలగించేందుకు వీరు ట్యాంక్‌లోకి దిగారు. ట్యాంకులో నిల్వ చేసిన నూనెను ప్యాకింగ్‌కు తరలించిన తర్వాత క్లీన్ చేశాకే తిరిగి మరోసారి ఆయిల్‌తో నింపుతుంటారు. అలా ఖాళీ అయిన ట్యాంకును శుభ్రం చేసేందుకు ఎనిమిది మంది కార్మికులను ప్లాంట్ సూపర్‌వైజర్ రాజు పురమాయించారు. ఈ క్రమంలో ఒక్కొక్కరూ ట్యాంక్‌లోకి దిగారు. తొలుత ట్యాంక్‌లోకి దిగాక, కళ్లు తిరిగి ఊపిరాడక పోవడంతో బయటకు వచ్చిన వెచ్చంగి కిరణ్ మాత్రమే ప్రాణాలతో బయట పడ్డాడు. ఇతని పరిస్థితి గమనించి కూడా, మిగతా వారిని లోపలకు దింపడం దారుణం అని మిగతా కార్మికులు మండిపడుతున్నారు. ట్యాంక్‌లో ఆక్సిజన్ 20 శాతం లోపు ఉండటంతోనే కార్బన్ డయాక్సైడ్, మోనాక్సైడ్‌తో కూడిన విష వాయువులు కమ్మేసి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారని సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ 'సాక్షి ప్రతినిధి'కి చెప్పారు. ఈ ఫ్యాక్టరీలో ట్యాంకుల్లో నిల్వ చేసుకునేందుకు అనుమతి ఉందా లేదా అనే విషయాలను పరిశీలిస్తున్నామన్నారు. ఇక్కడున్న ఏడు ట్యాంకులన్నీ 18 నుంచి 24 అడుగుల లోతున ఉన్నాయి. మృతులను బయటకు తీసుకువచ్చేందుకు ట్యాంకును కట్ చేయాల్సి వచ్చింది.

**ఫ్యాక్టరీ సీజ్.. దర్యాప్తునకు ఆదేశం**

కాకినాడ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కృతికా శుక్లా, ఎం రవీంద్రనాథ్‌బాబు రెవెన్యూ, పోలీసు అధికారులతో కలిసి సంఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకున్నారు. ఫ్యాక్టరీని సీజ్ చేసి, కార్యకలాపాలను నిలిపివేశారు. యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ మొత్తం ఘటనపై విచారణకు జిల్లా జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో ఫ్యాక్టరీస్, కార్మిక శాఖ అధికారులతో త్రిసభ్య కమిటీని కలెక్టర్ ఏర్పాటు చేశారు. త్వరగా విచారణ పూర్తి చేసి, నివేదిక అందజేయాలని ఆదేశించారు. కాగా, పెద్దాపురం వద్ద కూడా ఇదే యాజమాన్యం ఏఎస్ ఆయిల్స్ పేరుతో మరో ఫ్యాక్టరీని నడుపుతోంది.

### మృతులు వీరే..

అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం పరేడ గ్రామ పంచాయతీ లక్ష్మీపురానికి చెందిన వెచ్చంగి కృష్ణారావు (36), వెచ్చంగి నరసింగరావు (40), వెచ్చంగి సాగర్ (23), ఉంచేడుపుట్టు గ్రామం కురుతాడుకు చెందిన కుర్తాడి బొంజుబాబు(35), బొండపల్లి గ్రామ పంచాయతీ సంపాపుట్టు గ్రామం కొర్రా రామారావు (45), పెద్దాపురం మండలం పులిమేరు గ్రామానికి చెందిన కట్టమూరి జగదేష్ (25), యల్లమిల్లి ప్రసాద్ (27). పెదబయలు మండలానికి చెందిన ఐదుగురూ దగ్గర బంధువులు.

### బాధితులకు అండగా సీఎం జగన్ ప్రభుత్వం

మృతుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వం తరఫున ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబంలో అర్హులైన వారికి పింఛన్ సహా ఇతర ప్రయోజనాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**కార్మికుల మృతి విచారకరం: గవర్నర్**

**సాక్షి, అమరావతి:** కాకినాడ జిల్లా జి.రాగంపేటలోని అంబటి ఆయిల్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఏడుగురు కార్మికులు మృతి చెందడంపై గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారని రాజ్‌భవన్ వర్గాలు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. ఈ ఘటనపై రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

## అందరూ రెక్కాడితే కానీ డొక్కాడని వారే..

మృతులంతా పొట్టకూటి కోసం వలస వచ్చిన వారే. రోజువారీ రూ.650 చొప్పున పని చేస్తున్నారు. ప్యాకింగ్ సెక్షన్‌లో పని చేసే వారిని ట్యాంకు శుభ్రంచేసే పనికి పురమాయించడం వల్లే అవగాహన లేక చనిపోయారని మృతుల కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. ఇక తమకు ఎవరు దిక్కంటూ జగదీష్, ప్రసాద్ కుటుంబ సభ్యులు మృతదేహాల వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. పోస్టుమార్టం కోసం ఇద్దరి మృతదేహాలను పెద్దాపురం ఆస్పత్రికి, ఐదుగురి మృతదేహాలను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం వారి స్వగ్రామాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని మంత్రి వేణుగోపాల కృష్ణ చెప్పారు.

**నలుగురికి 20 మంది పిల్లలు**

పెదబయలు మండలానికి చెందిన దగ్గరి బంధువులు ఐదుగురి మృతితో మన్యంలో విషాదం నెలకొంది వీరంతా సంక్రాంతి పండగకు స్వగ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులతో ఎంతో సంతోషంగా గడిపారు. రెండు వారాల క్రితమే ఫ్యాక్టరీకి తిరిగి వెళ్లారు. ఇంతలోనే ఇలా జరగడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కొర్రా రామారావుకు భార్య కొమాలమ్మ, ఎనిమిది మంది పిల్లలు ఉన్నారు. పిల్లలందరూ చిన్న వయసు వారే. వెచ్చంగి కృష్ణారావుకు భార్య లక్ష్మితో పాటు నలుగురు పిల్లలు. కుర్తాడి బొంజన్నకు భార్య నీలమ్మతో పాటు నలుగురు పిల్లలు ఉన్నారు. వెచ్చంగి సాగర్‌కు వివాహం కాలేదు. తల్లిదండ్రులు సీతారామ్, సత్యవతి, చెల్లెళ్లు ఇతనిపైనే ఆధారపడి ఉన్నారు. నర్సింగరావుకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

ఒక్కొక్కరం లోపలకు దిగేశాము. ఏదోలా అనిపించింది. వెంటనే ఊపిరాడక కళ్లు బైర్లు కమ్మేశాయి. ట్యాంక్ లోపల అరస్తూ పడిపోతున్న కృష్ణారావును పైకి లాగుదామనుకున్నా. అయితే అప్పటికే నాలో శక్తి సన్నగిల్లింది. ఎలాగోలా మిచ్చెన పట్టుకుని బయటికొచ్చి పడిపోయాను.

– ప్రత్యక్ష సాక్షి కిరణ్

# ఐరన్ లెగ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లోకేశ్

- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ ఎద్దేవా
- లోకేశ్ పాదయాత్ర బలి యాత్రగా మారింది

**సాక్షి, అమరావతి:** నారా లోకేశ్ ఎక్కడ అడుగుపెడితే అక్కడ అపశకునాలేనని, దుర్ఘటనలేనని, ఆ పాదం మహిమ అలాంటిదని, ఆయన 'ఐరన్‌లెగ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అని అంతా భావిస్తున్నారని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ చెప్పారు. అలాంటి పాదంతో లోకేశ్ చేసే పాదయాత్రలు జనావళికి ప్రమాదకరమని అన్నారు. ఆయన పాదయాత్ర బలియాత్రగా మారిందని తెలిపారు. నాగార్జున యాదవ్ గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లోకేశ్ పాదయాత్ర టీడీపీకి పాడెయాత్రగా మారిపోయిందన్నారు. లోకేశ్‌ను క్రేన్లతో లేపాలని చంద్రబాబు, ఎల్లో మీడియా ఎంత ప్రయత్నించినా విఫలమై చతికిలపడుతున్నారన్నారు. తొలుమందం లోకేశ్ సభ్యత, సంస్కారాలు మరచిపోయి సీఎం జగన్‌ని నోటికొచ్చినట్లు దూషిస్తున్నాడని, తాము కూడా చంద్రబాబును తిట్టగలమని, కాకపోతే తమ నాయకుడు వైఎస్ జగన్ సభ్యత, సంస్కారం నేర్పించారని చెప్పారు. సీఎంజగన్‌ని వారు ఒక మాటంటే.. తాము వారిని నాలుగంటామని హెచ్చరించారు. లోకేశ్ ఒళ్లు, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని అన్నారు. పాదయాత్రకు జనం రాలేదని బాబు బాధ పడుతున్నారని, లోకేశ్ బూతులు వినడానికి జనం రావాలా... అని ప్రశ్నించారు. సమర్థుడైన కొడుకుంటే ఏ తండ్రయినా పవన్ కళ్యాణ్‌పై ఎందుకు ఆధారపడతారని అన్నారు. ఉత్తరకుమారుడికి ప్రగల్భాలు ఎక్కువ, లోకేశ్‌కు ఉడత ఊపులు ఎక్కువ అని ప్రజలు నవ్వుతున్నారని వ్యాఖ్యానించారు. ఐరన్ మ్యాన్, సూపర్ మ్యాన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అయిన సీఎం వైఎస్ జగన్‌తో ఈ ఐరన్ లెగ్ చౌదరి లోకేశ్ తలపడి తట్టుకోలేడని చెప్పారు. ఇప్పటికైనా లోకేశ్ బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 